# విజయవిహారం

సెప్టెంబరు 2001 యువతరం మాసపత్రిక రు.15



# పసిపిల్లలపై పశుకామం

పుట్టపర్తిపై పులికన్ను



వ్యక్తిత్వవికాసం

కంప్యూటర్ క్లాస్‌రూమ్

నారాయణగురు

బాడీలాంగ్వేజ్

సినిమా కబుర్లు

ప్రేమగానం

గెలుపుకెరటాలు



భక్తి ముసుగులో... బూతు డ్యాన్సులు



## మనసును 'భావాలు'

విద్యావినయసంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని,
శుని చైవ శ్వపాకే చ పండితాః సమదర్శినః.

విద్యా వినయ సంపన్నుడగు బ్రాహ్మణుని యందును, ఆవునందును, ఏనుగునందును, కుక్కయందును, దాన్ని తినే చండాలుని యందును జ్ఞానులు సమదృష్టి ప్రదర్శిస్తారు. - శ్రీమద్భగవద్గీత

**Edited, Printed, Published and Owned by** T.V.Ramana Murty, **Printed at** KALAJYOTHI PROCESS LTD., Regd.Office : 1-1-60/5, R.T.C. X Roads, Hyderabad - 20. **Published at** 12-5-149/17, Opp. Railway Degree College, Tarnaka, Sec'bad - 17. ☎ 040-7007053.
Editor : T.V. Ramana Murty,
e-mail: vijayavihaaram@rediffmail.com,
Mobile No:9848019076

ప్రకటన: ఈ సంచికలోని విభిన్న వ్యాసాల్లో, అంశాల్లో వ్యక్తమైన రచయితల అభిప్రాయాలు పూర్తిగా వారివే అని, అవి పత్రిక అభిప్రాయాలు కానక్కర్లేదని, గమనించాలని మనవి. - ఎడిటర్

సంపుటి : 2 సంచిక : 8

# విజయవిహారం

సెప్టెంబర్ 2001 యువతరం మాసపత్రిక


| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రేమగానం | 5 | కంప్యూటర్‌క్లాస్‌రూమ్ | 23 | మత్స్య దేవతలు | 42 |
| 75వేలకోట్లడాలర్ల ఆస్తి | 6 | ఇంగ్లీషు పాఠాలు | 25 | కథ | 44 |
| డా. షేక్‌కి ఉరిశిక్ష | 8 | వ్యక్తిత్వ వికాసం | 26 | చిత్కళ | 45 |
| దలైలామా ఇంటర్వ్యూ | 9 | బాడీలాంగ్వేజ్ | 27 | తెరఛాట్ | 46 |
| దళితుడి దహనం | 11 | భగత్‌సింగ్-గాంధీ | 28 | చిత్రవిహారం | 48 |
| ప్రేమిస్తేచంపేస్తారు!! | 11 | దిగ్గజాలు | 29 | ఇసుకతో శిల్పాలు | 50 |
| హ్యూమరాలజీ | 12 | బిజినెస్ రౌండప్ | 30 | ఎడిటర్‌తో ముఖాముఖి | 50 |
| ఏమిటి'లా'? | 17 | రక్తకాసారం | 31 | | |
| దునియా | 18 | గిఫ్ట్‌బాక్స్ | 34 | | |
| చిప్కో ఉద్యమం | 19 | బుడత | 35 | | |
| హ్యూమర్‌స్ప్రెడ్ | 20 | నారాయణగురు | 36 | | |
| అంబేడ్కర్ | 22 | నట'కోచింగ్'... | 41 | | |

గెలుపుకెరటాలు

| | |
|---|---|
| చైతాలీ చటర్జీ | 20 |
| కన్వల్ విల్కు | 20 |
| కోనేరు హంపి | 43 |
| హరికృష్ణ | 43 |
| అపూర్వ అయ్యంగార్ | 43 |
| సవిత | 43 |
| సోనాలి మాల్‌గుంకర్ | 43 |



భక్తి ముసుగులో బూతు డ్యాన్సులు ..10

పసిపిల్లలపైన పశుకామం



..14

పుట్టపర్తిపై పులికన్ను ..38




ఫ్లాష్... ఫ్లాష్... ఫ్లాష్...

## రియల్ ఎస్టేట్ చరిత్రలోనే సంచలనం...

100 చ||గ|| ప్లాటు కేవలం రూ.39,000/-లకే!



సర్దార్ ఎన్. సూర్యనారాయణ రెడ్డి
ఛైర్మన్ & మేనేజింగ్ డైరక్టర్

హైద్రాబాద్ నగరంలో రామోజి ఫిల్మ్‌సిటీకి
చేరువగా విజయవాడ - హైద్రాబాద్ హైవేపై తూప్రాన్ పేట
గ్రామాన్ని ఆనుకుని వెంటనే ఇల్లు కట్టుకోవడానికి
అనుకూలంగా సుమారు 100 ఎకరాలలో రూపుదిద్దుకున్న
షిర్డీసాయి నగర్‌లో నేడే ప్లాటు బుక్ చేసుకోండి...

స్పాట్ రిజిస్ట్రేషన్
సులభవాయిదాల పద్ధతి
బహుమతులు

ముందుగానే...
గ్రావెల్ రోడ్లు, ప్లాటు విభజన, స్టోన్స్ పై నెంబరింగ్

## గ్రీన్ స్టార్ హౌసింగ్ & ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్

హైద్రాబాద్ ఆఫీస్ : గణేష్ కాంప్లెక్స్, సెకండ్ ఫ్లోర్, దిల్‌సుఖ్‌నగర్ బస్ స్టాండ్ ఎదురుగా, హైద్రాబాద్. ఫోన్ : ☎040 4067403.
కార్పొరేట్ ఆఫీస్ : చిలుకు దుర్గయ్య వీధి, సాగర్‌బార్ రోడ్డు, సూర్యారావు పేట, విజయవాడ -2. ఫోన్స్ ☎0866-667355, 666355



# ప్రేమగానం

**... అది వుత్తుంగ తరంగం, మనసుకందని భావావేశం, హృదయం చేసే తాండవ నృత్యం.**

**... అది మలయమారుతం, చల్లని వెన్నెల గీతం, నిశ్శబ్ద కాసారం.**

**... అది అంతు తెలియని మోహావేశం, అంతే తెలియని అగాధం, విషాదం, అయినా మనిషికి జీవాధారం.**

... అది ప్రేమే, కాదంటే మోహం, లేదంటే కామం, శృంగారం, విరహం, భక్తి, రక్తి సైన్స్ చెప్తున్నట్టు అంతు తెలియని / అంతు తేలుస్తున్న కెమిస్ట్రీ.

ఎన్ని చెప్పినా, ఎలా చెప్పినా, ఎంత అనుభవించినా ప్రేమలో యింకా... యింకా... యింకా... అంతు తెలియని అగాధాలు, లోయలు, శిఖరాగ్రాలు, జలపాతాలు మనిషిని నిరంతరాన్వేషిగా సజీవ ప్రేమ వాహినిగా వుంచుతోంది.

ప్రేమ అనంత గానం, మనిషి పాడే అమృత గీతం. ప్రేమను అనుభవించిన వారంతా, దాన్ని అత్యున్నత మానవ విలువగా గుర్తించారు.

పుట్టిన ప్రతి మనిషీ ఏదో ఒక సందర్భంలో ప్రేమను లీలా మాత్రంగానయినా అనుభవించే వుంటాడు.

ఈ వివరమేమీ తెలియని వయస్సులో, నాకు బాగా జ్ఞాపకమున్న సందర్భం ఒకటి చెప్తాను.

నాకప్పుడు ఏడేళ్ళ వయస్సుంటుందేమో! మేం శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలో వుండేవాళ్ళం. మధ్యాహ్నం భోజనాల తరువాత, మా యింటి వరండాలో అమ్మతో పాటు అత్తయ్యలంతా చేరి కబుర్లాడుకునేవారు. ఆడుకునే మిషతో వారి దరిదాపుల్లోనే తచ్చాడుతూ నేనూ ఆ కబుర్లు వినేదాన్ని.

ఒకానొక మధ్యాహ్నం వాళ్ళు అదే కాలనీలో వుంటున్న మున్నీ అక్క ప్రేమ వ్యవహారం గురించి మాట్లాడుకున్నారు. మున్నీ అక్క ఎలా, ఎంత చక్కగా వాణిశ్రీలా చీర కట్టుకుంటుందో... ఆమె వయ్యారంగా ఎలా నడుస్తుందో... ఆమె మొహంలో కనిపించే మోహం... ఎవరినీ లెక్క చేయనితనం... ఆనందం... వీటన్నింటి గురించి మాట్లాడుకున్నారు. బహుశ నా చెవులను ఈ విషయాలే బాగా ఆకర్షించి వుంటాయి. వారు ఆమె పట్ల వ్యతిరేకంగా వున్నట్లు నాకు లీలగా గుర్తుంది.

మున్నక్క అప్పుడే కొత్తగా ఓణీలు వేసుకోవడం కారణంగా నాకు చాలా అద్భుతంగా అనిపించేది. ఆమెను నేను చాలాసార్లు తదేకంగా ఆరాధనగా చూడడం జరిగింది. అయితే గత కొద్ది రోజులుగా ఆమెను చూడడం పడలేదు.

అక్క ప్రేమ వ్యవహారం విన్న తరువాత, ఆమెను చూడడం గురించే వాళ్ళింటికెళ్ళా. తోటలో పూలు కోస్తున్న అక్క, కూని రాగాలు తీస్తోంది. అడవి నేరేడు మాను చాటునుండి, దొంగగా ఆమెనే చూస్తున్నా. నన్నెప్పుడు గమనించిందో ఏమో, నా వైపు చూసి నవ్వి, దగ్గరికి పిలిచింది. నేను సిగ్గుపడి తుర్రున పారిపోయాను. అలా వెళ్ళిన దాన్ని... సందు చివర వేపచెట్టు కింద కంతలో దూరాను. కళ్ళు తెరిచినా మూసినా మున్నీ అక్క మొహమే కనిపించింది. ఆమె మొహంలో ఏదో వుంది. ఆమె నాకు దేవుడిలా కనిపించింది. మా నాన్న నాకు చెప్పే కథల్లో దేవుళ్ళు, మంచివారంతా అక్క మొహంలో కనిపించారు.

అప్పటి నుండి చాలాకాలం వరకు నాకు వచ్చే కలల్లో, వూహల్లో మంచి వారందరూ మున్నీ అక్కలోని పారవశ్యం తాదాత్మ్యతనే పుణికి పుచ్చుకున్నారు.

అది మొదలు, ప్రేమించే వారంతా చాలా మంచివారు, పవిత్రులు, వారిలో దైవం వుంటుందని నమ్మేదాన్ని.

ఎవరెన్ని చెప్పినా, ప్రతి మనిషి అనుభవించి తెలుసుకోవలసింది ప్రేమ. ఒకరి అనుభూతిని మరొకరు ఎలా చూడడం. మహా అంటే కొన్ని లక్షణాలను గుర్తించగలమేమో. ఒకానొక పారవశ్యంలో వుంటే, అతడు ప్రేమలో వున్నాడని అనుకోవచ్చు. అయితే యితరుల ప్రేమానుభూతిని చూసి మనం అనుభవించలేం కదా!

* * *

ఒకమ్మాయి జ్ఞాపకానికి వస్తోంది.

రోడ్డు వక్కన కాలు విరిగి చతికిలవడ్డ కోతిపిల్లను చంకనేసుకుని, ప్రేమగా పాలు పడుతూ ఆనందంగా తిరుగుతోంది. అదొక ఆధ్యాత్మిక శిబిరం. కనీసం వందమంది ఆ శిబిరంలో పాల్గొన్నారు.

చూస్తే అర్థమయిందేంటంటే, ఆ అమ్మాయికి ఆధ్యాత్మికత అన్నా, ఆ శిబిరం అన్నా లెక్కలేదు. ఎవరి బలవంతం మీదో అనివార్యంగా అక్కడికి వచ్చింది. ఆ వాతావరణాన్ని ఆనందంగా తనకు నచ్చిన రీతిలో అనుభవిస్తోంది. శిబిర నిర్వాహకులు ఆమె పద్ధతిని వ్యతిరేకించినా లెక్క చేయలేదు ఆ అమ్మాయి.

అందరి కళ్ళూ ఆమె మీదే. ఆశ్చర్యంతో, అసూయతో, ఆరాధనతో, హేళనతో, ఆప్యాయతతో, ప్రేమతో, వుత్సుకతతో అందరి కళ్ళూ ఆమె మీదే. ఆ అమ్మాయి చక్కగా పాడుతుంది కూడా. పైగా అందగత్తె. అందంతో పాటు లెక్కలేనితనం, తనలో



తాను ఆనందంగా వుండగల అద్భుత పరిణతి.

ఆ అమ్మాయి పట్ల ఆకర్షణకు నేను అతీతురాలనేమీ కాదు కదా!

మొదటి చూపులోనే ఆ అమ్మాయితో నాకు స్నేహం కలిసింది. ఆమెలో నిజంగా ఎంతో ప్రేమను అనుభూతి చెందా. ఆమెలోని ఆనందానికి అసూయ పడ్డా. ఆమె స్నేహానికి గర్వించాను. ఆమె పాటకు పరవశించాను.

రాత్రి నడిఝాము దాటుతుండగా ఆమె హృదయ రహస్యాలు విని నిరుత్తరినయ్యా.

కథ సాధారణమైందే. ఆమె 18 సం॥ల వయస్సులో ఒక వ్యక్తిని ప్రేమించి, యింట్లో తెలీకుండా పారిపోయి దొంగపెళ్ళి చేసుకుంది. నెలరోజుల తరువాత అతడు ఆమెను వదిలేసి పారిపోయాడు.

భారతదేశంలో ఎందరో అమ్మాయిల కథే యిది. అయితే ఈ కథలోని అద్భుతం ఈమే.

నాలుగు సంవత్సరాల పూర్తి మౌనం. తరువాత యిప్పటికీ అతడి కోసం ఎదురు చూడడం. యింకా అదే ప్రేమను అదే మానసిక స్థితిని అనుభూతి చెందడం. తనలోని ప్రేమనంతటినీ ప్రోదిచేసి అతడితో పంచుకోవాలన్న ప్రియమైన కోరిక.

"అతడు నిన్ను మోసం చేసాడని అనిపించలేదా? అతడి మీద కోపం లేదా?" అని అడిగా.

అందుకా అమ్మాయి "అతడెలాంటి వాడయితే నాకేంటి. నేనతడిని ప్రేమించానంతే. ఆ ప్రేమలో నాకానందం వుంది. ప్రేమలో నాకెంత ఆనందం వుందంటే, జీవితంలో నాకు ప్రేమ తప్ప మరేదీ అవసరం లేదనిపిస్తుంది" అంటూ పక్కనే పడుకున్న కోతిపిల్లను ముద్దు చేసింది.

నేనేమీ మాట్లాడలేకపోయాను. అయినా యింకా ఏదో, ఆమె కూడా సామన్యురాలేనని నిరూపించాలన్న తపనేమో...

"నీకే బాధా లేదా?" అని అడిగాను.

ఆమె నవ్వి "బాధ వుంది. ప్రేమతో అతడికి దగ్గరగా వుండాలని వుంటుంది. అప్పుడు బాధ అనిపిస్తుంది. అయినా ఏం చేస్తాం, అతడికి నా ప్రేమ అక్కర్లేదనుకుంటా" అంది.

"అలా అని తెలిసీ అతడి కోసం ఎదురుచూస్తావెందుకు" అన్నా.

"నేను ఎదురు చూడడం లేదు, ప్రేమిస్తున్నా అంతే" అంది.

ఒక్క క్షణం సిగ్గుతో చిన్నబోయా. వయస్సులో చిన్నదయినా, మనస్సులోనే ఆమెకు పాదాభివందనం చేశా. ప్రేమలో ఆమె విఫలమయిందని అందరూ అనే వుంటారు. కానీ ఆమె విజయాన్ని మనసారా అనుభవించా.



ప్రేమ లోతులను ఎవరయినా అనుభవించి తెలుసుకోవాల్సిందే.

అందుకే ప్రేమ విషయంలో అంత గందరగోళం. ఎవరికి వారు తమకు తెలిసిందే ప్రేమని అనుకోవడంలో దోషం ఏముంది. అలాగని ప్రేమ ముసుగులో, హింస, చంపడం, ఛావడం వంటి ధోరణులు ప్రమాదకరం కదా!

పొరపాటు ఏమంటే, కొన్ని విషయాలను గురించి అసలు మాట్లాడకపోవడం, లేదా కొన్ని కోణాలలోనే మాట్లాడుకోవడం, పక్షపాతంతో మాట్లాడడం, వయస్సు ప్రభావంతో విషయాలను నిర్వచించడం, కొన్ని పరిధులకు లోబడి ఆలోచించడం జరుగుతోంది.

ముఖ్యంగా ప్రేమంటే అది అందరికీ తెలిసిన సామాన్య విషయంగా, దాన్ని గురించి తెలుసుకోవాల్సింది, సమీక్షించాల్సింది, నేర్చుకోవాల్సింది ఏదీ లేదన్న ధోరణి వుంది. ప్రేమ వ్యక్తిగత మానసిక అనుభూతి. అది ప్రయోగశాలలో లిట్మస్ టెస్ట్‌తో నిరూపితమయ్యేది కాదు, దానికి కొలమానం ఏదీ లేదు కనుక ప్రేమను వ్యక్తుల అనుభవానికే వదిలేయడం జరుగుతోంది.

ప్రేమ ప్రధానాంశంగా పుంఖాను, పుంఖాలుగా కావ్యాలు, కథలు, నవలలు, సినిమాలు వచ్చాయి, వస్తున్నాయి, రాబోతాయి కూడా. అయినా ప్రేమ విశ్వరూపాన్ని, తత్వాన్ని ఆవిష్కరించాల్సిన అవసరం నిత్యనూతనంగా మనముందు నిలుస్తోంది.

'మనిషి సహజంగా ప్రేమతోనే పుడతాడు' అంటాడు ఓషో. అయినా ప్రేమనూ నేర్వాల్సిందే. ఎందుకంటే ఎదిగే క్రమంలో మనిషి సహజత్వాన్ని కోల్పోతున్నాడు. సమాజం, నీతిసూత్రాలు, తల్లిదండ్రులు మనిషిపైన గాఢమైన ముద్రవేస్తాయి. అందుకే సహజాతమైన భావోద్వేగం, పారవశ్యంగా వుండాల్సిన ప్రేమ కులం, మతం, డబ్బు, జాతకాలు, ప్రాంతీయ తత్వాలు, తల్లిదండ్రుల మీద ఆధారపడుతోంది. సహజంగా వుండాల్సిన భావోద్వేగాలు, అడుగంటితే జీవితం రసవిహీనం అవడంతో ఆశ్చర్యమేముంది.

ప్రేమ రాహిత్యం ప్రధానమైన జబ్బుగా ఈ మధ్యకాలంలో విజ్ఞులు, వైద్యులు గుర్తించారు. అలాగే ప్రేమ మనిషి ఆత్మిక శక్తిని అమాంతంగా పంచుతుందంటారు. ఈ అవగాహన నుండే "ప్రతి మగాడి విజయం వెనుక ఒక స్త్రీ వుంటుంది" అన్న నానుడి వచ్చింది. యిది రెండువైపులా సత్యమే. మూడో వైపు కూడా సత్యమే. అది, స్త్రీ పురుషుల మధ్య ప్రేమే కాదు, మనిషికి మనిషికి మధ్య ప్రేమ, స్నేహం, సౌజన్యం మనుషుల జీవనోత్సాహాన్ని పంచుతుంది.

ప్రేమ మనిషి జీవితంలో ప్రధాన పాత్ర వహిస్తుంది. మనుషుల జీవితాలను, చరిత్రను పరిశీలిస్తే, ప్రేమే జీవితంలో నిర్ణయాత్మకమైన పాత్ర వహిస్తున్నట్టు గుర్తించవచ్చు.

'స్త్రీ బుద్ధి ప్రళయాంతకః' అన్న నానుడిలో స్త్రీ వ్యతిరేక ధోరణి కనిపించినా, తన ప్రియురాలి కోసం ఏమయినా చేయగల పురుషుని నిబద్ధత కనిపిస్తుంది. ప్రేమ చాలా శక్తివంతమైన ఆయుధంగా అనేకసార్లు నిరూపితమయింది.

అందుకే ప్రేమను అనేక కోణాలలో ఆవిష్కరించాలన్నది మనిషి అంతరాంతరాలలోని అతి ప్రాచీన కోరిక. నిరంతరాన్వేషి అయిన మనిషికి ప్రేమే పథనిర్దేశి●



## మీరు ప్రేమించారా?

ప్రేమ ప్రేమను ప్రేమగా ప్రేమిస్తుంది, ప్రేమను ప్రేమించిన ప్రేమ ప్రేమచే ప్రేమించబడిన ప్రేమను ప్రేమిస్తుంది - అంటూ కవులు ఎన్ని కవితలు అల్లినా ఎవరి ప్రేమానుభవం వారికి మధురం. తాము మునిగింది ప్రేమగంగ అనీ, తాము వలచింది జగన్మోహనమూర్తిననీ ఊహించే, భావించే హక్కు ప్రతి ఒక్కరికీ వుంది. ప్రేమ మనిషి జీవితంలో వసంత ఋతువు. ఒకరికి అది అపురూప, అనిర్వచనీయ అనుభవం కావచ్చు. మరొకరికి అది క్రూర మధురస్మృతి కావచ్చు. విఫలమైనా, విజయం పొందినా, కాల్చినా, మైమరపించినా ప్రేమ ప్రేమేకదా! మీరు ప్రేమించారా? మీ ప్రేమానుభావాన్ని 'విజయవిహారం' యువ పాఠకులతో ఇదే పేజీలో పంచుకోదలిచారా?

అయితే మీదే ఆలస్యం. క్లుప్తంగా, పొందికగా మీ ప్రేమానుభూతిని అక్షర బద్ధంచేసి పంపించండి. ఎంపికచేసి ప్రచురించేందుకు మేము సిద్ధం. - ఇందిర

**నేను ఎదురు చూడడం లేదు, ప్రేమిస్తున్నా అంతే...**

చిన్నదేశమే అయినా అది ఓ చింతలేని దేశం... దాని పేరు బ్రూనై. అక్కడ మట్టి పిండితే అంతా చమురే... అదొక్కటే ఆ దేశపు తరగని సంపద. అలాంటి దేశానికి రాజు హసనల్ బోల్కియా.

ఆయనగారికి తమ్ముళ్లు ముగ్గురు.

పెద్ద తమ్ముడు మహ్మద్ బోల్కియా. మతమంటే కాస్త భయమూ, భక్తీ వున్నవాడు. హంగులూ, ఆర్భాటాలంటే అస్సలు గిట్టవ్. ఒక్క భార్యతోనే గుట్టుగా కాపురం సాగిస్తున్నాడు. ఆ చిన్ని దేశానికి ఆయన విదేశాంగ మంత్రి కూడా. తన పనేమిటో తాను సిన్సియర్‌గా చేసుకుపోయే రకం.

సుల్తాన్‌గారి మూడవ తమ్ముడు సూఫ్రీ... ఈయనేమిటో, ఏం చేస్తుంటాడో పెద్దగా తెలియదు. ఇప్పుడు మనకు అవసరం లేదు కూడా.

ఇక అసలు కథంతా రెండవ తమ్ముడి గురించే... ఈ యువరాజు పేరు జెఫ్రీ బోల్కియా. జీవితాన్ని జాలీగా ఎలా ఎంజాయ్ చేయాలో - ఈయనకి తెలిసినంతగా బహుశ ఎవ్వరికీ తెలియదు. జెఫ్రీ స్టైలంతా "ఖావో పియో మజా కరో" టైపే.

1984లో బ్రూనై స్వతంత్రమైనప్పుడు - తమ్ముడు గదా అన్న నమ్మకంతో జెఫ్రీ జల్సారాయుడికి సుల్తాన్ హసనల్ ఏకంగా ఆర్థిక శాఖ తాళాలే చేతికిచ్చాడు. ఇంకేం - యువరాజు కోరికలు కళ్ళేలు లేని గుర్రాలయ్యాయి. రోజుకో విందు - ఒకరితో పొందు అన్నట్టు సాగింది. ఇస్లాం సంప్రదాయాలను పాటించాడో లేదో తెలియదు కానీ నలుగురు భార్యల్ని చేసుకోవడానికి ఆ మతం ఇచ్చిన అనుమతిని మాత్రం ఖచ్చితంగా అమలు పరిచాడు. నలుగురికీ కలిపి 35 మంది సంతానం. ఇదంతా పబ్లిక్ వ్యవహారం కాగా - ప్రైవేట్‌గా దేశదేశాల ఉంపుడుగత్తెల్ని ఎంతమందిని పోషించాడో లెక్కలేదు. దేశమంతటా - పూర్తయి, సగంలో ఆగిపోయిన - గెస్ట్‌హౌస్‌లకు లెక్కలేదు. ఆకాశవీధి గుండా - ప్రత్యేక విమానాల్లో అందాల భామల్ని రప్పించుకుని రాసలీలల్లో మునిగితేలడం యువరాజు జెఫ్రీ దినచర్య.

లండన్, పారిస్, వాషింగ్టన్, న్యూయార్క్... ఇలా అన్ని ప్రముఖ నగరాల్లో రాజభవనాల్నే తలదన్నే ప్రాసాదాలు కట్టించాడు. ఇలా జెఫ్రీ విలాసాలకి బ్రూనై బొక్కసం - గండిపడిన చెరువులా తయారైంది. జెఫ్రీ చేతికి అడ్డూ అదుపూ లేకుండా పోయింది. ఏది ఎందుకు కొంటున్నాడో, ఏ భవనం ఎందుకు కట్టిస్తున్నాడో విచక్షణ అస్సలు లేదు. దేశవిదేశాల్లో అప్పులు కుప్పలుగా పెరిగాయి. రాజమందిరంలో కలతలు రేగాయి. సుల్తాన్ గారికి మూడేళ్ల క్రితమే ఈ సంగతి తెలిసింది. అలా తెలిసేప్పటికే సుల్తాన్ కష్టపడి కూడబెట్టిన 40 బిలియన్ డాలర్ల విదేశీ మారకం నిల్వలు సగానికి సగం హరించుకుపోయాయి. దీంతో 1997లో ఖజానా తాళాలు వెనక్కి తీసుకున్నాడు. కానీ పదవి పోయేసరికి జల్సాలకి అలవాటు పడ్డ జెఫ్రీ అప్పులతో నెట్టుకొచ్చాడు. ఇదంతా రాజమందిరం నాలుగ్గోడల మధ్య గుట్టుగానే జరిగినా మొన్న (ఆగస్టు మొదటి వారంలో) 300 మంది దేశదేశాల అప్పులవాళ్ళు ఇచ్చిన సొమ్ము రాబట్టుకోవడానికి బ్రూనేలో వాలిపోవడంతో జెఫ్రీ బతుకు తెరిచిన పుస్తకం అయింది. విషయం తెలిసి బ్రూనే ప్రజలు నోళ్ళు వెళ్లబెట్టారు. జెఫ్రీ కొన్న ఖరీదైన సామాగ్రి, కట్టిన భవంతులు - అన్నీ వేలం పాటకి వచ్చాయి. దీంతో ప్రపంచంలోనే సమస్యలంటూ తెలియని అత్యంత సంపన్న దేశంగా గౌరవం అందుకుంటూ వచ్చిన బ్రూనై - ఇవాళ ఒక్క జెఫ్రీ అనే వ్యక్తి కారణంగా - అప్పులవాళ్లు రాజమందిరాన్ని చుట్టుముట్టడంతో తీవ్ర అవమానకరమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది.

వచ్చిన విధంగా జీవితాన్ని అనుభవించడం అనే హక్కు ప్రతి మనిషికీ ఉండవచ్చుగాక. కానీ ఆ విలాస జీవితానికి అయిన ఖర్చు ప్రజలదైనప్పుడు, ఒక దేశం ప్రతిష్ఠతో ముడిపడి ఉన్నప్పుడు - వ్యక్తిగత జీవితంలోని ప్రతి కోణమూ రచ్చకెక్కి తీరుతుంది.

బ్రూనై బొక్కసానికి జెఫ్రీ యువరాజా వారు కన్నం వేసిన కమామీషు చూస్తే బయటపడ్డ నమ్మలేని నిజాలు అన్నీ ఇన్నీ కాదు...


అన్నగారు: బ్రూనై సుల్తాన్ హసన్ అల్ బోల్కియా

## పదేళ్లలో 75 వేల కోట్ల

ఆగ్నేయాసియాలో 5765 చ.కి.మీ. వైశాల్యంతో, కేవలం 3 లక్షల జనాభాతో ఉన్న అతిచిన్న దేశం బ్రూనై. ఇంత చిన్న దేశానికి 600 ఏళ్ళ పెద్ద చరిత్రే వుంది. మలేసియా సమీపంలోని విశాల బోర్నియో ద్వీపకల్పంలో బ్రూనై ఒక చిన్న ప్రాంతం. మొదట్లో బ్రూనై సూల్తాన్‌లు ఫిలిప్పీన్స్ దాకా విస్తరించిన సువిశాల సామ్రాజ్యాన్ని పాలించారు. తరువాత పొరుగురాజుల దాడుల ఫలితంగా బ్రూనై దాదాపు కనుమరుగై - బ్రిటిష్ వాళ్ళ చలవతో ఇప్పుడున్న ప్రాంతం మిగిలింది. అప్పటినుంచి వందేళ్ళపాటు సాగిన బ్రిటిష్ పాలన నుంచి బ్రూనై 1984లో స్వతంత్రమైంది. స్వతంత్ర బ్రూనైకి 29వ సుల్తాన్ హసనల్ బోల్కియా అధికారం చేపట్టాడు.

ఇదీ క్లుప్తంగా చరిత్ర.

అక్కడ ఎన్నికలు లేవు. అధికారమంతా సుల్తాన్‌దే. మంత్రులంతా రాజకుటుంబీకులే.

అపారమైన చమురు, సహజవాయువు నిక్షేపాలు కలిగిన దేశాల్లో బ్రూనైది నాలుగవ స్థానం. ఈ చమురు సంపదే సుల్తాన్‌ని ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా మార్చింది. ఇప్పుడీ వివరాలన్నీ ఎందుకూ అంటే - గౌరవప్రదంగా, గుట్టుగా ఏలుబడి సాగిస్తున్న రాజకుటుంబాన్ని రాజుగారి రెండవ తమ్ముడు జెఫ్రి బోల్కియా వివిధ దేశాల అప్పులవాళ్ల ముందు తలదించుకునేలా చేశాడు.

జెఫ్రీ దుబారా ఖర్చుతో - దుర్భేద్యం అనుకున్న బ్రూనై ఆర్థిక వ్యవస్థ పునాదులే కదులుతున్నాయి. 20 ఏళ్ళుగా జెఫ్రీ విందులు, వినోదాలు, విలాసాలకు ఆదేశపు 40 బిలియన్ డాలర్ల విదేశీ మారకంలో ఇప్పటికే సగం కరిగిపోయింది. మూడువందల మంది బడా అప్పులవాళ్లు రాజకుటుంబం తలుపులు తట్టారు. జెఫ్రీ ఆస్తుల్ని వేలం




## ఎంత లాసు కోటలో...

ఒక మనిషి ఒక రోజుకి ఎక్కువలో ఎక్కువ ఎంత ఖర్చు చేస్తాడు? వందలో, వేలో, మహా అయితే కొన్ని లక్షల దగ్గరే మన జవాబు ఆగిపోతుంది. కానీ జెఫ్రీ ఒక్క రోజు చేసే ఖర్చు మాత్రం మన రూపాయల లెక్కల్లో 3.5 కోట్లు మాత్రమే. ఇది ఏదో ఒక్క రోజన అనుకుంటే పొరపాటే. గత పదేళ్ల నుంచి యువరాజా వారి దినసరి ఖర్చు దీనికి తక్కువేమీ లేనట్లు లెక్కలు తేల్చారు.

తన చిన్న దేశాన్ని పాశ్చాత్య దేశాలను తలదన్నేలా తీర్చి దిద్దాలన్నది ఇతడి కోరిక. ఇది మంచిదే కావచ్చు. కానీ ఆయన చేసిన ఏ ఒక్క పనీ దేశానికి పనికి రాలేదు. దీని పేరిట ఆయన ఎంతగా దుబారా చేశాడో చూసి అక్కడి ప్రజలే గుడ్లు తేలేస్తున్నారు. ఉదాహరణకి గత ఏడాది ఒపెక్ దేశాల సదస్సు జరిగింది. అప్పుడు జెఫ్రీ ఓ మహారాజు భవనం లాంటి సిక్స్ స్టార్ హోటల్‌ని కట్టించాడు. దీంట్లో పాలరాయి, గ్రానైట్, బంగారం తాపడంతో కట్టిన 530 గదులున్న ఈ ప్యాలెస్‌కు 80 మీటర్ల ఎత్తయిన ముఖద్వారం ఉంది. ప్రపంచంలోనే ఇది పెద్దది. ఇందులో ఓ మయసభ లాంటి ఎంపరర్ సూట్, ఇండోర్ స్విమ్మింగ్‌పూల్, గోల్ఫ్ కోర్స్, సినిమా హాల్, ఇంపోర్టెడ్ ఇసుకతో కట్టిన అద్భుతమైన శిల్పాలెన్నో ఉన్నాయి. ఇంతకూ దీని ఖర్చెంతో తెలుసా?

3600 కోట్లు...! దీనిపై లాభాల సంగతలా ఉంచి ఒక్క రోజుకి, ఒక్కో గదికి 500 డాలర్లు (రూ. 25 వేలు) బిల్లు కట్టే కస్టమర్లు 60 ఏళ్ళపాటు 450 గదుల్లో రెగ్యులర్‌గా ఉంటారని అనుకున్నా - దీన్ని కట్టిన ఖర్చు రాబట్టుకోవడం కష్టమని తేలింది.

ఇదిలా వుంది కదూ! ఇప్పుడా హోటల్‌కి 50 గదులు కూడా నిండడం గగనంగా ఉంది. అద్దెని రోజుకి 90 డాలర్లకు తగ్గించినా ఎవరూ రావడం లేదని దీనికి డిజైన్ చేసిన పీటర్ బ్రూక్ చెబుతున్నాడు. ఇది ఆర్థికంగా దేశ ఖజానాను ముంచే ఆలోచనే తప్ప ఏమాత్రం లాభం లేదు.

మరో ఉదాహరణ. ఓ బ్యాంక్ కోసం అద్భుతమైన మల్టీస్టోరీడ్ బిల్డింగ్ కాంప్లెక్స్‌కి ప్లాన్ చేశాడు జెఫ్రీ. తీరా నిర్మాణం పూర్తయ్యాక ఆ ప్రాజెక్ట్ దేశంలోని చారిత్రాత్మకమైన ఒమర్‌అలీ సైపుద్దీన్ మసీదు ఎత్తును మించిపోతోందన్న అభ్యంతరాలు వచ్చాయి. దాంతో పైనుంచి ఏకంగా ఆరు అంతస్తుల్ని కూల్చివేశారు. అక్కడి ప్రజలే ఈ ప్రాజెక్టుని తమాషాగా 'నన్సీ' అని చెప్పుకుంటారు. కోట్ల ఖర్చుతో కట్టిన ఈ ప్రాజెక్ట్ - ఇప్పుడు పిచ్చి మొక్కలు ముళ్ళ తుప్పల మధ్య శిథిల భవనంలా ఉంది.




జెఫ్రీ ఖర్చుకి అదుపు లేదనడానికి మరో సంఘటన. బ్రిటన్ రాజవంశీయులకి నగలు సరఫరా చేసే ఆస్ప్రీ అనే సంస్థను ఏకంగా 1732 కోట్లకు కొన్నాడు. ఎందుకో ఏ నరమానవుడికీ తెలియదు.

అసలు సంగతేమిటంటే దీని అసలు విలువ ఈ మొత్తంలో సగం కూడా ఉండదు. ఇదే ఘోర నష్టం అనుకుంటే ఆ మధ్యన ఆస్ప్రీని అమ్మితే కనీసం ఆ సగంలో సగం ధర కూడా [illegible]దుట. ఇలా జెఫ్రీ ఖర్చుకి ఓ తలాతోకా లేకుండా పోయింది.

"జెఫ్రీకి డబ్బు విలువ తెలియదు. ఆయనకు ఓ [illegible]నో, తుప్పుపట్టిన మేకునో చూపించి దీనికి రెండు వేల డాలర్లు అంటే తేలిగ్గా నమ్మేస్తారు" అని బ్రూనీ ప్రజలు తమాషాగా చెప్పుకుంటారు.

## విమానం ఫీలింగ్ కోసం...

జెఫ్రీ యువరాజా వారికి విమానం అంటే బోల్డు సరదా. దీన్ని తానే నడపాలన్నదే ఆయన కోరిక. కానీ అదెలాగో తెలిసి చావదు కదా. అందుకని ఆ వినోదాన్ని తీర్చుకోవడం కోసం అచ్చు ఎ-340 విమానం కాక్‌పిట్‌ను తలపించే సిమ్యులేటర్‌ను (కంప్యూటర్ గేమ్ లాంటిది అనుకోండి) కొనుక్కున్నాడు. దీని ఖరీదెంతో తెలుసా? కేవలం 54 కోట్లు. అలాగే ఓ హెలికాప్టర్ నడిపించాలనిన్నీ - ఓ రేసింగ్ కార్‌లో దూసుకుపోవాలనిన్నీ ఈయనగారి కోరికలు. నిజమైనవి ఎలాగూ నడపలేడు కాబట్టి - వాటిని నడిపిన ఫీలింగ్‌ను పొందడానికి ముచ్చటపడి కోట్ల డాలర్లు పోసి కంప్యూటర్ సిమ్యులేటర్‌లను కొనుక్కున్నాడు. ఇక కార్లంటే ఎంత మోజో! వివిధ కంపెనీలకు చెందిన రెండువేల కార్లు ఆయన కొలువులో ఉన్నాయి.

ఇలా ఈ యువరాజా వారి 'బిగ్‌బాయ్ బొమ్మల కొలువు'లో 50 మీటర్ల నౌక, ఖరీదైన రెండు లైఫ్ బోట్లు, ఇటాలియన్ షాండ్లియర్‌లు, గ్లాస్ ఫర్నీచర్, బంగారు క్యాండిల్ హోల్డర్లు, 12 అడుగుల ఎత్తున్న ఊగే బంగారు గుర్రం లాంటివి బోలెడున్నాయి. చివరికి డస్ట్‌బిన్‌లూ, మరుగు దొడ్లను కడిగే బ్రష్‌లు సైతం బంగారంతో చేసినవే.

## గుర్రాలకి ఎ.సి. సూట్

యువరాజుకి ఆటలంటే కూడా బోల్డు ఇష్టం. జరుడోంగ్ అనే ఓ గ్రామాన్ని - కేవలం రాజవంశీయులు, విదేశీ వి.ఐ.పి.ల కోసం బ్రహ్మాండ ఆటస్థలంగా మార్చివేశాడు (ప్రజలకోసం అనుకుంటే పొరపాటే). ఓ పోలో


బంగారు షాండ్లియర్‌లు, మరుగు దొడ్లను క్లీన్ చేసే బంగారు బ్రష్‌లు, కుర్చీలకు బంగారు తాపడ

వేశారు. దీన్ని ఈ శతాబ్దంలోనే అతి పెద్ద వేలంగా చెబుతున్నారు.

ముందుచూపు ఉన్న సుల్తాన్ - కూర్చుని తింటే కొండలైనా కరుగుతాయని గ్రహించి చమురు నిధులను లాభదాయకమైన రంగాల్లో పెట్టుబడుల్ని పెట్టడానికి "బ్రూనై ఇన్‌వెస్ట్‌మెంట్ ఏజన్సీ" ఏర్పాటు చేశాడు.

కానీ యువరాజు, బ్రూనై ఆర్థికమంత్రి కూడా అయిన జెఫ్రీ అనుకున్నది వేరు. ఈ పూట ఎంత జాలీగా గడిపామన్నదే ఆయన లెక్క. పదేళ్ళ నుంచి అదే ట్రైపు. చేతికి ఎముక లేదు. ఖర్చుకి అంతులేదు. ఫలితంగా గత పదేళ్ళలో ఏకంగా 16 బిలియన్ దాలర్ల (75 వేలకోట్లకు పైనే) బి.ఐ.ఎ. నిధులు చిన్నయ్యగారి విలాసాలకి హుష్‌కాకి అయిపోయాయి. ఈ గుట్టు - అప్పులవాళ్ళ రాకతో బద్దలైంది. చమురు కాకుండా ఇతర రంగాల్లో దేశాన్ని ఆర్థికంగా నిలబెట్టాలని ఒక వైపు పెద్దన్న (సుల్తాన్) నానా తంటాలు పడుతుంటే - మరోవైపు బొక్కసానికి జెఫ్రీ పెద్ద కన్నమే వేసి నిధులను తోడుకుంటూ పోయాడు. మొన్నటి ఆసియా కరెన్సీ సంక్షోభ సమయంలో అనేక దేశాలను డబ్బు సాయం చేసి గట్టెక్కించిన సుల్తాన్ - ఇపుడు తమ్ముడి నిర్వాకంతో తల వంచుకు నిలబడ్డాడు. జెఫ్రీ అప్పుల పర్వం ఎంత ప్రకంపనం సృష్టించిందంటే - పొదుపు చర్యలు అన్నమాటే తెలియని బ్రూనైలో ఇప్పుడు ప్రభుత్వం అలాంటి చర్యలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## ఆస్తి హారతి కర్పూరం



కథా నాయకుడు జెఫ్రీ బోల్కియా

# జులారీ ఖర్చు 3.5 కోట్లు





పోలో క్రీడలో అన్నలుంగారు

క్లబ్‌ని కట్టాడు. పోలో ఆటకోసం గుర్రాలు కావాలి కదా.

అందుకని దాదాపు రెండు వేల మాంచి జవనాశ్వాలను అర్జెంటినా నుంచి ప్రత్యేకంగా తెప్పించాడు. మరి ఆ వివిపి గుర్రాల్ని పిడికెడు గడ్డి పారేసి ఓ మూలకి కట్టేస్తా రనుకున్నారా ఏం? ఆ రెండువేల గుర్రాలకి ఓ పేద్ద ఎయిర్ కండిషన్డ్ లగ్జరీ సూట్ కట్టించి అందులో ఉంచాడు. ఆ పోలో క్లబ్‌లో రాజవంశీయులకి తక్క అన్యులకి ఎంట్రీ నిషిద్ధం.

"రాచరికపు చిక్కులలో" అలసినపుడు సుల్తాన్, జెఫ్రీ ఇక్కడికి వచ్చి ఆడుకుంటారు. అప్పుడప్పుడు ఈ క్లబ్‌కి వచ్చే అతిథుల హోదా బ్రిటన్ ప్రిన్స్ చార్లెస్ లాంటి వాళ్ళ లెవిల్లో మాత్రమే ఉంటుంది. ప్రజలకేమాత్రం లాభం లేని ఈ పోలో క్లబ్‌కి ఎంత తగలేసాడో ఇప్పటికీ లెక్క తేలలేదు.

## మదన కామరాజు

జెఫ్రీ మాంచి రసికరాజు కూడా.

దేశంలో నిర్మాణం పూర్తయిన, మధ్యలో ఆగిపోయిన గెస్ట్‌హౌస్‌లు ఎన్ని ఉన్నాయో లెక్కలేదు. రోజూ ఏదో ఒక గెస్ట్‌హౌస్‌లో పార్టీ జరగాల్సిందే. అవి అల్లాటప్పా రకం కాదు. అమెరికా, ఫిలిప్పైన్స్ లాంటి దేశాల అందాల రాణులు ప్రత్యేక విమానాల్లో వచ్చి వాలతారు. రొటీన్‌గా అనిపిస్తే తానే వెళ్ళి సరదాగా గడిపి వస్తాడు. వారికి ఇచ్చే నజరానాలకి ఖరీదు కట్టడం కష్టం. కొన్నిసార్లు వివాదాల్లోనూ ఇరుక్కున్నాడు. అమెరికాకు చెందిన షెనాన్ మార్కెటిక్ అనే ఓ బ్యూటీ క్వీన్ తనను ఉంపుడుగత్తెగా ఉండేందుకు రమ్మని జెఫ్రీ వెంటపడ్డట్టు కోర్టుకెక్కింది. చివరికి దౌత్యపరంగా ఉన్న పలుకుబడితో అది రచ్చకెక్కలేదనుకోండి.

జెఫ్రీ విలాసజీవితం బ్రూనైకే పరిమితం కాలేదు. లాస్‌ఏంజిల్స్, లండన్, పారిస్, వాషింగ్టన్, న్యూయార్క్ వంటి నగరాల్లో రాజభవనాల్ని తలదన్నే స్టార్ హోటళ్లు, నివాస భవనాలు చూస్తే కళ్లు తిరిగిపోతాయ్. లండన్, లాస్ వెగాస్‌లలోని ఇళ్లు ఆ నగరాల్లోనే ఖరీదైనవని చెబుతారు. ముందు ముందు కట్టబోయే విలాస భవనాలకోసమని తెప్పించిన 7000 టన్నుల మార్బుల్, ఇతర ఇర్మాణ సామగ్రి ఇప్పుడు దుమ్ముకొట్టుకుపోయింది.

## ఎలా పొక్కింది?

నాలుగేళ్ల క్రితం దాకా జెఫ్రీది ఆడింది ఆటగా, పూటకో విందులా సాగింది. సుల్తాన్ కూడా విలాసజీవే అయినప్పటికీ కష్టపడి విదేశీ మారక ద్రవ్య నిల్వలను 40 బిలియన్ డాలర్లకు (1,80,000 కోట్లు) తీసుకువచ్చాడు. తమ్ముడు జెఫ్రీ ఇప్పుడు ఇందులో సగం (సుమారు 75,000 కోట్లు) కరిగించాడు. అపారమైన తైలనిక్షేపాల నుంచి వచ్చే నిధులలో కొంత రాజకుటుంబానికి పోను, మిగతా మొత్తాన్ని ఎక్కడ ఎలా లాభదాయకంగా పెట్టుబడి పెట్టాలో నిర్ణయించేందుకు 'బ్రూనై ఇన్వెస్ట్‌మెంట్ ఏజెన్సీ' ఏర్పాటు చేశాడు సుల్తాన్. దాని బాధ్యతలు జెఫ్రీకి అప్పగించాడు. దేశమంతటా రోడ్లు, పవర్‌స్టేషన్, సెల్‌ఫోన్ నెట్‌వర్క్, శాటిలైట్ టీవీ నెట్‌వర్క్ లాంటి వాటి మీద కొంత ఖర్చు బాగానే చేశాడు జెఫ్రీ. కానీ తన విలాసాలకి చేసిన ఖర్చులో ఇది ఓ మూలకి కూడా రాదు. అమ్మాయిలు, ఆట వస్తువులు, డజన్ల కొద్దీ విలాస భవనాలు, ఖరీదైన కార్లు... ఇలా ఆయన ఖర్చు అంతులేకుండా పోయింది.

"ఆయిల్ నిల్వల మీద ఆధారపడితే దిక్కులేదు. మరో ఇరవై ఏళ్లలో అవన్నీ ఆవిరైపోతాయి. అందుకే చమురు కాకుండా ఇతర రంగాల్లోనూ దేశం అభివృద్ధి చెందితేనే మనగలుగుతాం" అని సుల్తాన్ ముందుచూపుతో బిఐఏని ఏర్పాటు చేశాడు. అలా దేశానికి లాభాలు తెచ్చే రంగాల్లో పెట్టుబడి పెట్టాల్సిన బిఐఏ నిధులని ఇలా తన ఖర్చులకి తగలేశాడు.

జెఫ్రీ 'అమెడో కన్‌స్ట్రక్షన్ కార్పోరేషన్' అనే స్వంత కంపెనీని పెట్టుకున్నాడు. ఈ కంపెనీ పేరు మీదే తన స్వంత ఖర్చుల కోసం దొరికిన చోటల్లా అప్పులు చేశాడు. 1997లోనే ఈ సంగతి సుల్తాన్‌కి తెలిసి ఆర్థిక మంత్రి పదవి నుంచి తీసేశాడు సుల్తాన్. ప్రభుత్వ దర్యాప్తులో తేలిందేమిటంటే - బిఐఏ నుంచి 16 బిలియన్ డాలర్లకు (75,000 కోట్లు) జెఫ్రీ తన ఖర్చుల కోసం కన్నం వేసినట్టు తేలింది. దీంతో జెఫ్రీ మీద బ్రూనై కోర్టులో కేసు దాఖలైంది. కాని సుల్తాన్ తమ్ముని మీద కనికరంతో కోర్టు బయట సెటిల్మెంట్ చేసుకున్నాడు. దీని ప్రకారం జెఫ్రీ తన ఆస్తులన్నీ ప్రభుత్వానికి అప్పగించాలి. వాటన్నింటినీ అమ్మకానికి పెట్టాలన్నది ఆ కండిషన్. అయినా జెఫ్రీ అప్పులు తీరలేదు. అప్పులవాళ్లకి ఇంకా బిలియన్ డాలర్లు (4,500 కోట్లు) కక్కాల్సి వుంది. జెఫ్రీకి అప్పులిచ్చిన వాళ్ళలో హ్యూండయ్, సిటీ బ్యాంక్ లాంటి ప్రసిద్ధ కంపెనీలు వున్నాయ్. గత నెలలో ఇలాంటి 300 మంది అప్పులవాళ్లు బ్రూనైలో వాలారు. ఆగస్టు 11 - 15 మధ్య జెఫ్రీకి సంబంధించిన ప్రతి వస్తువునీ వేలం పాటకి పెట్టారు. ఈ వేలం పాటకి దేశవిదేశాల్నుంచి 1000 మంది సంపన్నులు వచ్చారు. 'ఈ శతాబ్దపు వేలం'గా చరిత్రకెక్కుతున్న ఈ యాక్షన్‌ని బ్రిటన్‌కు చెందిన ప్రఖ్యాత సాత్‌బీ సంస్థ నిర్వహించింది. అధికారులు కూడా బ్రూనై చేరారు. ఈ బ్రూనైలోని 21 గోదాముల్లో జెఫ్రీ దాచిన వేలాది వస్తువుల్ని వేలంవేశారు. వీటిలో బంగారు బ్రష్షు నుంచి - ఖరీదైన ఆభరణాల దాకా వున్నాయి. ఇంతచేసినా అప్పులు తీరకపోవడంతో రుణదాతలు జెఫ్రీకోసం వల పన్నారు.



ఈ అమెరికన్ బ్యూటీ క్వీన్‌పై జెఫ్రీ మనసుపడ్డారు కానీ...

జెఫ్రీకి ప్రతినెలా 3లక్షల డాలర్లు (దాదాపు 12.5 కోట్ల రూపాయలు) అందించే ఏర్పాటుచేసాడు సుల్తాన్. అప్పులవాళ్లని తప్పించుకుంటూ జెఫ్రీ ఇప్పుడు పారిస్, లండన్, న్యూయార్క్ మధ్య చక్కర్లు కొడుతున్నాడు. ఆ మధ్య జెఫ్రీ ఓసారి బ్రూనై వచ్చినపుడు అప్పులవాళ్ల తరపు లాయర్లు ఆయన్ని పట్టుకోలేకపోయారు. కారణం డజన్ల సంఖ్యలో రాజభవనాలున్నాయ్. వీటిలో ఈ యువరాజు ఎక్కడ దాక్కున్నాడో పట్టుకోవడం వాళ్ల తరం కాలేదు.

గత నెలలో జెఫ్రీ వస్తువుల్ని వేలం వేసినా ఇంకా అప్పులు తీరలేదు. అయితే విదేశీ అప్పులవాళ్లకి ఇప్పుడు చిక్కు సమస్య వచ్చింది. జెఫ్రీ స్వంత డబ్బుతో కూడబెట్టిన ఆస్తులేమిటి? ప్రభుత్వ నిధులతో కూడబెట్టినవి ఏమిటి అనే ప్రశ్న తలెత్తింది. ప్రభుత్వ నిధులతో జెఫ్రీ కట్టిన భవనాలు, హోటళ్లు, కొన్న వస్తువుల్ని వేలం వేయడానికి వీల్లేదని బ్రూనై కోర్టు ఆదేశించింది. దీంతో అసలు బ్రూనైలో రాజవంశీయుల ఆస్తులేవీ, ప్రభుత్వ ఆస్తులేవీ అన్నది వేరు చేయడం సాధ్యం కాక తల పట్టుకున్నారు.

దీంతో వేలం పాటలో జెఫ్రీకి తామిచ్చిన అప్పుల్లో ఏడో వంతు కూడా రాబట్టుకోలేని అప్పులవాళ్లు లబోదిబోమంటున్నారు•



జెఫ్రీ కలల వ్యాపార సామ్రాజ్య కేంద్రం, పూర్తి కాకుండానే చిట్టడవిగా మారిన వైనం..



ఈ హోటల్‌కి 3,600 కోట్ల ఖర్చు





5 కోట్ల డాలర్ల పెయింటింగ్

# పాకిస్తాన్‌లో మానవత్వానికి మరణశిక్ష



**"మాకు చదువు చెబుతున్న ప్రొఫెసర్ అన్న గౌరవం కొద్దీ వదిలేశాం. లేకపోతే ఆయన్ని అక్కడికక్కడ కొట్టి చంపేవాళ్లం" - ఇది డాక్టర్ యూనిస్ షేక్ గురించి పదిహేడేళ్ల విద్యార్థి సయ్యద్ బిలాల్ చెప్పిన మాట! ఒక్క బిలాల్‌దే కాదు, మరి కొందరు విద్యార్థుల మాట కూడా అదే.**

విద్యార్థులు డాక్టర్ షేక్‌ను వదిలిపెట్టారు కానీ, మతపెద్దలు మాత్రం వదిలిపెట్టలేదు. ఆయనను 'చంపే పని'ని వారంతా కలిసి పాకిస్తాన్ ప్రభుత్వానికి అప్పగించారు.

డాక్టర్ షేక్ ఇస్లామాబాద్‌లోని ఒక హోమియోపతి వైద్యకళాశాలలో ఫిజియాలజీ ప్రొఫెసర్. ఆయన పాకిస్తాన్‌లోనూ, ఐర్లాండ్‌లోనూ చదువుకున్నారు. డాక్టర్‌గానూ, ప్రొఫెసర్‌గానూ గౌరవనీయమైన స్థానంలో ఉన్నారు. డాక్టర్ షేక్ ఒక మానవతావాది. లండన్‌లోని 'ఇంటర్నేషనల్ హ్యూమనిస్ట్ ఎండ్ ఎథికల్ యూనియన్' (ఐహెచ్ఇయు)కి అనుబంధంగా పాకిస్తాన్‌లో పనిచేస్తున్న 'ఎన్‌లైటెన్మెంట్' సంస్థను నిర్వహిస్తున్నారు. ప్రపంచ శాంతి, పర్యావరణం, మానవ హక్కులు వంటి అనేక అంశాల్లో కృషి చేస్తున్న ఉద్యమకారుడు.

డాక్టర్ షేక్ అనుకోకుండా గత అక్టోబర్‌లో దైవదూషణ ఆరోపణల్లో చిక్కుకున్నారు. గత అక్టోబర్‌లో ఇస్లామాబాద్ పోలీసులు ఆయనను అరెస్ట్ చేశారు. సెక్షన్ 295 సి కింద పలు అభియోగాలు మోపారు. దైవదూషణకు మరణశిక్షను విధించే ఈ సెక్షన్ పాకిస్తాన్‌లోని చట్టాల్లోకెల్లా తీవ్రమైనది. ఎవరైనా దైవదూషణకి పాల్పడ్డారని రుజువైతే ఈ చట్టం కింద మరణశిక్షను అనుభవించాల్సిందే. డాక్టర్ షేక్‌పై పోలీసులు ఎఫ్ఐఆర్‌లో చాలా తీవ్రమైన ఆరోపణలు నమోదు చేశారు.

నలభయ్యో యేట ప్రవక్త దైవసందేశం అందుకునే దాకా ముస్లిం కాలేదని, ప్రవక్త తల్లిదండ్రులు కూడా ముస్లింలు కారని డాక్టర్ షేక్ గత అక్టోబర్‌లో ఓ రోజు విద్యార్థులకు పాఠం చెబుతున్నపుడు అన్నట్టు పోలీసులు ఆరోపించారు. 259సి చట్టాన్ని వ్యక్తిగత కక్షలు తీర్చుకునేందుకు ఉపయోగించుకుంటున్న దాఖలాలే ఎక్కువగా ఉన్నాయి. తాజా సంఘటన కూడా దీనికి ఓ ఉదాహరణగా కనిపిస్తోంది.

క్లాస్‌రూమ్‌లో యధాలాపంగా జరిగిన చర్చలో మహ్మద్ అజ్గర్ ఖాన్ అనే విద్యార్థి బయటపెట్టాడు. డాక్టర్ షేక్ అంటే పడని ఆ విద్యార్థి 11 మంది విద్యార్థులతో కలిసి ఆయన చేసిన నేరాలు ఇవీ అంటూ ఒక లేఖ రాసి సంతకాలు పెట్టారు. ప్రవక్త గురించి డాక్టర్ షేక్ అవమానకరంగా మాట్లాడారని పేర్కొంటూ పలు ఆరోపణలను లేఖలో పొందుపరిచారు.

తమ ఫిర్యాదు లేఖను విద్యార్థులు 'మజ్లిస్-ఇ-ఖతమ్ నబువత్' అనే మతసంస్థకి అందచేశారు. వెంటనే ఆ సంస్థకు చెందిన అబ్దుర్ రవూఫ్ అనే మతపెద్ద ఇస్లామాబాద్‌లోని మార్గల్లా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు డాక్టర్ షేక్‌ని అరెస్ట్ చేసి 295 సి కింద ఆరోపణలు మోపి కోర్టులో హాజరుపరిచారు. కోర్టు ఆదేశాల మేరకు ఆయనను రావల్పిండిలోని అడయాల జైలులో - కనీసం నిలబడేందుకు కూడా చోటు లేని ఓ ఇరుకు గదిలో నిర్బంధించారు. ఇది జరిగింది గత అక్టోబర్‌లో. 11 నెలలుగా నిర్బంధంలో ఉన్న షేక్‌కు అడిషనల్ సెషన్స్ జడ్జి మొన్న ఆగస్టు మొదటివారంలో మరణశిక్ష విధించారు. ఆగస్టు 18న ఉరి తీయాలని తీర్పు ఇచ్చారు. (దీని మీద డాక్టర్ షేక్ హైకోర్టుకు అప్పీలు చేసుకున్నారు.) డాక్టర్ షేక్ తరపున వాదించటానికి ఒక్కరూ ముందుకు రాలేదు. అలా చేస్తే వారి ప్రాణం మీదికి వస్తుందని తెలుసు. ఫిర్యాదుదారుల తరపున మాత్రం 20 మంది మతపెద్దలు తమ వాదనలు వినిపించారు. కోర్టుకు వచ్చినపుడు షేక్‌పై కొందరు విరుచుకుపడ్డారు. కొట్టేందుకు ప్రయత్నించారు. ఆయనను కనీసం ఎవరితోనైనా మాట్లాడేందుకు కూడా పోలీసులు అనుమతించలేదు.

నేరానికి ప్రత్యక్ష సాక్షులు ఎవరూ లేరని, ఏ మాత్రం సంబంధం లేని ముల్లాలు కేసు పెట్టారని, నేరం జరిగినట్టు చెబుతున్న రోజున తాను కళాశాలలో లేనని షేక్ వాదించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. నేరానికి సంబంధించి కీలకమైన అటువంటి టెక్నికల్ విషయాలను అక్కడి న్యాయవ్యవస్థ పట్టించుకోదల్చుకోలేదు. డాక్టర్ షేక్‌ను విచారిస్తున్న సందర్భంలో, భయపెట్టే ఉద్దేశ్యంతోనూ, ప్రభావితం చేసే ఆలోచనతోనూ కొందరు మతఛాందసులు కోర్టుకు హాజరయ్యారు. కోర్టు వదిలిపెట్టినా తాము వదలబోమనేది మతఛాందసుల వైపునుంచి అందిన సంకేతం.

అబ్దుల్ వాహిద్ ఖాశ్మి అనే మతపెద్ద - "డాక్టర్ షేక్ మేలు కోరే మేం అరెస్టు చేయించాం. లేకపోతే ఈ పాటికి ఆయన్ని వీధుల్లో కొట్టి చంపేసి వుండేవారు" అని చెబుతున్నాడు.

ఆయన చెప్పిన దాంట్లో అంతా నిజమే వుంది. ఎందుకంటే - ప్రవక్తను, దైవాన్నీ దూషించేవారిని వెంటాడి తగిన శిక్షను వేయించే వరకూ నిద్రపోని సంస్థ 'మజ్లిస్-ఇ-ఖతమ్ నబువత్'. అవసరమైతే న్యాయాన్ని తన చేతుల్లోకి కూడా తీసుకుంటుంది. ఇది తరచు అహ్మదీయుల మీద దృష్టిని కేంద్రీకరిస్తూ వుంటుంది. అహ్మదీయులు తమను తాము ముస్లింలుగా భావించుకుంటారు. అయితే వారు మహ్మద్‌తో పాటు మరొక ప్రవక్తను కూడా విశ్వసిస్తారు. ఆ కారణంగానే, పాకిస్తాన్ సమాజం మరీ ముఖ్యంగా మత ఛాందసులు వారిని ముస్లింలుగా గుర్తించరు. పాకిస్తాన్ చట్టంకూడా, అహ్మదీయులు ఇస్లాంతో ఏ రకమైన సంబంధాలు పెట్టుకోవటానికీ అనుమతించదు. వారు ఖురాన్‌లోని పంక్తుల్ని ఉచ్చరించినా నేరమే, 'సలామ్ అలేకుమ్' అంటూ పలకరించుకున్నా నేరమే - కేవలం ఇటువంటి నేరాల కారణంగా ఏటా వందలాది అహ్మదీయులను అరెస్టు చేస్తుంటారు.

డాక్టర్ షేక్ కుటుంబీకులు కూడా ఎందుకైనా మంచిదని, 'మానవ హక్కుల' కేసులను వాదించే లాయర్‌ను సంప్రదించటానికి ఇష్టపడలేదు. బదులుగా వారు షేక్‌ను అరెస్టు చేయించిన సంస్థ బహవల్‌నగర్ శాఖకు చెందిన మత నాయకులను కలిశారు. (బహవల్ నగర్, డాక్టర్ షేక్ స్వస్థలం) మౌలానా అబ్దుల్ హాఫీజ్ అనే మతపెద్ద, డాక్టర్ షేక్‌కు అనుకూలంగా మాట్లాడారు. "ఇందులో దైవ దూషణ ఏమీ లేదు. మహ్మద్ తనను ప్రవక్తగా ప్రకటించుకున్న అనంతర కాలపు అంశాలను ప్రశ్నిస్తేనే అది దైవదూషణ అవుతుంది. డాక్టర్ షేక్ చర్చించింది తనను ప్రవక్త ప్రకటించుకోవటానికి పూర్వపు సంగతులు" అని వాదించారు. హాఫీజ్‌తో పాటు బహవల్ నగర్ ముల్లాలు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ఇస్లామాబాద్ ముల్లాలు వీరి మీద మండిపడ్డారు - "దైవనిందకు పాల్పడిన వాడిని రక్షించే ప్రయత్నం చేయడం కూడా దైవనిందే అవుతుంది" అంటూ హెచ్చరించారు కూడా. దీంతో హాఫీజ్ లాంటి వారు వెనక్కి తగ్గారు.

బ్లాస్ఫెమీ చట్టంలో మార్పులు తేవాలని అన్నందుకు ఆ దేశ అధ్యక్షుడు ముషారఫ్ సైతం గతంలో మతపెద్దల ఆగ్రహానికి గురయ్యారు. మత ఛాందసులంతా ప్రదర్శనలు చేయడంతో పాకిస్తాన్‌కి పాలకుడే అయినా, వారికి తలొగ్గాడంటే - మత ఛాందసుల పట్టును అర్థం చేసుకోవచ్చు.

ఈ చట్టం ప్రకారం - నేరారోపణకి ఇద్దరు ముస్లిం మగవాళ్ల సాక్ష్యం వుంటే చాలు. విచారించే అధికారి కచ్చితంగా ముస్లిమే అయ్యుండాలి. ముస్లిం మగవారి సాక్ష్యంతో పోల్చినప్పుడు స్త్రీల, మైనారిటీల సాక్ష్యాలకు ఏమాత్రం విలువ వుండదు. ఈ చట్టాన్ని పాకిస్తాన్ జనాభాలో 3 శాతంగా వున్న అహ్మదీయులు, క్రైస్తవులు, హిందువులు, షియా ముస్లింలు లాంటి మైనారిటీలను అణచివేయటానికే వినియోగిస్తున్నారు. సాక్షాత్తూ ఆ దేశపు మతవ్యవహారాల శాఖమంత్రి, బ్లాస్ఫెమీ చట్టానికి గట్టి మద్దతుదారు అయిన మహ్మద్ ఘాజీ కూడా - 'చాలా కేసుల వెనుక దురుద్దేశం, వ్యక్తిగత కక్షలు మాత్రమే కనిపిస్తున్నాయి' అని అన్నారు.

బ్లాస్ఫెమీ నేరం కింద వందలాది మంది. జైళ్ల పాలవుతున్నప్పటికీ - సంచలనంగా మారే కేసులు మాత్రమే బయట ప్రపంచానికి తెలుస్తున్నాయి. ఖురాన్ పేజీలు చింపిన ఒక వ్యక్తికి మరణ శిక్ష పడినప్పుడో, మతాన్ని దూషిస్తూ, ప్రశ్నిస్తూ లేఖ ప్రచురించిన కారణానికి ఒక పత్రిక మూతపడినప్పుడో, బ్లాస్ఫెమీ నిందితుల్ని మత ఛాందసవాదులు చంపేసినప్పుడో, ఎవరైనా ఒక జడ్జి ధైర్యం చేసి నిందితుల్ని వదిలిపెట్టినప్పుడో - మాత్రమే ఇవి లోకం దృష్టికి వస్తున్నాయి.

బ్లాస్ఫెమీ ఆరోపణల మీద, వందలాది మైనారిటీలు జైళ్లపాలయ్యారు. అయితే ఇప్పటికి ఇద్దరికి మాత్రమే మరణశిక్షలు విధించారు. షేక్ కంటే ముందు అయూబ్ మాసి అనే క్రైస్తవుడికి పాకిస్తాన్ ప్రభుత్వం మరణ శిక్ష వేసింది. మాసి భూమిని కబ్జా చేసే ప్రయత్నంలో భాగంగానే అతడి మీద ప్రత్యర్థులు దైవదూషణ నేరాన్ని ఆరోపించారని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ చెబుతున్నది. (అయూబ్ మాసితో సహా బ్లాస్ఫెమీ ఆరోపణలతో జైలు పాలైన అనేక మంది పాకిస్తానీ క్రైస్తవుల దుస్థితి గురించి 'బతుకు లేదు... విశ్వాసం వుంది' శీర్షికతో విజయ విహారం జులై 2000 సంచికలో ఒక సమగ్ర, సచిత్ర వ్యాసాన్ని ప్రచురించింది).

మరణశిక్ష కారణంగానూ, మానవహక్కుల సంఘాల ప్రచారం కారణంగానూ, డాక్టర్‌షేక్ గురించి ప్రపంచానికి తెలిసింది. ప్రపంచవ్యాపితంగా వివిధసంఘాలు, వ్యక్తులు డాక్టర్ షేక్ శిక్షను రద్దు చేయమని కోరుతూ పాకిస్తాన్‌పైన వత్తిడి తీసుకువస్తున్నారు. 'ఇంటర్నేషనల్ హ్యూమనిస్ట్ అండ్ ఎథికల్ యూనియన్' షేక్‌ని కాపాడమంటూ ప్రచారోద్యమాన్ని పెద్ద ఎత్తున చేపట్టింది. యూనియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాబు గోగినేని (మన తెలుగువాడే), ప్రెసిడెంట్ లెవీ ఫ్రాగెల్ ఐక్యరాజ్య సమితి నుంచి ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వరకు అనేక అంతర్జాతీయ సంస్థల్నీ, వ్యక్తుల్నీ కలిపి షేక్ ప్రాణాలను కాపాడే ప్రయత్నాలు చేస్తున్నారు. షేక్ అరెస్ట్ అయి జైలు పాలైనప్పుడు తమ పత్రిక 'ఇంటర్నేషనల్ హ్యూమనిస్ట్ న్యూస్'లో కవర్‌పేజీ వ్యాసాన్ని ప్రచురించి ప్రపంచానికి వెల్లడించింది. (ఈ పత్రిక అదే సంచికలో (డిసెంబర్ 2000) యాదృచ్ఛికంగా విజయవిహారం మీద' జరిగిన దాడిని ఖండిస్తూ, బాబు గోగినేని రాసిన వ్యాసాన్ని బ్యాక్ కవర్ మీద ప్రచురించారు.) ప్రపంచవ్యాప్తంగా హేతువాద, మానవతావాద ఆలోచనా ధోరణులకు అండగా నిలుస్తూ ఆ దిశగా హ్యూమనిస్ట్ యూనియన్ గణనీయమైన కృషి చేస్తోంది. ప్రస్తుతం షేక్‌ను కాపాడాలంటూ బ్లాస్ఫెమీ చట్టాలను మానవీకరించాలని కోరుతూ చేపట్టిన ఉద్యమానికి 'విజయవిహారం' తన మద్దతు తెలిపింది. మన రాష్ట్రానికి చెందిన హేతువాద, మానవతావాద సంఘాల తరపున ఎన్. ఇన్నయ్య, సి. లక్ష్మన్న, కె. మురహరి రావు, రావిపూడి వెంకటాద్రి, ఎం. సుబ్బారావు, ఎం. మురళీధర్, ఎన్. కోటయ్య, జి. వీరన్న తదితరులు డాక్టర్ షేక్‌ను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ పాక్ అధ్యక్షుడు ముషారఫ్‌కు టెలిగ్రామ్‌లు పంపారు.

మరోవైపు డాక్టర్ షేక్ కూడా - "నన్ను అర్థం చేసుకోండి. నేను ఆధ్యాత్మికవాదిని. నేను ప్రవక్తను దూషించటం అనేది ఊహించను కూడా ఊహించలేను" అంటూ మొత్తుకుంటున్నా ఎవరూ వినిపించుకోవటం లేదు. ఈ మధ్యకాలంలో డాక్టర్ షేక్ తనను తాను 'ఇస్లామిక్ హ్యూమనిస్ట్' అని విశేషణాన్ని నొక్కి చెబుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవటం లేదు.

పాకిస్తాన్ ప్రభుత్వం సైనిక ప్రజాస్వామ్యం చేతుల్లో వున్నా, ప్రజాస్వామిక సైన్యం చేతుల్లో వున్నా పెద్దమార్పు ఏమీ వుండదు. మరోవైపున మతఛాందసుల పట్టు ప్రభుత్వం పైన, సమాజం మీద రోజుకిరోజుకీ పెరిగిపోతోంది. మైనారిటీ మతస్తులు తమ తమ విశ్వాసాలను అనుసరించలేని పరిస్థితులు తయారయ్యాయి. అణచివేతను బ్లాస్ఫెమీ లాంటి చట్టాలను నిరసిస్తూ, 1998 మే 5న ఫైజలాబాద్ బిషప్ జాన్ జోసెఫ్ తనను తాను కాల్చుకుని ప్రాణాలు తీసుకున్నాడు. అయినా అధికారుల్లో కానీ, చట్టంలో కానీ ఏ మాత్రం మార్పు రాలేదు. ఇక మత ఛాందసవాదులు - తమ దగ్గర పాఠాలు నేర్చుకుని, తమని మించిపోయిన తాలిబన్లను ఆదర్శంగా తీసుకుంటున్నారు. మతం పేరుతో పాకిస్తాన్‌ని ఆఫ్ఘనిస్తాన్ లాగా తయారు చేయాలన్నదే వారి ఉద్దేశ్యంగా కనిపిస్తున్నది●

పి.ఎస్.: మానవతావాది డాక్టర్ షేక్ విడుదల కోసం సాగుతున్న ఉద్యమంలో మీరు కూడా పాలుపంచుకోవచ్చు. పాక్ ఎంబసీకి, పాక్ ప్రభుత్వానికి డాక్టర్ షేక్‌పై మరణశిక్షను నిలిపివేయాలని, కేసు ఉపసంహరింప చేయాలని లేఖలు, టెలిగ్రామ్‌లు, ఇ-మెయిల్ సందేశాలు పంపవచ్చు. సముచితంగా స్పందించమని మన ప్రభుత్వాన్ని కూడా కోరవచ్చు. ఈ ఉద్యమానికి సంబంధించిన వివరాలకు Campaign@iheu.org ను చూడాలి.

(ఫోటోలు: ఐహెచ్ఇయు సౌజన్యం)





పాకిస్తాన్‌లో తనను నిర్బంధించిన జైలు నుంచి డాక్టర్ యూనిస్ షేక్- లండన్‌లోని ఐహెచ్ఇయు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాబు గోగినేనికి రాసిన లేఖ ఇది. డాక్టర్ షేక్ ఈ లేఖను సిగరెట్ పెట్టెలో పెట్టి అతికష్టం మీద రహస్యంగా బాబుకు పంపించగలిగారు.



పోలీసు నిర్బంధంలో డాక్టర్ షేక్



తెలుగు జర్నలిజం చరిత్రలో ఒక వినూత్నాధ్యాయం - తెలుగు పాఠకుల ఉత్తమాభిరుచికి నిజమైన నిదర్శనం- విజయవిహారం

దలైలామా - ప్రపంచంలో మిలియన్ల మంది టిబెటన్లు, బుద్ధుని సజీవ అవతారంగా ఎంచి పూజించే వ్యక్తి. టిబెటన్ల ఆశాజ్యోతి. 1950లో కమ్యూనిస్టు చైనా టిబెట్‌ను ఆక్రమించినపుడు 9 సంవత్సరాలు శాంతియుత పరిష్కారానికి ప్రయత్నించి అది సాధ్యం కాకపోయేసరికి భారతదేశంలో ఆశ్రయం పొందారు దలైలామా. ప్రవాసంలో ఉండి అర్ధశతాబ్దానికి పైగా టిబెటన్ల స్వయం నిర్ణయాధికారం కోసం శాంతియుతంగా కృషి చేస్తున్నారు. గత కాలపు టిబెట్‌లో ఎన్నో చెప్పగలిగిన అపసవ్యతలు ఉన్నాయని చెప్పగలిగిన స్థైర్యం ఆయన స్వంతం, అదే సమయంలో తమ జీవన విధానంలో విలక్షణమైన, విశేషమైన, భద్రపరచాల్సిన సంగతులు ఎన్నో ఉన్నాయని అటువంటివెన్నో కోల్పోతున్నామని ఆయన ఆవేదనగా చెపుతారు. చైనా ప్రభుత్వం టిబెట్‌ను దురాక్రమించినా, చైనా ప్రజానీకాన్ని లేదా చైనాను కించపరిచేలా మాట్లాడేందుకు దలైలామా ఇష్టపడరు.

దలైలామా కరుణ, వినయం, ఔదార్యం, ప్రవాసంలో ఉండి కూడా 'స్వేచ్ఛ'ను అవధరించగల సామర్థ్యం - ప్రపంచంలో, ముఖ్యంగా పాశ్చాత్య ప్రపంచంలో మిలియన్ల మందిని ప్రభావితం చేశాయి, టిబెటన్ బౌద్ధ సంప్రదాయం వైపు ఆకర్షితుల్ని చేశాయి. రిచర్డ్ గెరె, హారిసన్ ఫోర్డ్ వంటి హాలీవుడ్ తారలను సైతం దలైలామా ప్రభావితం చేశారు. అయినా సాధారణ మిషనరీ మత మార్పిడి పద్ధతులకి ఆయన విముఖులు.

'టిబెట్ విమోచన'ను సాకుగా చూపి, చైనా ఒలింపిక్ క్రీడలు నిర్వహించే ప్రతిపాదనలను వ్యతిరేకించేందుకు దలైలామా ఇష్టపడలేదు. అటువంటి ప్రయత్నాలు చైనా ప్రజల మనోభావాలను గాయపరుస్తాయని ఆయన అభిప్రాయం. టిబెట్ సమస్య పరిష్కారానికి చైనా ప్రభుత్వంతో ఎటువంటి ముందు షరతులు లేకుండా చర్చించేందుకు దలైలామా సిద్ధంగానే ఉన్నారు.

ఏటా 3-4 వేల మంది టిబెటన్లు కేవలం దలైలామాను దర్శించుకునేందుకే భారత్ వస్తున్నారు. ద్వేషరహితమైన ఆయన దృక్పథం, అహింస, కరుణ, మానవతల సమ్మిళితమైన ఆయన దశాబ్దాల కృషి యావత్ప్రపంచాన్ని ముగ్ధుల్ని చేసింది. 1989లో ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ శాంతి పురస్కారాన్ని దలైలామాకి బహూకరించారు.

బౌద్ధానికి సైన్సుకూ వైరుధ్యం లేదనే ఆధునిక దృక్పథం దలైలమాది. మానవతా వాదిగా, ఆధునిక దృక్పథం గల ధార్మిక నేతగా ఆయన ఆలోచనలు ఇప్పుడు అనేక మందిని ప్రభావితం చేస్తున్నాయి.

భారతదేశం తమ గురువని, భారతదేశం ఇప్పుడు మరింత భారతీయం కావాల్సిన అవసరం ఉందని ఆయన చెపుతారు.

దలైలమాతో ఇటీవల లైఫ్ పాజిటివ్ పత్రిక జరిపిన ఇంటర్వ్యూ సంక్షిప్త రూపం విజయవిహారం పాఠకుల కోసం అందిస్తున్నాం. - ఎడిటర్



# కరుణ సంతోషాన్ని శాంతిని ఇస్తుంది!

# భారతదేశం భారతీయం కావాలి!

♣ మీరెవరు...

మొదట నేనో బౌద్ధబిక్షువుని, తరువాత నలందాధర్మాన్ని అనుసరించే వ్యక్తిని. నలందా గురువులయిన నాగార్జున, ఆర్యదేవ, ఆర్యసంఘ, ధర్మకీర్తి, చంద్రకీర్తి, శాంతిదేవ రాసిన శాస్త్రాలను మేం చదివి, అనుసరిస్తాం. వాళ్ళంతా నా గురువులు. నేను నా గతజన్మలో వారితో కలిసి వుండివుంటాననుకుంటా. అందుకే, ఎప్పుడన్నా వారి పుస్తకాలు చదివి, వారి పేరును ధ్యానం చేస్తే, వారితో అనుబంధాన్ని అనుభూతి చెందుతాను. ఈ సందర్భంగా, నేను హీనయాన లేదా మహాయాన సంప్రదాయానికి సంబంధించిన వాడినని చెప్పను, నేను నలందా ధర్మానికి కొనసాగింపును అంతే.

♣ మిమ్మల్ని 'లివింగ్ బుద్ధ' - అంటారు?

'లివింగ్ బుద్ధ' చైనా పదం 'హోఫు'కు అనువాదం. దాన్నే టిబెట్‌లో 'లామా' (గురువు) అంటారు. గురువు, 'బుద్ధ' అయ్యుండక్కర్లేదు, అయితే గురువు జ్ఞానంతో నిండి వుంటాడు. నా ముందు దలైలామాలు, అవలోకితేశ్వరుని (కారుణ్యబుద్ధ) ప్రతిరూపాలని నమ్ముతాను. అయిదవ దలైలామాను మంజుశ్రీ అవతారంగా విశ్వసిస్తారు. గొప్ప లామాలయిన వీరందరి అవతారంగా నేనుండడం అదృష్టంగా భావిస్తున్నాను.

♣ ఎవరయినా 'బుద్ధ' అవ్వచ్చా?

తప్పకుండా! చైతన్యం గల ప్రతి జీవిలో బుద్ధత్వాన్ని చేరగల విత్తనం వుంటుంది.

♣ మన ప్రపంచం యింతకంటే మంచిగా వుండాలంటే...

మనం మరింత కరుణతో వుండాల్సిన అవసరం వుంది.

♣ కర్మను ఎలా అధిగమించగలం?

ఎరుకతో, తెలివిడితో మసలుకోవడం ద్వారా.

♣ ఎరుకతో (*Awareness*) మనం ఎలా జీవించడం?

వుదాహరణకు మహాత్మాగాంధీనే తీసుకోండి. శారీరకంగా బలహీనమైనవాడు. ఆయన బాగా చదువుకున్నప్పటికీ, అంతకంటే ఎక్కువ చదివిన వారు చాలామందే వున్నారు. అయితే ఆయనే మహాత్ముడెందుకయ్యాడు? అది ఆయన హృదయం వల్ల. ఆయన తన గురించి, తన స్వంత లాభం గురించి పనిచేయలేదు. కరుణ అంటే అదే. నా వుద్దేశ్యంలో, ఒక వ్యక్తి మంచివాడవడానికి కరుణ ప్రధానాంశంగా వుంటుంది. స్టాలిన్, లెనిన్, మావో, వీళ్ళంతా శక్తివంతమైన నాయకులు. కానీ వారిలో కరుణ లేదు. అందుకే అప్రతిష్టపాలయ్యారు.

కరుణ సహజంగానే, సంతోషాన్ని, శాంతిని యిస్తుంది. అప్పుడు కలచివేసే ఎలాంటి వార్తనయినా మీరు నింపాదిగా తీసుకోగలరు. మీ మనసు నిశ్చలంగా వుండడం వల్ల అది సాధ్యమవుతుంది. మీరు గందరగోళంగా వుంటే, చిన్న చిన్న విషయాలు కూడా మిమ్మల్ని బాగా కల్లోలపరుస్తాయి.

మీరు ఏదయినా మంచిపనిని, ఫలితం ఆశించకుండా, అనలెవరి గురించి ఆ పని చేస్తున్నారో కూడా తెలియకుండా చేయడమే కరుణంటే. పక్కవాడు కూడా మనలాంటి వాడే అని తెలుసుకోవడం వల్ల అది సాధ్యమవుతుంది. అలా తెలుసుకోవడమే కరుణను అలవరచుకోడానికి పునాది అవుతుంది. మీ చుట్టూ వున్న వారి విషయంలోనే కాదు, మీ శత్రువుపట్ల కూడా. మామూలుగా, శత్రువు గురించి ఆలోచించినపుడు, అతనికి హాని చేయాలనే అనుకుంటాం. అలా కాకుండా, శత్రువు కూడా మనిషేనని, అతడికీ నీలాగే సంతోషంగా వుండే హక్కు వుందని గుర్తు తెచ్చుకోడానికి ప్రయత్నించు. యిక నా గురించయితే, నాకూ కొందరు శత్రువులుండేవుంటారు.

♣ మీరు చైనా గురించి మాట్లాడుతున్నారా?

లేదు, లేదు! అదొక వూహ మాత్రమే.

ఎవరికయినా శత్రువులుంటే, వారు బాధపడాలని కోరుకుంటారు. శత్రువుపట్ల ద్వేషం కలిగితే, అతడు కూడా మనిషే అని అనుకోండి. నిజమైన కరుణ అదే. ఎందుకంటే మీరు మీ శత్రువుపట్ల కరుణతో వున్నారు. మీ కరుణకు మీ పట్ల యితరుల మంచితనం పునాది కాదు. నిజానికి యితరులు మీకు హాని చేస్తున్నారు. అందుకే నిజమైన కరుణకు ఏ పక్షపాతము వుండదంటాను. సాధారణంగా మనం, పక్షపాతంతో కూడిన కరుణనే చూస్తాము. అది నిజానికి అనుబంధం వల్ల పుట్టినది. నిజమైన కరుణ, చైతన్యం గల అన్ని జీవుల వైపు ప్రసరిస్తుంది. ముఖ్యంగా నీ శత్రువు వైపు.



గాంధీ మహాత్ముడెందుకయ్యాడు? అది ఆయన హృదయం వల్ల ఆయన తన గురించి, తన స్వంత లాభం గురించి పనిచేయలేదు. కరుణ అంటే అదే... స్టాలిన్, లెనిన్, మావో, వీళ్ళంతా శక్తివంతమైన నాయకులు. కానీ వారిలో కరుణ లేదు. అందుకే అప్రతిష్టపాలయ్యారు.



మేం శిష్యులం, భారతదేశం మా గురువు. కానీ ఈ రోజు మా గురువు రోజురోజుకూ భౌతిక ప్రపంచం వైపుకు ఎక్కువగా పరుగుతీస్తున్నాడు. ఒకవైపు పూర్తి సాంప్రదాయం, మరోవైపు పూర్తి పాశ్చాత్యవ్యామోహంలో కొట్టుమిట్టాడుతున్నాడు. నా వుద్దేశ్యంలో, భారతదేశం భారతీయం అవ్వాల్సిన తరుణం ఆసన్నమయింది.



భారతదేశం హిందూ, బౌద్ధ, సిక్కు వంటి గొప్ప ధార్మిక సాంప్రదాయాలకు జన్మనివ్వడమే కాదు, అది ఇస్లామ్, క్రిస్టియన్, జొరాష్ట్రియన్ వంటి ఎన్నో ధర్మాలకు ఆశ్రయాన్ని కూడా యిచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా, ఈ రోజు మనం చూస్తున్న మత సహనం కూడా భారతీయుల సాంప్రదాయమే.

♣ కరుణ శత్రువుకు సహాయపడదా?

కరుణ మీ శత్రువుకు సహాయపడేకంటే, కరుణ రాహిత్యం మీకు చేసే హానే ఎక్కువ. ఆలోచనలను మార్చుకోవడం ద్వారా మీరు లోపలిశాంతిని పొందుతారు. కరుణ అవలంబిస్తే ఇతరులకేతప్ప తమకు అటువంటి మేలు ఉండదని అనేకమంది భావిస్తారు. ఇది శుద్ధ తప్పు. ఇటువంటి ధోరణిని ఎరుకతో అధిగమించాల్సి వుంది. అది విశ్లేషణ ద్వారానే సాధ్యం.

అధునిక వైద్య పరిశోధకులు కూడా దేహారోగ్యానికి మానసిక ప్రశాంతత అత్యంత ఆవశ్యకమనే నిర్ధారణకు వచ్చారు. ఏదైనా కల్లోలానికి లోనైనప్పుడు తిరిగి ప్రశాంత మానసిక స్థితిని పొందగలగటం - ప్రేమ, కరుణ అవలంబించేవారికే తేలికగా సాధ్యమని పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

ఈ సంవత్సరం విస్కాన్సిన్ విశ్వవిద్యాలయంలో నేను ఒక బిక్షువుపై జరిగిన పరిశోధనను తిలకించాను. ఆ బిక్షువుకు పెద్ద పెద్ద ధ్వనులు వినిపించారు. అవి అతడిపై స్వల్ప ప్రభావాన్నే చూపాయి. పెద్ద అంత కష్టం లేకుండానే అతడు మళ్ళీ మామూలు స్థితికి వచ్చాడు. కారుణ్యం మీకు గణనీయంగా ప్రశాంతిని ఇస్తుందని ఇది నిరూపిస్తోంది.

బుద్ధుడు, కరుణను బోధించాడు కనుక, కరుణను అలవరచుకోవాలని నేను చెప్పడం లేదు. అది కాదు. కరుణను, బౌద్ధులు, జైనులు, హిందువులు, క్రైస్తవులు అందరూ సమానంగా అలవరచుకోవాల్సిందే. అది సామాజిక నీతిలో భాగంగావుండాలి అని నా అభిప్రాయం. మనస్సు శాంతిగా వుండాలని కోరుకోవడంలో పవిత్రత గాని, మతంగాని ఏమీ లేదు. ప్రశాంతంగా వుండడం మన ఆరోగ్యానికే మంచిదని మనుషులు గుర్తించాల్సిన అవసరం వుంది. మనిషి మనస్సు ప్రశాంతంగా వుండడానికి దోహదం చేసే విలువలను పెంపొందించడమే, నా మార్గం.

♣ ప్రశాంతమైన మనస్సు అద్భుతాలను సృష్టిస్తుంది అని గుర్తించడం...

ఈ విషయాన్ని ప్రతిఒక్కరికీ స్పష్టంచేయాలి, పిల్లలకు కూడా. శాంతిని కోల్పోతే వారే బాధపడ తారు, అన్న విషయాన్ని పిల్లలకు అర్థమయ్యేలా చెప్పాలి. వారు మరింత దయగా, కరుణతో వుంటే వారు యింకా ఆనందంగా వుండగలరు. ఆడుకునేటప్పుడుకూడా. మీరు నవ్వితే, జీవితం మరింత అందంగా వుంటుంది. నేను మిమ్మల్ని చూసి నవ్వితే, మీరు తిరిగి నవ్వుతారు కదా!

♣ మీకెప్పుడన్నా కోపం వచ్చిందా?

వస్తుంది. నాకూ వస్తుంది. చెడు భావాలు, వుద్వేగాలు వస్తాయి, పోతాయి. అయితే అవి ఎక్కువ కాలం నాలో వుంటాయని అనుకోను. కోపాన్ని మీలో అలాగే వుండనిస్తే, అది మరిన్ని చెడు భావాలను, ద్వేషాన్ని కలుగజేస్తుంది.

♣ కోపంనుండి మీరెలా బయటపడతారు?

కరుణపట్ల స్పష్టమైన నిబద్ధత ద్వారా. చెడు భావాలు, నా మనస్సులో ఒక భాగం అనే అనుకుంటాను. సమస్య వచ్చినప్పుడు, కోపం రావడం అత్యంత సహజమైన విషయం. కానీ మనం మారచ్చు.

♣ ఎలా?

మీలో కోపం వచ్చిన క్షణం, ఆ కోపాన్ని మీరు గుర్తించగలిగితే, మీ మనసులో ఏ భాగమయితే కోపంగా వుందో ఆ భాగాన్ని మీరు వేరు చేయగలరు. అది మీ మనసును రెండు భాగాలుగా విభజిస్తుంది. ఒకటి కోపాన్ని కలిగివుంది, రెండవభాగం ఆ కోపాన్ని చూడడానికి ప్రయత్నిస్తుంది. అప్పుడు కోపం మొత్తం మనసును ఆక్రమించదు. అప్పుడు మీరు కోపం మంచిది కాదని గుర్తించగలరు, తద్వారా మీరు దానికో విరుగుడును తయారుచేస్తారు. కోపాన్ని పరాయిదిలా చూడండి. కోపానికి కారణమయిన వ్యక్తి లేదా ఆ సందర్భం యొక్క మంచితనాన్ని చూడడానికి ప్రయత్నించండి.

ఈ ఆలోచనలన్నీ, టిబెట్ కనిపెట్టినవి కావు. అవన్నీ నలందా కనిపెట్టినవి. మీరు కనిపెట్టినవి.

మేం శిష్యులం, భారతదేశం మా గురువు. కానీ ఈ రోజు మా గురువు రోజురోజుకూ భౌతిక ప్రపంచం వైపుకు ఎక్కువగా పరుగుతీస్తున్నాడు. బహుశ ఒకవేపు పూర్తి సాంప్రదాయం, మరోవైపు పూర్తి పాశ్చాత్య వ్యామోహంలో కొట్టుమిట్టాడుతున్నాడు. నా వుద్దేశ్యంలో, భారతదేశం భారతీయం అవ్వాల్సిన తరుణం ఆసన్నమయింది.

♣ మీరు 'సామాజిక నీతిని' గురించి వత్తిడి చేస్తున్నారు, అలాగే ఆధ్యాత్మిక విషయాలలో దేన్ని అనుసరించాలంటారు?

'పరిశోధనాత్మక ధ్యానం' అని నేను దేన్నయితే అంటానో, దాన్ని చేయమని చెప్తాను. అది శాస్త్రీయమైంది, శాస్త్రజ్ఞులు పరిశోధించినట్టు. మీరు ధ్యానం చేస్తున్నప్పుడు, మీ దృష్టి బయటి ప్రపంచం నుండి, లోపలి ప్రపంచం వేపు, భావోద్వేగ ప్రపంచం వేపుకు మళ్ళుతుంది.

♣ అందుకేనా బుద్ధుడిని గొప్ప మానసికవేత్తగా చెప్తారు...

అందులో అనుమానమేం లేదు. ఎందుకంటే ఆయన 'మనస్సు శాస్త్రాన్ని' బోధించాడు.

♣ మన జీవితానికి లక్ష్యం ఏంటి? ఏం సాధించడానికి మనం పుట్టాం?

సంతోషంగా వుండేందుకు.

♣ ఈ సృష్టి వుద్దేశ్యం...

సంతోషం.

♣ బుద్ధుని బోధనలన్నీ పాళీ భాషలోనే వున్నాయంటారు...

నలందా గురువులందరూ సంస్కృతంలో రాశారు. కేవలం వినయ, అభిధర్మలు పాళీ భాషలో రాశారు.

♣ బుద్ధుడు దేవుడి విషయంలో మౌనం వహించాడు. మీరేం చెప్తారు?

బుద్ధుడు దేవుడికి సంబంధించి ఏమీ చెప్పలేదు. ఎందుకని? ఆయన కార్యకారణ సిద్ధాంతాన్ని గురించిమాట్లాడాడు. ఎప్పుడయితే మీరు కార్యకారణ సిద్ధాంతాన్ని అంగీకరిస్తారో, అప్పుడిక సృష్టికర్త వుండడు. బుద్ధుడు సృష్టికర్తను అంగీకరించివుంటే, అప్పుడాయన మౌనంగా వుండేవాడు కాదు. అప్పుడిక ప్రతిదీ దేవుడే అయ్యేది.

♣ కార్యకారణ ధర్మానికి కారణం ఎవరు?

బుద్ధుడు, దానికి కారణం మనస్సు అని చెప్పి వుండేవాడు. తప్ప దేవుడనో లేదా ధర్మకాయుడనో లేదా బుద్ధుడనో చెప్పడు.

♣ మనస్సు ఎలా వచ్చింది...

ప్రకృతే మనస్సుకు కారణం. 'సృష్టి' అనే పదాన్ని, 'పరస్పర సహకారంతో వుద్భవించినది' అనే అర్థంలో వాడారు. దేవుడిని గురించి మాట్లాడితే, దేవుడిని ఎవరు సృష్టించారు? దాన్ని గురించి చర్చించడంలో అర్థమే లేదు. ధర్మకీర్తి, శాంతిదేవ, దేవుని వునికి విషయంలో తీవ్ర వాదోపవాదాలు చేసి, 'దేవుడనే వాడేవుంటే మనం దుఃఖానికి ఏ వివరణని యివ్వగలం?' అనుకున్నారు.



1959లో భారత్‌లో ఆశ్రయం

నాకో గమ్మత్తయిన సందర్భం గుర్తొస్తోంది. టిబెట్ డ్రామాలో, విమర్శ కూడా వుంటుంది. మా విమర్శలో బుద్ధుడికి కూడా మినహాయింపు లేదు. ఒక వ్యక్తి రంగస్థలం మీద నటిస్తున్నాడు. అతడికి దేవుడి మీద నమ్మకం లేదు. అతడేమంటాడంటే, అసలు దేవుడే మనల్ని సృష్టించి వుంటే, రెండు కళ్ళను ముందే పెట్టకుండా, ఒక కంటిని వెనక పెట్టి వుండాలి. అప్పుడు మనం యింకా సమర్థవంతంగా వుండేవాళ్ళం, అంటాడు.

ఇక్కడ హాస్యాన్ని పక్కనపెడితే, ఈఆలోచన ఎవరినీ, ఏ మతాన్ని అవమానించడానికి కాదు, కేవలం సత్యాన్ని పరిశోధించడానికే పరిమితం.

♣ బౌద్ధానికి, హిందూ మతానికి మధ్య సామ్యం ఏమయినా వుందా?

చారిత్రకంగా, బుద్ధ శాక్యముని హిందువే. అందుకే నేను హిందూ, బౌద్ధం రెండు కవల పిల్లలంటాను. అలాగే రెండింటిలో సమాధి, విపాసనలను అనుసరిస్తారు. తేడా అల్లా, శూన్యత విషయంలోనే. హిందువులు ఆత్మను నమ్ముతారు. బౌద్ధులు అనాత్మను. అయితే అహింస విషయంలో బౌద్ధులు, హిందువుల కంటే జైనులు మరింత స్పష్టంగా వుంటారు.

♣ అల్డుస్ హక్స్‌లే, - అన్ని మతాలకు ఒకే మార్మిక పునాదిని గురించి మాట్లాడాడు. మీరు దాన్ని నమ్ముతారా?

అది చెప్పడం కష్టం. ఒక పరిధి వరకు, అన్ని మత సాంప్రదాయాలు ఒకే లక్ష్యాన్ని కలిగి వుంటాయి. 'వ్యక్తిని, మంచి వైపుకు మరల్చడం.' మరొక పరిధిలో, దేవుడిని నమ్మే మతాలలో (Theistic religions), నిర్వాణం భావనలేదు.

♣ మీరు ప్రపంచమంతా తిరిగారు కదా! ప్రపంచం మంచి వైపుకే ప్రయాణం చేస్తోందంటారా...

ఈ విషయంలో బ్రిటన్ రాణి గురించి చెప్పదల్చుకున్నాను. ఆమె, 96వ జన్మదినం నాడు, నేనిదే అడిగాను. ఆమె, ప్రపంచం మంచి వైపుకే వెళ్తోందని చెప్పింది. ఎందుకంటే, ఆమె చిన్నప్పుడు ఎవరూ పర్యావరణాన్ని గురించి, మానవ హక్కులను గురించి మాట్లాడేవారు కాదట. ఈ రోజు ప్రపంచమంతా వాటిని గొప్ప విలువలుగా గుర్తించింది. గాంధీ అహింసను ఆచరించినప్పుడు, అందరూ దాన్ని ఒక బలహీనతగానే తీసుకున్నారనుకుంటా. అయితే, యిప్పుడు చైనా తప్ప ప్రపంచమంతా అహింసను అంగీకరిస్తోంది, అనుసరిస్తోంది, నెల్సన్ మండేలాలా. భారతదేశం హిందూ, బౌద్ధ, సిక్కు వంటి గొప్ప ధార్మిక సాంప్రదాయాలకు జన్మనివ్వడమే కాదు, అది ఇస్లామ్, క్రిష్టియన్, జొరాష్ట్రియన్ వంటి ఎన్నో ధర్మాలకు ఆశ్రయాన్నికూడా యిచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా, ఈ రోజు మనం చూస్తున్న మత సహనం కూడా భారతీయుల సాంప్రదాయమే.

♣ చైనా మారుతోందంటారా...

అవును, చైనా కూడా మారే క్రమంలో వుందని నేననుకుంటున్నాను●

(లైఫ్‌పాజిటివ్ సౌజన్యంతో)

ఆగస్టు ఆరవతేదీ రాత్రి...

ఆ ఒక్కరాత్రి గడిచిపోతే పద్దెనిమిదేళ్ల విశాల్, పదిహేడేళ్ల సోను ప్రాణాలతో బతికిపోయేవాళ్లు....

కులాలు వేరు కావటంతో తమ ప్రేమను పెద్దవాళ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించరన్న సంగతి వారికి స్పష్టంగా తెలుసు.

విశాల్ బ్రాహ్మణుడు, సోను జాట్ కులస్తురాలు!

అందుకే ఊరికీ, అయినవాళ్లకీ దూరంగా ఎటైనా వెళ్లిపోవాలని ఆలోచనలు చేస్తున్నారు. ఆరవతేదీ అర్థరాత్రి బహుశా ఆ యోచనతోనే ఒక చెట్టుకిందికి చేరి మాట్లాడుకుంటున్నారు.

ఈ లోగా సోను తలిదండ్రులు మునీష్, సహేంద్రలు చూడనే చూశారు. లేచిపోయే ప్రయత్నంలో వున్న ఆ ప్రేమికులను పట్టుకున్నారు. వారికి కొందరు బంధువులూ జతకలిశారు. అందరూ కలిసి ఆ జంటను నిర్దాక్షిణ్యంగా కొడుతుంటే, వాళ్లిద్దరూ తట్టుకోలేక కేకలు పెడుతుంటే... బల్బీరి అనే పొరుగింటి మహిళ లేచి బయటికొచ్చింది. ఆపాలని చూసింది కానీ ఆమెను పక్కకు నెట్టేశారు. దీంతో ఆమె విశాల్ వాళ్లింటికి వెళ్లి, విశాల్ అన్నావదినలు సంజు, బబ్లిలను పిలుచుకొచ్చింది.



# ఆ కులంలో... ప్రేమిస్తే తల్లిదండ్రులే చంపేస్తారు!

అప్పటికే తీవ్రంగా ఊగిపోతున్న సహేంద్ర 'ఈ కులటకి ఒక పాఠం చెప్పాలి' అంటూ కూతురు సోను మెడకి తాడు బిగించి ఉరి తీసేశాడు.

తర్వాత సంజు వంతు వచ్చింది. సహేంద్ర తన కూతురును ఏ విధంగా చంపాడో, అదే విధంగా సంజు తన తమ్ముడి ప్రాణం తీశాడు.

ఆ ప్రేమికులు కలిసి జీవించడానికి వ్యతిరేకించిన పెద్దలు, వారిని అంతం చేయడానికి మాత్రం ఒక్కటయ్యారు. ఈ గొడవంతా జరుగుతుండగా ఊరి జనమంతా మేల్కొని ఆ ఇంటి ముందుకి చేరుకున్నారు. బయట చోద్యం చూస్తూ నిలబడిపోయారేగానీ, ఒక్కరైనా ముందుకు వచ్చి ఇదేమిటని ఆపే ప్రయత్నం చేసినవాళ్లులేరు. పైగా ఇది జరగాల్సిందే అన్నట్టుగా నిమ్మళంగా వుండిపోయారు. ఆ రాత్రి అప్పటికప్పుడు మృతదేహాలను దహనం చేశారు.

పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌పూర్ జిల్లా అలీనగర్ గ్రామంలో జరిగిన ఈ దారుణం చూసి దేశం నివ్వెరపోయింది.

కొద్దిరోజుల తర్వాత ఈ కేసులో ప్రధాన నిందితులైన మునీష్, సహేంద్ర, సంజులు కటకటాలవెనక్కి వెళ్లారు. 'చట్టపరంగా చూస్తే మాది నేరమే కావొచ్చు. కానీ సామాజికంగా చూస్తే మాత్రం మేం చేసింది సరైనపనే' అని కూతురిని చంపిన ఆ తండ్రి కనీసపు పశ్చాత్తాపమైనా లేకుండా సమర్థించుకుంటున్నాడు.

విశాల్ అన్నావదినలు కూడా 'మేం ఏ తప్పు చేయలేదు. మా సంప్రదాయాలు ఇటువంటి వాటిని అనుమతించవు. మేం సోనుకి, మా విశాల్‌కీ దారి మార్చుకోమని ఎంతో నచ్చచెప్పాం కానీ వినిపించుకోలేదు. అందుకే చివరికి మేం ఇలా చేయకతప్పలేదు.' అంటున్నారు.

కులగౌరవం, కుటుంబప్రతిష్ఠ పేరుతో కన్నబిడ్డలనే కాటికి పంపుతున్న సంఘటనలలో ఇదే మొదటిది కాదు.

పశ్చిమ ఉత్తరప్రదేశ్‌తో పాటు రాజస్థాన్, హర్యానా, పంజాబ్, మధ్యప్రదేశ్ లలోని కొన్ని ప్రాంతాలలో కూడా ప్రేమ చంపదగ్గ నేరమైపోయింది. మరీ ముఖ్యంగా వ్యవసాయకులమైన జాట్‌లలో ఈ దురాచారం ఆందోళనకరంగా పెరిగి పోతున్నది. కేవలం ఈ జులై, ఆగస్టులలోనే ఎందరో ప్రేమికులు సోను, విశాల్ మాదిరిగా హతమారిపోయారు.

జాట్‌ల ఆధిపత్యం కనిపించే ఈ 'గోభూమి' ప్రాంతంలో, ప్రతిగ్రామం లోనూ జాట్ కులపెద్దలతో కూడిన 'ఖాప్ పంచాయితీలు' వుంటాయి. ఇవి ప్రజలెన్నుకునే పంచాయితీలకంటే శక్తివంతమైనవి. గ్రామాల మీద పట్టుకి, ఓటుబ్యాంకు రాజకీయాలకీ, కులరాజకీయాలకీ ఇవే బలమైన ఆధారాలు. ఈ పంచాయితీలు కులంలోనే ఏకగోత్రీకుల మధ్య వివాహాలు జరిగితే సహించవు. ఇక తమ కులం యువతీ యువకులు ప్రేమాగీమా అంటూ కులం కాని వారిని చేసుకునే ప్రయత్నం చేస్తే, కులం కలుషితం కాకుండా చూడ్డానికి ఏకంగా ప్రేమికులనే అంతం చేయటం మొదలుపెట్టారు. ఒక్కమాటలో చెప్పాలంటే అనాది నుంచి కొనసాగుతూ వస్తున్న సాంఘిక నిర్మాణాన్ని కాపాడుకోవటానికీ, కులస్త్రీలు దారి తప్పి కులం పరువు తీయకుండా చూడటానికీ ఎంత ఘోరానికైనా తయారవుతారు.

మొన్న ఆగస్టు 15న తూర్పు ఉత్తరప్రదేశ్‌లోని కుశీనగర్ జిల్లాలోని దేవీపూర్ లో జాట్ కులపంచాయితీ పదిహేడేళ్ల సంజు చౌహాన్‌ని చంపేయమని చెప్పింది. ఆ రోజున పథకం ప్రకారం ఐదుగురు యువకులు సంజూను అటకాయించి పీకపిసికి చంపేశారు. హంతకులు కొన్నాళ్ల ముందుగా, సంజూ తండ్రి రామ్‌హరక్‌తో కూతురిని చంపేయమంటూ డిమాండ్ చేశారు. రామ్ తిరస్కరించాడు. దాంతో మరింత రగిలిపోయిన ఆ యువకులు అన్నంతపనీ చేశారు. దీనివెనుక వున్న వాస్తవం మరో రకంగా వుంది.

సంజూకి 13వ ఏట పెళ్లయింది.గ్రామ ఆచారం ప్రకారం పద్దెనిమిదో ఏడు వచ్చిన తర్వాత అత్తగారింటికి పంపవలసివుంది. ఇంకో ఏడాదికి భర్త దగ్గరకి వెళ్ల బోతున్నది. ఈలోగా కులపంచాయితీ సభ్యులలోని కొందరు యువకులు సంజూ వెంటబడటం మొదలుపెట్టారు. ఆమె వారిని ఛీకొట్టింది. పగ పెంచుకున్నవారంతా ,ఆమె ఎవరితోనో వివాహేతర సంబంధం పెట్టుకుందని,







ఒక బిడ్డను కూడా కన్నదనీ , ఇది గ్రామానికి, కులానికీ కూడా తలవంపులు తెస్తుందని ఆరోపించారు. ఆ సాకుతో చివరికి అన్యాయంగా చంపేశారు. ఆ గ్రామ మహిళలు మాత్రం ఆమె గర్భం దాల్చటం అబద్ధం అని తేల్చి చెబుతున్నారు. ఈ కేసులో నేరస్తులు జైలు పాలయ్యారు.

సగోత్ర వివాహం చేసుకున్నారన్న ఆరోపణ మీద హర్యానాకు చెందిన దర్శన అనే యువతిని, ఆమె భర్త ఆశీష్‌ని దారుణంగా అవమానించారు. పోయినేడాది జరిగిన ఈ సంఘటనలో - దర్శన చేత భర్తకి బలవంతంగా రాఖీ కట్టించారు. ఏడాదిన్నర వయసు కొడుకున్న ఆ దంపతుల వివాహం చెల్లదని కులపంచాయితీ భావించింది. ఒకే గోత్రానికి, ఒకే గ్రామానికి చెందిన వీరు సమాజం దృష్టిలో సోదరీ సోదరులవుతారని వాదించింది. అందుకే ఆ దంపతులను అవమానించి ఊరి నుంచి వెలేసింది.







జాట్‌లలోనే కాకుండా ముస్లింల లోనూ ఇటువంటి ఉదాహరణలు కొన్ని కనిపిస్తున్నాయి. ముజఫర్ నగర్‌కి 30కిలోమీటర్ల దూరంలో వున్న ముంజెరా గ్రామంలో ఆగస్టు 16న త్వరలో పెళ్లిచేసుకోబోతున్న ఇర్ఫాన్, షబానా అనే జంటను వివస్త్రలను చేసి ఊరేగించారు. వారిది పెద్దలిద్దరూ అంగీకరించిన పెళ్లే. అయితే పెళ్లి కాకముందు ఇర్ఫాన్ తరచూ షబానా ఇంటికి వస్తూపోతూండడాన్ని గ్రామస్తులు అభ్యంతరపెట్టారు. ఆ కోపంతోనే ఈ దురాగతానికి దిగారు. చివరికి వారి కుటుంబాలు ఆ ఊరి నుంచి 20 కిలో మీటర్ల దూరంలో వున్న వేరే ఊరికి వలసవెళ్లిపోయాయి. ఇర్ఫాన్ పెట్టిన కేసును ఉపసంహరించుకోవలసిందిగా అతనిపై విపరీతమైన వత్తిడి వస్తోంది.

ఇంకో సంఘటనలో - ఖురేషీ తెగకి చెందిన డాక్టర్ నాజ్ పర్వీన్, అంతకుముందే పెళ్లయిన పఠాన్ యువకుడు జమాల్ కాసిఫ్‌ను ప్రేమించి పెళ్లిచేసుకుంది. అక్కను గురించి, తమ కుటుంబం గురించి ఇరుగుపొరుగు వారు పోతున్న గుసగుసలు విని నాజ్ సోదరుడు నజీర్ కుతకుత ఉడికిపోయాడు. స్నేహితుల సహాయంతో, అక్కాబావల్ని పట్టపగలు నాలుగంటన్నర గంటలకి రద్దీగా వుండే మార్కెట్ ప్రాంతంలో దారుణంగా వెంటాడిచంపాడు. నాజ్‌ను గొడ్డలితో నరికేసిన తర్వాత, ఒక సందులోకి పారిపోయిన జమాల్ మీద తుపాకీగుళ్ల వర్షం కురిపించాడు.

శిరోమణి గురుద్వారా ప్రబంధక్ కమిటీ మాజీ ప్రెసిడెంట్ బీబీజాగీర్ కౌర్ కుమార్తె హరిప్రీత్‌కౌర్ గత ఏడాది అనుమానాస్పద స్థితిలో మరణించింది. హరిప్రీత్ తాను ప్రేమించిన కమల్జిత్‌ను రహస్యంగా పెళ్లాడింది. అతడు తమ కులం వాడే అయినప్పటికీ అంతస్తు తేడా వుండటం వల్లే కూతురు ప్రేమను, పెళ్లిని తీవ్రంగా వ్యతిరేకించిందని, అందుకే కూతుర్ని అంతం చేయిందనీ బీబీ మీద ఆరోపణలు వచ్చాయి. వెలుగులోకి రాని ఇటువంటి సంఘటనలు ఎన్నెన్నో!

అయితే అలీనగర్‌లో విశాల్, సోనుల హత్య తర్వాత అధికారయంత్రాంగం ఒక సెల్‌ను ఏర్పాటు చేసింది. చట్టప్రకారం వివాహం చేసుకునే వయసు వచ్చిన యువతీ యువకులు - ప్రేమ పెళ్లి చేసుకోదల్చుకుంటే, వారికి ఈ సెల్ రక్షణ కల్పిస్తుంది. దీన్ని వికాస్‌సింగ్ అనే జాట్ యువకుడు, సోనా అనే దళితయువతి తొలిసారిగా ఈ అవకాశాన్ని ఉపయోగించుకోబోతున్నారు. అంతా సవ్యంగా జరిగితే, అధికారుల ఆశీసులతో జరిగే తొలివివాహం ఇదే అవుతుంది●

(ది వీక్ సౌజన్యంతో)

---

## కల్వకోలులో అమానుషం

# దళితుడి సజీవదహనం

మహబూబ్‌నగర్ జిల్లా, పెదకొత్తపల్లి మండలం, కల్వకోలు గ్రామంలో పెత్తందారితనం మరోసారి పడగ విప్పింది. పన్నెండేళ్ళ తర్వాత గ్రామ పెత్తందార్ల ఆగ్రహానికి మరో దళితుడు ఆహుతై పోయాడు. 1989లో బుడ్డన్న అనే దళితుడ్ని సజీవంగా దహనం చేసిన గ్రామ పెత్తందార్లు ఈసారి నామాల బాలస్వామి (30) అనే మరో దళితుడ్ని సజీవంగా దహనం చేశారు. అప్పుడు బుడ్డన్నను బాణామతి చేస్తున్నా డనే నెపంతో మట్టుబెడితే ఈసారి బాలస్వామిని గడ్డివాములు తగల బెడుతున్నాడనే సాకుతో కాలిపోయిన ఓ గడ్డివాములోనే కిరోసిన్ పోసి తగలబెట్టారు.

సుమారు 4,500 జనాభాగల కల్వకోలు గ్రామంలో వందల ఎకరాల భూమిగల బడాభూస్వాములెవ్వరూ లేకపోయినా పెత్తందారితనం మాత్రం ఆ గ్రామంలో పుష్కలంగా ఉంది. గ్రామంలో పెత్తనం కోసం, ఆధిపత్యం కోసం అన్ని వర్గాలు, అన్ని పార్టీలు పోటీ పడుతుంటాయి. ఇటీవల జరిగిన స్థానికసంస్థల ఎన్నికల్లో ఆ గ్రామం ఎంపిటిసిగా బిజెపికి చెందిన శ్రీనివాసులు శెట్టి ఎన్నికయ్యారు. కులాల విభజనకొస్తే గ్రామంలో సగం జనాభా తెలుగు (ముదిరాజ్) కులానికి చెందిన వారే. వారు కాకుండా గ్రామంలో నాలుగు రెడ్డి, పది వైశ్య కుటుంబాలున్నాయి. 170 దాకా మాల, 70 దాక మాదిగ కులాలకు చెందిన కుటుంబాలున్నాయి. మచ్చుకైనా బ్రాహ్మణ కుటుంబంలేని ఆ గ్రామంలో మిగతా బిసి కులాలకు చెందిన కుటుంబాలు తక్కువే ఉన్నాయి.

పేదలను, దళితుల్ని ఏదో ఒక ముద్రవేసి చంపివేయ టంలో కల్వకోలు గ్రామానికి ఘనమైన చరిత్ర ఉంది. ఆ ప్రాంతం పెద్దల లెక్కప్రకారం గత నలభై ఏళ్ళలో ఇలాంటి ఘాతుకాలకు 23మంది బడుగు వర్గాల వారు బలయ్యారు. 1985 నుంచి ఇప్పటిదాక అయిదుగురిని చంపేశారు. 1986 ప్రాంతంలో గొల్ల కులానికి చెందిన ఒకే కుటుంబంలోని నారాయణ, బుచ్చన్న, తులనయ్యలను చేతబడి చేస్తున్నారనే నెపంతో చంపేశారు. 1989లో కూడా అదే రకం ఆరోపణపై దళితుడైన బుడ్డన్నను సజీవంగా దహనం చేశారు. గ్రామంలో గత కొంతకాలం నుంచి గడ్డివాములను తగులబెడుతున్నాడనే సాకుతో ఈ ఏడాది జులై 26 తెల్లవారు జామున మాలకులానికి చెందిన నామాల బాలస్వామిని దహనం చేశారు.



స్వాతంత్ర పోరాటంలో, తెలంగాణా సాయుధ పోరాటంలో పాలుపంచుకున్న యోధులున్న కల్వకోలుగ్రామంలో రాజకీయ చైతన్యానికి కొదువేమీ లేదు. గ్రామంలోని ప్రతి కుటుంబానికి ఏదో ఒక రాజకీయపార్టీతో సంబంధాలున్నాయి. కాంగ్రెసు, బిజెపి, తెలుగుదేశం మొదలుకొని పీపుల్స్‌వార్ వరకు అన్ని పార్టీల సానుభూతి పరులు ఆ గ్రామంలో ఉన్నారు. గ్రామ ముఖద్వారం వద్దే ఒకవైపు బిజెపి, మరోవైపు సిపిఐ జెండాలు మనకు స్వాగతం చెబుతాయి.

మాలకులానికి చెందిన మృతుడు నామాల బాలస్వామి సిపిఐ సానుభూతి పరుడు. ఉండడానికి ఓ చిన్న ఇల్లు, అర ఎకరం పొలం మాత్రమే ఉన్న ఆ నిరుపేద కుటుంబంలోని వారంతా వ్యవసాయ కూలీలే. ఇంటి పెద్ద నామాల ఎర్రన్న ముష్టి కులానికి చెందిన జగన్నాథం వద్ద పాలేరుగా పని చేస్తున్నాడు. పెద్ద కొడుకు పెద్ద బాలస్వామి, మృతుడు బాలస్వామి ఇద్దరూ వ్యవసాయ కూలీలే. మూడవ కొడుకు నామాల నర్సిములు, కూతురు నామాల శ్యామల ఇద్దరు పీపుల్స్‌వార్ పాన్‌గల్ దళసభ్యులు. నర్సిములు ఇటీవల చందుబాట్ల దగ్గర జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోగా శ్యామల మాత్రం గాయాలతో తప్పించుకుంది. ఆమె బ్రతికిందో,మరణించిందో కుటుంబ సభ్యులకు కూడా ఇప్పటివరకు తెలియదు.



### తండ్రి కళ్ళెదుటే కాల్చి చంపారు

గత కొద్ది మాసాలుగా గ్రామానికి చెందిన కొందరు రైతుల పొలాల్లో గడ్డివాములు తగులబడిపోతున్నాయి. వాటిని తగలబెడుతున్నది బాలస్వామేనని గ్రామంలోని కొందరు జులై 25వ తేది అర్ధరాత్రి మిత్రుని ఇంటి నుంచి తన ఇంటికి ఒంటరిగా వస్తున్న బాలస్వామిని పట్టుకొని లైట్ స్తంభానికి కట్టిపడేసి అతన్ని చితకబాదారు. ఆ తర్వాత తెల్లవారు జామున (26వ తేది) ఊరికి సమీపంలో అంతకుముందు మూడు రోజుల క్రితం తగలబడి ఆరిపోయిన ఈడిగ యశోద గడ్డివాము వద్దకు బాలస్వామిని లాక్కెళ్ళారు. ఇంతలో విషయం తెలుసుకున్న బాలస్వామి తండ్రి ఎర్రన్న ఆ గడ్డివాము వద్దకు పరుగెత్తుకెళ్ళి తన కొడుకును కొడుతున్న వారిని వారించబోయాడు. వారు అతన్ని కూడా చితకబాది కింద పడేశారు. తర్వాత ఎర్రన్న చూస్తుండగానే బాలస్వామిని వారు గుడ్డలతో చుట్టి కిరోసిన్ పోసి సజీవంగా తగలబెట్టారు. 'విజయవిహారం'తో ఎర్రన్న మాట్లాడుతూ తన కొడుకుపై బంట్రోతు ఎర్రన్న కిరోసిన్ పోయగా నారాయణ రెడ్డి గట్టుచెర్ల చంద్రయ్య, గట్టుచెర్ల శివుడు, ముష్టి కుర్మయ్య, సంగజోని సుక్కయ్య, కుంటి గుజ్జన్న పెద్ద కోడలు చంద్రమ్మ, పానుగంటి రాజు మరికొందరు కలసి నిప్పంటించి సజీవంగా దహనం చేశారని చెప్పారు. కళ్ళముందే మంటల్లో కాలిపోతున్న కొడుకును రక్షించుకోవడానికి పరుగెత్తిన తనను అడ్డగించి రక్తం కారేటట్టు కొట్టారని ఎర్రన్న చెప్పారు.

ఈ ఘటనకు సంబంధించి పోలీసులు 20 మందిపై కేసు నమోదు చేశారు. అందులో ఆరుగురు దళితులు వున్నారు. ఎస్సి, ఎస్టి అట్రాసిటీస్ చట్టం కింద కేసు నమోదు కాకూడదనే దురుద్దేశంతోనే పోలీసులు అక్రమంగా ఆరుగురు దళితుల్ని కూడా కేసులో ఇరికించారని వామ పక్షాలు ఆరోపిస్తున్నాయి.

సంచలనం సృష్టించిన బాలస్వామి సజీవదహనం కేసు సి.బి.సి.ఐ.డి.కి బదిలీ అయింది. ఈ కేసు విచారణ నిమిత్తం సి.బి.సి.ఐ.డి. ఎస్.పి. వై.వి.రాజు మహబూబ్‌నగర్ వెళ్ళి కేసులో నమోదు చేసిన సెక్షన్‌లకు తోడు ఎస్.సి., ఎస్.టి. యాక్టును కూడా చేర్చారు.

ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో దక్షిణాఫ్రికాలోని డర్బన్‌లో ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 7 వరకు జరగనున్న ప్రపంచజాతి వివక్ష వ్యతిరేక ప్రభుత్వాల అధికార సదస్సులో బాలస్వామి సజీవదహనం సంఘటనను దళిత వర్గాలు ప్రస్తావించ నున్నాయి●

- కె. రఘురామయ్య
(మహబూబ్‌నగర్ నుంచి)

# అల్లా మెహర్బాన్ తో గధా పహిల్వాన్

## (దేవుడు దయచూపిస్తే గాడిదే పహిల్వాన్) 8

యర్రంశెట్టి సాయి

హ్యూమరాలజీ

ఇంకా గంగారామ్ ఇంటి బయట కేకలు వినబడుతూనే ఉన్నాయ్.

జిందాబాద్ జిందాబాద్ - గంగారామ్ జిందాబాద్.

గంగారామ్ కోన్‌హై- బగర్ పోర్ట్‌ఫోలియో మినిష్టర్ హై -

స్టేట్‌కే నేతా క్షైసీహో- గంగారామ్ జైసీహో

బన్‌గయా - బన్‌గయా - గంగారామ్ మినిష్టర్ బన్‌గయా -

గంగారామ్ అయ్యాడు - ఎ.పి. మినిష్టర్ అయ్యాడు -

మదన్ బయట నిలబడి స్లోగన్స్ ఆర్గనైజ్ చేస్తున్నాడు.

గంగారామ్ పెద్ద ఊరేగింపుతో శెక్రటేరియేట్‌కి చేరుకునేందుకు పాపారావ్, మదన్ పెద్ద ఎత్తున జనాన్ని సేకరిస్తున్నారు.

లోపల బాలశకుని, అతని భార్య, రాజేశ్వరి గంగారామ్ మెడలో దండవేసి నుదుట కుంకుమ బొట్టు పెట్టి దిష్టితీసేసి హారతిస్తున్నారు.

బయట హాల్లో గంగారామ్‌ని అభినందించడానికి వచ్చిన జనం కిక్కిరిసి పోయి ఉన్నారు. గంగారామ్‌ని హాల్లోకి తీసుకొచ్చి అందరికీ పరిచయం చేశాడు బాలశకుని.

"చోరప్పన్‌తో అద్భుతంగా దౌత్యం చేసి నక్సెన్ అయారు సార్'' అంటూ పొగుడుతున్నారందరూ. గంగారామ్ ఏమనాలో తెలీక 'ఇహి' అంటున్నాడు వాళ్ళతో.

ఊరేగింపు బయల్దేరి శెక్రటేరియేట్ చేరుకుంది.

"తిన్నగా సి.యమ్. దగ్గరకెళ్ళి ఆశీస్సులు తీసుకో'' అన్నాడు బాలశకుని గంగారామ్ చెవిలో. వెంటనే సి.యమ్. చాంబర్‌కి చేరుకున్నాడతను.

సి.యమ్. అప్పటికే ఎవరితోనో మాట్లాడుతున్నాడు.

"నమస్కారం సార్'' అన్నాడు గంగారామ్. కానీ చీఫ్ మినిష్టర్ అతనిని గమనించలేదు. బాలశకుని గంగారామ్ చెవిలో ఊదాడు "కాళ్ళ మీద పడు, కాళ్ళ మీద పడు''

గంగారామ్‌కి కాళ్ళబేరాలు ఇష్టం లేకపోయినా కాళ్ళ మీద పడబోయాడుగానీ అక్కడే ఉన్న డి.జి.పి. అతని భుజం తట్టాడు.

"ఎక్స్‌క్యూజ్‌మీ - కాళ్ళ మీద పడాలంటే ఆ క్యూలో రావాలి!''

గంగారామ్‌కి చిరాకేసుకొచ్చింది.

"అయితే కాళ్ళమీద పడను - నమస్కారం చేస్తాను'' అంటూ మళ్ళీ నమస్కారం చేశాడతను.

"నమస్తే గంగారామ్ గారూ! ఏమిటి? ఇవాళ మంత్రిగా ఛార్జ్ తీసుకుంటున్నారా?''

"అవున్సార్''

"మరి పోర్ట్‌ఫోలియో ఇంకా డిసైడ్ అవలేదు కదా! పోనీ ఓ పని చేయండి. ఎల్లుండి మన హోమ్ మినిష్టరు గారు ఫారిన్ టూర్ వెళ్తున్నారు. ఆయన తిరిగి వచ్చేవరకూ హోమ్ ఎఫైర్స్ మీరే చూస్తూండండి''

గంగారామ్ ఆనందంతో పొంగిపోయాడు.

"థాంక్యూ సర్''

"ఈ కొద్దిరోజుల్లో మంచి పేరు తెచ్చుకోండి! మీరు కష్టపడి రాత్రింబగళ్ళు పనిచేయండి! బాగా పనిచేసి పేరు తెచ్చుకుంటే మీకు మంచి పోర్ట్‌ఫోలియో ఇస్తాను. లేకపోతే అయిదేళ్ళూ పోర్ట్‌ఫోలియో లేని మినిష్టర్‌గానే ఉండిపోతారు''

"అలాగే సార్''

గంగారామ్ బయటికొచ్చేశాడు.

వెనుకే డి.జి.పి. వచ్చి అతని కాళ్ళమీద పడ్డాడు.

గంగారామ్ ఉలిక్కిపడ్డాడు.

"అదేమిటి - కాళ్ళమీద పడుతున్నారు?''

"మీరంటే నాకు చిన్నప్పటి నుంచీ తెగ గౌరవం సార్. మీరు గొప్ప ప్రజానాయకులనీ - ఏదొక రోజు మంత్రి అవుతారని కూడా అనుకున్నాను సార్. మీ లాంటి గొప్పవాళ్ళ కాళ్ళమీద పడటం నా అదృష్టంగా భావిస్తున్నా సార్. అందుకే కాళ్ళ మీద పడ్డాను. అదీగాక నేను సాధారణంగా కొత్తగా ఎవరు హోమ్ మినిష్టరయినా వాళ్ళ కాళ్ళమీద పడతాను సార్''

"నాకిలాంటి కాళ్ళబేరాలు నచ్చవు డి.జి.పి. గారూ'' చిరాగ్గా అన్నాడు గంగారామ్.

"అలా అనకండి! వాళ్ళు హర్టవుతారు. సైలెంట్‌గా ఊరుకుంటే సరిపోతుంది'' అన్నాడు పాపారావ్ చెవిలో.

ప్రిన్సిపల్ హోమ్ శెక్రటరీ హడావుడిగా వచ్చి గంగారామ్‌కి నమస్కారం చేశాడు.

"నమస్తే సార్. నేను ప్రిన్సిపల్ హోమ్ శెక్రటరీని. నా పేరు చిదంబరం!''

"నమస్తే''

"మరి మీ చాంబర్‌కి వెళ్దామా సార్''

"పదండి''

అందరూ వెనుక వస్తూండగా హోమ్ మినిష్టర్ రూమ్‌లోకి చేరుకుని కూర్చున్నాడు గంగారామ్.

"సార్! కొత్తగా హోమ్ మినిష్టరయిన వాళ్ళు మన రాష్ట్ర రాజధాని అంతా రాత్రుళ్ళు మారు వేషంలో పర్యటించి ఎక్కడ ఏ అవినీతి కార్యక్రమాలు జరుగుతున్నాయో, ఎక్కడ ఏ చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నాయో అన్నీ తెలుసుకోవటం రివాజు సార్! మరి ఈ రాత్రి మీరు కూడా మారు వేషంలో బయల్దేరతానంటే మీతోపాటు డి.జి.పి.గారూ, కమిషనర్ గారూ కూడా మారు వేషాల్లో వస్తారు సార్''

గంగారామ్ ఆశ్చర్యపోయాడు.

"ఏమిటి? నగరమంతా మారువేషాల్లో తిరిగి ఎక్కడ ఏ దారుణం జరుగుతుందో తెలుసుకోవాలా? అంటే ఎక్కడ ఏం జరుగుతుందో మనకు తెలీదా? తెల్లారి లేస్తే నగరమంతా తిరుగుతూనే ఉన్నాం కదా! బార్లు అన్నీ రాత్రి పదింటికి మూసేయాలి. కానీ అవి రెండింటి వరకూ తెరచే ఉంటాయ్. నేనే చాలాసార్లు మా ఏరియా పోలీస్ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి రాత్రి ఒంటి గంట వరకూ బార్లో మా ఫ్రెండ్స్‌కి పార్టీ ఇచ్చాను. అలాగే గూండాలంతా రాత్రి తాగి ఏయే వ్యభిచార గృహాలకెళ్తారు, ఏయే క్లబ్బుల్లో పేకాడతారు ఇవన్నీ కూడా నాకు తెలుసు. ఎలక్షన్స్‌లో నాకు కాన్వాసింగ్ చేసిందెవరనుకున్నావ్? మా ఏరియా దాదాలు! వాళ్ళందర్నీ ఆ క్లబ్బుల్లోనే కలుసుకుని డబ్బు ఇస్తూండేవాడిని! ఇక నగరమంతా ఉన్న గొప్పోళ్ళ క్లబ్బుల సంగతి సరేసరి! లక్షల రూపాయల గాంబ్లింగ్ జరుగుతూంటుందక్కడ. నేనూ ఎప్పుడయినా సరదాగా ఆ క్లబ్స్‌కే వెళ్ళి పేకాడుతూంటాను. ఇక కాల్‌గాల్స్ సంగతి సరేసరి. బాగా ధనవంతులుండే ప్రాంతాల్లో కూడా హైలెవల్లో బ్రోతల్ హౌస్‌లు రన్ చేస్తున్నారు. మా ఎమ్మెల్యేలు చాలా మందిని నేను ఆ ఇళ్ళల్లోనే కలుసుకుంటూంటాను.

ఇలా ఒకటేమిటి? నగరం మొత్తం అక్రమాలతోనూ అవినీతితోనూ నిండిపోయి ఉండటం చిన్నప్పటి నుంచీ చూస్తున్నాను. ఇప్పుడు హోమ్ మినిష్టరయానని ఏమీ తెలీనట్లు మారు వేషం వేసుకుని వెళ్ళి ఎక్కడేం జరుగుతుందో ఇప్పుడే కనుక్కున్నట్లు ఫోజు పెట్టాలా? ఇలాంటి హిపాక్రసీయే నాకు నచ్చదు. ఇలాంటి హిపాక్రసీని ఫైట్ చేయడానికే నేనసలు పాలిటిక్స్‌లోకొచ్చాను''

"అయ్యో - మీరర్థం చేసుకోవటం లేద్సార్! ఇది మన హోమ్ డిపార్ట్‌మెంట్‌లో పాటించాల్సిన సంప్రదాయం సార్! అలా చేయటం వల్ల ప్రజల్లో మీరంటే మంచి అభిప్రాయం ఏర్పడుతుంది! మనం అదంతా ఎలాగో ప్రెస్ మీట్‌లో చెప్తాంగనుక న్యూస్ పేపర్‌వాళ్ళు కూడా మీరు నిజంగా నాన్ కర్రప్టెడ్, నో నాన్సెన్స్ హోమ్ మినిష్టర్ అని భ్రమ పడతారు. అలాంటి ఇమేజ్ తెచ్చుకోవటం వల్ల భవిష్యత్తులో మీరు ఎన్ని కిరాతకాలు చేసినా, ఎన్ని దారుణాలు చేసినా ప్రజలు మీరు చేశారంటే నమ్మరు''

పాపారావ్ నెమ్మదిగా గంగారామ్ చెవిలో గొణిగాడు.

"ఆ ప్రిన్సిపల్ శెక్రటరీ చెప్పేది నిజమే సార్! హోమ్ మినిష్టర్లే కాదు. కొత్తగా డి.జి.పి. పదవి చేపట్టిన అధికారులూ, కొత్తగా పోలీస్ కమిషనరయిన కాండిడేట్లూ, ఆఖరికి ఈ రోజుల్లో ఎస్పీలు కూడా ఇలాంటి మారు వేషాల గిమ్మిక్స్ చేస్తున్నారు. న్యూస్ పేపర్లు పాతవి తెప్పించి చూస్తే ఈ ప్రొసీజర్ రాష్ట్రమంతటా ఎంత పెద్ద ఎత్తున పోలీస్ అధికార్లు ఫాలో అవుతున్నారో మీకే తెలుస్తుంది. అందుకని మీరూ అదే ప్రొసీజర్ ఫాలో అవటం మంచిది. మనక్కావలసింది ఎప్పుడూ ప్రజలనూ, న్యూస్ పేపర్‌వాళ్ళనూ వెర్రివెంగళాయిల్ని చేయటమే కదా! దానికి ఏ పద్ధతి ఫాలో అయితేనేం?''

"కానీ నేను అందరి లాంటి ఎమ్మెల్యేని కాదని నీకు తెలుసు కదా!''

"తెలుసనుకోండి! అయినా మీ రివల్యూషనరీ అయిడియాలన్నీ ఇప్పుడే ఆచరణలో పెట్టేయకూడదు. దీనిక్కొంచెం టైమ్ కావాలి!''

"సరే'' అన్నాడు గంగారామ్

"ఆ రాత్రే మారు వేషంలో నగరమంతా సంచరించి ఎక్కడేంజరుగుతుందో స్వయంగా తెలుసుకోవాలని హోమ్ మినిష్టర్‌గారు అనుకుంటున్నారు. కనుక న్యూస్‌పేపర్ జర్నలిస్టులను కూడా ఈ సీక్రెట్ సర్‌ప్రైజ్ ఇన్‌స్పెక్షన్‌కి తోడు తీసుకెళ్ళడానికి ఏర్పాట్లు చేశారు. మీరు మీ మీ కరెస్పాండెంట్స్‌ని తప్పకుండా రాత్రి పదకొండు గంటలకల్లా కమిషనర్ గారి ఆఫీస్ దగ్గరకు పంపించవలసిందిగా కోరుతున్నాం!'' అంటూ న్యూస్‌పేపర్ వాళ్ళకు ఫోన్ చేశాడు కమిషనర్.

సరిగ్గా రాత్రి పదకొండు గంటలకు అందరూ మారు వేషాల్లో కార్లల్లో బయల్దేరారు. ముందు అందరూ డబీర్‌పురా దగ్గర దిగి చార్మినార్ వేపు నడవటం ప్రారంభించారు. నాలుగడుగులు వేయగానే ఇద్దరు గూండాలు మోటర్ సైకిల్ మీద వచ్చి కత్తి చూపించి గంగారామ్‌ని పర్సు ఇమ్మన్నారు.

గంగారామ్ పర్స్ తీసి ఇచ్చాడు.

అందులో డబ్బులాక్కుని పర్స్ గంగారామ్ మీదకు విసిరేసి వెళ్ళిపోబోతూండగా ఆ ఏరియా ఇన్‌స్పెక్టర్ ఆ విషయం వైర్‌లెస్‌లో తెలుసుకుని వచ్చి ఆ గూండాలకు బేడీలు తగిలించబోయారు.

ఆ గూండాలు మండిపడ్డారు.

"ఏయ్ ఇన్‌స్పెక్టర్. ఏందివాళ నకరాల్జేస్తున్నావ్? రోజూ మేము కమాయించిన పైసల్లో నీకు బరాబర్ షేర్ ఇస్తుంటిమి గదవయ్యా. ఇయాళ గూడా ఇస్తాం! ఇవ్వనంటిమా?'' అనడిగారు.

ఇన్‌స్పెక్టర్ కంగారు పడ్డాడు.

"ష్. అరవకు! అవతల వాళ్ళు ఎవరనుకున్నావ్? మా డి.జి.పి.గారు, కమిషనర్ గారు, హోమ్ మినిష్టర్‌గారూనూ''

"అయితే ఏందివయ్యా! వాళ్ళందరికీ గూడా షేర్లు ఇయ్యాల్నని నువ్వేగా దందాలు జేసేటోళ్ళందరి దగ్గరా వసూళ్ళు చేస్తుంటావ్?''

ఇంక అక్కడ ఉంటే మర్యాద దక్కదని అక్కడి నుంచి మళ్ళీ ముందుకి నడిచారు వాళ్ళు. జర్నలిస్టులు లోలోపల నవ్వుకున్నారు.

అక్కడే బార్లు రెండు జనంతో క్రిక్కిరిసిపోయి కనిపించినయ్.

"కమిషనర్‌గారూ! ఏమిటిది? బార్లు ఇంకా ఎందుకు తెరచి ఉన్నయ్ ఈ టైమ్‌లో? అని మీరడగాలి సార్ ఇప్పుడు'' అన్నాడు పాపారావ్ రహస్యంగా.

"అది 24 గంటలూ తెరిచే ఉంటాయ్ కదా! పదకొండు తర్వాత మామూలుగానే వెనుకవేపు నుంచి జనం వచ్చిపోతూంటారు. పొద్దున్నే పోలీసులు వచ్చి మామూళ్ళు తీసుకుపోతారు. అందరికీ తెలిసిందే ఇది. ఇంకా నేనడగటం ఎందుకు?''

"తప్పదుసార్. ప్రెస్ వాళ్ళను మనం వెంట తీసుకొచ్చింది ఇలా డ్రామా ఆడడానికే! ఇంత హైఓల్టేజ్ డ్రామా లేకపోతే వాళ్ళు న్యూస్ రాయరు''

"సరే సరే'' చిరాగ్గా అని కమిషనర్‌ని బార్ సంగతి అడిగాడు గంగారామ్.

"నేనూ ఫస్ట్ టైమ్ చూస్తున్నాను సార్. ఇంతకు ముందు నేను మారు వేషంలో వచ్చినప్పుడు కరెక్ట్‌గా టైమ్‌కి క్లోజ్ చేసేశారు''

ప్రెస్ ఫోటోగ్రాఫర్లు ఆ బార్‌ని ఫోటోలు తీశారు. అందరూ ఇంకో ఏరియాకి చేరుకున్నారు.

"సార్. హవాలా మనీ కావాలా! అమెరికన్ డాలర్స్‌కి ఇండియన్ రుపీస్. హవాలా. హవాలా'' ఒక వ్యక్తి ఎదురుగ్గా వచ్చి అడిగాడు.

అడిగి మారువేషంలో ఉన్న అందర్నీ ఎగాదిగా చూసి "ఏంటి సార్ మళ్ళీ మారు వేషంలో వచ్చారు? ఇంకెవడయినా కొత్త పోలీస్ ఆఫీసరొచ్చాడా?'' అనడిగాడు కమిషనర్‌ని.

కమిషనర్ మొఖం పాలిపోయింది.

"ఏయ్ ఎవర్రా నువ్? పో ఇక్కడి నుంచి'' అన్నాడు కోపంగా.

"ఓకే ఓకే సార్. అన్నట్లు మీరు ఆ రాజారావ్ సాబ్‌కి హవాలా మనీ ఇప్పించమన్నారు కదా! రేపు రాత్రి ఇదే టైమ్‌కి మా ఆఫీస్‌కి రమ్మని చెప్పండి సార్'' అనేసి వెళ్ళిపోయాడు వాడు.

గంగారామ్ మళ్ళీ ఆశ్చర్యం నటించాడు.

వాళ్ళు మళ్ళీ నాలుగడుగులు వేసేసరికి హఠాత్తుగా పది మంది వాళ్ళను చుట్టుముట్టారు.

"సార్. ఏక్లాస్ రిస్ట్‌వాచెస్ సార్. ఏక్లాస్ కంప్యూటర్లు సార్. ఏ క్లాస్ టి.వి.సెట్స్, విసిడీ, మ్యూజిక్ సిస్టమ్ - అన్నీ సరికొత్త పీసెస్ సార్. వారం రోజుల క్రితమే దొంగతనం చేసి తెచ్చిన తాజా స్టాక్ సార్. దారుణమయిన చౌక రేటులో తీసుకోండి సార్''

"సార్. గోల్డ్ నగలు సార్. గొలుసులు, నెక్లెస్‌లు, చెవి కమ్మలు, గాజులు అన్నీ నిన్న రాత్రి రోడ్ మీద దోపిడీ చేసినవే సార్. కారుచౌక సార్. చోరీకా మాల్. కిస్‌కో హోనా భాయ్. చోరీకా మాల్''

"ఏమిటి దొంగసామాన్లు ఇంత డైరక్ట్‌గా అమ్ముతారా?'' అడిగాడు గంగారామ్ ఏమీ తెలీనట్లు''

"అవున్సార్. ఈ మార్కెట్‌ని జుమే రాత్ బజార్ అంటారు సార్. అన్నీ దొంగసామాన్లు ఈ ఏరియాలో కారుచవగ్గా అమ్ముతుంటారు సార్'' అన్నాడు ఆ వస్తువులమ్మేవాడు.

"ఎంత కాలం నుంచి ఇలా అమ్ముతున్నారిక్కడ?'' అడిగాడు కమిషనర్ అమాయకంగాచూస్తూ.

"మా నాన్న చిన్నప్పటి నుంచీ మాది ఇదే వ్యాపారం సార్! చోరీ సామాన్లు కొని మేము లాభానికి అమ్ముతూంటాం!'' అన్నాడు వాడు.

సరిగ్గా అప్పుడే ఆ పక్కనే ఉన్న ఓ ఇంట్లో నుంచి నలుగురు స్త్రీలు గంగారామ్ వేపు చూస్తూ "ఆజా సనమ్ - ఆజా'' అని పిలవటం మొదలుపెట్టారు.

"దిసీజ్ టూమచ్'' అన్నాడు గంగారామ్. "వ్యభిచారం మరీ ఇంత పబ్లిగ్గా జరుగుతోందా?'' అన్నాడు ఆవేశంగా.

"నిజంగా మనం మారు వేషాల్లో రావటం వల్ల చాలా మనకు తెలీని విషయాలు తెలుసుకోగలిగాం సార్'' అన్నాడు కమిషనర్.

అప్పటికే ఒంటిగంటయి పోవడంతో ఆ రాత్రికి మారువేషాలు ప్రయోగం ముగిసింది. మర్నాడు అన్ని పేపర్లలోనూ "తాత్కాలిక హోమ్ మినిష్టర్ రాత్రి మారువేషంలో నగర సంచారం! వెలుగుచూసిన ఎన్నో దారుణాలు!'' అంటూ హెడ్‌లైన్స్‌లో వార్తలు వచ్చినయ్.

అన్నిట్లోనూ గంగారామ్ ఫోటోలు, డి.జి.పి., కమిషనర్ ఫోటోలు వచ్చినయ్. గంగారామ్‌కి ఉదయం ఆరు నుంచే తెలిసిన వారి నుంచి ఫోన్‌కాల్స్ మొదలయినయ్.

"గంగారామ్‌గారూ! చాలా గొప్ప పని చేశారు సార్ మీరు! మీరు చూసిన దారుణాలన్నిటికీ మీరే అడ్డుకట్ట వేస్తారన్న నమ్మకం మాకుంది'' అంటూ పొగడ్తల్లో ముంచెత్తారు. మరికాసేపటికల్లా టి.వి. ఛానెల్ వాళ్ళ కెమెరాలు గంగారామ్ ఇంట్లో ప్రత్యక్షమయినయ్.

"సార్. రాత్రి మీరు మారువేషంలో నగరమంతా సంచరించి చాలా దారుణాలు, అక్రమాల గురించి ప్రత్యక్షంగా తెలుసుకున్నారని తెలిసింది. మీరు చూసిన దారుణాలన్నీ ఓసారి చెప్తే మా న్యూస్ వ్యూయర్స్ అందరూ హాపీగా ఫీలవుతారు'' అన్నారు వాళ్ళు.

అప్పటికప్పుడే ఇంటర్వ్యూలు మొదలయినయ్.





మీరు హైదరాబాద్‌వాసి అయితే కేవలం ఒక ఫోన్ కాల్ చేసి జనహర్ష పబ్లిషర్స్ వారి 'డోర్ సర్వీస్' సదుపాయాన్ని పొందవచ్చు

"నేను మారువేషంలో వెళ్ళినప్పుడు నిజంగా నగరంలో జరుగుతున్న దారుణాలు చూసి ఆశ్చర్యపోయాను. అంతే కాదు బాధ కూడా కలిగింది నాకు! ప్రజలు మమ్మల్ని ఎన్నుకుంది ఎందుకు? మేము ప్రజారంజకంగా పరిపాలించాలని - దొంగలు, మోసగాళ్ళు, గూండాలు నగరంలో అరాచకాలు చేయకుండా వారి ఆటకట్టించాలనీనూ! కానీ జరుగుతోందేమిటి?" ఆవేశంగా ప్రశ్నించాడు గంగారామ్ కెమెరాలోకి చూస్తూ.

"ఉదాహరణకి డబీర్‌పురా ఏరియా తీసుకోండి. నేను మొదటిసారి ఆ ఏరియా చూడటం. చాలా హారిబుల్ కండిషన్‌లో ఉంది.ఎన్నో అక్రమాలు - ఇల్లీగల్ వ్యవహారాలు జరుగుతున్నాయ్ అక్కడ" అన్నాడు గంగారామ్.

"మనం పుట్టి పెరిగిందక్కడేరా బాడుకవ్" అంది చిలక.

అందరూ అదిరిపడి గదంతా చూశారు. గంగారామ్ చిలక సంగతి వాళ్ళకు చెప్పకుండా దాటేశాడు. "బయట ఎవరో ఏదో మాట్లాడుకుంటున్నారులెండి! ఇంతకు ముందు అసెంబ్లీలో వర్క్ చేశారు కదా! అందుకని అక్కడి లాంగ్వేజ్ ఎక్కువగా మాట్లాడుతూంటారు" అన్నాడు సర్దిచెప్తూ.

ఇక ఆ గదిలో ఎంత ఎక్కువ మాట్లాడితే అంత ప్రమాదం అని అర్థమయిందతనికి.

"పదండి లాన్‌లో కూర్చుందాం" అన్నాడు.

ఆ మధ్యాహ్నం నుంచే టి.వి. చానెల్ వాళ్ళు పోటీలు పడి కొత్త హోమ్ మినిస్టర్ రాత్రుళ్ళు మారువేషాల్లో తిరిగి ఎన్నెన్ని దారుణాల గురించి తెలుసుకుంటున్నాడో డిటెక్టివ్ స్టోరీలాగా చూపించటం మొదలు





పెట్టారు. దాన్తోపాటు డి.జి.పి., కమిషనర్ కూడా తాము మారువేషాల్లో హోమ్ మినిస్టర్‌తో పాటు తిరగటం వల్ల చాలా చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలుసుకున్నామనీ వాటన్నిటినీ వెంటనే చెక్ చేస్తామనీ ఇంటర్వ్యూల్లో ఆనందంగా చెప్పారు. ఆ ప్రోగ్రామ్ చూసిన జనం కొంతమంది ఆశ్చర్యపోయారు. కొంత మంది నవ్వారు. ఇంకొంత మంది నవ్వుకున్నారు. చెవుల్లో పూలు పర్మనెంటుగా పెట్టుకున్న కేటగిరి వాళ్ళు హోమ్ మినిస్టర్ని అభినందిస్తూ టి.వి. చానెల్‌కీ, న్యూస్ పేపర్లకూ ఉత్తరాలు రాశారు.

"చూశారా సార్. మొదటి రోజు చాలా విజయవంతం అయింది. మీరు ఆ ఒక్క ట్రిక్‌తో రాష్ట్ర ప్రజలందరి దృష్టిలోకి వచ్చేశారు. చాలా సిన్సియర్, నిజాయితీ మినిస్టర్ అన్న పేరు వచ్చేసింది" అన్నాడు పాపారావ్.

"ఏమిటది?"

"మసి కోపరేటివ్ బాంక్ డిపాజిటర్ల బేజారు. బాంక్ దివాలా తీసిన వైనం"

"దానికి మనమేం చేస్తాం?"

"ఎవరూ ఏమీ చేయలేరని అందరికీ తెలుసు సార్! కానీ మనం ఏమయినా చేయగలం అన్న భ్రమ ప్రజలకు కల్పించాలి. వెంటనే రంగంలోకి దిగుదాం. వెంటనే మనం పోలీస్‌ని తీసుకుని ఆ బాంక్‌కెళ్దాం. అక్కడ గుమిగూడిన డిపాజిటర్లనుద్దేశించి మీరు బ్రహ్మాండంగా ప్రసంగించాలి! అక్కడ మీ స్పీచ్ ఎలా ఉండాలో నేను విప్లవ సినిమాలకు డైలాగులు రాసే రచయితతో రాయించుకొస్తానిప్పుడే"

గంగారామ్‌లో ఉత్సాహం పొంగుకొచ్చింది.

"డైరెక్ట్ యాక్షన్ అన్నమాట - అంతేనా?"

గంగారామ్‌కి అలా ప్రజల్ని మోసగించటం ఇష్టం లేకపోయినా ఆ పేరు సంపాదించటం సంతృప్తినిచ్చింది.

"ఇవాళ ఏం చేద్దాం?" అన్నాడు పాపారావ్‌తో.

"న్యూస్‌పేపర్స్ చూద్దాం సార్. వాటిల్లో ప్రజల తరపున నిలబడి ఎవరయినా ప్రజలకు అన్యాయం చేస్తే వెంటనే రంగంలోకి దూకుదాం! ఆ ప్రజల దగ్గరకు వెళ్ళి "మీరు ఒంటరి వాళ్ళు కాదు. మీకు తోడుగా నేనున్నాను. మా ప్రభుత్వం ఉంది" అని చెప్పాలి. బ్రహ్మాండమయిన పబ్లిసిటీ వచ్చేస్తుంది".

ఇద్దరూ చకచకా న్యూస్ పేపర్లు అన్నీ తిరగేశారు. గంగారామ్‌కి చిరాకేసుకొచ్చింది. పేపర్ విసిరి అవతల పారేశాడు.

"ఈ అన్యాయాల్ని మనమేం సరిజేస్తాం! మొత్తం అక్రమాలన్నీ ప్రభుత్వమే చేస్తోంది. న్యూస్ చూడు! వేసిన రోడ్ రెండో రోజునే మాయం. పెట్రోల్ బంకులు కల్తీ చేస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం - చేతులెత్తేసిన చిట్‌ఫండ్ కంపెనీ - మేమేం చేయలేమని చేతులెత్తేసిన పోలీసులు - ప్రభుత్వ భూమి కబ్జా - ఏమీ చేయలేకపోతున్న ప్రభుత్వం పెరిగిపోతున్న బియ్యం ధరలు. గోదాముల్లో కుళ్ళిపోతున్న బియ్యం నిల్వలు - కళ్ళు మూసుకున్న ప్రభుత్వం. అన్నీ ఇలాంటి వార్తలే"

పాపారావ్ నవ్వాడు.

"అవన్నీ మనం పట్టించుకోకూడదు సార్. ఇదిగో ఈ మూల ఈ న్యూస్ వేసారు చూడండి!"

"అంతే సార్. ఇలా రోడ్‌న పడి దగాపడిన ప్రజలకు సేవ చేస్తానని అవాకులూ చెవాకులూ వాగినందువల్ల ఇంకో ప్రయోజనం కూడా ఉంది సార్"

"ఏమిటది?"

"ముందు మనం ఆ బాంక్‌కి వెళ్ళే రోడ్లన్నీ పోలీసులు బ్లాక్ చేసేస్తారు సార్! ట్రాఫిక్ మొత్తం ఎక్కడికక్కడ ఆపేస్తారు. జనమంతా ఆఫీసులకూ, ఇతర పనులకూ వెళ్ళలేక గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతారు. దాంతో ఆటోమేటిగ్గా మీ పేరు అందరికీ తెలిసిపోతుంది. ఫలానా హోమ్ మినిస్టర్ వస్తున్నాడు అందుకని ట్రాఫిక్ మొత్తం ఆపేశారు అని. దాంతో మీ పబ్లిసిటీ ఇంకా పెరిగిపోతుంది. పైగా మనకు సైలట్‌గా వెళ్ళే పోలీస్ జీప్‌లు ఇంకా అద్భుతంగా మనకి పబ్లిసిటీ ఇస్తారు. రోడ్ మీద వెళ్ళే వాహనాల వాళ్ళందర్నీ 'అరేయ్ సాలే. స్కూటర్ పక్కకు పోనీరా బాడుకవ్. మినిష్టర్ సాబ్ వస్తుండని చెప్తుంటే నీక్కాదురా మాదచ్చోద్' అంటూ బండబూతులు తిడుతూ లాఠీలతో వాళ్ళ వీపుల మీద కొడుతూంటే మీ ఇమేజ్ వాడవాడలకూ పాకిపోతుందనుకోండి"

గంగారామ్ కొంచెం ఇబ్బందిగా మొఖం పెట్టాడు.

"కానీ రోడ్ మీద అర్జంటు పనుల మీద వెళ్ళే లక్షల మంది జనాన్ని కేవలం మన పవర్ చూపించటం కోసం, మన సెక్యూరిటీ అనే వంకతో గంటలకొద్దీ ఆపేయటం అన్యాయం పాపారావ్! మనిషి అనే వాడెవడూ చేయకూడదాపని"

"మన రాజకీయ నాయకులు మనుషులెలా అవుతారు సార్. భలే ఉన్నారే మీరు. మనం మనుషులకు ఎక్కువ - దేవుళ్ళకు తక్కువ. అదీ మన కేటగిరీ! అయినా ఇది ముఖ్యమంత్రి దగ్గర్నుంచీ అసెంబ్లీలో, శెక్రటేరియేట్‌లో ప్యూన్ వరకూ అందరూ సరదాగా చేసే పనే. మధ్యలో మీరు ఇదవుతారెందుకు?"

"కానీ అలా గంటల కొద్దీ ట్రాఫిక్ ఆపేస్తే - ఆ స్మోక్‌పొల్యూషన్‌లో - ఊపిరాడక లక్షలమంది జనం ఎలా ఫీలవుతారో నాకు తెలుసు పాపారావ్. కాలేజ్‌లో చదివే రోజుల్లో అలా నన్ను కూడా పోలీసులు ఆపినప్పుడు నేనేమేం తిట్లు తిట్టేవాడినో తెలుసా?"

"బాస్టర్డ్స్ దగుల్బాజీ ముండా కొడుకులు- నంగబాడుకవ్ సాలేగాళ్ళు. లుచ్చాలంజాకొడుకులు. ఇక్కడ ఇంత మందిని ఈ పొల్యూషన్‌లో ఆపి, ఎటూ కదలడానికి వీల్లేకుండా చేసి ఆనా కొడుకులు నిమషాల్లో ఎ.సి. కార్లల్లో వెళ్ళిపోతారా? వాళ్ళవయితే అర్జంటు పనులు మిగతావాళ్ళవి కావా? ఇదా ఈ సాలేగాళ్ళు ప్రజల కోసం చేసే సేవ" అని గట్టిగానే తిట్టేవాడిని. అక్కడ నిలబడ్డ వాళ్ళంతా కూడా ఇంచుమించుగా ఇవే తిట్లు తిట్టటం కూడా విన్నాను. అలాంటిది ఇప్పుడు నేనూ అదే పని చేస్తే - నన్నూ అందరూ అలాగే తిట్టుకుంటారుగా!" పాపారావ్‌కి వళ్ళు మండిపోయింది.

"ఈ తిట్టుకునే సాలేగాళ్ళెవరూ మనకి ఓట్లు వేయరు సార్. మనకనే కాదు. అసలు ఎవరికీ ఓటే వేయరు. వాడేం తిట్టుకుంటే మనకెందుకు?"

"కానీ ఈ పద్ధతి చాలా తప్పు పాపారావ్. హిట్లర్ లాంటి నియంతలు చేయాల్సిన దారుణాలుగానీ డెమొక్రసీలో ఇలా పోలీసుల్ని గూండాల్లాగా మినిష్టర్స్ కార్లకు పైలట్‌గా పంపి అడ్డమొచ్చిన వారందరినీ బండబూతులు తిట్టించటం - రోడ్డు దిగి వెళ్ళిపొమ్మని లాఠీతో కొట్టించటం - బుద్ధీ, జ్ఞానం, మానవత్వం ఉన్నవాళ్ళు చేయాల్సిన పని కాదు"

"సార్. అయామ్ వెరీ సారీ! బుద్ధీ, జ్ఞానం, మానవత్వం ఉంటే మనం ఇలా పబ్లిక్‌ని ఇబ్బంది పెట్టకూడదు అన్నమాట నిజమే! కానీ మనకు అవేమీ లేవని అనుకుంటే పోలా? ఇంక ఎవడేం మాట్లాడతాడు? అందుకని మీరలాంటి ఫీలింగ్సేమీ పెట్టుకోకుండా రడీ అవండి. ఈలోగా మిగతా ఏర్పాట్లన్నీ నేను 'చూస్తాను" అంటూ వెళ్ళిపోయాడు పాపారావ్.

మరికాసేపట్లో గంగారామ్ కాన్వాయ్ బయల్దేరింది మసి బాంక్‌కి!

మామూలుగానే గూండా పోలీసుల పైలట్ జీప్ రోడ్ మీద వెళ్తోన్న ప్రజలనుద్దేశించి బండబూతులు తిడుతూ, లాఠీలతో కొడుతూ.

"రోడ్ దిగరా సాలే. సైరన్ ఇనరావటం లేదురా బాడుకవ్! అరే స్కూటర్ బాడుకవ్. ఛల్ పక్కకు పో. ఏయ్ మారుతీకార్ వాలా. కండ్లు లేవా నీకు. మినిష్టర్ సాబొస్తుండోయ్. కారు పక్కకు తోలు. ఏడకెళ్ళి వస్తావ్రా నంగబాడుకవ్‌లు. అరే అంబాసిడర్. అరే భైరే. అరేయ్ అంధే. మాదచ్చోత్. పక్కకి తియ్యరా"

చాలాచోట్ల ట్రాఫిక్ మొత్తం ఆగిపోయి ఉండటం గమనించాడు గంగారామ్. ఆ ఆగినవాళ్ళందరూ తమ మంత్రులను ఏయే పదజాలంతో తిడతారో గుర్తుకొచ్చి సిగ్గుపడిపోయాడు. కాసేపట్లో మసి బాంక్ దగ్గరకొచ్చి ఆగినయ్ కార్లు. బాంక్ మూసేసి ఉంది. డిపాజిటర్లు అంతా గుమికూడి ఉన్నారు బాంక్ ముందు. గంగారామ్‌ని చూడగానే నినాదాలు చేస్తూ చుట్టుముట్టారు.

"సోదరులారా! ఈ రాష్ట్రంలో ఎవరు ప్రజల్ని మోసగించినా, ఎవరు ప్రజల డబ్బు దుర్వినియోగం చేసినా, ఎవరు ప్రజల డబ్బుతో అవినీతికి పాల్పడినా వాళ్ళు అంతు చూస్తానని నేను మీకు వాగ్దానం చేస్తున్నాను. ఈ బాంక్ ఛైర్మన్, డైరక్టర్లు ఎంత పెద్దవాళ్ళయినా - వాళ్ళందరినీ సాయంత్రం లోపల కటకటాల్లోపల వేస్తానని కూడా మీకు మాట ఇస్తున్నాను. బాంక్‌కీ, బాంక్ మేనేజ్‌మెంట్‌కీ చెందిన స్థిరాస్థులూ, చరాస్థులూ అన్నీ జప్తు చేసి డిపాజిటర్ల డబ్బంతా కూడా తిరిగి ఇప్పిస్తానని ఇక్కడే ప్రతిజ్ఞ చేస్తున్నాను" అంటూ సినీరైటర్ రాసిన డైలాగులు అన్నీ చదివేసరికి అంతా చప్పట్లు కొట్టేశారు.

వెంటనే కార్లన్నీ మళ్ళీ శెక్రటేరియేట్‌కి చేరుకున్నయ్. డిజిపి, కమిషనర్ ఆయన కోసమే ఎదురుచూస్తున్నారు.

"మీరు మసి బాంక్ దగ్గర ప్రజలకు చేసిన వాగ్దానాలన్నీ టి.వి. ఛానెల్ ద్వారా విన్నాం, చూశాం సార్. చాలా థ్రిల్లింగ్ స్పీచ్ ఇచ్చారు. అసలు మీరే హోమ్ మినిస్టరుగా కంటిన్యూ అయితే బాగుండేదని మా పోలీస్ అధికారులందరికీ అనిపించింది. ఎందుకంటే మా మీద వచ్చే మినిష్టర్ల అవినీతి పరులవటంతో మేమూ మాకిష్టం లేకపోయినా చాలా అవినీతి పనులకు పాల్పడాల్సి వస్తోంది. ఇప్పుడు నిప్పులాంటి మీరు ఉన్నారు కాబట్టి కనీసం ఈ కొద్ది రోజులయినా నీతిగా నిజాయితీగా పని చేసి అప్రదిష్టపాలయిన మన డిపార్ట్‌మెంట్ పేరుని తిరిగి నిలబెడతాం సార్" ఆవేశంగా అన్నాడు డి.జి.పి.

గంగారామ్ ఆనందంతో పొంగిపోయాడు.

"నాకు తెలుసు! యధారాజా తథా ప్రజా అని. మినిష్టర్ ఎలా వుంటే పోలీసులూ అలానే ఉంటారు. నేను ఈ పదవిలో ఉన్న ఈ కొద్ది రోజుల్లోపలే ఈ 'మసి' బాంక్ వ్యవహారం తేలిపోవాలి. 24 గంటల్లోపల ఆ బాంక్ ఛైర్మన్నీ, డైరక్టర్స్నీ అందర్నీ అరెస్ట్ చేయాల్సిందే. వాళ్ళెంత పెద్ద వాళ్ళయినా సరే. ఏ పార్టీకి చెందిన వారయినా సరే. ఆఖరికి ముఖ్యమంత్రి జోక్యం చేసుకున్నా సరే. నేను మాత్రం వాళ్ళని వదిలిపెట్టేది లేదు"

"ఓకేసార్. మీరు 24 గంటలన్నారు. మేము సాయంత్రం లోపలే అరెస్ట్ చేసేస్తాం సార్" అనేసి వెళ్ళిపోయారు వాళ్ళు.

సాయంత్రం ఆరింటికి గంగారామ్ డి.జి.పి.కి ఫోన్ చేశాడు.

"ఏమయింది? మసి బాంక్ వాళ్ళను అరెస్ట్ చేశారా?"

"ఇంకెక్కడ అరెస్ట్ సార్. దాని ఛైర్మన్ మారేడు కాయల్రావ్ అమెరికా పారిపోయాడు" గంగారామ్ స్టన్ అయ్యాడు. వెంటనే సిబి సిఐడి ఆఫీస్‌కి ఫోన్ చేశాడు.

"ఆ మసి బాంక్ ఛైర్మన్ అమెరికా పారిపోయాడంటున్నారు. వెంటనే అమెరికాలో ఎక్కడున్నాడో ఇన్‌ఫర్మేషన్ తీసుకోండి!"

"ఆయన అమెరికా వెళ్ళారని ఎవరు చెప్పారు సార్?" అడిగాడతను.

"డి.జి.పి. గారే స్వయంగా చెప్పారు"

అతను పగలబడి నవ్వాడు.

"మీకు చెవులో పువ్వు పెట్టాడు సార్"

"What nonsense you are speaking?"

"ఆ ఛైర్మన్ మారేడు కాయల్రావ్‌ని ఇందాక డి.జి.పి.గారే స్వయంగా ఎక్కడికో తీసుకెళ్ళి దాచేసి వచ్చారు సార్"

గంగారామ్‌కి నోట మాట రాలేదు.

(ఇంకావుంది)

మీ ఇంటి వద్దే విజయవిహారం చందా చెల్లించవచ్చు!, పాత కాపీలను పొందవచ్చు- ఫోన్ చేయాల్సిన నంబర్ : 7007053, సెల్ నెం.9848019076

# పసిపిల్లలపైన





పిల్లలంతా అరవైఏళ్ల ఆ పెద్దాయనను ప్రేమగా 'తాతగారు' అని పిలుచుకుంటారు. ఆ పిల్లలు నా అన్నవారెవ్వరూలేని అనాథలు, అభాగ్యులు. వీధులపాలైన ఇటువంటి పిల్లలంతా ఒకనీడ దొరికినందుకు ఎంతో సంబరపడ్డారు. ఆ సంబరం ఎంతో కాలం నిలవ లేదు. నీడయితే దొరికింది కానీ తాతగారినుంచి ఊహించని కొత్త పీడ తయారయింది.

విశాఖపట్టణంలోని 'న్యూహోప్' అనాథ శరణాలయాన్ని పర్యవేక్షించే, పర్వీరాజ్ అనే ఆ ముసలాడితో పిల్లలు ప్రేమగా వున్నారు .కానీ, తాతగారు మాత్రం పిల్లల్ని కామించారు. నోరూవాయీ లేని మూగపిల్లలు, కనుచూపు కరువైన అంధబాలలతో సహా అనేకమంది పిల్లల్ని కన్నుకానని కామంతో కాటేశాడు. 'తాతగారి' హేయమైన చర్యల్ని పిల్లలు తట్టుకోలేక చివరికి ఆయన నిజస్వరూపాన్ని బయట పెట్టారు. ఆ విధంగా ఆ వృద్ధుడి పాపం బద్దలై బయటి ప్రపంచానికి తెలిసింది.

**మౌనం మరింత ప్రమాదకరమైనది. అవకాశం చూసుకుని పిల్లల అసహాయతను ఆసరాగా చేసుకుని, విశాఖపట్నం 'తాతగారి' లాగా మృగాలవుతున్న పెద్దలు ఎందరో! హేయమైన లైంగికచర్యల పాలిటపడి కక్కలేని, మింగలేని దుఃఖాన్ని దిగమింగుతున్న పిల్లలు మరెందరో! సమాజం కూడా మౌనాన్ని ఆశ్రయిస్తున్నకారణంగా సమస్య మరింత ఉధృతం అవుతున్నది. మనుషుల్లోని వికారాలకు, టూరిజం, దారిద్ర్యం వంటివి మరింత ఆజ్యం పోస్తున్నాయి. ఇక ఇంటర్నెట్ చైల్డ్‌పోర్న్‌తో మరింతగా కలుషితం చేస్తున్నది. ఈ మొత్తం ప్రమాదం నుంచి పిల్లల్ని కాపాడుకోవాలంటే ముందు మౌనాన్ని వీడాలి.**

పర్వీరాజ్ అలియాస్ తాతగారు ఒక పిడోఫిల్!

భారతీయభాషల్లో ఈ మాటకి సమానార్థకాన్ని ఇచ్చే పదం కాగడా పెట్టి వెతికినా కనిపించదు. పిడోఫిల్ అంటే అర్థం - 'చిన్నపిల్లలతో లైంగికచర్యలుచేసే వికృత మనస్కుడు' అని. పీడోఫిలియా తరహా నేరం ఒకటి ఇంత పెద్ద ఎత్తున బయటపడటం రాష్ట్రంలో బహుశా ఇదే ప్రథమం.



బాలుడిపై అత్యాచారానికి పాల్పడ్డ డాక్టర్‌పై రెండు కేసులు

కన్నకూతురిపై తండ్రి అత్యాచారం

కూతుళ్లపై తండ్రి అత్యాచారం

పధ్నాలుగేళ్లకే బిడ్డకు జన్మనిచ్చిన విద్యార్థిని!

కూతురిపై తండ్రి అత్యాచారం

మూడేళ్ళ పసిపాపపై అత్యాచారం

బాలికపై అత్యాచారయత్నం

పదేళ్ల బాలికపై అత్యాచారం

వ్యథలకు విలయం ఈ అనాథ శరణాలయం

ఈ మధ్యకాలంలో ఇటువంటి వార్తలెన్నో!

కానీ గోవాలో ఇటువంటి తాతగారి ఉదాహరణే మరొకటి వుంది. అది సరిగ్గా పదేళ్లకిందట 1991లో జరిగింది. గోవాలో ఒక అనాథాశ్రమాన్ని నడిపే ఫాదర్ ఫ్రెడ్డీపీట్ తెల్లగడ్డంతో కనిపిస్తాడు. ముఖాన ఎప్పుడూ చిరునవ్వు వెలుగుతుంది. ఫాదర్‌ను పిల్లలంతా 'శాంతాక్లజ్' అని ప్రేమగా పిలుచుకునేవారు. ఒకరోజున బాధితుడైన ఒక పిల్లవాడి పుణ్యమాఅని ఫాదర్ గుట్టు రట్టయ్యింది. పోలీసులు ఆయనఇంటిని సోదాచేస్తే, మాదక ద్రవ్యాలతోపాటుగా, 2305ఫోటోలు దొరికాయి. పిల్లలను బలవంతంగా లైంగికచర్యల్లోకి దించి తీసిన ఫోటోలు అవి. వెంటనే ఫాదర్ పీట్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఐదేళ్ల తర్వాత ఫాదర్‌కి యావజ్జీవశిక్ష పడింది. పీట్ ఆ ఫోటోలన్నింటిని ఇంటర్నెట్‌కి, చైల్డ్‌పోర్న్‌గ్రూపులకి అందించేవాడు.

పోయినేడాది డిసెంబర్‌లో ముంబాయి సమీపంలోని ఒక రిసార్ట్‌లో ఒక విదేశీ జంట, ఇద్దరు మైనర్ బాలికల దుస్తులు తొలగించి ఫోటోలు తీస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల పరిశోధనలో ఆ జంట అనేకమంది చిన్న పిల్లలను నగ్నంగా ఫోటోలు తీసి ఇంటర్నెట్‌కి సరఫరా చేసినట్టు వెల్లడైంది.

బయటి ప్రపంచానికి వెల్లడైన ఈ మూడు కేసులలోనూ నిందితులు విదేశీయులే అన్నది గమనించాలి. ముందే చెప్పుకున్నట్టు - పీడోఫిలియా అనేది పాశ్చాత్యులలోని కొంతమందిలో ప్రబలంగా కనిపించే వికృతధోరణి. మనదేశంలో కూడా ముంబయ్, గోవా, బెంగుళూరు లాంటి నగరాలలో పాశ్చాత్యదేశాల టూరిస్టులు ఇటువంటి హేయమైన కార్యకలాపాలకు పాల్పడుతున్న సంఘటనలు క్రమంగా పెరుగుతున్నాయి.

పీడోఫిల్ అనేమాట పాశ్చాత్యపదమూ, పాశ్చాత్య ధోరణే కావొచ్చు. అంత విశృంఖలంగానూ ఇక్కడి పరిస్థితి లేకపోవచ్చు. కానీ పిల్లలమీద లైంగిక అత్యాచారాలు (చైల్డ్ సెక్సువల్ ఎబ్యూజ్) తక్కువేమీ కాదు. అవకాశం చూసుకుని, పిల్లల అసహాయతను ఆసరాగా తీసుకుని అప్పటికప్పుడు మృగాలుగా మారే మనుషులు ఎందరో



ఉన్నారు. కాకపోతే ఇటువంటి అత్యాచారాల గురించి అందరూ మౌనాన్ని ఆశ్రయిస్తారు. మన సమాజపు విలువలే ఈ మౌనానికి కారణం. అత్యాచారం గురించి బయటి ప్రపంచానికి తెలిస్తే, నిందితులకు పోయేదేమీ లేదని, బాధితులకు మాత్రమే అది జీవితాంతం మచ్చలాగా మిగులుతుందని భావించే సమాజం మనది. అందుకే ఆ విషయాలను ఎక్కడికక్కడే కప్పిపెట్టేస్తారు. ఈ మౌనం వల్ల సమస్య సమసిపోదు, మరింతగా పెరుగుతుంది. అందుకే చేదుగా, గరళంలాగా వున్నప్పటికీ, సమస్య తీవ్రతను అర్థం చేసుకోవటానికి కొన్ని సంఘటనలను ప్రస్తావించక తప్పదు. పిల్లల మానసిక వికాసాన్ని, భవిష్యత్తును నాశనం చేసే సెక్సువల్ ఎబ్యూజ్ గురించి చర్చించటం అవసరమే. మిగతా ప్రపంచపు వికారాలను అసహ్యించుకునే ముందు మన మేడిపండు సమాజం పొట్టవిప్పి చూసుకోవాలి.

## కంచే చేను మేస్తే...

కొన్నాళ్ల కిందట... స్త్రీల సమస్యలమీద పనిచేసే ఒక స్వచ్ఛంద సంస్థ హైదరాబాదులో ఒక వర్క్‌షాపు నడిపింది. ఆడ పిల్లలు, యువతులు బయటికి వెళ్లినప్పుడు - ఈవ్ టీజింగ్‌లాంటి సమస్యలను ఎలా ఎదుర్కోవాలనేది ఆరోజు సబ్జెక్టు.

సంస్థ కార్యకర్తలు వర్క్‌షాపుకి హాజరైన సాధారణ స్త్రీలలో ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్నీ పెంచే మాటలు చెబుతున్నారు. ఈలోగా శ్రోతల్లోనుంచి సన్నగా ఏడుపు వినిపించింది. నిర్వాహకులతోపాటు, అందరి దృష్టీ అటు మళ్లింది. చూస్తే పదిహేనేళ్లమ్మాయి వెక్కివెక్కి ఏడుస్తోంది. వర్క్‌షాపు నిర్వాహకులు ఆమె దగ్గరకు వెళ్లి 'ఏం జరిగిందమ్మా?' అంటూ అనునయంగా అడిగారు. వారు కదిలించిన మరుక్షణం పెద్దగా భోరుమని ఏడ్చేసిందా అమ్మాయి. "మీరెంతసేపూ బయటకెళ్లి నప్పుడు మగాళ్లవల్ల వచ్చే ఇబ్బందులను గురించి చెబుతున్నారు. ఇంట్లో మగాళ్లే అన్యాయం చేస్తే ఏం చెయ్యాలి? ఎవరికి చెప్పుకోవాలి?" అంటూ వెక్కిళ్ల మధ్య చున్నీతో ముక్కుతుడుచుకుంటూ అడిగింది.

అప్పటికి రెండుమూడేళ్లుగా సొంత ఇంట్లోనే, ఒక కుటుంబసభ్యుడి కామానికి బలైపోతున్నదా అమ్మాయి. ఆ కామపిశాచి ఎవరో కాదు కన్న తండ్రే.

ఈ దారుణం తెలిసి ఆ 'తండ్రి'ని నిలదీసిన తల్లికి తన్నులూ, దెబ్బలూ, ఏడుపులూ మిగిలాయి. తాగొచ్చి ఇంటిలో నరకం చూపించే - ఆ భర్త ముందు, ఆ తండ్రి ముందు, తల్లీ కూతుళ్లిద్దరూ నిస్సహాయులు... ఇదంతా విని షాక్ తిన్న సంస్థ కార్యకర్తలు ఆ అమ్మాయిని హాస్టల్లో చేర్పించటం ద్వారా తండ్రి చెర నుంచి తప్పించగలిగారు.

## తెలిసినవారితోనే డేంజర్

తెలియని వ్యక్తులతో పోల్చితే, పిల్లల్ని- తెలిసినవారు, కుటుంబసభ్యులు, దగ్గరిబంధువులూ కామంతో కాటేస్తున్న సంఘటనలే ఎక్కువ. ఇంటి నాలుగ్గోడల మధ్య జరిగే ఇటువంటి అత్యాచారాలు పిల్లల లేత గుండెల్లోనే సమాధి అవుతాయి. అవకాశాన్నీ, పిల్లల అసహాయతనీ ఆసరాగా తీసుకుని లైంగిక వేధింపులకు (సెక్సువల్ ఎబ్యూజ్) ఒడిగట్టేవారిలో- తండ్రులతోపాటు, సోదరులు, మామలు, బాబాయిలు, చివరికి తాతలూ కూడా వుంటారంటే ఆశ్చర్యపోనవసరం లేదు.

మొత్తమ్మీద పిల్లలపై (మగపిల్లలతో సహా) లైంగిక అత్యాచారాలకి పాల్పడే వారిలో 80 శాతం తెలిసినవారే అయ్యుంటారు. పిల్లలకు బిస్కెట్లో, చాక్‌లెట్లో, మరొక



తాయిలమో ఆశచూపి, మంచిమాటలు చెప్పి లొంగదీసుకుంటారు. పొరుగింటి అంకుల్స్, పనివాళ్లు, టీచర్లు, డాక్టర్లు - పిల్లలతోనూ కుటుంబంతోనూ బాగా పరిచయముండే ఇటువంటి వారితోనే ప్రమాదం. దళిత,గిరిజన వర్గాలకు చెందిన ఆడపిల్లల మీద టీచర్లు, వార్డెన్లు చేసే అత్యాచారాల వార్తలు తరచూ పత్రికల్లో కనిపిస్తూనే వున్నాయి. తమనుతాము దైవాంశ సంభూతులుగా చెప్పుకునే బాబాలు, స్వాముల మీద కూడా చిన్నపిల్లలను తమ కామదాహానికి బలి చేస్తున్నట్టు ప్రపంచవ్యాప్తంగా ఆరోపణలు వస్తున్నాయి. సమాజంలో ఉన్నతమైన బాధ్యతాయుతమైన స్థానాల్లో ఉన్నవారు కూడా ఇటువంటి నేరాలకు పాల్పడుతున్నారు. దీనికి ఉదాహరణగా, ఈమధ్యకాలంలో ఏకంగా ఒక మంత్రివర్యుడే ఒకమైనర్ బాలికపై అత్యాచారానికి

## డి.ఎన్.ఎ. టెస్ట్‌కి దొరికిపోయిన అస్సాం మంత్రి

రాజేంద్ర ముషాహరి అల్లాటప్పా మనిషేమీ కాదు. అస్సాం రాష్ట్ర మంత్రి. అటువంటి బాధ్యతాయుతమైన హోదాలో వున్న ముషాహరిపైన, మోనిలా అనే ఒక మైనర్ బాలికను అత్యాచారం చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. అయన ఆ ఆరోపణల్ని కొట్టిపారేశాడు. తనను రాజకీయంగా దెబ్బతీయడానికి పన్నిన రాజకీయ కుట్ర అని కూడా అన్నాడు. చివరికి డి.ఎన్.ఏ పరీక్షల పుణ్యమా అని ముషాహరి నేరం రుజువైంది. మోనిలాకి పుట్టిన బిడ్డ ముషాహరి బిడ్డేనని తేలింది.

గత ఏడాది ఫిబ్రవరి 27న, మార్చి1న మోనిలాను ముషాహరి ఒక హోటల్‌లో అత్యాచారం చేశాడు. అతడు మంత్రి కావటంతో, ఆ బాలికకు ఏం చేయాలో , ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక కొన్నాళ్లు సతమతమైపోయింది. కొన్నాళ్లకి తాను గర్భం దాల్చినట్టు తెలుసుకుందామె. గత ఏడాది సెప్టెంబరు 9న పోలీసుస్టేషన్‌లో మంత్రిపై ఫిర్యాదు చేసింది. పోలీసులు యథావిధిగానే పట్టించుకోలేదు. దీంతో ఒక మహిళా సేవాసంస్థ రంగంలోకి దిగి, అస్సాం మానవహక్కుల కమిషన్‌కి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు జాతీయ మానవహక్కుల సంఘం అస్సాం ప్రభుత్వాన్ని నిలదీయడంతో ముషాహరి తన పదవికి రాజీనామా ఇచ్చాడు.

మోనిలా గత ఏడాది అక్టోబరు 24న మగపిల్లవాడికి జన్మనిచ్చింది. ముషాహరి మళ్లీ పాతపాటే పాడాడు.



బిడ్డతో మోనీలా, ముషాహరి (ఇన్‌సెట్‌లో)

మోనిలాతో, ఆమె బిడ్డతో తనకేమీ సంబంధం లేదన్నాడు. డి.ఎన్.ఏ పరీక్షకు కూడా సిద్ధమేనన్నాడు. ఆ ముగ్గురి నుంచి సేకరించిన రక్తం శాంపిల్స్‌ను హైదరాబాద్‌లోని 'సెంటర్ ఫర్ డి.ఎన్.ఏ ఫింగర్‌ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్' కు పంపించారు. పరీక్షలో ఆ బిడ్డకు తండ్రి ముషాహరేనని తేలింది. దీంతో ఆగస్టు 5న రాజేంద్ర ముషాహరిని ఐ.పి.సి 376, 109, 506 సెక్షన్‌లకింద అరెస్టు చేశారు.

### నేరస్తులు తప్పించుకోలేరు :

అత్యాచారాలకు పాల్పడిన నేరస్తులు ఎవరూ ఇకపై తప్పించుకునే వీలు లేకుండా డి.ఎన్.ఏ టెస్టులు అందుబాటులోకి వచ్చాయి. దీని గురించి రాష్ట్ర ఫోరెన్సిక్‌సైన్స్ లాబరేటరీ డైరెక్టర్ కె.పి.సి. గాంధీ ఇలా అంటున్నారు- ' అత్యాచార సమయంలో నేరస్తుడి శరీరానికి సంబంధించిన వీర్యకణాలు, రోమాలు, ఎండిపోయిన రక్తపుమరకలు, వేలిముద్రలు నుంచి డి.ఎన్.ఏను సేకరించి నేరస్తుడిని కచ్చితంగా గుర్తించవచ్చు. అయితే అత్యాచారం జరిగిన వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు సంఘటనా స్థలంలోని ఆధారాలను చాలా జాగ్రత్తగా పరీక్షకు పంపాలి. ఈ పరీక్షల ఆధారంగా ఇప్పటికి అనేక కేసుల్లోని దోషులను శిక్షించగలిగారు. ఇందుకు తాజా ఉదాహరణే అస్సాం మంత్రి కేసు'●

- అనంచిన్ని వెంకటేశ్వరరావు

ఒడిగట్టిన సంఘటన వెలుగులోకి వచ్చింది (బాక్స్ఐటమ్ చూడండి).

ఈ అత్యాచారాలను పిల్లలవైపునుంచి చూస్తే - తెలిసీ తెలియని వయసులో తమకు జరిగిందేమిటో అర్థంచేసుకోలేరు. పైగా తెలిసిన వారు, బాగా కావలసినవారు తమకు చెడు చేస్తారని ఊహించలేరు. జరిగినదాన్ని పెద్దవారికి చెప్పనూ లేరు. దానికి తమను తప్పు పడతారేమోనన్న భయం వుండనే వుంటుంది.

అదీకాక అత్యాచారం చేసినవారు బెదిరించటం వల్లో, వారికి తమ కుటుంబం దృష్టిలో ఒక విలువ వుండటం

# పశుకామం



వల్లో- బాధితులు భయంతో నోరు విప్పలేరు. ఒకవేళ పెద్దవారికి తెలిసినా 'పరువు మర్యాద'ల కారణంగా అది సద్దుమణిగిపోతుంది. ఇక ఇంట్లోవాళ్లే అత్యాచారానికి పాల్పడితే అది 'కుటుంబ వ్యవహారం' కింద మాటుమణిగిపోతుంది.

## ఏనాడోజరిగినదానికి..

కథ అక్కడితో ముగిసిపోతే ఫర్వాలేదు కానీ ముగియదు. లైంగిక అత్యాచారాల బారినపడిన పిల్లలు యవ్వన దశలోకి వచ్చిన తర్వాత వేరే సమస్యలు మొదలవుతాయి. "చిన్నతనంలో జరిగిన అత్యాచారం మరీ ముఖ్యంగా ఆడపిల్లల్లో పెద్దయ్యాక తీవ్రమైన ప్రభావం చూపుతుంది. ఆ తప్పు తమ కారణంగానే జరిగిందని, కన్యాత్వం పోయిందని, తీవ్రమైన అపరాధభావానికి, డిప్రెషన్‌కి లోనవుతారు. ఫ్రిజిడిటీ లాంటి సమస్యలూ తలెత్తుతాయి. దీనివల్ల వారు సంసారజీవితంలో సుఖాన్ని పొందలేక కాపురాలు దెబ్బతినే పరిస్థితి కూడా వస్తుంది" అని హైదరాబాద్‌కు చెందిన సైకియాట్రిస్టు డా॥ మధుసూదన్ జోషి చెబుతున్నారు.

అత్యాచారానికి పాల్పడిన వ్యక్తి హాయిగానే వుంటాడు. బాధితులు మాత్రం జీవితాంతం తామేదో తప్పు చేశామన్న భావనతో కుంగిపోతూ వుంటారు. ఎవరికీ చెప్పుకోలేక, ఎవరితోను పంచుకోలేక మానసికంగా కల్లోలమవుతారు.

## 'చేదు తాయిలం'

ఈ మధ్య ముంబయ్ జర్నలిస్టు, రచయిత్రి పింకీ విరానీ పిల్లలమీద లైంగిక వేధింపులకి సంబంధించి 'బిట్టర్ చాకొలెట్' అనే పుస్తకం రాసింది. చిన్నప్పుడు సమీపబంధువు చేతిలో వేధింపులకి గురైంది పింకీ. ఇది తండ్రికి తెలిసినా ఆర్థిక పరిస్థితుల కారణంగా ,ఆ బంధువుల మీదే ఆధారపడిన కారణంగా అసహాయుడిగా మిగిలిపోయాడు. దీనితోపాటు, కుటుంబసభ్యుల తాగుడు లాంటి దుర్వ్యసనాల కారణంగా పింకీకి బాల్యమంతా అశాంతిగా గడిచింది. ఈ వాతావరణం పింకీ మీద తీవ్రమైన దుష్ప్రభావం చూపింది. పదేళ్ల వయసుకే పొగతాగడం, చెడు స్నేహాలు చేయడం- ఇలా తన అసహనాన్నీ, కోపాన్నీ వ్యక్తపరుచుకునేది. (కాస్త పెద్దయిన తర్వాత తెలుసుకుని ఆ దురలవాట్లను మానుకుంది).ఇటీవల మళ్లీ చిన్ననాటి చేదు అనుభవం పింకీ హృదయాన్ని కుదిపివేసింది. ఆనాటి నుంచి

గుండెల్లో పేరుకుపోయిన అపరాధ భావం పెరిగి పెరిగి ఎవరికైనా చెప్పుకుంటేనో, రాసుకుంటేనో తప్ప బయటపడలేని మానసిక స్థితిలో పడిపోయింది. తన ఒక్కదానికే కాదనీ, అనేక మంది స్త్రీలకు, పురుషులకు కూడా బాల్యంలో ఇటువంటి చేదు జ్ఞాపకాలు ఉన్నాయని తెలుసుకుంది. చైల్డ్ సెక్సువల్ ఎబ్యూజ్ గురించి అనేక సంఘటనల్ని, సమాచారాన్ని సేకరించి 'బిట్టర్ చాకొలెట్' ('చేదు తాయిలం')అనే పుస్తకాన్ని రాసింది. ఈ అంశమ్మీద భారతదేశంలో ఇదే తొలి పుస్తకం. మనది సంప్రదాయ సమాజం కావడంతో పుస్తకం సహజంగానే సంచలనమైంది. ఆ పుస్తకంలో ఇచ్చిన గణాంకాలు, ఉదాహరణలు మనసును కల్లోల భరితం చేస్తాయి.

## మగపిల్లల పైనా....

కానీ, వాస్తవంలో ఆ స్థాయిలో చైల్డ్ ఎబ్యూజ్ వుందా...? ఇదే ప్రశ్న స్త్రీల సమస్యల మీద పనిచేసే ఒక మహిళను అడిగితే - "నూటికి తొంభై శాతం ఆడపిల్లలకి, ఏదో ఒక రకమైన ఎబ్యూజ్‌కి గురయ్యే నిస్సహాయ పరిస్థితులు ఎదురవుతాయి" అని చెప్పారు.

ఆడపిల్లల స్థాయిలో కాకపోయినా, తక్కువగానైనా మగపిల్లలు కూడా లైంగికవేధింపులకి గురవుతుంటారు. చిన్నతనంలో

విశాఖపట్నంలో

## 'తాతగారి' కామానికి బలైన వీధిబాలలు

దుర్మార్గం పెరిగి పెరిగి మేరువంతగా బలిసి యాధృచ్ఛికంగా పగిలితేనే, ఆ దుష్పరిణామాలపై చర్చిస్తాం, చర్యలు తీసుకుంటాం.

మనకు 'పోస్టుమార్టం'పై ఉన్న శ్రద్ధ పర్యవేక్షణ, పరిశీలన, నియంత్రణ, నివారణలపై లేకపోవడమే ఇందుకు కారణం.

అందుకనే విశాల భారత స్వప్నాలుగా వర్ణించే చిన్ని చిన్ని ఆశలు మొన్నగాక మొన్న సేవాసదనాల పేరిట ప్రైవేటు శిశువిక్రయశాలలకు 'సరుకు'గా సప్లయ్ అవుతున్నారని తెలిసి గబుక్కున నాలిక కరిచేసుకుని హడావుడి, హంగామా చేశాం. ఇదే వైఖరికి పర్యవసానంగా నేడు విశాఖలో వీధిబాలలను కామం రూపుకట్టిన 'వృద్ధ ద్విపాది' లైంగిక హింసల పంజరంలో బంధించాడు. 'న్యూ హోప్' అనాథ శరణాలయం మేనేజరయిన పర్వీరాజ్ అలియాస్ 'తాతగారు' ఎంతోకాలంగా సాగిస్తున్న ఈ దురాగతం, ఆగస్టు 24న బట్టబయలైంది.

యెన్నెవర్డినా అనే మహిళ స్మారకార్థం ఏర్పాటుచేసిన న్యూహోప్ హోం విశాఖనగరంలోని మధురవాడ ప్రాంతంలో వుంది. ఈ హోంలో వృద్ధులు, అంధబాలికలు, అనాధబాలికల కోసం పునరావాస కేంద్రాలు నడుపుతున్నారు. అలిజర్ రోజ్ దంపతులు నిర్వహిస్తున్న ఈ స్వచ్ఛంద సంస్థకి విజయనగరం, గజపతి నగరం, న్యూఢిల్లీ, ఒరిస్సాలలో బ్రాంచీలున్నాయి. విశాఖ మధురవాడలోని న్యూహోప్ లెప్రసీ రూరల్ ట్రస్ట్ వసతిగృహం మేనేజర్‌గా ఆస్ట్రేలియాలో పనిచేసిన 60 ఏళ్ల బాబుల్‌పాల్ ఎలియాస్ పర్వీరాజ్‌ను నియమించారు. ఈయన నగరంలోని ఆర్.కె.బీచ్ ప్రాంతంలో ఖరీదైన ఫ్లాట్‌లో నివాసముంటున్నాడు.

న్యూహోప్ హోంలో వృద్ధులు, అంధబాలికలు, వీధిబాలలు మొత్తం 70 మంది వరకు ఉన్నారు. రైల్వే ఫ్లాట్‌ఫారాలు, బస్ కాంప్లెక్సులు తదితర ప్రాంతాల్లో అనాధలుగా తిరుగుతున్న వీధిబాలలు దాదాపు 30 మందిని ఈ శరణాలయంలో చేర్పించారు. పర్వీరాజ్ ఈ బాలలను ఒక్కొక్కరిని ఇంటికి రప్పించుకుని క్రమంగా తన విలాసవంత జీవనాన్ని పరిచయం చేస్తూ, బ్లూ ఫిల్ములు చూపుతూ, లైంగిక చర్యలకు ప్రేరేపించేవాడు. తన కామవాంఛలను ఆ పిల్లల ద్వారా తీర్చుకునేవాడు. దీని గురించి ఆ పిల్లలు నోరు మెదపకుండా వారికి డబ్బు ఆశ చూపేవాడు, శరణాలయం నుంచి పంపేస్తామని బెదిరించేవాడు. ఈ సెక్స్‌హింసను భరించలేక ఒక అనాథ మూగబాలుడు హోం విడిచి వెళ్లిపోయాడు. హోం సందర్శనకు వచ్చిన ట్రస్ట్ డైరెక్టర్ అలిజర్‌రోజ్‌కు అనాధ బాలలందరూ పర్వీరాజ్ కామహింసను వివరించారు. విషయం తెలుసుకున్న పర్వీరాజ్ పరారయ్యాడు.

పర్వీరాజ్ ఉదంతం తెలుసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి ఒరిస్సా రాష్ట్రం మునిగడలో అరెస్టు చేశారు. నిందితుడిని పూరీ తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో తీసుకువస్తుండగా విజయనగరం స్టేషన్‌లో - రైలు బయలుదేరుతుండగా పర్వీరాజ్ పోలీసులను ఏమార్చి పరారయ్యాడు. పర్యవసానంగా ఒక ఎస్.ఐ సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఇద్దరు కాని స్టేబుళ్లు శాఖాపరమైన చర్యలను ఎదుర్కొంటున్నారు. న్యూహోప్ డైరెక్టర్ అలిజర్ రోజ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పర్వీరాజ్ ఇంటి నుంచి బ్లూఫిల్మ్ క్యాసెట్లు, సి.డి.లు స్వాధీనపరచుకున్నారు. అనుమతి లేకుండా దేశంలో నివసించటం, బాలలపై లైంగికవేధింపులు , పోలీసు కస్టడీ నుంచి పరారవడం వంటి నేరాలపై కేసులు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట నిలబెట్టడంలో పోలీసులు కృతకృత్యులయ్యారు.



పర్వీరాజ్ అరెస్టు దృశ్యం

ఇకపైన పర్వీరాజపై, ఆ సంస్థపై కేసు నడుస్తుంది. ఒకనాటికి తీర్పు కూడా వస్తుంది. కథ కంచికి మనం ఇంటికి అన్నతీరులో ఇంతటి దారుణకాండను మనం మరపు చాటున కాలం మాటున 'టేకిట్‌ఈజీ'గా గతంలో కలిపేస్తాం.

అందుకే ఈ రకమైన దారుణాలు పునరావృతమవుతూ వుంటాయి. న్యూహోప్ శరణాలయంలా ఎన్ని సంస్థల్లో ఎన్ని రకాల హింసలు, అవినీతి అక్రమాలు జరుగుతున్నాయో సభ్యసమాజానికి ఇప్పట్లో తెలియనే తెలియదు. ఎందుకంటే ఈ రకమైన నియంత్రణకు తగ్గ విధి విధానాలు , నిబంధనలు మనం నేటికీ ఏర్పరుచుకోలేదు. యాధృచ్ఛికంగా ఏదైనా నేరం వెల్లడైతే ఆవేశంగా స్పందించడం తప్ప, ఈ రకమైన సంస్థల పనితీరు, వాటికి విదేశాల నుంచి వస్తున్న నిధుల 'లక్ష్యం'. ఈ సంస్థల నిర్వాహకుల పూర్వాపరాలు తదితర వివరాలు ప్రభుత్వశాఖల ఎదుట ఉండాల్సి ఉంది.

శరణాలయాలకు తెస్తున్న అనాధల వివరాలు, వారిని తెచ్చిన తీరు, వారిని సాకుతున్న తీరుపై నిరంతర పర్యవేక్షణ వుండాలి. విదేశీయులు తగిన అనుమతి పత్రాలు లేకుండా దశాబ్దాల తరబడి ఎలా వుంటున్నారు - అన్న ప్రశ్నకు అధికారిక సమాధానాలు అవసరం. సేవాసంస్థల నిర్వాహకుల పట్ల గౌరవంతో పాటు కాస్తంత పర్యవేక్షణ కూడా అవసరమే. లేకుంటే దేశంలోని రాష్ట్రంలోని పేదలు, అనాధలు, వికలాంగులు, వృద్ధులకు వేధింపులు- విధినిర్వహణలో వున్న పోలీసు, పౌర అధికారులకు సస్పెన్షన్లు, శాఖాపరమైన చర్యలు తప్పవు. స్వచ్ఛందసంస్థల పారదర్శకత నిరూపణ తప్పనిసరి కావాలని ప్రాథమికంగా గుర్తించాలి. ఈ మేరకు చట్టసభలు కూడా క్రియాత్మకంగా స్పందించాల్సి వుంది●

- ఎం.డి. అబ్దుల్లా (విశాఖపట్నం నుంచి)

## 'వెబ్'చారంలోకి పిల్లలు

ఇంటర్నెట్ ప్రపంచాన్ని ఎంత దగ్గరకు చేర్చిందో తెలీదుగానీ- అక్కడక్కడా చెదురుమదురుగా వుండే ఫీడోఫిల్స్‌ను (చిన్న పిల్లలతో సెక్స్ చేయాలనుకునే వికృత మనస్కులు) మాత్రం ఒకటి చేయగలిగింది. వీరి కారణంగా చైల్డ్‌పోర్నోగ్రఫీ ప్రపంచమంతా ఆందోళన కలిగించే రీతిలో విస్తరిస్తున్నది. చిన్నపిల్లల నగ్నచిత్రాలు, బ్లూఫిల్మ్‌లు, వీడియోలు, బూతుసాహిత్యం ఇంటర్నెట్ ద్వారా తేలిగ్గా ఒకరికొకరు అందచేసుకుంటున్నారు. రోజురోజుకీ వీరి 'ఆకలి' పెరిగిపోతున్న కారణంగా - వీరి వాంఛలకు బలయ్యే పిల్లల సంఖ్య పెరుగుతూ పోతున్నది.

పిల్లల చుట్టూ 'నెట్' బిగుసుకుంటున్న తీరుకి - క్యాథీ గొప్ప ఉదాహరణ. 1995లో క్యాథీకి 13 ఏళ్ల వయసులో జరిగింది ఇది. మార్క్ అనే వ్యక్తితో ఆన్‌లైన్ స్నేహం చేసింది. అతడు క్యాథీలో నమ్మకం పెరిగాక, బయట కలుసుకునే ప్రతిపాదన చేశాడు. అంతకాలం స్నేహం ఉన్నప్పటికీ మనిషిని చూడటం అదే మొదటిసారి కావటంతో క్యాథీ చాలా ఆసక్తిగా వెళ్లింది. తీరా చూస్తే ఆ మార్క్ మార్క్ కాదు, అతడి పేరు ఫ్రాంక్. మార్క్ తప్పుకుని పీడోఫిల్ అయిన ఫ్రాంక్‌ను ప్రవేశపెట్టాడు. తన ఆన్‌లైన్ స్నేహితుడు ఏ ఇరవై ఏళ్ల చిల్లరవాడో అయ్యుంటాడని అనుకుంది. కానీ అతడి వయసు 40పైనే వుంది. ఫ్రాంక్ మార్క్‌ను ఉపయోగించుకుని కేథీని ఉచ్చులోకి లాగాడు. అతడ్ని కలవగానే అంతా తలకిందులుగా వుండటంతో తాను మోసానికి గురయినట్టు భావించింది. చివరికి అతడి చేతిలో రేప్‌కి గురయింది.

ఇలా ప్రపంచవ్యాపితంగా ఎందరో బాలబాలికలు పీడోఫిల్స్ చేతికి చిక్కుతున్నారు. అమెరికా లాంటి దేశాలలో సైబర్‌చట్టాలున్నప్పటికీ, చైల్డ్‌పోర్న్‌ను నిషేధించినప్పటికీ లెక్కలేనన్ని కొత్తసైట్లు పుట్టుకొస్తూనే ఉన్నాయి. అమెరికాలో 1998లో ఆన్‌లైన్ ఫీడోఫిల్ కేసులు 700 నమోదు కాగా, పోయినేడాదికి ఆ సంఖ్య దాదాపు 3000 వరకూ పెరిగింది. అమెరికాలో ఇటీవల జరిగిన ఒక సర్వే ప్రకారం - ప్రతి 33 మంది పిల్లలలో ఒకరికి చొప్పున, ఫలానాచోట కలవమన్న ఫోను సందేశం, రెగ్యులర్‌గా మెయిల్స్ రావటం, బహుమతులు రావటం జరుగుతున్నదని తేలింది. ఇక శ్రీలంక, థాయ్‌లాండ్, ఫిలిప్పీన్స్ లాంటి దేశాలలో టూరిజం పుణ్యమా అని ఫిడోఫిలియా ప్రమాదం తీవ్రంగా పెరుగుతున్నది.



ఇండియాకు కూడా ఈ ప్రమాదం ఇప్పుడిప్పుడు విస్తరిస్తున్నది. ఇప్పటికే గోవా, ముంబయ్, బెంగుళూరు వంటి టూరిస్టు ప్రాంతాలలో దీని ఉనికి కనిపిస్తున్నా, ఎవరూ సమస్య తీవ్రతను గుర్తించటం లేదు. పైగా 'ఇటువంటి నేరాలు పాశ్చాత్యదేశాలకు మాత్రమే పరిమితం. ఇండియాలో ఇటువంటి సంఘటనలు జరగవు' అని భావించేవారే ఎక్కువ. ఒక పోలీసు అధికారి మాత్రం 'ఇటువంటి కేసులలో మన సమాజం మౌనంగా వుంటుంది. ఈ మౌనం సమస్య మరింత ఉధృతమవటానికి కారణమవుతుంది. ' అని అంటున్నారు.

1991లో గోవాలో అరెస్టయిన ఫాదర్ పీట్‌ది చైల్డ్‌పోర్న్‌కి సంబంధించిన మొదటికేసుగా చెప్పుకోవచ్చు. పోయినేడాది నెట్‌కి సంబంధించి ఒక చైల్డ్‌పోర్న్ కేసు నమోదయింది. దాని మీద విచారణ చేస్తే, ఆ సైట్‌ను పెరూ దేశపు రాజధానిలో లిమా నుంచి నడుపుతున్నారని తేలింది. దానికి డొమైన్ సర్వర్ కల్పించిన కారణంగా, హైదరాబాదు నగరంలో అరవింద్ శ్యామ్ జగ్గమ్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు కూడా. ఈ అరెస్టు గత సెప్టెంబరులో జరిగింది.

విజృంభిస్తున్న చైల్డ్‌పోర్న్‌ను, సైబర్‌నేరాలనూ దృష్టిలో పెట్టుకుని - 'పరిస్థితి చాలా విషమిస్తున్నది' అని ఒక పోలీసు అధికారి వ్యాఖ్యానించిన దాంట్లో అర్థసత్యం కానీ, అసత్యం కానీ లేదు. మొత్తమ్మీద పరిస్థితి ఆందోళనకరంగానే వుంది. ఇంతవరకూ పీడోఫిల్స్‌కి మాత్రమే పరిమితమైన ఈ వికారం నెట్ పుణ్యమా అని మిగతావారిని కూడా కలుషితం చేసే ప్రమాదం బాగా పెరిగింది●

అత్యాచారానికి గురైన మగపిల్లలు పెద్దయ్యాక, సహజంగా స్త్రీల వట్ల ఆకర్షణకి లోను కావలసిందిపోయి, హోమోసెక్సువాలిటీ వైపు మళ్లవచ్చు. మరికొందరు స్త్రీలతో సహజమైన లైంగిక సంబంధాన్ని కొనసాగిస్తూనే, మరోపక్క స్వలింగ సంపర్కం వైపుకి కూడా ఆకర్షితులు కావచ్చు. లేదా మానసికంగానూ లైంగికంగానూ తీవ్రమైన గందరగోళానికి లోనుకావచ్చు.

ఇక ఆడపిల్లలు మగవాళ్లంటేనే భయపడిపోయి లెస్బియన్స్‌గా మారవచ్చు. లేదా పింకీలాగా విపరీతమనస్తత్వానికి, ప్రతిదానికీ అతిగా స్పందించే ధోరణికి మళ్లవచ్చు. మొత్తమ్మీద అసహజంగా, అసాధారణంగా తయారయ్యే అవకాశమే ఎక్కువ. ఒక ఉదాహరణలో - వరంగల్‌కి చెందిన ఒక విద్యార్థిని, హాస్టల్‌లో తోటి విద్యార్థినులతో లైంగిక సంబంధం పెట్టుకుంది. చిన్నతనంలో మామ వరసయ్యే వ్యక్తి ఆమెపై అత్యాచారం చేసాడు. ఫలితంగా ఆమెకి మగవాళ్లంటే భయం యేర్పడిపోయింది. వయసు వచ్చిన తర్వాత సహజంగా చెలరేగే కోరికలను తీర్చుకోడానికి అసహజమైన మార్గాన్ని అనుసరించింది.

## మూగబాధకి అక్షరరూపం ఇచ్చిన **పింకీ విరానీ**



నెలకి ఏడొందల రూపాయల జీతానికి ట్రైపిస్ట్‌గా జీవితాన్ని ప్రారంభించినప్పుడు పింకీ వయసు పదిహేడేళ్లు. చదువుల మీద అపనమ్మకమూ, ఏదో ఒకటి చేసి నిలబడాల్సిన పరిస్థితులూ - ఆ చిన్న ఉద్యోగానికి ఆమెను పురిగొలిపాయి. ముంబై, భావన్స్ కాలేజిలో జర్నలిజంలో డిప్లొమా కోర్సు... తలపండిన జర్నలిస్టు ఎం.వి. కామత్ పాఠాలు... ఆ తర్వాత ఆగాఖాన్ ఫౌండేషన్ ఇచ్చిన స్కాలర్‌షిప్‌తో అమెరికాలో మాస్టర్ డిగ్రీ... లండన్ 'సండే ట్రైమ్స్'లో ఇంటర్న్‌షిప్... ఇవన్నీ పూర్తి చేసుకుని ఇండియా తిరిగొచ్చినప్పటికి పింకీ వయసు 21 ఏళ్లు. 'ఇలస్ట్రేటెడ్ వీక్లీ ఆఫ్ ఇండియా'లో తొలి ఉద్యోగం. ఆ తర్వాత 'మిడ్‌డే' సాయంకాల పత్రిక... కొన్నాళ్ల తర్వాత ఆ పత్రికకే ఎడిటరయ్యింది. ఒక ఈవెనింగర్‌కి ఎడిటర్‌గా పని చేసిన మొదటి మహిళ పింకీనే కావచ్చు. 'ఐలాండ్' అనే పత్రికకీ సంపాదకురాలిగా పని చేసింది. ఇక్కడ పనిచేసిన రోజుల్లో కొలీగ్ అయిన శంకర్ అయ్యర్‌ను పెళ్లాడింది. ఒక ఆసుపత్రి సిబ్బంది చేతిలో రేప్‌కు గురై, ఆ షాక్‌తో పాతికేళ్ల నుంచీ - అదే ఆసుపత్రిలో జీవచ్ఛవంలా కోమాలో బతుకుతున్న అరుణ అనే మహిళ దయనీయ గాథను 'అరుణాస్ స్టోరీ' పేరుతో రాసింది. ఆ తర్వాత 'వన్స్ వజ్ బోంబే'... ఈ రెండూ బెస్ట్ సెల్లర్స్.

పింకీ మూడో రచన 'బిట్టర్ చాకొలెట్' కూడా సంచలనం సృష్టిస్తోంది. (అనేక భారతీయ భాషలతో పాటు, త్వరలో తెలుగులోకి కూడా రాబోతోంది ఈ 'చేదు చాకొలెట్'.) వాస్తవాల ఆధారంగా అద్భుతమైన రచనలు చేస్తున్న పింకీ 'ది ఫాస్టెస్ట్ రైజింగ్‌స్టార్ ఇన్ ఇండియన్ రైటింగ్'గా సర్వత్రా ప్రశంసలు అందుకుంటోంది.

## అన్ని వర్గాలలోనూ...

చిన్నప్పుడు ఎప్పుడో జరిగిన అత్యాచారం కారణంగా, గుండెల్లో పేరుకుపోతూ వచ్చిన అపరాధ భావం పెద్దయ్యాక ఏ 'డిప్రెషన్' రూపంలోనో బయటపడొచ్చు. ఈ మూల కారణం వారికే తెలియనంతగా మనసులో ఎక్కడో మారుమూలన దాగి వుండొచ్చు. బాధితులు డిప్రెషన్ కారణం మీద సైకియాట్రిస్టులను కలిసినా, అసలు విషయం చెప్పడానికి సంకోచిస్తారు. "ఈ విషయం డాక్టర్‌కి తెలిసిందని బాధపడిపోయి, పేషెంట్‌ని మళ్లీ మా దగ్గరకు తీసుకురాని వాళ్లను చాలా మందిని చూశాను. మిడిల్‌క్లాసు, అప్పర్ మిడిల్ క్లాసు వారే నా దగ్గరకు వస్తుంటారు. ఇటువంటి విషయాలు మరొకరికి తెలియకూడదని వారు భావిస్తుంటారు" అన్నారు జోషి.



'అంకురం' సుమిత్ర

తాగుడు, ఇరుకిరుకు ఇళ్లు వుండే పేద వర్గాలలోనే ఇటువంటి సమస్యలు ఉంటాయని సాధారణంగా అనుకుంటారు కానీ మధ్య, ఎగువ మధ్యతరగతుల్లో కూడా చైల్డ్ సెక్సువల్ ఎబ్యూజ్ సమస్య వున్నదనే సంగతిని ఆయన మాటలు చెబుతున్నాయి. పింకీవిరానీ కూడా, మధ్యతరగతి, ఉన్నతవర్గాలతో సహా ఈ సమస్య వుందని చెబుతున్నారు. ఆమె ప్రకారం, దేశంలో ప్రతి ఐదుగురు పిల్లల్లో ఒకరు లైంగిక అత్యాచారానికి గురవుతున్నారు.

## పిల్లలకీ హక్కులు

పిల్లలకూ హక్కులున్నాయి. 1989లో ఐక్యరాజ్యసమితి బాలలహక్కుల అంతర్జాతీయ ఒడంబడికను రూపొందించింది. ఐక్యరాజ్య సమితి సభ్యదేశాలన్నీ ఆమోదించిన ఈ ఒడంబడికను భారతప్రభుత్వం 1992 డిసెంబరు 11న ఆమోదించి సంతకం చేసింది. ఈ తీర్మానంలో పేర్కొన్న బాలల హక్కుల్ని సంరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే. ఒడంబడికలోని ఆర్టికల్ -34 పిల్లలను అన్ని రకాల లైంగిక దూషణ నుంచి, లైంగిక దోపిడీల నుండి రక్షించే చర్యలను తీసుకోవాలని పేర్కొంటున్నది.

ఎ) చట్టబద్ధంకాని ఏ లైంగిక కార్యకలాపంలోనైనా పాల్గొనేందుకు పిల్లలను బలాత్కరించటం లేదా ప్రేరేపించటాన్ని

బి) వ్యభిచారం, తదితర అక్రమ లైంగిక వ్యవహారాలలో పిల్లలను వినియోగించటాన్ని, దోపిడీ చేయటాన్ని

సి) బూతుబొమ్మలు, బూతు విషయాల్లో పిల్లలను వినియోగించటాన్ని, దోపిడీ చేయటాన్ని - అరికట్టాలని చెబుతున్నది.

ఇక ఆర్టికల్-35 ఏ ప్రయోజనం కోసమైనా సరే , ఏ రూపంలో వున్నా సరే పిల్లల అపహరణ, అమ్మకం లేదా వర్తకాలను అడ్డుకోవడానికి సభ్యదేశాలన్నీ చర్యలు తీసుకోవాలని చెబుతున్నది. కానీ వాస్తవంలో ఈ హక్కులు అమలవుతున్న జాడలు ఎక్కడా కనిపించటం లేదు. పైగా రోజురోజుకీ పిల్లలు లైంగిక దోపిడీకి గురవటం పెచ్చుపెరిగిపోతోంది. ఎక్కడిదాకానో వెళ్ళక్కర్లేదు, మన రాష్ట్రంలో చూసినా ఇది కళ్ళకు కట్టినట్టు కనిపిస్తోంది.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన దిశగా, బాలల హక్కులసాధన మార్గంలో పనిచేసే కొన్ని స్వచ్ఛంద సంస్థలు, ఈ ఆగస్టు పదవతేదీన స్వచ్ఛందసంస్థలు చైల్డ్‌ట్రాఫికింగ్, చైల్డ్ సెక్సువల్ ఎబ్యూజ్ పథానాంశంగా ఒక సదస్సును నిర్వహించాయి. 'ప్రజ్వల', 'మహిత' అనే సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈసదస్సులో 'హెల్ప్' (ఒంగోలు), 'అంకురం' (హైదరాబాద్), 'ఎన్.ఎ. డబ్ల్యు.ఎ' (నల్గొండ) లాంటి సంస్థలు అనేకం పాల్గొన్నాయి. పాత బస్తీలో నిరుపేద ముస్లిం ఆడపిల్లల్ని అరబ్ షేక్‌లకిచ్చి పెళ్లి చేసే పేరుతో జరుగుతున్న వ్యాపారం, నల్గొండ ప్రాంతంలో లంబాడీ బాలికల్ని ముంబైకి తరలిస్తున్న వైనం, కోస్తాలోని కొన్ని ప్రాంతాల్లో మగవారి ఉపాధి అవకాశాలు సన్నగిలిన ఫలితంగా యువతులు బాలికలు పెద్దఎత్తున వ్యభిచారంలోకి మళ్లుతున్న స్థితి - ఇలా బాలికలకు సంబంధించి అనేక సమస్యలను సదస్సు చర్చించింది.



డా॥ ప్రభాకర్ కోరాడ డా॥ మధుసూదన్ జోషి

పైకి ప్రస్ఫుటంగా కనిపించే చైల్డ్ ట్రాఫికింగ్, చైల్డ్ ప్రాస్టిట్యూషన్ లాంటి సమస్యల మీద ఈ మధ్యకాలంలో ఎంతో కొంత కృషి జరుగుతోంది. అది మంచిదే. అయితే డొమెస్టిక్ చైల్డ్ లేబర్ విషయం మాత్రం ఎవరూ పట్టించుకోవటం లేదు. వారి శ్రమకి తగ్గ ప్రతిఫలం లభించకపోవటమే కాదు, యజమానుల నుంచి హింసను, లైంగికహింసను కూడా భరిస్తూ నిస్సహాయంగా మిగిలిపోతున్నారు' అని 'అంకురం' డైరెక్టర్ సుమిత్ర పనిపిల్లల సమస్యల గురించి ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

## అవకాశం ఇవ్వొద్దు

లైంగిక అత్యాచారాలు వికసించే పిల్లల మనస్సులను వికటింప చేస్తాయి. ఇటువంటి నేరాలకు చట్టాలూ, శిక్షలూ వున్నప్పటికీ, న్యాయం పొందే అవకాశం ఉన్నప్పటికీ - పిల్లల మనసుకి అయ్యే గాయం ఎన్నటికీ మానేది కాదు. అందుకే, అత్యాచారాలు సంభవించకుండా జాగ్రత్తపడటమే ఉత్తమం. పిల్లల్ని కాపాడుకోవడానికి పిల్లల మీద శ్రద్ధ పెట్టడమే ఏకైక మార్గం. ఈ సందర్భంగా, పిల్లలతో సన్నిహితంగా మెలిగేవారి మీద ఒక కన్నేసి ఉంచటం లేదా అనుమానించటం ఎల్లప్పుడూ సాధ్యమయ్యే పని కాదు.

"సమస్య తీవ్రమైనదే! అలాగని చెప్పి పిల్లలతో ప్రేమగా వుండే వారందరినీ అనుమానించటం అర్థరహితం. పిల్లలకు బ్యాడ్‌టచ్ ఏదో, గుడ్ టచ్ ఏదో అర్థమయ్యేట్టు చెప్పాలి. బ్యాడ్ టచ్ ఎదురైనప్పుడు ఆ సంగతి పెద్దవాళ్లకు చెబుతానని నిర్మొహమాటంగా చెప్పగల తత్వాన్ని పిల్లల్లో పెంపొందించాలి. అన్నింటికంటే ముఖ్యం - చాలా మంది తలిదండ్రులు పిల్లలు చెప్పేది వినరు. వారి మాటలకు విలువ ఇవ్వరు. పిల్లలు మంచీ చెడూ ఏదైనా తలిదండ్రులతో చెప్పగలిగే వాతావరణం వుండాలి" అని సికింద్రాబాద్ పికెట్ రోడ్‌లో 'సూర్యా బ్రెయిన్ అండ్ మైండ్ క్లినిక్' నడుపుతున్న డా॥ ప్రభాకర్ కోరాడ అంటున్నారు.

సెక్సువల్ ఎబ్యూజ్ అంటే రేప్ స్థాయిలో జరిగే ప్రమాదమే కానక్కర్లేదు. బూతులు తిట్టటం, తాకటం, బూతు బొమ్మల్ని చూపటం, సైగల్ని చేయటం లాంటివి కూడా అబ్యూజ్ కిందకే వస్తాయి. ఇవన్నీ పిల్లలను ఆరోగ్యకరమైన వ్యక్తులుగా రూపొంద కుండా అడ్డుకుంటాయి. తీవ్ర మానసిక సమస్యలను సృష్టిస్తాయి. వికృతమైన ధోరణులకు పురిగొల్పుతాయి. తద్వారా కౌటుంబిక, సామాజిక సమస్యలకు దారి తీస్తాయి. అందుకే పెద్దవాళ్ళు పిల్లలతో స్నేహంగా, ప్రేమగా ప్రవర్తిస్తూ మంచీచెడూ వివరించాలి. వారిని వారే కాపాడుకోగలిగే అవగాహనని ఇవ్వాలి.

ఎయిడ్స్ లాంటి అదనపు ప్రమాదాలు కూడా పొంచి వున్న ఈ కాలంలో పిల్లలను కాపాడుకోవటానికి - ఎబ్యూజ్ పాలిట పడకుండా నివారించుకోవటం ఒక్కటే మార్గంగా కనిపిస్తున్నది.

- సాంబశివరావు

బాల్యంలో లైంగిక అత్యాచారాలకి గురైన పిల్లల్లో కొందరు ఇళ్ల నుంచి పారిపోయి, హైదరాబాదు లాంటి నగరాల్లో పనిమనుషులుగా, అనాథలుగా, వ్యభిచారులుగా తేలుతున్నారు. చిన్న వయసులోనే సుఖవ్యాధుల బారిన, ఎయిడ్స్‌లాంటి ప్రమాదకర జబ్బులపాలిట పడుతున్నారు. అన్ని విధాలా అన్యాయమైపోతున్న ఇటువంటి ఆడపిల్లల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా చేస్తున్నది శూన్యం. కొన్ని స్వచ్ఛంద సంస్థలు మాత్రం తమ శక్తిమేరకు వీరిని ఆదుకొని ఆశ్రయమిచ్చే ప్రయత్నాలు చేస్తున్నాయి. అటువంటి ఒక ఆశ్రయంలో ఉన్న ముగ్గురు పిల్లలు వీరు. పసితనంలోనే బతుకు బండలైన ఈ ముగ్గురు పిల్లలూ సమస్య తీవ్రతకు మూడు సజీవ ఉదాహరణలు...

## పనిచేసే ఇంట్లో... వృద్ధుల చేతిలో...

"ఛీఛీ... దేవుడు నన్నెందుకు పుట్టించాడు? నాకు ఈ ఖర్మ ఏమిటీ?" అని ఎప్పుడూ దిగులుగా వుండే రమకి నిండా పదిహేనేళ్లు కూడా లేవు. రమకి ఊహ తెలిసేటప్పటికి నా అన్నవాళ్లెవరూ లేరు. అనంతపురం రైల్వేస్టేషన్‌లో అడుక్కుతినేది. పిల్లలు లేని వృద్ధ దంపతులు రమను చేరదీసి కొన్నాళ్లు పెంచారు. వాళ్లు చనిపోయిన తర్వాత ఆ ఊళ్లోనే ఒక ఇంట్లో పనికి కుదిరింది. ఒకసారి ఆ ఇంట్లోవాళ్లు ఒక ముసలాయన్ను మాత్రం వదిలిపెట్టి అంతా తిరుపతి వెళ్లారు. అంతకు ముందే ఆ ముసలాయనకి తోడు ఒక నడివయసున్న ఒక చుట్టాన్ని పిలిపించారు. వాళ్ళిద్దరూ కలిసి నాలుగు రోజుల పాటు రమను రేప్ చేశారు. దాంతో ఇన్ఫెక్షన్ సోకిన రమ సరిగ్గా నడవలేక పోయింది. ఆసుపత్రికి తీసుకెళితే విషయం బయటపడింది. కానీ ఆ ఇంటివాళ్ళు 'నువ్వెక్కడో తిరిగి పాపం ఆ ముసలాళ్ల మీద చెబుతున్నావా' అంటూ తిట్టి కొట్టి పంపించారు. ఇంత చిన్నపిల్లకి ఇదేం పోయేకాలం అని ఆ ఊళ్లో అందరూ అసహ్యించుకున్నారు. రమను తీసుకుపోయి గవర్నమెంటు ఆసుపత్రిలో పడేశారు. తింటానికి తిండిలేక, పైసా డబ్బుల్లేక రమ అల్లాడింది. తగ్గిన తర్వాత తిరుపతి రైలెక్కి ఆ ఊళ్లో కొన్నాళ్లు ఇళ్లలో పని చేసింది. కొన్నాళ్లు బాగానే వుంది కానీ అక్కడ కూడా అటువంటి అనుభవమే ఎదురవుతున్నప్పుడు తప్పించుకుని చివరకు హైదరాబాద్ చేరుకున్న రమకి ఒక హోమ్‌లో షెల్టర్ దొరికింది. అయినా గతం తాలూకు భయంకరమైన జ్ఞాపకాలు అంత తేలిగ్గా మర్చిపోలేకపోతోంది.



## పొరుగింటి పెద్దమనిషే...

దివ్య అంతటి దురదృష్టవంతురాలు బహుశా ఇంకొకరుండరేమో! దివ్య ప్రతిభావంతురాలైన బాలనటి. తెలుగు, తమిళ భాషలలో అనేక మంది ప్రముఖ హీరోలతో, హీరోయిన్‌లతో కలిసి నటించింది. బాగా పేరు వస్తున్న సమయంలో పొరుగు అపార్ట్‌మెంటులో వుండే నలభై ఐదేళ్ల ప్రభుత్వోద్యోగి ఒకడు దివ్యను కాటేశాడు. అప్పటికే వైవాహిక జీవితంలో సమస్యలను ఎదుర్కొంటున్న దివ్య తల్లికి ఆరోగ్యం అంతంత మాత్రం. ఫీల్డులో మంచి పేరొస్తున్న తరుణంలో కూతురి మీద జరిగిన అత్యాచారం ఆమెను ఇంకా కుంగదీసింది. ఏడాదిపాటు అనారోగ్యంతో బాధపడి దివ్యను ఒంటరి చేసి వెళ్లిపోయిందామె. దివ్య ఇప్పుడు అనాథ. దివ్యను కొన్నాళ్లు ఒక స్వచ్ఛంద సంస్థ ఆదుకుంది. ప్రస్తుతం ఆ పాపకి ప్రభుత్వం నడుపుతున్న ఒక హోమ్‌లో ఆశ్రయం దొరికింది.



## కన్నతండ్రి కామానికి...

లక్ష్మిది రాజమండ్రి దగ్గర్లో ఒక పల్లెటూరు. తండ్రి తాగొచ్చిన మైకంలో లక్ష్మిని రేప్ చేశాడు. ఆమెకి అప్పుడు ఏడేళ్లు. అంతకు ముందే తండ్రి పెడుతున్న బాధలను భరించలేక తల్లి వేరే వ్యక్తితో వెళ్లిపోయింది. తండ్రి లక్ష్మిని రెండు వేల ఐదొందల రూపాయలకు అమ్మేశాడు. లక్ష్మిని కొనుక్కున్న వాళ్లు తమ బంధువులింట్లో పనిమనిషిగా హైదరాబాద్‌కు పంపించారు. అక్కడ నాలుగేళ్లు పని చేసింది. యజమానురాలు బాగానే చూసుకునేది. ఒకసారి ఆమె ఊరికి వెళ్లింది. యజమాని, లక్ష్మి మాత్రమే ఇంట్లో మిగిలారు. ఆ రాత్రి తాగి వున్న ముసలి యజమాని ప్రవర్తనలో లక్ష్మికి తేడా కనిపించింది. అతడిని తప్పించుకోవటానికి వంటగదిలో దూరి తలుపులు బిగించుకుని తెల్లార్లూ జాగారం చేసింది. పొద్దున్నే చెప్పాపెట్టకుండా బయటపడింది. ఆ తర్వాత చాలా ఇళ్లలో పనులు చేసి పొట్టపోసుకుంది. 'అటువంటి' ఇబ్బంది ఏదన్నా రాబోతున్న సూచనలు కనపడగానే మానేసేది. తండ్రే తనను అలా చేశాడన్న చేదు జ్ఞాపకంతో నిరంతరం కుంగిపోతూ వుంటుంది. ఎప్పుడూ నిరాశా నిస్పృహలతో కనిపిస్తుంది.



* అసలు పేర్లు, చిరునామాలు మార్చాం.



జనహర్ష గ్రూప్ - ఒక విభిన్న తరహాకి చెందిన నైతిక కార్పొరేట్ ఉద్యమం

# తెహల్కా విలేకరులు నేరస్తులా?







మాడభూషి శ్రీధర్ కాలమ్

వ్యభిచారం అవినీతికరమయిన సాంఘిక దురాచారం. మహిళల హక్కులకు, స్వేచ్ఛలకు, వ్యక్తిగత గౌరవప్రతిష్ఠలకు భంగకరమైన సాంఘిక దురాచారం. సెక్స్, వ్యక్తి స్వేచ్ఛ, వ్యభిచారం, వ్యక్తి గౌరవం ఒకదానితో మరొకటి ముడిబడి ఉన్న అంశాలు. నీతి నియమాలు వేరు శాసనిక నియమాలు వేరు. శాసనాలు మౌలికంగా నీతిని అమలు చేయడానికి ప్రయత్నాలనే అనాలి. కానీ అన్ని నీతిసూత్రాలను శాసనాల్లోకి దించడం ఎవరికైనా సాధ్యం కాదు.

తెహల్కా జర్నలిస్టులు రక్షణరంగంలో అవినీతిని బయటపెట్టడానికి రహస్య కెమెరాలను వాడారు. అబద్ధాలు చెప్పారు. లంచాలు ఇచ్చారు. మహిళలను ప్రలోభకరమయిన సాధనాలుగా ఉపయోగించి కొందరు రక్షణ అధికారుల స్త్రీలోలత్వాన్ని ఆసరాగా తీసుకుని వారి విషయ లంపటత్వాన్ని వాడుకుని, 'అవినీతి'ని ఎండగట్టే ప్రయత్నం చేసారు. రక్షణకు అవసరమయిన సాంకేతిక పరికరాలు, ఆయుధాలు, ఇతర మందుగుండు సామాను కొనుగోలు చేయడానికి చిత్తశుద్ధి, స్పష్టమయిన, న్యాయమయిన ఒప్పందాలు, లావాదేవీలు ఉండాలి. నాణ్యమయిన ఆయుధాలను కొనడానికి లంచాలు తీసుకున్నా, నాసిరకం ఆయుధాలను ఎక్కువ లంచాలు తీసుకుని కొనుక్కున్నా దేశానికి ద్రోహం చేయడమే అవుతుంది. అది నేరం అని వేరే చెప్పనక్కర లేదు.

ఈ నేరాలు ఎలా బయటపడాలి? ఎవరు డొంక కదిలించాలి? కింది నుంచి పైదాకా అందరూ లంచగొండి రక్షణ కొనుగోళ్ల వ్యవహారంలో చేతులు తడుపుకుంటూ దేశరక్షణను, కిందిస్థాయి జవాన్ల బతుకులను అయోమయంలో, ప్రమాదంలో పడేస్తుంటే ప్రజలు చేతులు ముడుచుకుని కూర్చోవాలా? పత్రికలు నిజాలు రాయాలని, ఎక్కడ అవినీతి ఉన్నా కడిగి పారేయాలని, రవిగానని చోటు కవి గాంచుననీ, కవి గానని చోటికి ప.వి. (పత్రికా విలేకరి) వెళ్లునని కథలు కవితలు, నీతి ప్రబోధాలు చెప్పే మహానుభావులంతా తెహల్కా దెబ్బకు ఉలిక్కి పడుతున్నారు. తెహల్కా జర్నలిస్టులు 'అవినీతి'ని బయట పెట్టడానికి, ఆ విధంగా దేశరక్షణకు నడుం కట్టిన దేశభక్తులా? లేక డబ్బుకోసం, తమ వెబ్‌సైట్ ఛానల్ కీర్తి కోసం నీతిని తాకట్టుబెట్టిన దేశద్రోహులా, అనే ప్రశ్న ఇప్పుడు జనం ముందు ఉంది. లంచాలు తీసుకుని దేశరక్షణను పణంగా పెట్టే భ్రష్టాచారాన్ని బయటపెట్టడం ఎంత మాత్రమూ తప్పుకాదు. మరో రకంగా ఈ అవినీతిని వెల్లడి చేయడానికి చీకటి కోణాలలో వెలుగు రేఖలు ప్రసరింపచేయడానికి ఆస్కారం లేదు. కనుక కెమెరా మూడో కన్ను తెరిచి ఉంది. కన్ను తెరిచిన కెమెరా చూసినవన్నీ రికార్డు చేసింది. అందులో నోట్లకట్టలు బల్ల మీద కింద చేతులు మారిన దృశ్యాలూ ఉన్నాయి. లంచాలను పార్టీ విరాళాల రూపంలో అందుకున్న చేతులూ ఉన్నాయి. అడిగి అమ్మాయిలను రప్పించుకున్న కాముకుల పనులూ ఉన్నాయి. అడగకపోయినా లంచాలు ఇచ్చినట్టే. కోరకపోయినా కోరిక పుట్టించి, తీర్చేందుకు వేశ్యలను పంపిన సంఘటనలూ ఉన్నాయి.

లంచం అడిగితే నేరం. అడగకపోయినా ఇవ్వజూపితే నేరం. కానీ లంచగొండి అని రుజువు చేయడం కోసం లంచం ఇస్తానని చెప్పి, లంచం నోట్లు తీసుకుంటూ ఉంటే రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం కోసం లంచం ఇవ్వడం నేరం కాదని చట్టాలు చెప్తున్నాయి. కనుక లంచం ఇస్తానని ఆశ చూపి దొంగచాటుగా రికార్డు చేసిన తెహల్కా జర్నలిస్టుల వ్యవహారం నేరం కాదని అనే వీలుంది. దాన్ని ఎవరూ ప్రశ్నించలేరు కూడా. ఎ.సి.బి. వారు ప్రతిరోజూ ఇదే పని చేస్తారు, చేస్తున్నారు.

స్త్రీలను ప్రలోభపరిచే సాధనాలుగా వాడుకోవడం 'మార్కెట్' నాగరికత వికృతరూపం అనడంలో సందేహం లేదు. లంచం అడగకపోయినా ఇవ్వజూపడం వ్యూహం అనీ ద్రోహం కాదని సమర్థించడానికి ఆస్కారం ఉంది. అమ్మాయిలను పంపమని అడగకపోయినా, పంపుతామని తెహల్కా విలేకరులే కోరి, ఊరించి, వారిని లోబరుచుకునే పని అవినీతి, అని వేరే చెప్పనవసరం లేదు. కానీ అది నేరం కూడా అవుతుందా? చట్టప్రకారం శిక్షార్హులవుతారా? అన్న ప్రశ్నకు ఇప్పుడు అధికారంలో ఉన్న కేంద్ర సంకీర్ణ పార్టీల నాయకులు అవునని జవాబు ఇస్తున్నారు. ఈ పని ఆ అమ్మాయి వ్యక్తి స్వేచ్ఛకు భంగకరం కాదా అంటే అవుననే చెప్పాలి. కానీ ఆమె అందుకు అంగీకరిస్తే, అది తనకు వృత్తిలో భాగమని భావిస్తే నేరమా? అందుకు ఆమె అంగీకరిస్తే ఆమె స్వేచ్ఛకు భంగం కలుగదు. ఆ అంగీకారాన్ని మోసపూరితంగా, వత్తిడి ద్వారా, లేదా భయపెట్టడం ద్వారా సాధిస్తే, ఆ వ్యక్తి ఆమె స్వేచ్ఛను హరించినట్లు అవుతుంది. వ్యభిచారం తన వృత్తి అనీ, కనుక వృత్తిలో భాగంగా ఆ పని చేసానని అంటే 'ఇమ్మోరల్ ట్రాఫిక్ ప్రివెన్షన్ చట్టం' రంగంలోకి రావలసి వస్తుంది. అవినీతికరమయిన శారీరక లావాదేవీలను ఈ చట్టం నిరోధిస్తుంది. అమ్మాయిలను సరఫరా చేయడంతో వ్యాపారం చట్టవిరుద్ధమయింది. తెహల్కా వారే కాదు ఎవరయినా అమ్మాయిలను కొని, అద్దెకు ఇచ్చి, అమ్మి, ప్రలోభ సాధనాలుగా వాడుకుంటే ఈ చట్టం ప్రకారం నేరమే అవుతుంది.

1956లో రూపొందించిన ఇమ్మోరల్ ట్రాఫిక్ (ప్రివెన్షన్) ఆక్ట్, 1956 వ్యభిచార 'వ్యాపారాన్ని' నిరోధించాలని అణచి వేయాలని భావించే చట్టం. కాని ఈ చట్టం వ్యభిచారాన్ని నిషేధించలేదు. ఒక వ్యక్తి వ్యభిచరించడాన్ని కూడా నిషేధించలేదు.

'బ్రోతల్' అనే పదానికి ఈ చట్టంలో ఉన్న నిర్వచనం (సెక్షన్ 2(ఎ)) జాగ్రత్తగా చదివితే ఒక మహిళ సొంతంగా, ఎవరి సహకారమూ లేకుండా, మరో వ్యక్తి ప్రమేయం లేకుండా తానే విటులను రప్పించుకుని వ్యభిచరిస్తే ఆమె ఇంటిని 'బ్రోతల్' అనడానికి వీల్లేదని ఈ నిర్వచనం చెప్తుంది. తన జీవనోపాధి కోసం వ్యభిచరించే మహిళను ఈ చట్టం నేరస్తురాలు అని చెప్పలేదు. శిక్షించడం లేదు. ఆమె సామాజిక పరిస్థితులకు బలయిన 'బాధితురాలు' అవుతుందే కానీ నేరస్తురాలు కాదు. కానీ అదొక పెద్ద వ్యాపారంగా మార్చి ఒక ముఠాగా ఏర్పడి, కంపెనీని ప్రారంభించి, వ్యాపార పరమయిన లాభాలు ఆర్జిస్తే అది నేరమవుతుంది.

'వ్యభిచారం' అన్న పదానికి నిర్వచనం (సెక్షన్ 2(ఎఫ్)) గమనించినా వ్యక్తిగత వ్యభిచారం అందులోకి రాదని తేలిపోతుంది. 'కొందరు వ్యక్తులను వ్యాపార అవసరాలకు గాను సెక్సువల్ దోపిడీకి గురిచేయడం, లేదా దుర్వినియోగం చేయడం వ్యభిచారం అని అర్థం.

అంటే వ్యభిచారం అనే వ్యాపారానికి దోహదం చేసే విధంగా మహిళలను సెక్స్ దోపిడీ చేస్తే ఆ విధంగా చేసిన వారు వ్యభిచార నేరస్తులవుతారు. 'ట్రాఫికింగ్' అంటే తరచు రాకపోకలు ఉండే వాతావరణం, 'బ్రోతల్' స్థలాన్ని, వ్యభిచార వ్యాపార లక్షణాన్ని నిర్ధారిస్తుంది. దీన్ని బట్టి విడిగా సాగిన వివాహేతర శారీరక సంబంధాన్ని వ్యభిచారం అనడానికి వీల్లేదు. ఒక మహిళ ఒంటరిగా పలువురితో డబ్బు కోసం గడిపినా వ్యభిచారం కాదు. ఒక మహిళ మరొకరి సలహా మేరకు ఇంకొకరితో ఒక రాత్రి గడిపినా 'వ్యభిచారం' కాదు. ఇది 1956 చట్టం చెప్పే విషయం. తెహల్కాకు సొంతంగా పత్రికా రచనా వ్యాపారం, టి.వి. జర్నలిజం వ్యాపారంతో పాటు, వ్యభిచార వ్యాపారం కూడా ఉంటే వ్యభిచార నిరోధక చట్టం కింద వారిని ప్రాసిక్యూట్ చేయవచ్చు. అందులో బ్రోకర్లుగా పనిచేసిన వారిని బంధించవచ్చు.

1986కు ముందు వ్యభిచారం నిర్వచనం (సెక్షన్ 2(ఎఫ్)) వేరుగా ఉండింది. ఒక మహిళ తన శరీరాన్ని డబ్బు కోసం లేదా ఇతర వస్తువుల కోసం మరొకరికి లేదా అనేకులకు అద్దెకు అప్పగించడం వ్యభిచారం అని చట్టం నిర్వచించింది. 1986 లో ఈ నిర్వచనాన్ని సవరించారు. విడిగా ఒక్క సంఘటన ఆధారంగా ఒక మహిళను 'వ్యభిచారిణి' అనడానికి, శిక్షించడానికి వీల్లేదని కోర్టులు తీర్పు చెప్పాయి. కొత్త వ్యక్తితో కాలం గడపడం, లేదా ఒక పురుషుడిని ఆకర్షించేందుకు ప్రయత్నం చేయడం అసభ్య చర్యలు కావచ్చు. కానీ ఈ చట్టం కింద నేరాలు కావని 1966లో మద్రాస్ హైకోర్టు (AIR 1962 Mad.312) స్పష్టం చేసింది. వివాహం కాకుండా ఒక మహిళతో ఏ ప్రతిఫలమూ చెల్లించకుండా ఎల్లకాలమూ గడిపితే అది వ్యభిచారం కాదని కూడా కోర్టు వివరించింది.

ప్రాస్టిట్యూషన్ కోసం మహిళలను వినియోగిస్తే అది నేరం. ఇక్కడ కూడా ప్రాస్టిట్యూషన్ అంటే ఒక వరస, కొన్ని సంఘటనలు, అనేక వ్యక్తులు, నిరంతర వ్యాపార ధోరణితో కూడుకున్న వ్యవహారమని అర్థం.

లంచం కేసులలో సాక్ష్యాధారాల కోసం లంచం ఇవ్వబోయే ట్రాప్ విట్‌నెస్‌ను ఎ.సి.బి. చట్టాలు అనుమతించిన విషయం పరిశీలించాం.

కమలాబాయ్ V.స్టేట్ ఆఫ్ మహారాష్ట్ర కేసులో (AIR 1966 సుప్రీంకోర్టు 1189) బొంబాయి పోలీసులకు వ్యభిచారం సమాచారం అందింది. వారు ఇద్దరు వ్యక్తులకు మార్చివేసిన వందరూపాయల నోట్లు ఇచ్చి ట్రాప్ సాక్షులుగా ఆ గృహానికి పంపారు. అందులో ఒక వ్యక్తి తనకు చూపిన ఇద్దరు అమ్మాయిలలో ఒకరిని ఎంచుకుని, వంట గదిలోకి వెళ్లాడు. ఇద్దరు బట్టలు విప్పి పక్కన కుప్పబెట్టారు. తరువాత చెప్పడానికి వీల్లేని భంగిమలో నేల మీద పడుకున్నారు. అప్పుడొక సంకేతం ఇస్తే పోలీసులు వచ్చి వ్యభిచార నేరం కింద నేరస్తులను అరెస్టు చేసారు. హైకోర్టు శిక్షించింది. కేసు సుప్రీంకోర్టుకు వెళ్లింది. ట్రాప్ సాక్షిగా మెట్రిక్యులేషన్ చదువుతున్న పిల్లవాడిని ఉపయోగించడం తప్పని సుప్రీంకోర్టు విమర్శించింది. కానీ ఇతర సాక్ష్యాల ద్వారా నేరం రుజువైందని భావించి శిక్షను నిర్ధారించింది. అంటే పిల్లల్ని కాకుండా యువకుల్ని ట్రాప్ సాక్షులుగా పంపితే సక్రమమే అని అర్థం.

వ్యభిచార నేరాన్ని మట్టుబెట్టడానికి పోలీసులు ట్రాప్ సాక్షిగా విటులను తయారు చేసి పంపడం చట్టబద్ధమైనపుడు సుప్రీం కోర్టు దాన్ని అంగీకరించినపుడు, రక్షణ శాఖలో అధికారుల దేశద్రోహ అవినీతి గుట్టురట్టు చేసేందుకు ఒక మహిళను లేదా సెక్స్‌వర్కర్‌ను ట్రాప్ విట్‌నెస్‌గా వాడుకుంటే అది అవినీతి నేరం ఏ విధంగా అవుతుంది?

సెక్షన్ 4 వ్యభిచార నిరోధక చట్టం ప్రకారం వ్యభిచారం ద్వారా వచ్చే ఆదాయంపై పూర్తిగా లేదా పాక్షికంగా ఆధారపడి జీవించే వాడిని నేరస్తుడుగా నిర్ధారించి రెండేళ్ల జైలు శిక్ష విధించవచ్చు. తెహల్కా కేసులో జర్నలిస్టులను, ఈ సెక్షన్ కింద నేరస్తులుగా భావించడానికి వీల్లేదు. ఈ వ్యభిచారం ద్వారా వచ్చే ఆదాయాన్ని వారు కోరుకోవడం లేదు కనుక, ఇది వ్యభిచారం కాదు కనుక తెహల్కా జర్నలిస్టులు ఈ సెక్షన్ పరిధిలోకి రారు.

అక్రమ సంబంధాలకోసం మైనర్ బాలికలను కొనడం, అద్దెకు తీసుకురావడం, లేదా ఇతర మార్గాల ద్వారా స్వాధీనం చేసుకోవడం సెక్షన్ 372, 373 (ఐ.పి.సి.) కింద నేరాలు అవుతాయి. కానీ తెహల్కా ఉదంతంలో మైనర్ బాలికలను ఉపయోగించినట్టు ఎవరూ ఆరోపించడం లేదు. 366, 366ఎ సెక్షన్ల ప్రకారం ఏ వయసు ఆడవారినైనా ఎత్తుకుపోయినా, అక్రమ సంబంధాల కోసం మభ్యపెట్టినా నేరమవుతుంది. తెహల్కాలో ఈ సెక్షన్లు కూడా వర్తించే అవకాశం లేదు. సెక్షన్ 366 లో కూడా ఎత్తుకు వచ్చిన వారికి బలవంతంగా లేదా మభ్యపెట్టడం ద్వారా అక్రమ సంబంధాలకు వినియోగించడం మాత్రమే నేరమవుతుంది.

ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దినపత్రిక ఆడవారి క్రయవిక్రయాలు జోరుగా సాగుతున్నాయని చెప్పడం కోసం ఒక మహిళను కొని సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఉదంతంలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ విలేకరి అక్రమానికి పాల్పడ్డారని, నేరం చేసారని ఎవరూ ప్రాసిక్యూట్ చేయలేదు. చేయాలని అనలేదు.

అవినీతిని, నేరాన్ని రాజకీయం నుంచి దూరం చేయాలి. రక్షణ కొనుగోళ్లలో సైనిక పరికరాల అమ్మకం కాంట్రాక్టులలో అవినీతిని విడిగా ఒక తీవ్రమయిన నేరంగా పరిగణించాల్సిందే గాని దానికి రాజకీయాలను ముడిబెట్టి, అధికార సంకీర్ణ పక్షాలు విలేకరులపై విరుచుకు పడడం న్యాయం కాదు.

తెహల్కా విలేకరులు లంచం ఇవ్వజూపినందుకు, ఇచ్చినందుకు 'సెక్స్' వాంఛలను తీర్చడమనే లంచాన్ని ఇచ్చినందుకు వారిని ప్రాసిక్యూట్ చేయాలని కోరుతున్న రాజకీయ నాయకులు ఒక విషయం గమనించాలి. లంచం అంటే కేవలం డబ్బు రూపంలో ఇచ్చిందే అని ఎక్కడా లేదు. పదవుల ఎరజూపడం కూడా లంచమే అవుతుంది. పదవులతో ప్రలోభపెట్టి ఎదుటి పక్షాన్ని చీల్చి, ఫిరాయింపులను ప్రోత్సహించి రాజకీయాధికారం సంపాదించే లంచగొండులు అసలైన నేరస్తులు. అటువంటి రాజకీయ నాయకులు తెహల్కా విలేకరులను ప్రాసిక్యూట్ చేయాలని కోరడం దయ్యాలు వేదాలను వల్లించినట్టు ఉంటుంది.

లంచం అంటే ఏమిటో ఇండియన్ పీనల్ కోడ్‌లో నిర్వచించారు. అవినీతి నిరోధక చట్టంలో కూడా నిర్వచనం ఉంది. కానీ పదవుల లంచం ఇవ్వజూపడం, ఆడవారిని లంచం వస్తువులుగా వాడడాన్ని కూడా 'లంచం' అని స్పష్టంగా నిర్వచించలేదు. కోర్టులు కూడా ఈ వ్యవహారాలను లంచాలుగా నిర్ధారిస్తూ తీర్పులు చెప్పే అవకాశం రాలేదు.

నైతిక విలువల దృష్టితో ఆలోచిస్తే తెహల్కా జర్నలిస్టులు రక్షణ రంగంలో అవినీతిని బట్టబయలు చేయడం ఎంతో గొప్ప కార్యక్రమమే. కాని అందుకు మహిళలను పావులుగా, ప్రలోభాల సాధనాలుగా వాడుకోవడం, వ్యక్తి గౌరవానికి, మానవ హక్కులకు, నీతి నియమాలకు పూర్తిగా విరుద్ధమైన అంశాలు. ఈ విషయంలో తెహల్కాను సమర్థించడం కష్టం.

కీలకమయిన శాఖలలో అవినీతిని బహిర్గతం చేసి, నిరోధించడంలో అన్ని హంగులు అధికారాలూ ఉన్న సి.బి.ఐ. కూడా ఏమీ చేయలేకపోతున్నది. ఏ అధికారమూ, మౌలిక వనరులూ లేని సామాన్యపౌరులు సదుద్దేశంతో విలేకరిగా బాధ్యత నిర్వహించే లక్ష్యంతో పరిశోధన చేసి వెల్లడించిన రహస్యమయిన అవినీతి వార్తలను సరయిన దృక్పథంతో పరిశీలించడం అవసరం.

ఆడవారిని వస్తువులుగా, పావులుగా వాడుకోవడం ఎంత మాత్రం సమర్థనీయం కాదు. లంచం ఇవ్వజూపినట్టు నటించడం చట్టబద్ధమే అయినా, విటుడిగా ఒకరితో నటింపజేసి వ్యభిచారులను పట్టుకోవడం సక్రమమే అని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినా, ఆ పనుల ద్వారా మాత్రమే అవినీతిని నేరాలను అరికడ్తామని, మరో రకంగా చేయలేమని అనడం అసమర్థతే అవుతుంది.

అయితే అవినీతి ఆరోపణలలో పీకల దాకా కూరుకుని పోయి దేశరక్షణావసరాల మీద బేరాలు ఆడుకునే రాజకీయ నాయకులకు, ఆరోపణల దెబ్బలకు మంత్రి పదవులను కోల్పోయిన బడా నేతలకు మాత్రం తెహల్కా విలేకరులను ప్రాసిక్యూట్ చేయాలనే నైతిక అధికారం, హక్కు లేదు.

గూఢచారి వ్యవస్థల్లో ఆడవారిని వినియోగించడం, శత్రుదేశాల రహస్యాలు కనుగొనడానికి ఎరలుగా స్త్రీలను ప్రయోగించడం, విషకన్యలను రూపొందించి ప్రత్యర్థి వర్గాలను అంతమొందించడం రాజనీతిగా, వ్యూహాలుగా, అగ్రస్థాయి రాజకీయ ఎత్తుగడలుగా చలామణి అయిన ఉదంతాలు చరిత్రలో కోకొల్లలు.

హత్యలు, రేప్‌లు చేసిన కేసుల్లో కూడా దురుద్దేశం రుజువు కాలేదని వందల మందిని నిర్దోషులుగా పేర్కొంటూ వదిలేస్తున్న మన న్యాయవ్యవస్థ తెహల్కా జర్నలిస్టులను నేరస్తులని నిర్ధారించగలదా? వారిని ప్రాసిక్యూట్ చేయాలనే అధికార రాజకీయ నాయకులను వారి అవినీతి నేరాలను, వారి పార్టీలు పాల్గొన్న అవినీతి సంఘటనలను ప్రాసిక్యూట్ చేయవలసిన అవసరం లేదా?

నైతిక నియమాలు, విలువల గురించి ఈ కాలంలో మాట్లాడుకుంటూ, ఆ విలువల పేరుతో ఇద్దరు జర్నలిస్టులను శిక్షించే బదులు, లేదా ప్రాసిక్యూషన్ పేరుతో టెర్రరైజ్ చేసే బదులు, వారు బయటపెట్టిన అవినీతిని ప్రక్షాళన చేయడానికి చిత్తశుద్ధితో కృషి చేయడం ఇప్పటి అవసరం●





# దునియా..

## కాళికాలయ పూజారి మహ్మద్ అలంగీర్

కలకత్తాలో గంగానది ఒడ్డున ఖాజెకలా గ్రామంలో వున్న కాళిమాత ఆలయానికి ఓ విశేషం వుంది. అక్కడ మాతకి నిత్యపూజదికాలు నిర్వహించేది ఓ ముస్లిం. ఆయన పేరు మహ్మద్ అలంగీర్. 16 ఏళ్ల నించీ ఆయన ఇదే ఆలయంలో వుంటున్నాడు. వేకువనే లేచి, గంగలో మునకేసి కాళిక పూజకి ఉపక్రమించడం ఆయన దినచర్య. మహ్మద్‌కి చిన్నప్పుడే తల్లిపోయింది. రెండోపెళ్లి చేసుకున్న తండ్రి - మహ్మద్‌కి బలవంతంగా చిన్నతనంలోనే పెళ్లి కూడా చేశాడు. దాంతో ఓ రోజు ఇంట్లోంచి పారిపోయి ఖాజెకలా చేరాడు. అక్కడ కాళిమాత ఆలయం ప్రధాన పూజారి మహంత్ ప్రకాష్‌నాథ్ ఆలయంలో వుండడానికి అనుమతించాడు. అలా... అలా కాళిమాత ఆయనను ఆకర్షించింది. సేవలో నిమగ్నమయ్యాడు. మహ్మద్ భక్తిని చూసి మహంత్ ఆయనని 12 ఏళ్ల క్రితం కాళి ఆలయ పూజారిగా నియమించాడు. మొదట్లో రుసరుసలాడిన భక్తులు క్రమంగా ఆయనతోనే పూజలు చేయించుకోవడం మొదలుపెట్టారు. అయితే మహ్మద్ ఓవైపు కాళికను ఆరాధిస్తూనే - మరోవైపు నమాజ్‌నూ, ఇతర సాంప్రదాయాలనూ పాటిస్తూ వచ్చాడు. అయితే మహ్మద్ తీరు హిందూ, ముస్లిం ఛాందస వాదులకి ఏమాత్రం నచ్చలేదు. రెండువైపుల్నుంచీ ముప్పు మహ్మద్‌ని వెంటాడుతోంది. "దేవుడొక్కడే... పూజించే మార్గాల్లోనే తేడా అల్లా... బెదిరింపులకి జడిసి ఆలయాన్ని వదిలిపెట్టను. అలాగని నా మతాచారాలకు దూరం కాను" అంటున్న మహ్మద్ మాట ఛాందసులకు తలకెక్కుతుందా!•



## విచిత్ర సహోదరులు



ఫోటోలో కనిపిస్తున్న ముగ్గురూ అన్నదమ్ములే. పేర్లు అర్మగం (52) వినాయక్ మూర్తి (48) ఏలుమలై (46). పుట్టింది మన తల్లుల్లాంటి ఓ మాతృమూర్తికే అయినా - లోపం ఎక్కడుందో తెలియదుకాని ఈ ముగ్గురి ప్రవర్తనా, ఆకారాలు, లక్షణాలు, మన 'పూర్వీకుల్ని' తలపిస్తాయి. వీళ్లకి భాష తెలియదు. మాట్లాడ్డం తెలియదు. పెట్టిందేదో తింటారు. అయితే ఈ విచిత్ర సహోదరుల్ని లోకమంతా వింతగా చూసినా - వదిన మురుగేశ్వరికి మాత్రం ఎంతో ప్రేమట. వీరి ఆలనాపాలనా ఆమె చూసుకుంటుంది. బెంగుళూరులో ఈ మధ్య ఓ అమ్యూజ్‌మెంట్ పార్క్ నిర్వాహకులు ఈ సోదరుల్ని - ప్రత్యేకంగా కట్టిన ఎన్‌క్లోజర్‌లో వుంచి - పది రూపాయల టిక్కెట్టు పెట్టి మరీ జనానికి చూపించారు. వీరి అనాకారితనమూ ఓ సేలెబుల్ పాయింట్‌గా మారడం ఈ వ్యాపార ప్రపంచంలో వింతేముంది?•

## శరీరమొకటే.. తలలు రెండు



బోసినవ్వులు చిందిస్తున్న ఈ ఇద్దరు పాపల శరీరం మాత్రం విచిత్రంగా ఒక్కటే. ఓ చైనీస్ తల్లికి ఈ కవలపిల్లలు అతుక్కుని పుట్టారు. వీరిని విడదీయాలంటే ఖరీదైన ఆపరేషనే మార్గం. ఆ ఖర్చుని భరించే తాహతు లేని ఆ తల్లి ఆస్పత్రి బైట కనవద్ద వారినల్లా సాయం కోసం దీనంగా అర్థిస్తోంది•

## ఖైమాకొట్టు రుఖియమ్మ

కటికదరిద్రమే రుఖియాను ఈ కటికవృత్తిలోకి దింపింది. కేరళలోని వైనాడుకు చెందిన 41 ఏళ్ల రుఖియా ఇప్పటికి పదిహేడేళ్లుగా మాంసం కొడుతూనే ఉంది. బహుశా కేరళలో ఈ వృత్తిలో వున్న ఏకైక మహిళ రుఖియానే కావచ్చు. ఈ పని నేర్చుకోకముందు ఆమె తోట పని చేసేది. ఆ ప్రాంతంలో ఉన్న ఒక మాంసం కొట్టు యజమాని దగ్గర ఈ కటిక పనిని నేర్చుకుంది. తోటపనికంటే మాంసం కొట్టే పనిలోనే ఎక్కువ డబ్బులొస్తాయని అర్థం చేసుకుంది. అప్పటినుంచి పూర్తి స్థాయిలో ఈ వృత్తికే అంకితం అయిపోయింది. ఇప్పుడామెకు నలుగురు మగవాళ్ళు అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారు. వారానికి సగటున పదిహేను గేదెలు రుఖియా చేతిలో మాంసం ముక్కలుగా మారుతుంటాయి. ఈ వృత్తిలోకి మారిన తరువాతే రుఖియా తను నలుగురి చెల్లెళ్లకి ఘనంగా పెళ్లిల్లు చేసింది. మరి నీ పెళ్లి సంగతేమిటని ఎవరైనా అడిగితే, "మంచి వయసులో నా పెళ్లి గురించి ఆలోచించేటంత టైం నాకు లేకపోయింది" అని చెబుతుంది రుఖియా - దమ్ము మీద దమ్ము లాగుతూ•



## 8,000 గుడ్లు + 900 కిలోల బంగాళా దుంపలు

ఒక్కరా... ఇద్దరా... 20 మంది నలభీములు. అట్లాంటిట్లాంటివారా ఏం? ఏవంటకాన్నైనా ఇట్టే వండి వడ్డించే 'గరిటె తిరిగిన' సిద్ధహస్తులు. వీరికి సాయం చేసేందుకు మరో 20 మంది. ఇంతమంది పాచకజెట్టీలు ఒక్కచోట చేరారంటే ఏదో అద్భుతం జరక్కుండా వుంటుందా? జరిగింది... అంతేకాదు అది నేరుగా గిన్నీస్ రికార్డుల్లోకి కూడా చేరింది. అదేమిటంటే... స్పెయిన్‌లోని మాడ్రిడ్‌లో ఈమధ్య 'ఇంటర్నేషనల్ పొటాటో ఫెస్టివల్' జరిగింది. బంగాళా దుంపల వందల వంటకాలతో ఆ నగరం ఘుమఘుమలాడింది. తాము అమితంగా ఇష్టపడే బంగాళాదుంపల స్పెషాలిటీ చూపించాలని కొందరు పాచకభీములు కలిసి ఈ మెగా 'దుంప ఆమ్లెట్'ని వేశారు. ఇందుకోసం ఎనిమిది వేలకిపైగా గుడ్లను చితగ్గొట్టి - ప్లాస్టిక్ బకెట్లతో ఆ సొనని - పెనం మీద కుమ్మరిస్తున్న వైనాన్ని ఫోటోలో చూడండి. 900 కిలోల బంగాళా దుంపల్ని ముక్కలు తరిగి ముందే ఆ పెనం మీద వేశారు. ఈ మెగా ఆమ్లెట్ ఫెస్టివల్‌కి హాజరైన వేలమంది బ్రేవుమనిపించారు•





విజయవిహారం ప్రతినెలా మొదటివారం మిమ్మల్ని నమ్మకంగా చేరే ఒక మార్గం - మీరు పత్రిక చందాదారులుగా చేరడమే!



# ప్రాణవాయువుకు ప్రాణదానం

# చిప్కో ఉద్యమం

జీవన భాషలో చెట్టు ఒక
ఛాయామయ విరామం
ఎక్కడ చేరి పక్షులు మనుష్యులు
నిశ్శబ్దాలై కలలు కంటారో -
దాన్ని విరిచి గొడ్డలి చేయకు
దాన్ని ఉరికంబం చేయకు
దేశపు వీరత్వాన్ని
దానికి వేలాడ దీయకు

\- శేషేంద్ర

ఒక తల్లికే తెలుస్తుందేమో నేలతల్లి మనసు! భూమి గుండెతో పెనవేసుకుపోయిన చెట్లని మొదలంటా నరికేసి, పచ్చదనానికి పాగపెట్టి, అదే అభివృద్ధి అనుకొమ్మంటే - ఆ పల్లెల్లోని తల్లులేమన్నా చదువుకున్న మూర్ఖులా? తలూపడానికి!

తిరగబడ్డారు... చెట్టుకొకరు అడ్డుపడ్డారు. మొదలును బిగ్గరగా వాటేసుకున్నారు. దమ్ములుంటే గొడ్డళ్ల ఎత్తమని సవాలు చేశారు. వారి తెగింపు చూసి-లేచిన గొడ్డళ్లు తోక ముడిచాయి.

ఉత్తర ప్రదేశ్‌లో హిమాలయ పర్వత సానువుల్లోని పల్లెల్లో - పచ్చదనాన్ని రక్షించుకునేందుకు ఎగిసిన ఓ నిశ్శబ్ద ఉద్యమం అది. ప్రేమతో ప్రత్యర్థిని గెలిచిన ఆ సమరం పేరు చిప్కో ఉద్యమం.

1974, మార్చి...

ఉత్తర ప్రదేశ్ ఘర్‌వాల్ ప్రాంతంలోని ఓ మారుమూల గ్రామం రేని. అదంతా అటవీ ప్రాంతం. అక్కడి చెట్లని నరకడానికి ఓ రోజు కొందరు కంట్రాక్టర్లు తమ మనుషులతో వచ్చారు. చెట్లపై వేటు వేసేందుకు సిద్ధమయ్యారు. ఈ సంగతి ఆ పల్లెవాసులకి తెలిసింది. ఏదో ప్రమాదం ముంచుకొచ్చినంత ఆందోళన పడ్డారు. గౌరీదేవి అనే ఆవిడ నాయకత్వంలో కొందరు మహిళలు అక్కడికి చేరుకున్నారు. కంట్రాక్టర్లని, వారి మనుషుల్ని అడ్డుకున్నారు. ఒక్క చెట్టుపై వేటు పడ్డా వూరుకునేది లేదని తెగేసి చెప్పారు. ఆ ప్రాంత అభివృద్ధి కోసమే ఇదంతా అని కంట్రాక్టర్లు నచ్చజెప్పడానికి ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. వన సంపద నాశనం చేసి సాధించే ఆ అభివృద్ధి తమకు అక్కర్లేదని ఖండితంగా చెప్పారు. చేసేది లేక వారు వెనక్కి తగ్గారు.

ఇలా చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా కొందరు స్త్రీల సత్యాగ్రహంతో మొదలైన నిరసనే తర్వాతికాలంలో చిప్కో ఉద్యమంగా పెను ప్రకంపనాన్ని సృష్టించింది. ఈ ఉద్యమం క్రమక్రమంగా హిమాలయ ప్రాంతంలోని పల్లెటూళ్లన్నింటికీ వ్యాపించింది. బలప్రదర్శన కాని, ధర్నాలు, లాంటివేవీ ఈ ఉద్యమంలో కనిపించవు. హింసకు ఏ మాత్రం చోటు లేదు. మహాత్మాగాంధి బోధన స్ఫూర్తితో - చినుకులా మొదలై ఉత్తుంగ తరంగితమై ఉత్తర ప్రదేశ్‌లోని అటవీ ప్రాంతాలన్నింటా వ్యాపించింది.



చండీ ప్రసాద్ భట్

చిప్కో అంటే హత్తుకోవడం లేదా అంటిపెట్టుకోవడం అని అర్థం. చెట్లను నరికేయడానికి వచ్చిన వారితో ఎలాంటి బాహా బాహీకి దిగకుండా ఒక్కొక్కరు ఒక్కో చెట్టుని హత్తుకుంటారు. "ముందు మా తలలు తెగనరికాకే ఈ చెట్టుని నరకండి" అని సవాలు చేస్తారు.

పూర్తిగా గాంధీ మార్గంలో, అహింసాత్మకంగా సాగిన ఈ ఉద్యమం ప్రభుత్వ, అధికార యంత్రాంగాలకే పర్యావరణ రక్షణపై కొత్త పాఠాలు నేర్పింది.

మొదట్లో చిప్కో ఉద్యమం ఒక ప్రణాళికా బద్ధమైన, సంఘటిత ఉద్యమంగా ప్రారంభం కాలేదు. హిమాలయ పర్వత ప్రాంతంలోని రేని, గోపేశ్వర్, దుంగరి పైటోలి తదితర వందలాది గ్రామాల్లో చెట్ల నరికివేతకు వ్యతిరేకంగా, వేర్వేరుగా సాగిన నిరసన ప్రదర్శనలే చిప్కో ఉద్యమంగా ఒక రూపాన్ని సంతరించుకున్నాయి.

నిజానికి 1970 దశకం మొదట్లో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఎక్కడా ఎలాంటి పర్యావరణ ఉద్యమాల ఊసన్నదే లేదు. అలాంటి సమయంలో భారత్‌లోని మారుమూల పల్లెల్లో మొదలైన ఈ కొత్త తరహా నిరసన ఉద్యమం అప్పట్లో యావత్ ప్రపంచం దృష్టినీ ఆకర్షించింది.

వర్తమాన దేశాల మేధావుల మెదళ్లని, ఆలోచనా విధానాన్నీ - సంపన్న దేశాలు ఆర్థికంగా సాధించిన అభివృద్ధి మత్తు కమ్మేసిన రోజులివి. కానీ పర్యావరణ రక్షణ, అభివృద్ధి అనేవి సమాంతరంగా సాగాలన్న సందేశాన్ని - చిప్కో ఉద్యమం బలమైన గొంతుతో వినిపించింది. అభివృద్ధి అంటే చెట్లు నరకడం, డాములు కట్టడం, భారీ పరిశ్రమలు నెలకొల్పడం ఒక్కటే కాదని - ప్రకృతి సంపదను కాపాడుకుంటూనే ఈ అభివృద్ధిని సాధించవచ్చని ప్రపంచానికి అప్పట్లో పరోక్షంగా చాటిచెప్పిన ఉద్యమం ఇదే.

ఈ ఉద్యమం 1980 ప్రాంతంలో అంతర్జాతీయంగా ఎంత ప్రభావితం చేసిందో చెప్పడానికి ఒక ఉదాహరణ. నార్వే ప్రధాని గ్రోహర్లెమ్ బ్రంట్‌లాండ్ - రేని పల్లె మహిళలు ప్రారంభించిన చిప్కో ఉద్యమానికి ప్రభావితుడై ఆర్థికాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ సమాంతరంగా సాగాలని ప్రతిపాదన చేశాడు. 1992లో బ్రెజిల్‌లోని రెమూ డిజనేరోలో జరిగిన ధరిత్రీ సదస్సు దీనికి ఏకగ్రీవంగా ఆమోదముద్ర వేసింది.

'ఆజ్ హిమాలయ్ జాగేగా, క్రూర్ కుల్హారా భాగేగా'

'అడవుల దగ్గరేముంది? స్వచ్ఛమైన నేల, మట్టి, గాలి తప్ప'

ఇలాంటి నినాదాలతో వనసంపదను కాపాడుకొనేందుకు పల్లెల్లో మొదలైన నిరసన ప్రదర్శనలు చిప్కో ఉద్యమంగా రూపుదిద్దుకుంది.

1970 ప్రాంతంలో ఈ నినాదాలు యు.పి. పల్లెల్లో ప్రతిధ్వనించాయి. మహిళల అహింసాయుత నిరసన చూసి అధికారులు, కంట్రాక్టర్లు ఖంగుతిన్నారు. అయితే ఈ నిరసన ప్రదర్శనలను సమీకృతం చేసి 'చిప్కో మూమెంట్' పేరిట ఓ మహా ఉద్యమంగా రూపుదిద్దిన ఘనత ఇద్దరు గాంధేయవాదులకే దక్కుతుంది. వారిలో ఒకరు చండీప్రసాద్ భట్ కాగా రెండవ వ్యక్తి సుందర్ లాల్ బహుగుణ.

## నిశ్శబ్ద విప్లవసారథి: చండీప్రసాద్ భట్

చండీప్రసాద్ ఓ నిస్వార్థ సమాజ సేవకుడు. ఉత్తర ప్రదేశ్‌లోని గోపేశ్వర్ గ్రామానికి చెందిన ఈయన అక్కడి పల్లె ప్రజలతో అత్యంత సన్నిహితంగా మెదిలారు. వారితో కలిసి జీవించారు. పర్యావరణాన్ని రక్షించుకునేందుకు వారికి వున్న హక్కులేమిటో వివరించారు. ఆ హక్కుల్ని సాధించుకోవడానికి ఎలా ఉద్యమించాలో మార్గం చూపి ప్రోత్సహించాడు. చండీప్రసాద్ అవిశ్రాంత కృషి వల్ల చెట్ల నరికివేత ఆగిపోవడమే కాదు... పచ్చదనం వాడిపోయి, జల సంపదలేక - పరిస్థితి దయనీయంగా మారిన అలకానంద వ్యాలీ అంతటా విస్తృతంగా చెట్లు నాటే కార్యక్రమానికి సారథ్యం వహించాడు. ఇప్పుడు ఈ వ్యాలీ స్వరూపమే మారిపోయింది. వన రక్షణ ఉద్యమం మహిళల వల్లే సాధ్యమవుతుందని గ్రహించిన చండీ ప్రసాద్ వారి ఆదరాభిమానాలు విశేషంగా చూరగొన్నాడు. హిమాలయ పర్వత సానువుల్లో - ఇంటింటికీ వెళ్లి - పెద్దవాళ్లను ఆప్యాయంగా పలకరించి "అమ్మా! నీ కూతుళ్లకి, కోడళ్లకి ఎన్ని చెట్లు బహుమానంగా ఇస్తున్నావ్" అంటూ ప్రశ్నించే చండీప్రసాద్ అంటే వాళ్లకి ఎంత అభిమానమో!

## అవిశ్రాంత యోధుడు: బహుగుణ

సుందర్‌లాల్ బహుగుణ ఒక అవిశ్రాంత పోరాట యోధుడు. మనిషి చాలా సాదాసీదా. తెల్లటి గడ్డంతో, బక్కపలుచగా, భుజం మీద ఒక్కోసారి కండువా సైతం లేకుండా - గోచీ కట్టుతో పల్లెల్లోనే తిరుగుతూ ఓ పల్లెటూరి రైతులా వుండే ఈ మనిషంటే అటు ప్రభుత్వాలకీ, అధికార యంత్రాంగానికి, కంట్రాక్టర్లకీ హడల్. అలాగని ఈయనేదో పల్లె ప్రజల్ని రెచ్చగొడుతున్నాడని కాదు. బహుగుణ శుద్ధ గాంధేయవాది. గాంధీజీ లాగే నిరసన తెలియచేయాల్సిన ప్రతిసారీ నిరసన దీక్ష చేస్తారు.



సుందర్‌లాల్ బహుగుణ

ప్రజా నిరసనకు ఆ అహింసాయుత స్ఫూర్తే బలమైన గొంతుకను ఇచ్చింది. దీనికి ఓ ఉదాహరణ. 1977 డిసెంబర్‌లో అడ్వాణీ ప్రాంత అడవుల్లో చెట్లనరికివేతకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. అప్పటికే చిప్కో ఉద్యమం ఆ పరిసర ప్రాంతాల పల్లెల్లో ఉధృతంగా వీస్తోంది. బహుగుణ ప్రభావమే ఇదంతా. మహిళల్లో ఎంత చైతన్యం వచ్చిందంటే ఒక్క చెట్టు నేలకూలినా సహించని స్థాయికి చేరుకున్నారు. అడ్వాణీ అడవుల్లో కొంత భాగాన్ని నరికివేయడానికి అన్ని హంగులతో వచ్చిన వారిని వందల సంఖ్యలో మహిళలు అడ్డుకున్నారు. అక్కడికి వచ్చిన కంట్రాక్టర్లలో ఆ ప్రాంతానికి చెందిన గ్రామం పెద్దకూడా వున్నాడు. విచిత్రమేమంటే - వారిని తీవ్రస్థాయిలో ప్రతిఘటించిన మహిళల్లో ఆ గ్రామపెద్ద భార్య కూడా వుంది. వీరంతా ఒక్కో చెట్టుకు తమని తాము సన్నటి తాడుతో కట్టేసుకొని దమ్ములుంటే నరుక్కోమని సవాలు చేశారు.

దీంతో ఆ కంట్రాక్టర్లంతా, రుసరుసలాడుతూ అప్పటికి వెళ్ళిపోయి-మరో రెండు నెలల తర్వాత మళ్లీ వచ్చారు. ఈసారి సాయుధులైన పోలీసు బలగాన్ని వెంటేసుకొని మరీ వచ్చారు. అయినా ఆ పల్లె మహిళల సత్యాగ్రహం ముందు మందబలం నిలవలేక పోయింది. అయినా ప్రభుత్వం, అధికారులు పట్టువదలనివిక్రమార్కుల్లా మళ్లీమళ్లీ రావడంతో బహుగుణ ప్రత్యక్షంగా రంగంలోకి దిగారు.

బైదియంగర్ అనే గ్రామంలోకి ఇలాగే పోలీసు బలంతో వచ్చిన కంట్రాక్టర్లని వెళ్లగొట్టేందుకు ఆమరణ నిరశన దీక్షకు దిగారు. ఆయనను అరెస్టు చేసి జైల్లో నిర్బంధించారు.

అప్పటికే చిప్కో ఉద్యమం యు.పి. రాష్ట్ర ప్రభుత్వానికి దడపుట్టించింది. 1975ప్రాంతంలో అప్పటి యు.పి. ముఖ్యమంత్రి హేమవతీనందన్ బహుగుణ చిప్కో ఉద్యమకారుల వాదనలో ఎంత వరకు నిజముందో నిగ్గు తేల్చాలని ఒక ఉన్నత స్థాయి కమిటీ వేశారు. ఆ కమిటీ కూడా ఉద్యమాన్నే బలపరుస్తూ నివేదిక ఇచ్చింది.

1980 నాటికి సుందర్‌లాల్ బహుగుణ అంటే అక్కడి పల్లెవాసులకి దైవ సమానుడయ్యాడు. 'అడవిరుషి'గా ఆదరం చూరగొన్న బహుగుణ అప్పటి ప్రధాని ఇందిరా గాంధీని కలిసి హిమాలయ పర్వత ప్రాంతంలో చెట్ల నరికివేతను పూర్తిగా నిషేధించాలని ఒత్తిడి తెచ్చారు. కేవలం ఆయన చొరవ వల్లే - ఇందిరాగాంధీ ఆ ప్రాంతంలో 15 ఏళ్లపాటు చెట్లను కూల్చడాన్ని పూర్తిగా నిషేధించారు.

బహుగుణ సారథ్యంలో తారస్థాయికి చేరిన చిప్కో వనసంరక్షణ ఉద్యమం 1981 నాటికి దేశంలోని ఇతరప్రాంతాలకూ విస్తరించింది. 81-83 మధ్య బహుగుణ కాశ్మీర్ నుంచి ఈశాన్య భారతంలోని కోహిమా వరకు దాదాపు 5000 కిలోమీటర్ల మేర పాదయాత్ర నిర్వహించారు. దేశవ్యాప్తంగా అప్పట్లో ఇది సంచలనం సృష్టించింది.

నేపాల్, భూటాన్‌లోని అనేక ప్రాంతాల్లో కూడా ఆయన - కాళ్లకి కనీసం చెప్పులు లేకుండా పాదయాత్ర నిర్వహించారు. మారుమూల అటవీ ప్రాంతాల్లో పర్యావరణ రక్షణకు ఒక శాంతియుత నిశ్శబ్ద విప్లవాన్ని తెచ్చిన బహుగుణకు నార్వే ప్రభుత్వం "రైట్ లైవ్‌లీ హుడ్" ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఇది నోబెల్ అవార్డుతో సమానమైన పురస్కారంగా పరిగణిస్తారు.

1990 ప్రాంతంలో బహుగుణ తన పోరాట మార్గాన్ని గర్‌వాల్ ప్రాంతంలో నిర్మాణం మొదలైన తెహ్రీ డ్యామ్ వైపు మళ్లించారు. డ్యాం నిర్మాణంతో నిర్వాసితులైన వేలాది పల్లెప్రజల పక్షాన నిలిచారు. 'సేవ్ హిమాలయన్ మూమెంట్' పేరిట సరికొత్త ఉద్యమాన్ని ప్రారంభించారు.

తెహ్రీ డ్యాం నిర్మాణంతో తెహ్రీ ప్రాంతంలోని పాఠశాలల్ని మరో ప్రాంతానికి తరలించింది ప్రభుత్వం. దీంతో ఆ పర్వత ప్రాంతంలోని దాదాపు 2000 మంది పిల్లలు స్కూళ్లకి చేరుకోవాలంటే 44 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ఇది ఓ ఉదాహరణ మాత్రమే. అభివృద్ధి అవసరమే గానీ దానికోసం ప్రకృతినే నమ్ముకున్న లక్షలాదిమంది పల్లెప్రజల జీవితాలని పణంగా పెట్టాల్సిన అవసరం లేదు అని బహుగుణ వాదిస్తారు.

చండీప్రసాద్, బహుగుణ లాంటి వ్యక్తులు మామూలు వాళ్లే కావచ్చు. కాని చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే మహా ఉద్యమాలకి ఊపిరిపోయాల్సి వచ్చినప్పుడు ఆ వ్యక్తులే హిమాలయాలంత సమున్నతంగా ఇంతింతై ఎదుగుతారు. దీనికి చిప్కో ఉద్యమ చరిత్రే నిదర్శనం.

\- శేషు

# వాజ్‌పాయ్ హైకూలు

ఇటీవల వాజ్‌పాయ్ తెలుగులో కొన్ని హైకూలు రాసుకున్నారు. అవి మాకు ఎలా దొరికాయని అడక్కండి ప్లీజ్!

అద్వానీ మీసం వల్లే మిస్సయ్యింది
నాకు ఆగ్రా ఒప్పందంలో
పీస్ పైజు

రాజీనామా చెయ్యాలనిపిస్తుంది
ఎన్డీఏ సమావేశంలోనే కానీ
రాష్ట్రపతిభవన్‌లోకాదు



వెంకయ్యనాయుడు కంటే మెరుగు
ఎర్రంనాయుడు, అంతకంటే నయం
చం.బా.నాయుడు

మంతనాలకి జశ్వంత్
చర్చలకి హురియత్
మోకాలికి రణవత్

'హా'లో ప్రెసిడెంట్' అంటే
తథాస్తు దేవతలు వింటే
నా తప్పా?

అద్వానీ ఎన్నైనా అనుకోనీ
బాల్‌థాక్రే హుక్కా మొత్తం తాగైనీ
బాబులేడా?

ఫూలన్ మరణం కాదు కానీ
పుట్టిమునిగేట్టుంది
మాకు యు.పి.లో

నయం నాదాకా తెచ్చాడు కాదు
తెహెల్కా కెమెరాల్ని
మా బంగారు

మా 'బంగారు' 'జార్జి' దగ్గిర
డబ్బు పెడితే మరి
తీసుకోరా?

నాకు తెలుసు నా మొహం చూసికాదు
నాకు ఓట్లేసేది ఖాయంగా
సోనియా మొహం చూసే

మద్దతు నిధి ఎవరిచ్చినా
తీసుకుంటాం -
కరుణానిధేం ఖర్మ

మార్చిలోగా తీరుస్తానన్నా
అయోధ్య తగాదా, తర్వాత
సెప్టెంబర్ లేదా?

ఈ జోకులన్నీ సరదాకి. కేవలం నవ్వుకోడానికి. వీళ్ళ మీదో వాళ్ళ మీదో జోకేస్తే జనం నవ్వరు సరికదా, నవ్విపోతారు. అదే జోకుకి జయలలితనో, చంద్రబాబునో, వాజ్‌పాయ్‌నో, అద్వానీనో జతకలిపితే చక్కగా పేలుతుంది. కనుక మనసారా నవ్వుకోడానికి తప్ప ఎవరి మనసూనొప్పించడం మా ఉద్దేశంకాదు. సో ఇట్సాల్ జస్ట్ ఫర్ ఫన్. డోన్ట్ మిస్టేక్ అజ్..... - ఎడిటర్

## విజయవిహారం హ్యూమర్ స్ప్రెడ్ 17



### ఎలా?

ముఖ్యమంత్రి చంద్రబాబు కంప్యూటర్ ఎగ్జిబిషన్‌ని ప్రారంభించారు. స్టాల్స్ అన్నీ చూస్తూ ఒక స్టాల్‌లో కంప్యూటర్లు కారుచౌక ధరలో అమ్మడం చూసి చంద్రబాబు పరమానంద భరితులయ్యారు. "భేష్, ధరలు చాలా తక్కువ పెట్టారు. కానీ ఇంత తక్కువ ధరలో అమ్మితే మీకు లాభం ఎలా వస్తుంది?" అని ప్రశ్నించారు.

స్టాల్ యజమాని సంతోషపడి "నిజమే సార్, కానీ మేం లాభాలు రిపేర్లు చేసి సంపాదిస్తాం" అని మనవి చేశాడు.



## బస్ డ్రైవర్, ఫుట్‌బాల్ ప్లేయర్, రిఫరీ చైతాలీ ఛటర్జీ

ప్యాంట్, టీషర్ట్, క్రాపులతో కనిపించే చైతాలీ ఛటర్జీని చూసిన వారెవరైనా మీసాలు తీసిన నవయువకుడని పొరపడతారు. చైతాలీ కోల్‌కత్తా మొత్తం మీద మొదటి హిళా బస్ డ్రైవర్. అంతేకాదు జాతీయ స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారిణి కూడా. ఇక్కడితో అయిపోలేదు. మూడో విశేషం కూడా వుంది. చైతాలీ ఆసియాలో కెల్లా మొదటి మహిళా ఐ.ఎస్.ఎ. రిఫరీ కూడా. "మహిళలు చేయలేని పనేమీ లేదు. ఫలానా పని పురుషులది, ఫలానా పని స్త్రీలది అనే విభజన నేను ఒప్పుకోను. అందుకే నేను మగవాళ్ళు మాత్రమే ఆడగలరు అనుకునే ఫుట్‌బాల్ క్రీడను ఎంపిక చేసుకుని జాతీయ స్థాయికి ఎదిగాను. మగవాళ్లు మాత్రమే చేయగలరని అనుకునే హెవీ వెహికల్ డ్రైవింగ్‌లోకీ అడుగుపెట్టి సక్సెస్ అయ్యాను. ఛాలెంజ్‌గా తీసుకుంటే ఏదైనా సాధ్యమే"



అంటుంది చైతాలీ.

ఒక మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన చైతాలీకి ఫుట్‌బాల్ క్రీడాకారిణిగా బెంగాల్ తరఫునా, దేశం తరఫునా ఆడే అవకాశం వచ్చినప్పుడు తల్లిదండ్రులు నిరుత్సాహ పరిచారు. వ్యతిరేకించారు. చివరికి ఆ వ్యతిరేకతను అధిగమించి మరీ తనను తాను రుజువు చేసుకుంది. బస్ డ్రైవర్‌గా పని చేస్తూనే, క్రీడాకారిణిగానూ రాణిస్తున్నది. మహిళా ఫుట్‌బాల్‌కి సంబంధించి మాత్రం ఆమెలో ఒక ఆవేదన ఉంది - "బై చుంగ్ భుటియా ఆడితే పదిహేనులక్షలు ఇస్తారు. అదే ఆట ఒక ఆడపిల్ల ఆడితే పదిహేను వేలు మించి ఇవ్వరు. ఇంత వివక్ష చూపుతుంటే మహిళా క్రీడాకారులు ఎలా ఎదుగుతారు?" అని ప్రశ్నిస్తుంది. చైతాలీ రిఫరీగా పురుషుల ఫుట్‌బాల్ మ్యాచ్‌లకు కూడా పనిచేస్తుంది.






తెలుగు జర్నలిజం చరిత్రలో ఒక వినూత్నాధ్యాయం - తెలుగు పాఠకుల ఉత్తమాభిరుచికి నిజమైన నిదర్శనం- విజయవిహారం



# అందుకని...

8 వేల కోట్ల రూపాయలు విలువైన ఆయుధ కంట్రాక్టుకి సంబంధించి, ఈస్ట్ ఎండ్ కంపెనీ డీలర్లు ఒక పెద్ద ఆర్మీజనరల్‌తో మాట్లాడారు. పేరున్న హోటల్ ఎందుకని, ఢిల్లీలోని ఒక పురాతన త్రీస్టార్ హోటల్‌లో మీటింగ్ ఏర్పాటు చేశారు. ఆర్మీజనరల్ ఈస్ట్ ఎండ్ ఆయుధ డీలర్లనుంచి మొదటి విడతగా 3,500 రూపాయలు అడ్వాన్సుగా పుచ్చుకున్నారు. ఒక బాటిల్ విస్కీ ఖాళీ చేశారు.

అనంతరం ఆర్మీజనరల్ కోరికమేరకు డీలర్లు, ఆయన కోసం ఒక కాల్‌గర్ల్‌ను ఏర్పాటు చేశారు. కంట్రాక్టు ఆ డీలర్లకే ఇప్పిస్తానని భరోసా ఇచ్చి పంపించి, ఆర్మీజనరల్ కాల్‌గర్ల్‌తో కలిసి హోటల్ గదిలో దూరి తలుపు వేసుకున్నారు.

పదినిముషాలు గడిచాక ఆర్మీజనరల్ బుర్రలో ఫ్లాష్ వెలిగింది.

"కొంపదీసి వాళ్ళు తెహల్కా జర్నలిస్టులు కాదుకదా! వాళ్ళు కూడా ఇలాగే అడ్వాన్సు ఇచ్చి మందుపోయించి, కాల్‌గర్ల్‌ని సప్లై చేసి మొత్తం వీడియో కెమెరాకి ఎక్కించి కొంపముంచారు కదా!" ఈ ఆలోచన రాగానే ఆర్మీజనరల్ బుర్ర వేడెక్కిపోయింది.

'సందేహం లేదు వీళ్ళు ఖచ్చితంగా జర్నలిస్టులే అయ్యింటారు' అని ఆయన నిశ్చయించుకున్నారు.

ఈ నిర్ధారణకి రాగానే ఆర్మీజనరల్ కాల్‌గర్ల్‌ని విడిచి, చటుక్కున మంచం మీదనించి కిందకి దూకారు.

రూమ్‌లో వీడియో కెమెరాగానీ, బగ్గింగ్ సాధనాలుగానీ ఉన్నాయేమో వెతకడం ప్రారంభించారు.

కాల్‌గర్ల్‌కి జరుగుతున్నదేమీ అర్థం కాలేదు. ఆర్మీజనరల్ రాత్రంతా వెతుకుతూనే ఉన్నారు. జేబులోంచి బటన్ నైఫ్ తీసి, రూమ్‌లో కనిపించిన వైర్లన్నీ లాగి, కోసి చూశారు. కార్పెట్ అంతా కత్తిరించి అనుమానం వచ్చిన ప్రతీదాన్నీ ధ్వంసం చేశారు. రాత్రంతా ఆయన అన్వేషణ కొనసాగింది.

ఉదయం జనరల్ రూమ్ ఖాళీ చేసి వెళ్ళిపోతుంటే రిసెప్షన్‌లో మేనేజర్ ఆదుర్దాగా అడిగాడు : "సార్ మీరూమ్ ఎలా వుంది, రాత్రి ఎలా గడిపారు? సుఖంగా, సౌకర్యంగా అనిపించిందా? మా హోటల్‌లో మీకేమీ అసౌకర్యం లేదు కదా?"

ఆర్మీ జనరల్‌కి చిర్రెత్తుకొచ్చి "నన్నెందుకు ఈ ప్రశ్నలన్నీ అడుగు తున్నారు?" అని అరిచారు.

మేనేజర్ కాస్త ఇబ్బందిగా మొహం పెట్టి "ఏం లేదు సార్, ఏం జరిగిందో ఏమో, రాత్రి అకస్మాత్తుగా షాండ్లియర్, సీలింగ్‌ఫాన్ ఊడిపడి సరిగ్గా మీ రూమ్‌కిందున్న రూమ్‌లో ఒక జంట చచ్చిపోయారు, అందుకని"

---

- ❑ పేదరాశిపెద్దమ్మ కథలకీ, రాజకీయ నాయకుల ఉపన్యాసాలకీ తేడా ఏమిటి?
- మొదటివి 'అనగనగనగా....' అని మొదలైతే, రెండవరకం 'సోదర సోదరీ మణులారా' అని మొదలౌతాయి.

- ❑ వైయస్ కార్యకర్తలతో ఆత్మాహుతి దళాలు నిర్మిస్తానంటున్నారు, ఎందుచేత?
- వాళ్ళు కార్యకర్తలు కాబట్టి!

- ❑ కరుణానిధిని అరెస్టు చేసిన పోలీసుల్ని వాజ్‌పాయ్ కావాలంటున్నారు, ఎందుచేత?
- 'వీడియో' చూస్తే వాజ్‌పాయేం ఖర్మ, అటువంటి పోలీసులు కావాలని సి.ఎం.లు అందరూ ఎగబడతారు!



# గీతాసారం





చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేలకి, ఎంపీలకీ, మంత్రులకీ యోగ, వ్యక్తిత్వ వికాసంలో శిక్షణలతో పాటు ఆధ్యాత్మిక ఉపన్యాసాలు ఇప్పించేందుకు స్వామీజీని కూడా రప్పించారు.

స్వామీజీ ఎమ్మెల్యేలనీ, ఎంపీలనీ సమావేశపరిచి "నేటి రాజకీయాలు లంచగొండితనం, స్వార్థం, అక్రమాలకి ఆలవాలవాలమైనాయి. మొదట ఆ విషయం గురించే ఆధ్యాత్మిక ప్రసంగాలు చేస్తాను. రాబోయే బుధవారం మొదటి ప్రసంగం. ఇందుకు ప్రిపరేషన్‌గా మీరంతా భగవద్గీతలోని 19వ అధ్యాయం బాగా చదువుకుని రండి" అన్నారు.

స్వామీజీ అందరికి భగవద్గీత కాపీలు కూడా పంచారు.

బుధవారంనాడు సమావేశమైనప్పుడు "నేను మొన్న చెప్పిన విధంగా భగవద్గీత 19వ అధ్యాయం చదివినవాళ్ళు చేతులు ఎత్తండి" అన్నారు స్వామీజీ.

ఎమ్మెల్యేలు ఎంపీలు అందరూ చేతులు ఎత్తారు.

"నేను గీతాసారాన్ని అవసరమైన వాళ్ళకి బోధిస్తున్నానో లేదో అనే చింత తీర్చుకోవడానికే మీకు ఆ ప్రశ్నవేశాను. నిజానికి భగవద్గీతలో 19వ అధ్యాయం అనేది లేదు. గీతలో ఉన్నవి 18 అధ్యాయాలే. కాబట్టి నేను గీతాసారం అవసరం ఉన్న శ్రోతలతో మాట్లాడు తున్నానని నాకు అర్థమైంది. అందుచేత ప్రసంగం ప్రారంభిస్తాను" అని చిరునవ్వుతో చెప్పారు స్వామీజీ.

---



## గెలుపుకెరటాలు

### అంటార్కిటికాలో 16 నెలలు గడిపిన తొలి భారతీయ మహిళ

# కన్వల్ విల్కు



సాహసానికి వయసు అడ్డురాదని నిరూపించిన మహిళ కన్వల్ విల్కు. 52 ఏళ్ల వయసులో, అది కూడా మంచు ఖండమైన అంటార్కిటికా వెళ్లి, ఏకంగా 16 నెలల పాటు గడిపిన సాహసి ఆమె. ఇరవై నాలుగు మంది సభ్యుల భారత బృందంలో ఒంటరి మహిళగా, అందరి కంటే పెద్ద వయస్కురాలిగా ఆ మంచు ఎడారికి విజయవంతంగా వెళ్లి వచ్చింది. ఆమె కంటే ముందు పన్నెండు మంది స్త్రీలు ఆ మంచు ఎడారికి వెళ్లారు కానీ, అక్కడి వాతావరణానికి తట్టుకోలేక రెండు మూడు నెలలకే తిరిగొచ్చారు. పైగా ఉష్ణోగ్రత మైనస్ 60 డిగ్రీలుండే శీతాకాలంలో అక్కడ గడిపిన ఏకైక మహిళ కూడా ఈవిడే.

ఎటుచూసినా మంచు తప్ప మరేమీ కనిపించని ఆ అతిశీతల ఖండంలో మంచు తుఫాన్లు, హిమానీ నదాలు అక్కడికి వెళ్లినవారిని తీవ్రంగా ఆటంకపరుస్తాయి. అక్కడి వాతావరణంలో జుత్తురాలటం, దంత సమస్యలు, చర్మరోగాలు లాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఇవన్నీ ఒక ఎత్తు అయితే అక్కడ వుండే వారిలో తలెత్తే డిప్రెషన్, మానసిక సమస్యలు మరో ఎత్తు. వీటన్నింటినీ తట్టుకుని నిలబడింది కన్వల్. భర్త ఆర్మీ ఆఫీసర్. ఆమె డాక్టరు. ఉద్యోగ రీత్యా ఆమె అనేక సంవత్సరాలు కాశ్మీర్, అస్సాం, లడఖ్, హిమాచల్ ప్రదేశ్, మిజోరం లాంటి ఎత్తయిన ప్రాంతాల్లో గడిపింది. ఈ అనుభవం ఆమె అంటార్కిటికాను తట్టుకోవటంలో ఉపకరించింది. అంటార్కిటికా వెళ్లిన భారత టీమ్‌కి వైద్యురాలిగా వెళ్లిన కన్వల్ అక్కడ రెండు ఆపరేషన్లు కూడా చేసింది.

"వేసవిలో నెలల తరబడి ఇరవై నాలుగు గంటలూ పగలే వుంటుంది. అప్పుడు సూర్యుడు తూర్పునే ఉదయించి తూర్పునే అస్తమించటం మరో విశేషం. ఇక చలికాలంలో ఇరవై నాలుగు గంటలూ రాత్రే వుంటుంది" అని అంటార్కిటికా వాతావరణం గురించి వివరిస్తుంది ఆమె. అక్కడికి వెళ్లినవారు నిల్వచేసిన పదార్థాలు మాత్రమే తినే అవకాశం వుంటుంది. కానీ కమల్‌కి కొన్నాళ్లకి విసుగు పుట్టి దాదాపు ఏడు నెలలపాటు మొలకెత్తిన ధాన్యాలు, పెరుగుతో మాత్రమే సరిపెట్టుకుంది. అక్కడున్న అతి శీతల వాతావరణంలో పెరుగు తోడుకోవడం చాలా కష్టమయ్యేది. కన్వల్ విటమిన్ 'సి' టాబ్లెట్లను ఉపయోగించి పెరుగు తయారు చేసుకునేది. మహిళల సంకల్పానికి ప్రతీకగా నిలిచిన కన్వల్‌కి మొత్తం మహిళలే సభ్యులుగా వుండే టీమ్‌ను రూపొందించి మరోసారి అంటార్కిటికాకు వెళ్లాలనేది ఆకాంక్ష●



# వైతాళికుడు అంబేద్కర్ 16

సాంఘిక విప్లవ సూర్యుడి శిఖరాయమాన వ్యక్తిత్వంపై నిబద్ధతగల సోషలిస్టు మేధావి నిష్పాక్షిక విశ్లేషణ

కులనిర్మూలన కాంక్షించే ప్రతి ఒక్కరూ చదివితీరాల్సిన రచన!

ధారావాహిక ♦ రచన : కీ.శే. మధులిమాయె ♦ అనువాదం : కీ.శే.సురమౌళి

## బలమైన కేంద్రం-1

(గత సంచిక తరువాయి)

వికేంద్రీకరణకు సంబంధించిన గాంధీజీ అభిప్రాయాలతో డాక్టర్ అంబేద్కర్ ఏకీభవించలేదు. రాజకీయ, ఆర్థిక శక్తి దిగువ స్థాయికి వ్యాపించాలన్న వాదం వెనుక వున్న కారణాలను అవగాహన చేసుకోగలిగిన విజ్ఞుడాయన. అయితే ఆయన అత్యధిక, ప్రధాన్యం ఇచ్చారు. క్రూరమైన కులసామ్రా జ్యాన్ని సమూలంగా అంతం చెయ్యడం ప్రప్రథమ కర్తవ్యంగా ఆయన భావించారు. సాంఘిక న్యాయం అన్న స్వల్పకాలికమైన వైరుధ్యం ఉన్నదని ఆయన భావించారు. బహుసంఖ్యాకులుగా ఉండే అగ్రకులాలకు చెందిన హిందువుల అత్యాచారాల నుండి, దళితవర్గాల వారికి రక్షణ కల్పించాలన్న లక్ష్యంతోనే ఆయన స్థానిక సంస్థలకు సర్వసత్తాక ప్రతిపత్తి కల్పించడానికి అంగీకరించలేదు. హిందూ సమాజంలో న్యాయం, సమానత్వం నిష్పక్ష వైఖరి అనేవి ప్రధానమైన చోదక భావనలు కావు కనుక, గ్రామీణ ప్రాంతాలలో ప్రజాభిప్రాయం ఉదారవంతంగా, విజ్ఞతగలదిగా ఎదుగు లేదు కనుక, ప్రజాభిమతాన్ని న్యాయంగా మలచి, నడిపించే సామర్థ్యం ఉన్నవారి కొరత గ్రామీణ భారతంలో వున్నది కనుక, అధికారాన్ని అత్యధిక భాగం దిగువస్థాయికి చేర్చినట్లయితే గ్రామస్థాయి సంస్థలను బలీయం చేసినట్లయితే అగ్రకులాలకు చెందిన హిందూపాలక వర్గాలవారికి, దళితులపై అత్యాచారాలు సాగించడానికి లైసెన్సు ఇచ్చినట్లు కాగలదని అంబేద్కర్ భావించారు. షెడ్యూల్డు కులాలవారు, వెనుకబడిన వర్గాలవారూ, ఒక్క కేంద్ర ప్రభుత్వ స్థాయిలోనే తమపట్ల ఏదన్నా సానుభూతి వైఖరినీ, అర్థం చేసుకొనే ధోరణినీ, విజ్ఞతతో వ్యవహరించే ఔదార్యాన్నీ ప్రదర్శించడం సాధ్యపడగలదని ఆశించవచ్చు. ఇది జీవిత యదార్థం జాతీయ పార్లమెంటు కార్యకలాపాలను గమనించిన వారెవరైనా ఈ విషయాన్ని నిస్సందేహంగా అంగీకరిస్తారు. షెడ్యూలు కులాలు, షెడ్యూల్డు జాతులు, ఇతరమైనారిటీల సమస్యలపట్ల లోక్‌సభ చర్చల్లోనూ రాజ్యసభ చర్చల్లోనూ కనిపించిన స్పందన రాష్ట్ర విధాన సభలో గానీ విధాన పరిషత్తుల్లోగానీ, స్థానిక సంస్థలలోగానీ కనిపించలేదు.

అందువల్ల అంబేద్కర్ సదాబలమైన కేంద్ర ప్రభుత్వాన్నే సమర్థించారు. సాంఘిక న్యాయం విషయంలో పరిపాలనా పరమైన సంకల్పాన్ని అమలు జరిగే విధంగా ఒత్తిడి చేసే అధికారం కేంద్రప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వంలోని నిర్వహణా వ్యవస్థకు ఉండాలని ఆయన కోరారు. కేంద్ర విధాన సభకు (పార్లమెంటుకు) విస్తృతమైన విషయాలపై చట్టాలు చేసే అధికారం ఉండాలని దళిత ప్రజల ప్రయోజనాలను రక్షించడానికి అవసరమైన విషయాలపై చట్టాలు చేసే అధికారం కేంద్రపార్లమెంటుకే ఉండాలని ఆయన ఆకాంక్ష. ఈ అంశంపైనే ఆయన సర్వదా గాంధీజీతో విభేదించారు.

ఈ ఆశయ సాధనకు అనుగుణమైన రాజ్యాంగంలోని అనుచ్ఛేదాలన్నీ అంబేద్కర్ స్వయంగానైనా రాసివుంటారు. మరెవరైనా రాసి ప్రతిపాదించి, పరస్పరచర్చల తర్వాత రూపొందినవైతే వాటిని ఆయన, రాజ్యాంగం రచనా సభలో గట్టిగా సమర్థించినవైనా అయివుంటాయి.

అస్పృశ్యతా నేరాల బిల్లును గురించి మాట్లాడుతూ డాక్టర్ అంబేద్కర్, ఈ కొత్త చట్టాన్ని అమలు జరపాల్సింది ఎవరు అన్న ప్రశ్నను లేవదీశారు. ఈ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వమే అమలు జరపాలని స్పష్టంగా విధించే ఒక నిబంధనను అందులోచేర్చాలని ఆయన సూచించారు.ఇలాంటి నిబంధనను చేర్చక పోయినట్లయితే, ఉమ్మడి జాబితాలో ఉన్నటువంటి అంశం మీద కేంద్రం ఈ చట్టం చేసిందనీ, దీన్ని అమలు జరిపే అధికారం తమదేనని రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తాయి. ఈ చట్టాన్ని అమలుజరిపే బాధ్యతను లేదా కర్తవ్యాన్ని రాష్ట్రాలకు వదిలివేయడం అంబేద్కర్‌కు ఇష్టం లేదు. రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాల ఆధీనంలో వుండే అధికారులూ స్థానిక అగ్రహిందువుల ఒత్తిడులకు లొంగుతారని ఆయన భయపడ్డారు. పరిపాలనా యంత్రాంగం అంతా సవర్ణహిందువుల గుప్పిళ్ళలోనే ఉంటుంది కనుక, ఈ చట్టాన్ని వారు చిత్తశుద్ధితో గట్టిగా అమలు జరపాలని, అమలుగాని ఈ చట్టం, కాగితాల మీద ఉండిపోవడం తప్ప దీని వల్ల ఎలాటి ప్రయోజనమూ ఉండదని ఆయన అన్నారు. భారత రాజ్యాంగంలోని 35వ అనుచ్ఛేదం ప్రాధాన్యాన్ని, 73వ అనుచ్ఛేదంలో చేసిన మార్పులనూ ఆయన వివరించారు. 17వ అనుచ్ఛేదాన్ని ఉల్లంఘించినవారికి, ప్రాథమిక హక్కుల క్రింద నేరాలుగా వివరించిన పనులకు శిక్షను నిర్ణయించే అంశానికి సంబంధించిన చట్టాన్ని పార్లమెంటే చెయ్యాలిగాని రాష్ట్ర విధాన సభలు కాదని 35వ అనుచ్ఛేదం లక్ష్యం. విషయం ఉమ్మడి జాబితాలోని విషయమే అయినప్పటికీ, ఆచరణలో అది అన్ని విధాలుగానూ కేంద్ర విషయమే కాగలదని ఆయన అన్నారు. అయితే 73వ అనుచ్ఛేదం క్రింద (1935 భారత ప్రభుత్వ చట్టంలో దానికి సమానమైన నిబంధనకు భిన్నంగా ఉన్నదది) ఈ చట్టాన్ని అమలు జరిపే అధికారాన్ని కేంద్రం ఎప్పుడైనా తీసుకొనవచ్చు.

ఉమ్మడి జాబితాలోని అంశాలకు సంబంధించి చట్టాలు చేసే కేంద్ర ప్రభుత్వ అధికారం చట్టాలు చేసేంతవరకే పరిమితమని 1935 భారత ప్రభుత్వ చట్టంలో స్పష్టమైన నిబంధన ఒకటి ఉన్నది. పరిపాలనా రంగాన్ని అక్రమించకూడదు. 1935 భారత ప్రభుత్వ చట్టంలో ఇటువంటి నిబంధనను ఎందుకు చేర్చారని ఈనాడు మనం ఉన్న ఈ పరిస్థితుల్లో చర్చించడం నిరర్థకం. అయితే రాజ్యాంగాన్ని రచించినప్పుడు అటువంటి నిబంధనను చేర్చడానికి మేము నిరాకరించాము. సంయుక్త రంగానికి చెందిన విషయంపై కేంద్రం చేసిన ఏ చట్టాన్నయినా అమలు జరిపే అంశాన్ని సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వాలకే విడిచిపెట్టవచ్చు. కాని, ఏదన్నా ఒక ప్రత్యేక విషయానికి సంబంధించిన చట్టాన్ని అమలుపరిచే బాధ్యతను రాష్ట్రాలకు అప్పగించాలా, లేక కేంద్రమే అట్టిపెట్టుకోవాలా అనేదాన్ని నిర్ణయించుకునే అధికారం కేంద్రానికే ఉండాలని మేమన్నాం. ఈ మా ఉద్దేశాన్ని రాజ్యాంగపు 17వ అనుచ్ఛేదపు నిబంధనల్లో పొందుపరిచాం.

ప్రాథమిక హక్కులను అమలు పరచే సాధనాల కోసం అంబేద్కర్ మొదటినుంచే అన్వేషించారు. ఈ హక్కులన్నింటినీ పొందు పరచిన జాబితా తయారుచేస్తే సరిపోదని ఆయన గుర్తించారు. ఈ హక్కులన్నీ మన సంస్కారంలో, ఆలోచనా సరళిలో భాగమై పోవాలి. వాటిని ప్రాథమిక హక్కులు అని పేర్కొంటే సరిపోదు. 1688లో ఇంగ్లాండులో జరిగిన రక్తరహిత విప్లవకాలంలోనే అవి చట్ట రూపం ధరించాయి. ఫ్రెంచి విప్లవకాలంలో వాటిని మానవహక్కులుగా పునరుద్ఘాటించారు. హక్కుల బిల్లు అమెరికా రాజ్యాంగంలో భాగమైపోయింది. వాటిని అనుభవించడం ఎలా, అమలు చేయడం ఎలాగనేది సమస్య. 1946 డిసెంబర్ 9వ తేదీన రాజ్యాంగ రచనా సభలో ప్రతిపాదించిన తీర్మానపు ఉద్దేశాలను గురించి వివరిస్తూ డాక్టర్ అంబేద్కర్ ఇలా అన్నారు!

"తీర్మానంలోని ఈ భాగం, కొన్ని హక్కులను గురించి ఉద్ఘాటిస్తూ ఉన్నప్పటికీ, వాటిని పరిరక్షించుకునే మార్గాలను గురించి చెప్పడం లేదని నా అభిప్రాయం. హక్కులను హరించినప్పుడు వాటిని పరిరక్షించుకోవడానికి ప్రజలకు ఏవైనా మార్గాలు ఉండకపోతే హక్కులు నిరర్థకమని మనందరికి తెలును. పరిష్కారమార్గాలను ఇందులో బొత్తిగా పొందుపరచలేదు. చట్టబద్ధమైన పద్ధతుల్లో కాకుండా ఏ వ్యక్తి ప్రాణాన్నయినా, స్వేచ్ఛనైనా, ఆస్తినైనా తీసుకోవడానికి వీలులేదు" అనే సామాన్య సూత్రాన్ని కూడా దీనిలో పొందుపరచలేదు.

రౌండ్ టేబుల్ మహాసభలో అంబేద్కర్ దళిత వర్గాల ప్రతినిధిగా పాల్గొన్నాడు. వారి హక్కులకోసం ఆయన తెలివిగా, నిరంతరంగా పోరాడారు. ఎవరి పక్షాన్నో వాదించడానికి తన ప్రజ్ఞాపాండిత్యాలను ఉపయోగించే న్యాయవాదిగా కాదు అంబేద్కర్ వాదించింది అంకిత భావంతో, విశ్వాసనిష్ఠతో మాట్లాడారాయన. దళితుల బ్రతుకులను బాగుచేయడమే తన జీవిత లక్ష్యంగా ఆయన భావించారు. భారతీయ సమాజాన్ని ఆయన క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. సాంఘిక వ్యవస్థ పనిచేస్తున్న తీరు తెన్నులు ఆయనకు పూర్తిగా తెలుసు. ఈ అసమానతల ఫలితాన్ని దాని బరువును అంబేద్కర్ పూర్తిగా మోశాడు. స్వయంగా అనుభవించాడు. స్థానిక స్థాయిలో న్యాయం సాధించలేమన్న నిర్ణయానికి వచ్చాడు. తిట్టడమే పనిగా పెట్టుకున్న వాడు కాదు అంబేద్కర్. అగ్రకులాలకు చెందిన హిందువులు, జాతీయ పత్రికారంగం ఆయన మీద బురదచల్లారు. ఆయన బ్రిటిష్ పాలకుల తొత్తు అని దూషించారు. కాని నిజంగా ఆయన అమోఘమైన దేశభక్తుడు. బాధ్యతలను భారత ప్రజలకు అప్పగించడాన్ని ఆయన వ్యతిరేకించలేదు. "బహుసంఖ్యాకులుగా ఉన్నటువంటి హిందూ అగ్రకులాల వారు, దళిత వర్గాలపై అత్యాచారాలు కొనసాగించడం కాకూడదు స్వరాజ్యమంటే" అనేది ఆయన ఆవేదన. వయోజన ఓటు హక్కు కావాలన్నా రాయన. దానికోసం గట్టిగా పోరాడారు. అయితే నూతనంగా సిద్ధించే పాలనాధికారంలో బడుగు ప్రజలకు, దళితులకు భాగం కావాలని అంబేద్కర్ కోరాడు. తమ హక్కులను పరిరక్షించడానికి బలమైన కేంద్ర ప్రభుత్వం కావాలని ఆయన పరితపించాడు. కేంద్ర విధాన సభ (పార్లమెంటు)కు విస్తృతమైన అంశాలపై చట్టాలు చేసే అధికారం వుండాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిర్వహణ విభాగానికి తగిన అధికారాలుండాలన్నారు. కేసులను పరిష్కరించే విషయంలోనూ, న్యాయాన్ని ప్రదానం చేసే విషయంలోనూ సుప్రీంకోర్టుకు సర్వాధికారాలుండాలన్నారు. అయితే ఇవన్నింటితో అంబేద్కర్ తృప్తిపడలేదు. ఆ తర్వాత ఆయన మరో ప్రశ్న వేశాడు. మహోన్నత న్యాయ స్థానం కలిగి వుంటాం సరే, ఆ న్యాయం స్థానానికి అవసరమైన అధికార పరిధిని సమకూరుస్తాం. సరే, అయితే దాని ఉత్తరువులు, తీర్పులు. అమలు జరపడానికి అవకాశం లేకపోతే, పాటింప చేసే యంత్రాంగం లేకపోతే, కేంద్ర ప్రభుత్వమనే బలమైన ఈ భవనాన్నంతా నిర్మించి ప్రయోజనం ఏమిటి? అని.

రౌండ్‌టేబుల్ సమావేశాల సమాఖ్య పద్ధతి సమితి (ఫెడరల్ స్ట్రక్చర్ కమిటి) 1931 అక్టోబరు 22వ తేదిన సమావేశమైనప్పుడు, ఆస్ట్రియా, అమెరికాలలో ఫెడరల్ న్యాయస్థానాల అధికార పరిధికన్నా భారతదేశపు ఫెడరల్ న్యాయస్థానపు అధికార పరిధిని విస్తృతం చెయ్యాలని డాక్టర్ అంబేద్కర్ గట్టిగా వాదించారు. "ప్రాథమిక హక్కులకు సంబంధించిన విషయాల్లోనూ, అల్ప సంఖ్యాకుల హక్కులకు సంబంధించిన విషయంలోనూ దానికి ఫెడరల్ అధికార పరిధి ఉండాలి" అన్నారాయన.

భారతదేశంలో భవిష్యత్తులో రూపొందబోయే రాజ్యాంగ వ్యవస్థ, బ్రిటిష్ ఇండియా ప్రాంతంలోని రాష్ట్రాల, సంస్థానాల సమాఖ్యగా ఉండబోతున్నట్లు గమనించి, రాజకీయ బహుసంఖ్యాక పద్ధతుల మీదకాక, కుల, మత పరమైన బహుసంఖ్యాక అధిపత్యం పైన ఆధారపడే ప్రభుత్వాలురావని ఊహించిన అంబేద్కర్ ఇలా అన్నారు.

"ప్రాథమిక హక్కులను పరిరక్షించే సమస్య, అల్ప సంఖ్యాకుల హక్కులను పరిరక్షించే సమస్య, ప్రపంచంలోని మరే ఇతర రాజ్యాంగంలోనూ ఊహించనటువంటి ప్రముఖ పాత్రను భారతదేశంలో వహిస్తుందని నా అభిప్రాయం. అందువల్ల అది ఎలాంటిదైనా సరే, ప్రాథమిక హక్కులను పరిరక్షించవలసిన విధికి, అవి ఎలాంటివైనా సరే, అల్ప సంఖ్యాకుల హక్కులను పరిరక్షించవలసిన విధికి ప్రాధాన్యం ఏర్పడుతుంది. ఈ పని చెయ్యడానికి నాకు తోచిన ఉత్తమ మార్గం. వాటికి సంబంధించిన తగాదాలను పరిష్కరించే అధికారక్షేత్రాన్ని ఫెడరల్ న్యాయస్థానానికి అప్పగించడం. ఇది నా వినతి. బ్రిటిష్ ఇండిలోగాని, సంస్థానాలలోగాని, ఎక్కడైనా సరే, ప్రాథమిక హక్కులకు సంబంధించిన అంశంగానీ, అల్ప సంఖ్యాక వర్గాలకు సంబంధించిన అంశంగానీ వచ్చినప్పుడు వాటిని విచారించి తీర్పు చెప్పే అధికారం ఫెడరల్ న్యాయస్థానానికి ఉండాలి.

ఫెడరల్ న్యాయస్థానం తీర్పులను అమలు పరిచే విషయాన్ని గురించి కూడా అంబేద్కర్ వివరించారు. సమితి సమావేశానికి అధ్యక్షత వహించిన లార్డ్ చాన్సలర్ కోపానికి వచ్చి, హెచ్చరించారుకూడా రాష్ట్ర లేదా సంస్థాన ప్రభుత్వాల చిత్తశుద్ధిని శంకించకూడదనీ, ఫెడరల్ న్యాయస్థానం తీర్పులనూ ఉత్తర్వులనూ ప్రభుత్వాలు తు.చ. తప్పకుండా శిరసావహించి, వాటిని అమలు జరపడానికి శాయశక్తులా కృషి చేస్తాయని విశ్వసించాలనీ ఆదేశించారు; లార్డ్ ఛాన్సలర్.

ఈ కీలకమైన అంశంలో జాన్‌స్టూవార్ట్ మిల్ ప్రతిపాదించిన సూత్రాన్ని పాటించాలని అంబేద్కర్ ప్రార్థించారు. ఆ సూత్రం ఏమిటంటే - "మనుషులందరూ ఉత్తములే అయినట్లయితే" మంచివారే అయినట్లయితే చట్టాలు చేయవలసిన అవసరమే లేదు. కొంత మంది చెడ్డవారుంటారు. కనుకనే చట్టాలు చేయవలసి వస్తున్నది. అందువల్ల ఈ విషయాన్ని ఎటువంటి నిర్ణయమూ లేకుండా అలాగే వదిలివేయడం మంచిదికాదని డాక్టర్ పట్టుపట్టారు. ఆ తర్వాత ఆయన అమెరికా చరిత్రలోనుంచి అనేక ఉదాహరణలిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలను రాష్ట్రాలు ధిక్కరించిన సందర్భాలనూ, అమలు జరపడంలో ఎండ్లకొద్దీ జాప్యం చేసిన సందర్భాలనూ పేర్కొన్నారు. భారతదేశపు పరిస్థితులను వివరిస్తూ ఆయనిలా అన్నారు.

"అల్ప సంఖ్యాకుల పక్షాన మాట్లాడుతున్న సభ్యునిగా, ప్రస్తుతం ఎటువంటి హక్కులూ లేక హక్కులు కావాలని పోరాడుతూ ప్రతీ దశలో వ్యతిరేకతను ఎదుర్కొంటున్న నాకు విధాన మండలిలో కులాధిపత్యం గల బహు సంఖ్యాకుల మద్దతుతో పనిచేసే రాష్ట్ర ప్రభుత్వం, తమ ప్రయోజనాలకు గిట్టని తీర్పులనూ, ఉత్తరువులనూ అంగీకరిస్తుందని, తల్గొగ్గి అమలు జరుపుతుందని విశ్వాసం కలగడం లేదు. అందువల్ల ఫెడరల్ న్యాయస్థానం తీర్పులను అమలు జరిపించడానికి ఫెడరల్ విధాన సభ (పార్లమెంటుకు) స్పష్టమైన అధికారాలను ప్రదానం చేయవలసిందిగా నేను విన్నవించుకుంటున్నాను.

జాతిపరమైన లేదా మతపరమైన, లేదా కులపరమైన యుద్ధాలు ప్రారంభమైనప్పుడు రాజ్యాంగంలో పొందుపరిచే ఏ పరిష్కారమైనప్పటికీ ప్రయోజనకరంగా ఉండబోదని అంబేద్కర్‌కు చెప్పినప్పుడు, దానికి సమాధానం చెప్పవలసింది తాను కాదని స్పష్టం చేశారు. తన స్వీయానుభవాన్ని ఆయన ఉదహరించారు, నాసిక్ దేవాలయ ప్రవేశ సత్యాగ్రహ విషయం. ఈ ప్రాథమిక హక్కు తనకు ఉన్నట్లయితే, దాన్ని పాటించడానికి తాను ప్రయత్నించినప్పుడు - ఏమి జరుగుతుంది?



గ్రామస్థాయి సంస్థలను బలీయం చేసినట్లయితే అగ్రకులాలకు చెందిన హిందూపాలక వర్గాలవారికి, దళితులపై అత్యాచారాలు సాగించడానికి లైసెన్సు ఇచ్చినట్లు కాగలదని అంబేద్కర్ భావించారు.

(ఇంకావుంది)



మీతోపాటు మీ ప్రియ నేస్తాల పేరిట విజయవిహారం చందా చెల్లించండి, మైత్రీ కానుకగా విజయవిహారాన్ని అందించండి!

ప్రొఫెషనల్స్‌నీ, లెర్నర్స్‌నీ
సమానంగా ఆకర్షిస్తూ,
సంచలనం సృష్టిస్తున్న
తొలి తెలుగు
కంప్యూటర్‌ఎడ్యుకేషన్ సీరియల్ !!



సి.యస్. సలీం బాషా



# కంప్యూటర్ క్లాస్‌రూమ్

## (పదిహేడవ భాగం)

## Disk Drive Utilities in Windows'95

మనం సమాచారాన్ని సాధారణంగా ఫ్లాపీ డిస్క్‌లలో లేదా హార్డ్‌డిస్క్‌లో నిల్వ చేసుకుంటాము. విండోస్‌లో డిస్క్‌లను మెయింటెయిన్ చేయటానికి అనేక సౌకర్యాలు ఉన్నాయి. ఫార్మాట్ చేయటం డిస్క్‌లను చెక్‌చేయటం, డీఫ్రాగ్‌మెంట్ చేయటం వంటి పనులు చేయటానికి సిస్టమ్ టూల్స్ వున్నాయి. దీనికోసం స్టార్ట్ మెనూ నుంచి Programs → Accessories → System Tools ఆ ప్రకారం సెలెక్ట్ చేసుకుంటే ఇలాంటి మెను వస్తుంది.




(మీ కంప్యూటర్‌లో పైన మెనూలో వున్న యుటిలిటీస్‌లో కొన్ని కనిపించకపోతే కంగారు పడనవసరం లేదు. ఎందుకంటే విండోస్ ఇన్‌స్టాల్ చేసినపుడు అవి సెటప్ చేసి వుండకపోవచ్చు. వాటిని మీరు ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు)

స్టార్ట్ మెను ద్వారా కాకుండా డ్రైవ్‌ను రైట్ క్లిక్ చేసి ప్రోపర్టీస్‌ను ఎన్నుకోవటం ద్వారా కూడా ఈ యుటిలిటీస్‌కు వెళ్ళవచ్చు. అలా అయితే ఇలాంటి డైలాగ్ బాక్స్ రావచ్చు.




అందులోనుంచి టూల్స్ టేబ్‌ను క్లిక్ చేసి యుటిలిటీస్‌ని వాడుకోవచ్చు. యుటిలిటీస్‌లో ముఖ్యమైనవి Backup, Disk Defragmentor, Drivespace, Scandisk, System Monitor వంటివి ముఖ్యమైనవి. పైన చెప్పిన డైలాగ్ బాక్స్‌లో Degragment ను క్లిక్ చేస్తే డిస్క్‌ను డీఫ్రాగ్‌మెంట్ చెయ్యటం జరుగుతుంది.

### Format చెయ్యటం :

విండోస్'95లో కానీ డాస్‌లో కాని ఒక డిస్క్‌ను (ఏదైనా సరే) నిల్వ చేసుకోవటానికి ఉపయోగించే ముందు ఫార్మాట్ చేసి తీరాలి. అంటే దాన్ని స్టోరేజికి అనుగుణంగా మార్చటం అన్నమాట. మరింత విపులంగా చెప్పాలంటే ఒక తెల్లకాగితం మీద లెక్కలు - సమాచారం రాసుకోవటానికి గీతలు కొట్టుకోవటం లాంటిది - ఫార్మాటింగ్. సాధారణంగా డిస్క్‌డ్రైవ్ ఫార్మట్ చేసింతర్వాతనే విండోస్'95 ఆపరేటింగ్ సిస్టమ్ ఇన్‌స్టాల్ చేయటం జరుగుతుంది. తరచుగా ఫ్లాపీ డిస్క్‌లనే ఫార్మాట్ చేయాల్సివుంటుంది. ఒక్కో సందర్భంలో హార్డ్‌డిస్క్‌లో వున్న సమాచారం మొత్తం తీసేసినపుడు (వైరస్ వంటివి వచ్చినపుడు - లేదా డిస్క్ క్రాష్ అయినపుడు మాత్రం) దాన్ని కూడా ఫార్మాట్ చేయాల్సి వుంటుంది. ఫార్మాట్ చేయాల్సి వుంటుంది. ఫార్మాట్ చేయటానికి డ్రైవ్‌ను రైట్ క్లిక్ చేసి వచ్చిన Context Menu లో నుంచి ఫార్మాట్ ఆప్షన్ ఎన్నుకోవాలి. అపుడు ఇలాంటి ఫార్మాట్ డైలాగ్ బాక్స్ వస్తుంది. ఈ బాక్స్‌లో వున్న ఆప్షన్స్‌ను పరిశీలిద్దాం.




Capacity : ఇది మనం ఏ విధంగా డిస్క్‌ను ఫార్మాట్ చేయాలో చెప్పే ఆప్షన్.

Format Type : ఈ ఫీల్డ్‌లో వున్న ఆప్షన్స్‌లో Quick (Erase) ఆప్షన్ ద్వారా వేగంగా, అంటే ఎటువంటి Error ను చెక్ చేయకుండా ఫార్మాట్ చేస్తాము. ఇది ఇంతకు ముందున్న ఫైల్ టేబుల్‌ను లేపేస్తుంది. Full : ఫార్మాట్ చేసేటపుడు Errors కూడా చెక్ చేస్తుంది. దీనికి ఎక్కువ సమయం పడుతుంది. ఇంతకు ముందు ఫార్మాట్ చేసి- మళ్ళీ రీ-ఫార్మాట్ చేయాలనుకున్నప్పుడు ఉపయోగపడే ఆప్షన్ ఇది.

Copy System Files Only : డిస్క్‌ను బూటబుల్ చేయటం కోసం ఉపయోగించే ఆప్షన్ ఇది. బూటబుల్ డిస్క్ అంటే ఆపరేటింగ్ సిస్టమ్ (డాస్)ను లోడ్ చేయటం. దీని ద్వారా కంప్యూటర్ స్టార్ట్ చెయ్యవచ్చు. అంటే C:\ Drive పని చేయనపుడు - ఇది పనికొస్తుంది.

Label : అంటే ఒక పేరు టైప్ చేయాలి. (అవసరం అయితేనే) కొన్ని ప్రొగ్రామ్స్ ఈ లేబుల్ ద్వారా సరైన డిస్క్‌ని గుర్తిస్తాయి. నో లేబుల్ అంటే పేరు అవసరం లేదని.

Display Summary when finished : డిస్క్ ఫార్మాట్ అయిన తర్వాత సంబంధిత సమాచారం చూపిస్తుంది.

Copy System Files : ఫార్మాట్ చేసేటపుడే దాన్ని బూటబుల్ డిస్క్‌గా మార్చటం కోసం దీన్ని ఉపయోగిస్తాము.

డైలాగ్ బాక్స్‌లో స్టార్ట్ క్లిక్ చేస్తే ఫార్మాటింగ్ మొదలవుతుంది.

## డ్రైవ్ గురించి తెలుసుకోవాలంటే

ఫ్లాపీ డిస్క్‌లు లేదా హార్డ్ డిస్క్‌లు (ఏదైనా సరే) గురించి సమాచారం కావాలంటే ఇదివరకటి డైలాగ్ బాక్స్ (డ్రైవ్‌ను రైట్ క్లిక్ చేసి ప్రోపర్టీస్ ఎన్నుకుంటే వచ్చిన డైలాగ్ బాక్స్) నుంచి జనరల్ టాబ్ ఎన్నుకుంటే ఇలా వుండవచ్చు.



ఇక్కడ మనం లేబుల్ ఫీల్డ్ దగ్గర పేరు మార్చుకోవచ్చు. టైప్ ఫీల్డ్ దగ్గర ఆ డ్రైవ్ ఫ్లాపీ డిస్క్, లోకల్ హార్డ్ డిస్క్, రిమూవబుల్ డిస్క్ లేదా CD-ROM ఏదైతే అది వుంటుంది. మిగతా సమాచారం - ఎంత స్పేస్ వాడబడింది. (Used Space) ఎంత స్పేస్ మిగిలింది. (Free Space)ను సూచించే Pie Chat వుంటుంది.

## Drive Space ద్వారా ఏం చెయ్యవచ్చు?

ఇది ఒక అత్యంత ఉపయోగకరమైన యుటిలిటి. దీని ద్వారా ఫ్లాపీ లేదా హార్డ్ డిస్క్‌లో వున్న స్థలాన్ని కుదించి (Compress) చేసి ఎక్కువ సమాచారం నిల్వ చేసుకునేలా చేసుకోవచ్చు. ఒక్కోసారి డిస్క్‌లలో స్థలం రెండింతలు కూడా అవుతుంది. డబుల్ స్పేస్ ద్వారా కుదించబడిన డిస్క్‌లను తిరిగి డ్రైవ్ స్పేస్ ద్వారా కంప్రెస్ చెయ్యవచ్చు. ఒక డ్రైవ్‌ను కంప్రెస్ చేస్తే...

- కుదించబడిన డ్రైవ్ ఒక ఫైలు లాంటిది. దాన్ని CVF అంటే Compressed Volume File అంటారు. ఫైల్ పేరు Drivespace.000
- డ్రైవ్‌లో కొంత భాగం కంప్రెస్ కాకుండా వుంటుంది. దాన్ని Host Drive అంటారు.
- మనం డ్రైవ్‌ను మొత్తం కంప్రెస్ చెయ్యవచ్చు. లేదా మిగిలిన ఖాళీ స్థలాన్ని మాత్రమే కంప్రెస్ చేయవచ్చు. ఇది వరకు సమాచారం వుంచిన స్థలాన్ని కంప్రెస్ చేయటానికి ఎక్కువ సమయం పడుతుంది.
- ఫ్లాపీ డిస్క్‌లలో అయితే స్థలాన్ని రెండింతలు చేయవచ్చు. అందులో CVF మరియు Host Drive రెండూ వుంటాయి.

Drive Space ఆప్షన్‌ను ఎన్నుకుంటే ఇలాంటి బాక్స్ రావచ్చు.




ఇందులో డ్రైవ్‌ను ఎన్నుకుని కంప్రెస్ ఆప్షన్ (డిస్క్ మెను నుంచి) ఎన్నుకుంటే ఒక డైలాగ్ బాక్స్ వస్తుంది.

ఈ బాక్స్ ద్వారా మనకు కావాల్సిన మార్పులు చేసుకుని OK క్లిక్ చేస్తే మళ్ళీ మొదటి బాక్స్‌కు వచ్చేయచ్చు. ఇదివరకే సమాచారం వున్న డ్రైవ్‌ను కంప్రెస్ చేసే పద్ధతి అలా కాకుండా డ్రైవ్‌లో చాలా భాగం ఖాళీగా ఉన్నప్పుడు దాన్ని మాత్రమే కంప్రెస్ చేయవచ్చు. అయితే ఇది వరకే వున్న సమాచారం మాత్రం కంప్రెస్ కాకుండా అలాగే వుంటుంది. దీనికోసం ఏం చెయ్యాలంటే

- డ్రైవ్‌స్పేస్ విండోను ఓపెన్ చేయాలి.
- Advanced Menu లోనుంచి Create Empty ఆప్షన్‌ను ఎన్నుకుంటే ఒక డైలాగ్ బాక్స్ వస్తుంది.
- మొదటి ఫీల్డ్‌లో డ్రైవ్ లెటర్ ఇవ్వాలి. రెండో ఫీల్డ్‌లో మనం ఎంత ఫ్రీ స్పేస్ వాడాలనుకున్నామో ఇవ్వాలి.
- చివరి రెండు ఫీల్డ్‌లు కంప్రెస్ చేసింతర్వాత ఎంత స్పేస్ వుంటుందో తెలియచేస్తాయి.

డిస్క్‌ను Uncompress కూడా చెయ్యవచ్చు. ఒక్కోసారి కంప్రెస్ చెయ్యబడిన డిస్క్‌లో కొన్ని ఫైల్స్ లేదా ప్రోగ్రామ్స్ స్టోర్ చెయ్యటం కుదరదు. అందుకోసం Adjust Free Space ను ఉపయోగించవచ్చు. Drive Space వాటిలోని డ్రైవ్ మెనూ నుంచి Adjust Free Space ఆప్షన్ ఎన్నుకుంటే ఒక బాక్స్ వస్తుంది. అందులో కింద ఇచ్చిన Slider ను Adjust చేసి మనకు కావాల్సిన విధంగా Space ను పెంచుకోవచ్చు.

## Scandisk Utility

ఇది డిస్క్‌లోని లోపాలు (Errors) గుర్తించి వాటిని సరిచేసే (Repair) ప్రోగ్రాం. అయితే ఇది CD-ROM డ్రైవ్‌లను చెక్ చెయ్యదు. అదీగాకుండా పాత డాస్ వెర్షన్‌లు ఉపయోగించి తయారు చేసుకున్న డ్రైవ్‌లను కూడా సరిచేయలేదు. అందుకే తరచు డ్రైవ్‌లను స్కాన్‌డిస్క్ ద్వారా చెక్ చెయ్యటం శ్రేయస్కరం.

స్కాన్‌డిస్క్ రెండు విధాలుగా ప్రారంభించవచ్చు. ఒకటి డ్రైవ్‌ను రైట్ క్లిక్ చేసి ప్రాపర్టీస్ ఆప్షన్‌ను తర్వాత టూల్స్ టాబ్‌ను ఎన్నుకోవటం ద్వారా రెండు Start → Programs →Accessories →System Tools →Scandisk ద్వారా ఎలా చేసినా ఇలాంటి బాక్స్ వస్తుంది.




ఇందులో మనకు కావాల్సిన డ్రైవ్‌ను మొదటి ఫీల్డ్ ద్వారా ఎన్నుకోవచ్చు. టైప్ ఆఫ్ టెక్స్ట్ ఫీల్డ్ స్కాన్‌డిస్క్ ఎలా చేయాలో చెప్పే ఫీల్డ్. మొదటిది Standard Check. ఇది ఫైల్సు, ఫోల్డర్స్‌ను చెక్ చేస్తుంది. రెండవది Thorough అంటే ఫైల్సు, ఫోల్డర్స్‌తో పాటు డిస్క్ సర్ఫేస్‌ను కూడా చెక్ చేస్తుంది. దీనికి ఎక్కువ టైము పడుతుంది. పాత డ్రైవ్‌లు, బాగా వాడిన డ్రైవ్‌లు అయితే ఈ టెస్ట్‌ను ఎన్నుకోవటం మంచిది.

'Scandisk Options' మరో ప్రత్యేకమైన సౌకర్యం. ఇంకా Automatically Fix Errors అంటే ప్రతిసారీ అడగకుండానే లోపాలు సరిచేస్తుంది. అడ్వాన్స్ బటన్ ద్వారా వివిధ లోపాలను (Errors) ఎలా సవరించాలో సెటప్ చేసుకోవచ్చు.

Scandisk Options :

Options బటన్‌ను క్లిక్ చేస్తే ఇలాంటి డైలాగ్ బాక్స్ వస్తుంది. (అయితే Thorough test ను ఎన్నుకున్నపుడు మాత్రమే Options పనిచేస్తుంది).




ఇందులో వున్న ఆప్షన్స్ ఓ సారి పరిశీలిద్దాం.

System and data areas : ఈ ఆప్షన్ ద్వారా మొత్తం డిస్క్ డ్రైవ్‌ను చెక్ చేయవచ్చు. సాధారణంగా ఇదే ఆప్షన్‌ను ఎన్నుకోవటం ఉత్తమం.

System Area only : కేవలం సిస్టమ్ ఫైల్స్ వున్న ఏరియా మాత్రమే చెక్ చేస్తుంది. ఇందులో తప్పులుంటే డ్రైవ్‌ను మార్చటం మంచిది.

Do-not Perform Write Testing : చెక్ చేసిన డాటాను డిస్క్ మీద రాయకుండా చేస్తుంది.

Donot repair bad sectors in hidden files : ఇది అంతగా అవసరం లేని ఆప్షన్.

Data area only : కేవలం డాటా వున్న ఏరియా మాత్రమే చెక్ చేస్తుంది. ఇది కూడా అంతగా అవసరం లేదు.

## Scan Disk Advanced Options

Scandisk విండోలో అడ్వాన్స్ బటన్ క్లిక్ చేస్తే ఇలాంటి డైలాగ్ బాక్స్ వస్తుంది. ఇందులో వివిధ ఆప్షన్స్ వున్నాయి.




Display Summary : లోపాలు చెక్ చేసిన తర్వాత వివరాలు చూపిస్తుంది. ఇందులో ఎప్పుడూ (Always) లేదా అసలు వద్దు (never) లేదా తప్పులున్నప్పుడు మాత్రమే (Only if errors found) సమాచారం చూపించమని చెప్పే ఆప్షన్స్ వున్నాయి.

Log File : ఇందులో కొత్త లాగ్ ఫైల్ లేదా ఇదివరకటి ఫైల్‌కే యాడ్ చేయటం (append to log) లేదా Log file అవసరం లేదు (No log) అనే ఆప్షన్స్ వున్నాయి.

Cross linked files : అంటే ఒక స్టోరేజ్ ఏరియాను వాడుతున్న రెండు ఫైల్సుని Cross linked files అంటారు. ఇది సాఫ్ట్‌వేర్ లోపం వల్ల కానీ, పవర్ ఫెయిల్యూర్ వల్లకాని రావచ్చు. Make copies అనే ఆప్షన్‌ను ఎన్నుకోవటం వల్ల ఫైల్స్‌ను చూసి ఏం చెయ్యాలో చూసుకోవచ్చు.

డిలీట్ వల్ల ఫైల్స్ తీసేయబడతాయి. ఇగ్నోర్ అంటే తర్వాత చూద్దాం అని అర్థం.

Lost file Fragments : ఇవి తొలగించబడిన (లేదా సరిగ్గా తొలగించబడని) ఫైల్సు అవశేషాలు. వాటిని ఫైల్స్ కింద మార్చటమా (Convert to files) లేదా అవసరం లేదు (Free) అన్నది ఎన్నుకునే అవకాశం వుండటమే దీని ఉపయోగం.

Check files for : ఇందులో invalid file menu ను ఎన్నుకోవటం మంచిది.

Check host drive : దీన్ని ప్రతిసారి ఎన్నుకోవాలి. ఎందుకంటే కంప్రెస్ చెయ్యబడిన డ్రైవ్‌లో host drive లో తప్పులు వుండవచ్చు.

## విండోస్ ప్రారంభించిన ప్రతిసారి ScanDisk ను రన్ చెయ్యటం

ఇది మంచి సద్దతి. అందుకోసం Scandisk ప్రోగ్రాంని Startup ఫోల్డర్‌లో పెట్టుకోవాలి. మొదట స్టార్ట్ బటన్‌ను క్లిక్ చేసి సెట్టింగ్స్‌లోకి వెళ్ళి టాస్క్‌బార్‌ను ఎన్నుకోవాలి. టాస్క్‌బార్ ప్రాపర్టీస్ డైలాగ్



మీతోపాటు మీ ప్రియ నేస్తాల పేరిట విజయవిహారం చందా చెల్లించండి, మైత్రీ కానుకగా విజయవిహారాన్ని అందించండి!

బాక్స్ నుంచి Start menu programs tab ను క్లిక్ చేయాలి. తర్వాత Add బటన్ క్లిక్ చేస్తే Create short cut డైలాగ్ బాక్స్ వస్తుంది. అపుడు Command line దగ్గర Scandisk type చేసి Next బటన్ క్లిక్ చేయాలి. తర్వాత Startup folder ను click చేసి text బటన్ క్లిక్ చేయాలి. చివరగా finish బటన్ క్లిక్ చేయాలి.

ఇపుడు విండోస్'95 ప్రారంభించిన ప్రతిసారి Scandisk రన్ అవుతుంది.

## ఫైల్ను Defragment చేయటం

ఇది కంప్యూటర్ సమర్థవంతంగా పనిచేయటానికి ఉపయోగపడే ప్రోగ్రాం. దీన్ని తరచుగా వాడటం మంచిది. సాధారణంగా కంప్యూటర్‌లో ఫైలు నిల్వ చేసినపుడు లేదా ఎడిట్ చేసి నిల్వ చేసినపుడు డిస్క్‌లో ఎక్కడ స్థలం వుంటే అక్కడ స్టోర్ చేయటం జరుగుతుంది. అంటే ఒక ఫైలు పది భాగాలుగా విభజించినపుడు పది భాగాలు వరసగా స్టోర్‌కావు. కొన్ని భాగాలు ఒకచోట మరికొన్ని భాగాలు మరోచోట స్టోర్ అవుతాయి. దీనివల్ల ఏదైనా ఫైలును తీసుకురావటానికి టైమ్ ఎక్కువ పడుతుంది. కంప్యూటర్ పనిచేసే వేగం తగ్గుతుంది. అలా కాకుండా ఒక ఫైలుకు సంబంధించిన భాగాలన్నీ ఒకే చోట వుంటే? చాలా బావుంటుంది. అలా Fragments గా స్టోర్ చెయ్యబడిన ఫైలుని Defragment చేసి ఒకే చోట చేర్చటమే ఈ యుటిలిటీ పని. ఇది చాలా సేఫ్ ప్రోగ్రాం. ఎప్పుడైనా ఎన్ని సార్లయినా దీన్ని రన్ చెయ్యవచ్చు. ఈ ప్రోగ్రాం మధ్యలో ఆపినా ఫర్వాలేదు. డాటా పోవటం జరగదు. దీన్ని రెండు రకాలుగా రన్ చేయవచ్చు ఒకటి డ్రైవ్‌ను రైట్ క్లిక్ చేసి ప్రోపర్టీస్ డైలాగ్ బాక్స్ నుంచి టూల్స్ టాబ్‌ను తద్వారా Defragment ఆప్షన్‌ను ఎన్నుకోవటం రెండవది Start → Programs → Accessories → System tools → Defragment ఇలా ప్రారంభిస్తే ఒక డైలాగ్ బాక్స్ వస్తుంది.




ఇందులో డ్రైవ్‌ను ఎన్నుకుని OK చేయటమే. ఎలా చేసినా ఇలాంటి డైలాగ్ బాక్స్ వస్తుంది.




ఇందులో స్టార్ట్ ఎన్నుకుంటే ప్రోగ్రాం రన్ అవుతుంది. లేదా వేరే డ్రైవ్‌ను ఎన్నుకోవచ్చు లేదంటే Advanced బటన్ ద్వారా అడ్వాన్స్డ్ ఆప్షన్‌నకు వెళ్ళవచ్చు. Exit అంటే ప్రోగ్రాం నుంచి బయటకి రావటమే.

Advanced Options : అడ్వాన్స్డ్ బటన్ ద్వారా ఈ డైలాగ్ బాక్స్ చేరుకోవచ్చు. ఇందులో వివిధ ఆప్షన్స్ వున్నాయి.

Full Defragmentation : ఫైల్స్ మాత్రమే కాకుండా ఖాళీ స్థలాన్ని కూడా Defragment చేస్తుంది.

Defragment files only : డీఫ్రాగ్‌మెంట్ ఫైల్స్ మాత్రమే చేస్తుంది.

Consolidate free space only : ఖాళీ స్థలాన్ని మాత్రమే Defragment చేస్తుంది.

Check Drive for errors : Defragment చేసే ముందు డ్రైవ్‌లో లోపాలను వెతుకుతుంది.

This time only : ప్రస్తుతం మాత్రమే ఈ సెట్టింగ్స్ తర్వాత మారుస్తామని అర్థం.

Save these options and use them : ఇవే సెట్టింగ్స్‌ను ప్రతిసారి ఉపయోగించమని అర్థం. సెట్టింగ్స్ పూర్తయిన తర్వాత OK బటన్ క్లిక్ చేసి స్టార్ట్ బటన్ క్లిక్ చేస్తే Defragmentation మొదలవుతుంది. అలా ఎన్ని డిస్క్‌లయినా Defragment చేసుకోవచ్చు.

(ఇంకావుంది)



# ఇలా ఈజీగా నేర్చుకుందాం 17

## ఆర్వీయార్ మాష్టారి ఇంగ్లీషు పాఠాలు

# వర్తమానకాలం
# The Present Continuous Tense

Present Continuous Tense తర్వాత Present Perfect Continuous Tense ని చూడ్డం ధర్మం. ఏమంటే యీ రెండింటిలోనూ Continuous activity వుంటుంది.

ఇంగ్లీషు భాషలో వున్న Perfect Tense లు విదేశీయులకు కొంచెం యిబ్బంది కలిగిస్తాయి. చాలా మంది విద్యార్థులకు వీటి మధ్య వున్న భేదం తెలియదు. మాతృభాషలో యిలాంటి tense division లేకపోవడం కారణం. "నేను చదువుతున్నాను" "నేను నాలుగు రోజుల నుంచి చదువుతున్నాను" అనేవి రూపంలో తేడా లేకుండానే వుంటాయి, రెండో వ్యాకంలో అదనంగా 'నాలుగు రోజులు' అని కాలసూచక పదాలు వున్నప్పటికీ. ఇదే ఇంగ్లీషులో అయితే తేడాగా వుంటాయి. 'I am reading' నేను చదువుతున్నాను - యిది మొదటి తరహా వాక్యం. I have been reading for four days అని రెండవ తరహా వాక్యం. Reading అని రెండు వాక్యాల్లోనూ క్రియారూపం వుంది. కాని మొదటి దానికీ రెండో దానికీ నిర్మాణ రూపంలో మార్పు వచ్చింది. మొదటి దాంట్లో am అని - subject first person singular కాబట్టి - వస్తే రెండవ దాంట్లో 'have been' అని వచ్చేయి. Third Person singular (He, She, It) subject అయితే is అని Present Continuous లో వస్తుంది, He is reading లాగా. Present Perfect Continuous లో He has been reading for four days అని 'have been' వస్తుంది. అన్ని పురుషుల pluralsకీ, youకీ have been అనే వస్తాయి. You/they/we have been reading for four days.

Present Perfect Continuous కి form యిప్పుడు చూడండి:

Subject + has/have + been + verbకి ing.

He/she/it has been reading for four day.

You/we/they/I have been reading for four days.

అయితే Present Continuousకీ Present Perfectకీ అర్థంలో తేడా యేమిటి? అని అడగవచ్చును. తేడా వుంది కాబట్టే ఆ action గతంలో మొదలైందనీ యింకా జరుగుతూనే వుంది అనీ తెలుస్తుంది. This tense is used for an action which began in the past and is still continuing.

She has been waiting for an hour and he still hasn't turnedup.

దీనికీ She is waitingకీ తేడా చూడండి. అక్కడ గంట నుంచీ wait చేస్తున్నట్టు తెలుస్తూ వుంటే Present Continuous Tense వాక్యంలో ఆ సూచన యేదీ లేదు. ఊరికే ఆమె wait చేస్తూ వుందని మాత్రమే తెలుస్తుంది.




Present Perfect Continuous లో మామూలుగా అయితే గతంలో మొదలైన ఆ action యింకా సాగుతూనే వుందనీ incomplete గా వుందనీ తెలుస్తుంది. అది continue అవుతూ వుందనే గాని యెప్పుడు complet అవుతుందో తెలియదు.

అయితే అప్పుడే పూర్తయిన ఒక actionని తెలియచేసేందుకూ Present Perfect Continuous ని వాడడం వుందనకండి. ప్రస్తుతం ఆ విషయాన్ని పరిశీలించద్దు. ఏమంటే అప్పుడే Complete అయిన action గురించి తెలియచేసేందుకు వేరే tense form వుంది. దాన్ని Present Perfect అంటారు. దీన్ని గురించి మళ్ళీసారి తెలునుకోవచ్చు. యిప్పటికి మాత్రం Present Perfect Continuous కీ Present Continuous కీ మధ్య వున్న తేడాతో సరిపెట్టుకుందాం, ఏమంటే learnersకి క్లిష్టంగా వుండే పద్ధతులు చెప్పకూడదు. Native speakers యేయే రీతుల్లో వాడతారో తెలియచెప్పేటందుకే యీ విషయాన్ని ప్రస్తావించుకున్నాం, అంతవరకే.

అదే రకంగా Present Continuous లో normal గా వాడని verbs వున్నాయని కిందటిసారి చూశాం. వాటిని Present Perfect Continuous లోనూ వాడకూడదు. verbs of senses (involuntary actions) feel, hear, see, smell, అలాగే verbs of feeling and emotions fear, hate, like, love, want లాంటివి సామాన్యంగా Present Continous లో వాడరని తెలుసుకున్నాం కదా. వాటిని యీ tense లోనూ వాడరు. అంటే I have been loving her అని అనరు, యెంత కాలంగానో ఆ ప్రేమ నానుతూ వున్నప్పటికీ.

Present Continuous లో వాడని క్రియల్ని యిక్కడా వాడకూడదు. ఆ verbs గురించి కిందటిసారి చూశాం.

Present Perfect Continuous tense లో - అలాగే Present Perfect లో కూడా - for, since అనే prepositions ని timeని తెలియచేసేందుకు వాడతారు.

వీటిని యెలా వాడాలో తెలియక మన విద్యార్థులు తప్పులు చేస్తూ వుంటారు. దీనికి కారణం మాతృభాష ప్రభావమే.

For, Since మధ్య తేడా తెలిసేటట్టు మాతృభాషలో ప్రయోగం లేకపోవడం వల్ల పొరపాటు జరుగుతూ వుంటుంది. "పది రోజులుగా యిక్కడే మకాం వేసి కూర్చున్నాడు", "పది రోజుల నుంచీ యిక్కడే వున్నాడు'' అని తెలుగులో అనేస్తాం వుంటారు. "గా, నుంచీ" అనేవి ఒకదానితో ఒకటి కలిపి వాడడం వల్లా, అదే ఇంగ్లీషులోకి అనువర్తించుకోవడం వల్లా వచ్చిన పొరపాటు యిది. ఇంగ్లీషులో అలా కాదు. For ని యిలా "గా" తెలియచేసేందుకు వాడితే since ని "నుంచీ" అనే point కి వాడతారు.

She hasn't been home since her marriage. తన పెళ్లయిందగ్గర నుంచీ యింటికి రాలేదు.

We have been working here since Monday. సోమవారం నుంచీ యిక్కడే పనిచేస్తూ వున్నాం.

She has been waiting for you for a week. వారం రోజులుగా నీకోసం చూస్తోంది.

Since ని ఒక point of time కీ, for ని ఒక point of timeవీ, point of time నీ గుర్తించడం యెలాగ అని సందేహం రావచ్చు.

నిర్దిష్టంగా ఫలానా అని స్పష్టం కానప్పుడు period of timeగా గుర్తించాలి. For a week, for a longtime, for ten years అంటూ చెబితే అది period అవుతుందే గాని ఎక్కడ ఎప్పుడు మొదలైందో లేదు. Since అలా కాక "from the point to the time of speaking" ని నిర్దేశిస్తుంది. "నువ్వు వెళ్లినప్పట్నుంచీ'', "పొద్దుటి నుంచీ'', "అయిదింటినుంచీ'' అంటూ point ని తెలియచేసేటట్టు 'since morning', since you left, since five o' clock అని since ని వాడాలి.

For నీ, since నీ యెలా వాడేదీ స్థూలంగా తెలునుకున్నాం. Perfect Tensesలో వీటిని గురించి మరింత వివరంగా ముందు చూద్దాం.

ఇప్పుడు యీ Present Perfect Continuous వివిధ తరహాల వాక్యాల్లో యెలా వుంటుందీ చూద్దాం.

Affirmative

I have been working, He has been working

Negative

I have not been working (havenotకి contract చేస్తే haven't అవుతుంది కదా)

He hasn't been working...

Has he been working...

Negative Interrogative

Haven't you been working...

Hasn't he been working...

ఇప్పుడు Present Perfectకి వెడదాం.

\- ఆర్వీయార్

సం॥ చందా రూ.180/- ; 5 సం॥ చందా రూ.800/- ; అడ్రసు :12-5-33/2, విజయపురి కాలనీ, తార్నాక, సికింద్రాబాద్-17. ☎ 7007053, సెల్ నెం.9848019076

## వ్యక్తిత్వ వికాసం 1

# సమస్యను జయించడంలోనే అసలైన థ్రిల్ వుంది

"Solution is like a sweedish sunset, we look the other way and lose it"

"If you can manage a problem positively, it will take care of the solution"



"Feel with your heart and think with your brain"



"Suicide is a permanent solution to a temporary problem"







"The best way out of difficulty is through it"







- సి.యస్. సలీంబాషా

# కాన్ఫిడెన్సే వుంటే కనిపిస్తుంది ప్రతి కదలికలో

బాడీ లాంగ్వేజ్ మేడీజీ 7









- సి.యస్. సలీంబాషా

# భగత్‌సింగ్ ఉరిని గాంధీజీ తప్పించగలిగేవారా?





**చారిత్రక విశ్లేషణ**

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల జీవితాలను మహాత్మా గాంధీ కాపాడగలిగేవారా? ఆ ముగ్గురు విప్లవకారుల మరణశిక్ష అమలు జరిగి 70 సంవత్సరాలైన సందర్భంగా, ఆనాటి ఘటనల విశ్లేషణ.

లాహోర్ సెంట్రల్ జైలులో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను ఉరితీసి, ఇప్పటికి 70 సంవత్సరాలు గడిచిపోయాయి. ఆ రోజు 1931 మార్చ్ 23. అదే నెలలో, మన స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో ప్రాధాన్యంగల మరో ఘటన జరిగింది. అది గాంధీ - ఇర్విన్ ఒడంబడిక. సుదీర్ఘ చర్చల అనంతరం ఈ ఒడంబడిక మీద 1931 మార్చి 5న సంతకాలు జరిగాయి. ఉరిశిక్షల అమలు, 1930లో అత్యంత తీవ్రస్థాయిలో జరిగిన సత్యాగ్రహోద్యమం అనంతరం కాంగ్రెస్‌కు, (బ్రిటిష్) రాజ్‌కూ మధ్య జరిగిన ఒడంబడిక చరిత్రలో కేవలం ఏకకాలంలో జరిగినవి మాత్రమే కాదు; ఒక దానినొకటి ఒరుసుకుంటు జరిగిన సంఘటనలు కూడా. కొంతవరకు అవి ఒక దానినొకటి ప్రభావితం చేశాయి. ఈ ఒడంబడిక కింద భగత్‌సింగ్‌కు క్షమాదానం సంపాదించలేకపోయినందుకు మహాత్మాగాంధీపై వివాదం చెలరేగింది. ఇది ఆయన్ను ఆత్మరక్షణలో పడేలా చేసింది. ఈ వివాదం, స్వాతంత్ర్య పోరాటంలో శాంతియుత, హింసాయుత విధానాల అంతస్సంబంధాల గురించి తీవ్రమైన చర్చలకు కూడా దారితీసింది. వాస్తవానికి ఆనాటి సంఘటనలను సమీక్షించి నట్లయితే, కాంగ్రెస్‌కి ఇబ్బందికరమైన పరిస్థితులను సృష్టించేందుకే బ్రిటిష్‌వాళ్ళు ఆ సమయంలో ఉరిశిక్షలు అమలు జరిపారని ఎవరైనా అనుమానించవచ్చు. ఈ రెండు సంఘటనలను విడివిడిగాను, ఆ తర్వాత రెంటినీ మేళవించి సమీక్షించడం ఆసక్తికరంగా వుంటుంది.

సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా ప్రదర్శనలు జరిపేటప్పుడు లాలా లజపత్ రాయ్ మరణంతో ఈ ఘటనల పరంపర ప్రారంభమైంది. లాఠీచార్జ్‌లో గాయపడిన లాలాజీ 1928 నవంబరు 17న కన్నుమూశారు. హింసాయుత పద్ధతుల్లో మాత్రమే బ్రిటిష్‌వారి మీద పోరాడగలమని అనేకమంది యువకులు నిర్ధారణకు వచ్చేందుకు ఇది దోహదం చేసింది. వాస్తవానికి, 1917లో రష్యాలో బోల్షివిక్ విప్లవం విజయవంతం కావడంతో ఉత్తేజం పొందిన అనేక మిలిటెంట్ బృందాలు భారతదేశంలో పనిచేయడం ప్రారంభించాయి. అలాంటివాటిలో ఒకటైన గదర్ పార్టీలో భగత్‌సింగ్ సభ్యుడు లాలా లజపతి రాయ్ లాఠీలతో కొట్టాడని భావిస్తున్న పోలీసు అసిస్టెంట్ సూపరింటెండెంట్ జాన్ పాయింట్స్ సాండర్స్‌ను కాల్పులకు గురైన నాలుగు నెలల అనంతరం, 1929 ఏప్రిల్ 8న ఇద్దరు యువకులు ఢిల్లీలోని సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో అధికారపక్ష సభ్యులు కూర్చున్న బెంచీలవైపు బాంబులు విసిరినందుకు అరెస్టు అయ్యారు. అందులో ఒకరు భగత్‌సింగ్. బహుశా, ఈ సంఘటన కారణంగానే లాహోరు కుట్ర కేసులో అతనికి ప్రమేయం వుండి వుంటుందని పోలీసులు అనుమానించి వుండాలి.

ఈ కేసు చాలా ప్రసిద్ధి పొందింది ఎందుచేతంటే, ఈ సందర్భంగా బ్రిటిష్ ప్రభుత్వం చట్టంలో కొన్ని కర్కోటకమైన నిబంధనల్ని చేర్చింది. లేనట్లయితే నేర శిక్షాస్మృతిలో అవి సహేతుకమైన చట్టాలుగానే వుండేవి. ఈ కేసుకింద నిర్బంధితులైనవారు జైళ్ళలో నిరాహారదీక్షలకు, బాయ్‌కాట్లకు పూనుకునేవారు. ఈ నిందితుల్లో అనేకసార్లు, వారు శారీరకంగా బలహీనంగా వున్నందువల్ల కోర్టు రూంకు స్ట్రెచర్ల మీద తీసుకువచ్చేవారు. జతిన్‌దాస్ అనే విప్లవకారుడు 63 రోజులపాటు నిరాహారదీక్ష చేసిన అనంతరం, అతనికి బలవంతంగా ఆహారం పెట్టే ప్రయత్నం చేయడంతో మరణించాడని చెప్పు కున్నారు. మిగతా అమరవీరులందరికంటే ఎక్కువగా భగత్‌సింగ్ ప్రజల స్మృతిపథంలో నిలిచిపోయాడు. ఈ కేసువిచారణ అందరి దృష్టిని ఆకర్షించడం అందుకు కొంత కారణం కావచ్చు.

సాక్షులు కూడా ఎదురు తిరిగి ప్రత్యర్థులు కావడంవల్ల ఈ విచారణ మరింత చర్చకు కారణమైంది. ఆఖరికి ఒక బ్రిటిష్ పోలీసు వ్యక్తి కూడా, హత్యాసమయంలో అక్కడ వున్న వ్యక్తి భగత్‌సింగేనని గుర్తించడానికి నిరాకరించాడు. ఫలితంగా ప్రభుత్వం లాహోర్ కాన్స్పిరసీ కేస్ ఆర్డినెన్స్ 1930 తీసుకొచ్చింది. దీనివల్ల విచారణ సమయంలో ముద్దాయిల హాజరు, డిఫెన్స్ సాక్షులు, డిఫెన్స్ కౌన్సిల్ అవసరం లేకుండా పోయింది. ఈ కొత్త తరహా విచారణ, అయిదు నెల్లకు ముగిసి 1930 అక్టోబరు 7న తీర్పు వెలువడింది. ప్రివీకౌన్సిల్‌కు అప్పీల్ చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. ఇదే కాలంలో జరిగిన గాంధీ - ఇర్విన్ ఒడంబడిక కింద భగత్‌సింగ్‌ను కాపాడుకుని వుండవచ్చని కొందరు భావిస్తున్నారు. ప్రత్యేకించి వామపక్ష వాదుల్లో ఈ అభిప్రాయం కొనసాగుతూంది. గాంధీజీ హింసను ద్వేషిస్తారు గనుక, క్షమాదానం కోసం ఆయన ప్రయత్నించి వుండకపోవచ్చని వారు అభిప్రాయపడ్డారు.

గాంధీ - ఇర్విన్ ఒడంబడిక నేపథ్యాన్ని గురించి తెలుసుకున్న తర్వాత మాత్రమే ఈ విషయంలో తీర్పు చెప్పబూనుకోవడం సమంజసంగా వుంటుంది.

అహింసాత్మక శాసనోల్లంఘన ఉద్యమం రూపంలో దేశం రెండు సంవత్సరాల పాటు కల్లోలాన్ని చవిచూసిన తర్వాత, మొట్టమొదటి సారిగా బ్రిటిష్ రాజ్యానికీ, కాంగ్రెస్‌కు మధ్య ఒడంబడిక కుదిరింది. 1929 డిసెంబరులో కాంగ్రెసు సంపూర్ణస్వరాజ్యం తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత, గాంధీజీ 450 కిలోమీటర్ల దండియాత్ర తలపెట్టారు. నిష్క్రియాపరులుగా వున్న గ్రామీణ ప్రజానీకాన్ని కదిలించడానికి, ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించేలా చేసి, శాసనోల్లంఘనోద్యమంలో భాగస్వాములయేలా చేయడం కోసం ఆయన ఆ యాత్ర తలపెట్టారు. ఆ తర్వాత జరిగిన ఘటనల పరంపర, హింసాయుత పోరాటానికి అవసరమైన త్యాగంకన్నా, అహింసాయుత పోరాటానికి కావలసిన త్యాగం తక్కువేమీ కాదని నిరూపించాయి. సిరిసంపదల్ని, కెరీయర్ని త్యాగం చేయడంతోపాటు, ఆ ఉద్యమంలో పాల్గొన్నవారు, పోలీసుల చిత్రహింసల్ని ఎదుర్కోవడంలో, హింసాత్మక పోరాటంలో చూపించవలసినంత ధైర్యాన్ని ప్రదర్శించవలసి వచ్చింది. ఆ ఏడాది డిసెంబరు నాటికి గాంధీజీతో సహా, దాదాపు అందరు ముఖ్య నాయకులు బందీలయ్యారు.

జైళ్ళు నిండిపోయాయి. చివరికి, తేజ్‌బహదూర్ సప్రూ వంటి మధ్యవర్తుల వల్ల సత్యాగ్రహులతో చర్చలు జరపడానికి ప్రభుత్వం సిద్ధపడింది. ముందు షరతుగా 1931 జనవరిలో నాయకులు విడుదలయ్యారు. గాంధీజీ ఢిల్లీలో వుండి, అక్కడే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు.

ఫిబ్రవరి 17 నుండి మార్చి 5 వరకు కాంగ్రెసుకూ, ప్రభుత్వానికీ మధ్య జరిగిన చర్చల వివరాలు అప్పటి సున్నితమైన పరిస్థితుల్ని సూచిస్తున్నాయి. తరచుగా ప్రతిష్టంభన ఏర్పడే సూచనలు, ఒక పదాన్ని గురించి లేదా పదబంధాన్ని గురించి సుదీర్ఘమైన చర్చలు, సహచరుల నుండి అభ్యంతరాలు వంటివి ఎదురయ్యాయి. అనేకసార్లు, అర్ధరాత్రి దాటిన తర్వాత గాంధీజీ వెంట వైస్‌రాయ్ అక్కడికి 8 కి.మీ. దూరంలో వున్న డాక్టర్ ముఖ్తార్ అహ్మద్ అన్సారీ ఇంటివరకు నడిచి వెళ్ళి దిగబెట్టేవారు. విన్‌స్టన్ చర్చిల్ ఈ సందర్భంలోనే గాంధీజీని అర్థనగ్న ఫకీరుగా వర్ణిస్తూ అసహ్యకరమైన వ్యాఖ్య చేశాడు. అతనిలా అన్నాడు: "విద్రోహియైన ఒక మిడిల్ టెంపుల్ లాయర్ మిస్టర్ గాంధీ, ఇప్పుడు తూర్పుదేశంలో అర్థనగ్నంగా ప్రసిద్ధుడైన ఫకీరులా పోజుపెడుతూ వైస్‌రీగల్ ప్యాలెస్‌పైపు పెద్ద అంగలు వేస్తూ... సర్వం సహా చక్రవర్తి ప్రతినిధితో సమానస్థాయిలో చర్చలు జరిపేందుకు వెళుతుంటే చూసేందుకు భయంకరంగానూ, వికారంగానూ వుంది."

చర్చల ఫలితం పట్ల మిశ్రమ స్పందన వ్యక్తమైంది. ఒడంబడికలోని కొన్ని నిర్దిష్ట భాగాల పట్ల ఏ నాయకుడూ సంతోషాన్ని వ్యక్తం చేయలేదు. ఉదాహరణకు, సుభాస్ చంద్రబోస్ కాంగ్రెస్ వాదుల్లోని వామపక్షవాదులతో ఇలా అన్నారు: "బ్రిటిష్ వాళ్ళకీ, మనకీ మధ్య రక్తసముద్రం, శవాల పర్వతం వున్నాయి. గాంధీజీ సంతకం చేసిన ఈ రాజీని భూమి మీది ఏ శక్తీ మనతో ఆమోదింపచేయజాలదు". మొత్తం మీద కాంగ్రెసు ఒడంబడికను ఆమోదించవలసి వచ్చింది. ఎందుచేతంటే, చర్చలు జరిగిన ప్రతి దశలోనూ వర్కింగ్ కమిటీ గాంధీజీతోనే వుంది. కానీ మిలిటెంట్లు, వారి మద్దతుదార్లు దాన్ని ఆమోదించలేకపోయారు. భగత్‌సింగ్‌కూ, ఆయన సహచరులకూ క్షమాదానం సాధించలేకపోయిన రాజీ వల్ల ఉపయోగం ఏమిటి? గాంధీజీ ఎక్కడకు వెళ్ళినా ఎర్రజెండాలు పట్టుకున్న యువకుల నుండి ప్రశ్నలను ఎదుర్కోవలసి వచ్చింది. ఆఖరికి కొన్ని చోట్ల ఆయనతో దురుసుగా కూడా వ్యవహరించారు. కరాచీలో ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి) సమావేశం వద్ద వారు "గాంధీజీ రాజీ భగత్‌సింగ్‌ను ఉరికంబానికి పంపింది" అని నినాదాలు చేశారు.

చరిత్రక్రమాన్ని ప్రదర్శించేటప్పుడు, ఈ కేసులో గాంధీజీ చేసిన కృషిని రికార్డు చేయకపోయినట్లయితే ఆయన పట్ల అసమంజసంగా వ్యవహరించినట్లవుతుంది. ఆయన కేవలం రాజకీయవేత్త మాత్రమేకాదు, అంతరాంతరాల్లో గాఢమైన మానవతావాది కూడా. "రాజకీయ ఉద్రిక్తతను ఉపశమింపజేయడం కోసం" అనే సాకుతో, సత్యాగ్రహులు కాక మరో 90,000 మంది రాజకీయ ఖైదీల విడుదలను ఆయన సాధించగలిగారు. ముగ్గురు వీరయోధులు భగతసింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌ల మరణదండనను తగ్గించవలసిందిగా కూడా అభ్యర్థించారు. కానీ విజయం సాధించలేక పోయారు. కానీ వైస్రాయ్ చర్చలను ఇంగ్లండ్ నుండి నిర్దేశించారు. వాళ్ళు ఈ ముగ్గురు హీరోల్ని 'రాజ్'కు ఒక సవాలుగా భావించారు. ఆ విధంగా వారు క్షమకు అనర్హులనుకున్నారు. వాస్తవానికి, గాంధీజీ వారి ఉరిశిక్షల రోజున వైస్రాయ్‌కి ఒక లేఖరాశారు. అందులో శిక్ష తగ్గించవలసిందిగా ఉద్వేగ భరితంగా అభ్యర్థించారు. కానీ ఆ ఉత్తరం రాయడం అప్పటికే ఆలస్యం అయిందని ఆయనకు తెలిసివుండదు.

కొన్ని అర్థం చేసుకోవడానికి వీల్లేని కారణాలవల్ల బ్రిటిష్ రాజ్‌తో కుదిరిన ఒడంబడిక బేరీజులో ఇప్పటికే బలహీనపడిన గాంధీజీ పక్షాన ఒక అంశాన్ని పేర్కొనాలి. బహుశా గాంధీజీ కంటే ఇర్విన్ మరింత మెరుగ్గా బేరసారాలు సాగించగలవాడై వుండాలి. లేకపోయినట్లయితే అత్యంత విశిష్టమైన, విజయవంతమైన అహింసాయుత ఉద్యమానికి అగ్రగామి నాయకుడిగా అంతర్జాతీయంగా మీడియా దృష్టిని ఆకర్షించి, స్త్రీలు, పిల్లలతో సహా లక్షోపలక్షల మంది ప్రజల్లో అరుదైన త్యాగనిరతిని నింపిన వ్యక్తి ప్రభుత్వానికి అన్ని రాయితీలు ఇవ్వవలసిన అవసరం లేదు. ఇటువంటి పరిస్థితులలో మరణశిక్షల తగ్గింపు వంటి ప్రధాన సమస్య విషయంలో ఆయన విజయం సాధించగలడని ఆశించలేము. ఆయన కరాచీలో ఇలా అన్నారు: "నేను మరొక పని చేసివుండాలని మీరంటారు. పరిష్కారానికి శిక్ష తగ్గింపును నేను ఒక షరతుగా చేసి వుండవచ్చు. కానీ అలా జరగలేదు. ఇప్పుడు (ఒడంబడిక నుండి) ఉపసంహరించుకుంటామని బెదిరించి నట్లయితే, అది విశ్వాస ఘాతుకం కాగలదు". ఇది భగత్ సింగ్ గురించి ఆయన లాంఛన ప్రాయంగా వ్యక్తీకరించిన అనుభూతిగా మాత్రమేభావించరాదు.

ఇలాంటి యువకుల శ్లాఘనీయమైన త్యాగనిరతి గురించి, జాతీయ వాద స్ఫూర్తి గురించి గాంధీజీ ప్రసంగాల రికార్డులన్నీ భద్రంగా వున్నాయి. ఒకసారి ఆయన ఇలా అన్నారు: "దేశభక్తిని ప్రోది చేయడానికి ఊకదంపుడు ప్రసంగాలు చేసేవారి గురించి నేను ప్రస్తావించడం లేదు; ఎంత మూల్యమైనా చెల్లించి తమ దేశాన్ని స్వేచ్ఛాయుతంగా చూడటానికి రహస్యంగా, నిశ్శబ్దంగా, అవిశ్రాంతంగా కృషి చేసే యువతీ యువకుల దళం నా మనసులో వుంది." ఆయన వారు అనుసరించిన విధానంతో మాత్రమే విభేదించారు. ఆయన కరాచీలో ఇలా అన్నారు: "నాకు ఒకసారి భగత్‌సింగ్ తోనూ, అతని సహచర కామ్రేడ్స్‌తోనూ మాట్లాడే అవకాశం లభించినట్లయితే, వారు అనుసరిస్తున్న మార్గం ఎంత పొరపాటో, ఎంత నిష్ఫలమో చెప్పివుండే వాడిని. ఆకొన్న లక్షోపలక్షలమంది ప్రజలకోసం మనం కత్తితో స్వరాజ్యాన్ని జయించలేం. ఎందుకో నేను వివరిస్తాను. మనం హింసావిధానాన్ని అనుసరించి నట్లయితే, గత ఉద్యమ కాలంలో సగర్వంగా తమను తాము రక్షించుకున్న స్త్రీలు, పిల్లలు ఆ విధంగా చేయగలరా?

ఈ భూమ్మీద ఎంతో బలహీనులుగా పేరుపొందిన మహిళలు ఎన్నో విశిష్టమైన సేవలు చేశారు. మనం హింసను చేపట్టినట్లయితే వాళ్ళలా చేయగలరా? ఇక మన పిల్లలు - మన వానరసేన; వాళ్ళు వారి ఆటబొమ్మల్ని, వారి గాలిపటాల్ని, వారి టపాకాయల్ని తిరస్కరించారు. స్వరాజ్య సైనికులుగా చేరారు. మీరు హింసాత్మకపోరాటంలోకి వాళ్ళనెలా చేర్చుకోగలరు?"

ఈ మాటల గురించి ఇప్పుడు ఆలోచించడం సముచితంగా వుంటుంది. ఏ పోరాట విధానం జయాపజయాలనైనా నిర్ణయించగలిగేది ప్రజల మద్దతు. భారతదేశ ప్రజానీకం హింసనుకాక, అహింసా విధానాన్నే స్పష్టంగా ఎంచుకున్నారు. ఈ వివాదం తర్వాత కూడా గాంధీజీ ఎప్పుడు పిలుపు ఇచ్చినా మిలియన్ల మంది స్పందించారు. బహుశా, గాంధీజీ పొందగలిగిన ఈ ప్రజామద్దతు కారణంగానే కాబోలు, వామపక్షం వైపు మొగ్గు గల ఎం.ఆర్.మసానీ, రామ్ మనోహర్ లోహియా, జయప్రకాష్ నారాయణ్ వంటి ప్రముఖ నాయకులు ఆయన బృందంలో కొనసాగారు. ఏ సందర్భంలోనైనా, స్వాతంత్ర్యం కోసం సాగించే సాయుధపోరాటం వెలుపల నుండి ఆయుధ సహాయంతో మాత్రమే విజయవంతం అవుతుంది. ఆ విధమైన సహాయం 1942లో సుభాస్ చంద్రబోస్ కృషితో వచ్చింది. కానీ అప్పటికే మనదేశ స్వాతంత్ర్యానికి సూత్రప్రాయమైన అంగీకారం లభించింది.

గాంధీజీ వాదనల గురించి చర్చించడం, హింసాయుత, అహింసాయుత పోరాట పద్ధతులలోని సానుకూల, ప్రతికూల అంశాలను పోల్చి చూడటం సుదీర్ఘమైన వ్యవహారం. కాని తప్పక గుర్తించదగిన విషయం ఒకటుంది. ఆయన అహింసా మతం ఆఖరికి "ఒక బందిపోటుని, లేక హంతకుడిని శిక్షించడానికి కూడా హింసాయుతంగా మారజాలదు.

బహుశా లార్డ్ ఇర్విన్ చెప్పిన ఈ కింది మాటలు, గాంధీజీ ఎందువల్ల ఉరిశిక్షలను తగ్గించేలా ఒప్పించలేకపోయారో వివరించవచ్చు. "శిక్ష తగ్గింపు గురించి గాంధీజీ నా ముందు చెప్పింది విన్నాక, అహింసా ప్రబోధకుడైన వ్యక్తి, మౌలికంగా తనకు వ్యతిరేకమైన (హింసా) వాదానికి అంకితమైనవారి కోసం ఇలా అభ్యర్థించడంలో అర్థం ఏమిటని ఎదురు ప్రశ్న వేసేవాడిని. కానీ, కేవలం రాజకీయ కారణాల ద్వారా మాత్రమే, నా విచక్షణ ప్రభావితం అయ్యేందుకు అనుమతించడం పూర్తిగా పొరపాటని భావించాను". గాంధీజీ వ్యక్తిగతంగా మార్చ్ 19వ తేదీన తనను కలుసుకోవడాన్ని గురించి ఇర్విన్ ప్రస్తావించారు. ఆసక్తికరమైన రీతిలో, అదే రోజున భగత్‌సింగ్, మరో ఇద్దరు వైస్రాయికి ఒక లేఖ పంపారు. స్నేహితుల ఒత్తిడివల్ల వాళ్ళు ఆ లేఖ పంపారు. ఆ ఉత్తరంలో వాళ్ళు వైస్రాయిని దయచూపించ వలసిందిగా కోరలేదు. యుద్ధఖైదీలుగా చూడవలసిందిగా మాత్రమే కోరారు. అందువల్ల తమను ఉరితీయకుండా షూట్ చేయమని కోరారు. ఇప్పుడు ఈ ఉత్తరం లభ్యం అవుతుంది. కనుక గాంధీజీ వైఖరిని, అది ఏమైనప్పటికీ, ఖండించడంవల్ల ప్రయోజనం లేదు. ఎందుచేతంటే భగత్‌సింగ్ ఎన్నడూ కూడా క్షమాపణ కోరాలనే భావననే సహించలేదు. మరో వాస్తవం కూడా దీన్ని ధ్రువీకరిస్తోంది. భగత్‌సింగ్ స్నేహితుడొకరు (ప్రాణ్‌నాథ్ మెహతా) మార్చ్ 20న జైల్‌లో దయాభిక్ష కోరే లేఖ మీద భగత్‌తో సంతకం చేయించడానికి ప్రయత్నించాడు. కానీ అతను నిరాకరించాడు.

నాలుగు రోజుల తర్వాత, కరాచీలో ఏఐసిసి సెషన్ రోజున, ముగ్గురినీ లాహోర్‌లో ఉరితీశారు. ఈ వార్త వినడంతోనే, ఒడంబడికలోని నియమ నిబంధనలతో సాంకేతికంగా ఎలాంటి సంబంధం లేకపోయినప్పటికీ ఇలాంటి పరిస్థితులలో ఆకస్మిక ఉరితీతలు తన కాళ్ళ కింద భూమిని తొలిచెయ్యడం వంటిదని గాంధీజీ అన్నారు. కరాచీ సెషన్ ప్రారంభం కావడానికి ఒక రాత్రి ముందుగా ఉరితీయ్యాలని ప్రభుత్వం ఆదేశించడం బహుశా, కపటత్వంతో కూడిన చర్య అయివుండాలి. ఉద్వేగభరితమైన అంశం ఏఐసిసిలో గాంధీజీని, కాంగ్రెస్‌ను క్లిష్టపరిస్థితుల్లో పడేస్తుందని తెలిసే ఆ పనిచేశారు. ఆ మంట అంతా గాంధీజీ మీదకు, కాంగ్రెస్ మీదకు మళ్ళుతుందనుకున్నారు. నిజానికి జరిగింది కూడా అదే ●

-(ఫ్రంట్‌లైన్ సౌజన్యంతో, ఏప్రిల్ 27 సంచికలోని పరేష్ ఆర్. వైద్యన్యాసానికి అనుసరణ).



## యాడ్‌జెల్ పెన్నులతో సంచలనం

# మానెక్ చంద్ జైన్



**అదేం పిచ్చి...**

**ఎవరూ తొక్కికూడా చూడని పెన్నుల వ్యాపారమే దొరికిందా నీకు...**

**అది లాభాలు తెస్తుందనుకున్నావా?**

**బిజినెస్ వేల్యూ బొత్తిగా తెలియదే !?... అని వెక్కిరించారు.**

**కాని దేన్నీ పట్టించు కోలేదు.**

**ఆయన ప్రయాణం మొదలైంది ఓ షాప్ కీపర్‌గా 300 జీతంతోనే కావచ్చు.**

**వారసత్వంగా వచ్చిన ఆస్థి చిల్లిగవ్వైనా లేకపోవచ్చు.**

**స్టేషనరీ షాపుల్ని చూస్తూ ముంబైలో పిచ్చివాడిలా రోడ్లమీద తిరిగినవాడే కావచ్చు.**

కాని అందరూ తేలిగ్గా కొట్టిపారేసిన పెన్నుల వ్యాపారాన్ని చేపట్టాడు 'మానక్ చంద్ జైన్'. మార్కెట్‌ను కొల్లగొట్టాడు. 1986లో కేవలం పదివేలతో - చిన్న గదిలో పెన్నుల తయారీ మొదలుపెట్టి ఇవాళ 150 కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించాడు. ఇది మామూలు విజయం కాదు. ఆయన చేపట్టింది. అమాంతం కోట్లకు పడగలెత్తే ఏ సాఫ్ట్‌వేర్ బిజినెస్సో కాదు.

'యాడ్ జెల్ పెన్ను'తో వ్యాపారంలో ఓ కొత్త అధ్యాయాన్ని రాస్తున్న మానక్‌చంద్ జైన్ పుట్టి పెరిగిందీ రాజస్థాన్‌లోని ఫతేపూర్ సికర్ పట్టణంలో. స్కూలు, కాలేజీ చదువు కొనసాగింది అక్కడే. 1974లో బి.కాం డిగ్రీ చేతికొచ్చింది. అప్పటికే ఆయన కుటుంబం ఆర్థికంగా కష్టాల్లో వుంది. తండ్రి మదన్‌లాల్ జైన్ చిన్న బట్టల కొట్టు యజమాని. దానిమీద వచ్చే రాబడి ఇంటి ఖర్చులకి కూడా సరిపోయేదికాదు. అందుకే డిగ్రీ కాగానే ఏదో ఒక ఉద్యోగం వెతుక్కోక తప్పలేదు. స్వంత పట్టణం ఫతేపూర్ సికర్‌లో అలాంటి అవకాశం ఒక్కటీ కనిపించలేదు.

### 300 జీతంతో మొదలు...

పి.జి చేద్దామన్న కోరిక వున్నా - ఆర్థిక పరిమితుల దృష్ట్యా అది సాధ్యం కాలేదు. ఉద్యోగం కోసం అనేక చోట్ల ప్రయత్నించి విసిగిపోయాడు. చివరికి కలకత్తాకు చెందిన సూరజ్‌మల్ జలాన్ దగ్గర చిన్న ఉద్యోగం దొరికింది. సూరజ్ మల్ అప్పటికి 'లింక్' బ్రాండ్ పేరుతో పెన్నుల తయారీ రంగంలో వున్నాడు. కలకత్తాలోని పెన్నుల షాపును చూసుకోవడం జైన్ పని. జీతం నెలకి రు.300 రూపాయలు మాత్రమే.

కష్టపడి పని చేసే స్వభావం, పట్టుదల, నిజాయితీ - జైన్ పట్ల యజమానికి బాగా నమ్మకం కలిగేలా చేశాయి. ఏడాది తిరక్కుండానే జీతం మరో రు.300 లు పెంచాడు. అదే సమయంలో మద్రాసులో జలాన్ కొత్తగా ఓ షాపుని తెరిచే ప్రయత్నంలో వున్నాడు. దాన్ని నిర్వహించడానికి ఓ నమ్మకస్తుడు కావాలి. సహజంగానే జైన్ మీద ఆ బాధ్యత పడింది. ఓ మామూలు షాప్ కీపర్‌గా, స్వల్ప వేతనంతో మొదలైన జైన్ జీవితాన్ని ఊహించని మలుపుతిప్పిన సంఘటన అదే. కోల్‌కత్తాలో మాదిరిగా మద్రాసులో విడిగా అద్దె ఇంట్లో వుండాల్సిన బాధతప్పింది. పగలంతా దుకాణం చూసుకొని అందులోనే ఓ మూల నిద్రపోయేవాడు.

మద్రాసులో జలాన్ పెన్నుల దుకాణం తొందర్లోనే పాపులరైంది. పెన్నుల అమ్మకాలు పెరిగాయి. దాంతో జైన్ జీతం కూడా ఓ మోస్తరు పెరిగింది. విడిగా ఓ అద్దె ఇల్లుతీసుకొని జైన్ తన కుటుంబాన్ని మద్రాసు మార్చాడు. అలా పదేళ్ళపాటు లింక్ పెన్నుల మార్కెటింగ్ పనిలోనే తలమునకలయ్యాడు. తాను పని చేస్తున్న కంపెనీ ఎలా ఎదుగుతోందో దగ్గర్నించి గమనించే అవకాశం కలిగింది. పెన్నుల వ్యాపారంలోని సాధక బాధకలేమిటో వాటిని ఎలా ఎదుర్కోవాలో తెలుసుకున్నాడు. దాంతో స్వంతకాళ్ళపై నిలబడాలన్న ఆలోచన జైన్‌ని తొలిచేసింది. నిజానికి ఆయన అప్పటికి బాగానే స్థిరపడ్డాడు. నాలుగంకెల జీతం... ఆత్మీయుడిగా చూసుకునే యజమాని.... ఉద్యోగంలో స్వేచ్ఛ.... కాని వ్యాపారంలోని లోతు తెలిసే కొద్దీ అందులోకి తానే స్వంతంగా దిగాలన్న ఆలోచన జైన్‌లో బలపడింది. స్వంతవ్యాపారమంటే మాటలు కాదు పెన్నుల పరిశ్రమకి పెట్టుబడి కోట్లలో కాకపోయినా మొదట్లో కనీసం లక్షల్లోనైనా కావాలి. జైన్‌కు కుటుంబపరంగా సంక్రమించిన ఆస్తి చిల్లిగవ్వ లేదు. ఉద్యోగంలో అప్పటికి కూడబెట్టింది మహా అయితే పదివేలు కూడా మించిలేదు. కాని ఈ ఆర్థిక పరిమితులేవీ ఆయన ఆలోచనకి కళ్ళెం వేయలేదు. రెక్కలు తొడుక్కున్న ఆశలతో లక్షణంగా వున్న ఉద్యోగానికి రాజీనామా చేసి 1986లో మద్రాసు నుంచి ముంబయి బయలుదేరారు.

### ముంబైలో ఒంటరిగా...

వ్యాపారాన్ని ఎక్కడినుంచి ప్రారంభించాలన్న చర్చ వచ్చినప్పుడు ముంబయి అయితేనే అన్ని విధాలా బాగుంటుందని మిత్రులు సలహా ఇచ్చారు జైన్‌కు. అప్పటికి ఆయనకి తెలిసినవి రెండే నగరాలు. ఒకటి కలకత్తా రెండు మద్రాసు. ముంబయి గురించి వినడమే తప్ప ఒక్కసారి కూడా చూళ్ళేదు. పూర్తిగా కొత్త ప్రపంచం. మిత్రులు, సన్నిహితులంటూ ఎవరూ లేని చోటు. కనీసం చేతిలో పుష్కలంగా పెట్టుబడి కూడా లేదు. 1986 వర్షాకాలంలో కేవలం పదివేల రూపాయలతో ముంబయిలో రైలు దిగాడు జైన్. బిజినెస్ సంగతేమోగాని మొదలు తలదాచుకోవడం - ఆ మహానగరంలో పెద్ద సమస్యగా మారింది జైన్‌కి. ఆర్య నివాస్ అనే ఓ మామూలు లాడ్జిలో దిగాడు. అద్దె ఖర్చులు కలిసొస్తాయని కొంతమందితో కలిసి ఓ గదిని షేర్ చేసుకున్నాడు. బిజినెస్ గురించి ఏం చేయాలో, ఎక్కడికి వెళ్లాలో తెలియని పరిస్థితి. మనదేశంలో పెన్నుల వ్యాపారం అప్పట్లో ఇంకా శైశవదశలోనే వుంది. బడావ్యాపార వేత్తలకి ఈ రంగం మీద ఏ మాత్రం ఆసక్తి వుండేదికాదు. ఇది అంత లాభసాటి వ్యాపారంగా కనిపించలేదు. దీంతో ఏ ఒకరిద్దరు చేతుల్లోనో ఈ పరిశ్రమ కేంద్రీకృతమై వుండేది. పోటీ అనేదే లేకపోవడంతో ఈ పరిశ్రమ మీద అందరికీ ఖరీదైన పెన్నులకి ఈ దేశంలో మార్కెట్‌లేదని అందరూ భావించేవారు. కొత్త బ్రాండ్‌ని ప్రమోట్ చేయడానికి ఓల్‌సేలర్లు కూడా ఆసక్తి చూపేవారు కాదు. కాని జైన్ మాత్రం - ఎవరికీ పట్టని ఈ పరిశ్రమ మీదే తన భవిష్యత్తును నిర్మించుకోవాలనుకున్నాడు. ముంబయిలో తను బసచేసిన ఆర్యనివాస్ లాడ్జినుంచి పొద్దున్నే బయటపడి ముఖ్యమైన సెంటర్లన్నీ తిరిగివచ్చేవాడు. స్టేషనరీ దుకాణం. కనిపించిన చోటల్లా ఠక్కున ఆగిపోవడం గంటల తరబడి షాప్‌కి వచ్చిపోయే కస్టమర్లను చూస్తూ నిలబడడం - అక్కడ అమ్మే లోకల్ మేడ్, ఫారిన్ మేడ్ పెన్నుల్ని పరిశీలించడం... ముంబయికి వచ్చిన మొదట్లో చాలా రోజులవరకు అతడి దినచర్య ఇదే.

జైన్‌లోని ఈ ఆసక్తే - ఆ తర్వాత కాలంలో అతడిని పెన్నులరంగంలో ఓ దిగ్గజంగా నిలిపింది.

### లక్ష్మీ 500

పెన్నుల పరిశ్రమకి ఈ దేశంలో మార్కెట్ లేదన్న అభిప్రాయాన్ని బద్దలు కొట్టాలనుకున్నాడు జైన్. ఆధునిక టెక్నాలజీ సాయంతో నాణ్యమైన పెన్నుల్ని తయారు చేసి చవకగా అందించగలిగితే - ఇంత జనాభా వున్న ఈ దేశంలో పెన్నులకి మార్కెట్‌ని సృష్టించడం కష్టమేం కాదన్నది జైన్ అభిప్రాయం. పెన్నుల తయారీకి స్వంత యూనిట్ నెలకొల్పే ప్రయత్నాలు మొదలు పెట్టాడు. వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్ళాలంటే సరికొత్త మార్కెటింగ్ వ్యవస్థ కూడా అవసరమని గ్రహించాడు.

ముంబయిలో ఓ చిన్నస్థాయి మౌల్డ్ - మేకర్‌ని ఆశ్రయించాడు. కావలసిన డిజైన్‌లోకి పెన్నుల నమూనాలని మలిచేందుకు అవసరమైన పరికరాన్ని కొనుగోలు చేశాడు. దానికి ఐదువేలు ఖర్చైంది. మిగిలిన డబ్బుతో ప్లాస్టిక్ తదితర సామాగ్రిని సమకూర్చుకున్నాడు. మౌల్డర్ మెషీన్ సాయంతో మొట్టమొదటి సారి 500 పెన్నుల్ని తన గదిలోనే తయారు చేశాడు. అప్పుడు తన యూనిట్‌కి 'అడ్వర్ట్' అనే పేరు పెట్టాడు. ఓ హోల్‌సేల్ డీలర్ని సంప్రదించాడు. అప్పటికే చేతిలో వున్న పదివేలూ కరిగిపోయాయి. తన కొత్త ప్రాడక్టుకి ఆదరణ వుంటే సరి - లేకుంటే పెట్టేబేడా సర్దుకొని మద్రాసు రైలు ఎక్కాల్సిందే! ఇలా మనసులో ఓ వైపు సవాలక్ష సందేహాలు ముప్పిరిగొంటుండగా - హోల్‌సేల్ డీలర్ దగ్గరికి వెళ్ళాడు. పెదవి విరుస్తాడేమోనని భయపడ్డాడు. అయితే - అదృష్టవశాత్తూ ఆ డీలర్‌కి జైన్ పెన్నులు నచ్చాయి. వాటిని మార్కెట్ చేస్తానన్నాడు. కాని ఓ షరతు పెట్టాడు. పెన్నులు అమ్ముడు పోకుంటే వాటిని జైన్ తిరిగి వాపసు తీసుకోవాలన్నది ఆ షరతు. జైన్ దీనికి ఒప్పుకున్నాడు. ఒకటి రెండు రోజులు గడిచాయి. ఏం వార్త వినాల్సివస్తుందోనని టెన్షన్‌తో వెళ్ళాడు ఆ డీలర్ దగ్గరికి. "నీ పెన్నుల్ని జనం బాగా రిసీవ్ చేసుకున్నారు. తక్షణం మరో వెయ్యి సరఫరా చేయగలవా?" అని ఆ డీలర్ అడిగేసరికి జైన్ ఆనందానికి పట్టపగ్గాల్లేకపోయాయి. అందమైన కొత్త డిజైన్లతో చవకగా ఇవ్వగలిగితే తన ప్రాడక్ట్‌కి తిరుగులేదన్న నమ్మకం బలపడింది. పెద్ద ఎత్తున ఉత్పత్తిని మొదలుపెట్టాలనుకుంటే పెట్టుబడి సమస్య ఎదురైంది. ముంబయి లాంటి మహానగరంలో యూనిట్‌ని నెలకొల్పడానికి అనువైన స్థలం దొరకడం మరో సమస్య. కాని వీటి గురించి ఆలోచిస్తూ కూర్చోలేదు. వెంటనే మళ్ళీ మద్రాసు రైలెక్కాడు. ఓ సన్నిహితుడి దగ్గరినుంచి లక్షరూపాయల అప్పు తీసుకున్నాడు. క్రియేటివ్ డిజైన్లు రూపొందించి, నాణ్యమైన ప్లాస్టిక్‌తో కొట్టొచ్చే రంగుల్లో ఆకర్షణీయంగా తయారు చేసిన పెన్నుల్ని సామాన్యుడు సైతం తేలిగ్గా కొనుక్కోగలిగే ధరకు అందించాలని వ్యూహం రూపొందించాడు. ముందు డీలర్లను ఆకర్షించగలిగితే సగం విజయం సాధించినట్టేనన్నది ఆయన ఆలోచన. సెంట్రల్‌బొంబాయిలో ఓ చిన్న స్థలాన్ని అద్దెకు తీసుకొని స్వంత యూనిట్ ప్రారంభించాడు. ఉత్పత్తి మొదలైంది. నాణ్యతపరంగా అప్పటిదాకా మార్కెట్లో వున్న వాటికంటే 'ఆడ్ పెన్నులు' ఆకర్షణీయంగా వున్నాయి. కాని ఎంత బాగా వున్న సరైన మార్కెటింగ్ వ్యవస్థ లేకుంటే లాభం లేదన్న సంగతి గ్రహించాడు జైన్. మామూలుగా పెన్నుల్ని కార్డ్‌బోర్డ్ బాక్సుల్లో ప్యాక్ చేసి అమ్మే పద్ధతికి భిన్నంగా ఓ ప్లాస్టిక్ జార్‌ని ఉపయోగించారు. ఇది అద్భుతంగాపనిచేసింది. అమ్మకాలు అనూహ్యంగా పెరిగాయి. రకరకాల అందమైన డిజైన్లతో తక్కువ ధరకు దొరికే యాడ్‌పెన్నులంటే జనంలో ముఖ్యంగా పిల్లల్లో బాగా క్రేజ్ ఏర్పడింది. ఈ దశలో జైన్ స్థానిక మార్కెట్‌పైన - అదీ తక్కువ ధర పెన్నులపైనే దృష్టికేంద్రీకరించాడు. అలా 1986లో కేవలం 10 వేలతో తెలియని నగరంలో కాలుమోపి స్వంత యూనిట్ నెలకొల్పి-తన కాళ్ళపై తాను నిలబడే స్థాయికి చేరుకోవడానికి దాదాపు పదేళ్ళు పట్టింది జైన్‌కి.

### యాడ్‌జెల్ సక్సెస్ బ్రాండ్

ఎవరూ సీరియస్‌గా పట్టించుకోని పెన్నుల తయారీ రంగంలో 1996 నాటికి జైన్ ఒక గుర్తింపు తెచ్చుకున్నారు. ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి తన ఉత్పత్తిలో కొత్త మార్పులు తేవాలన్న ఆలోచన కలిగింది. ఆ ఆలోచన ఫలితమే యాడ్ జెల్ హైటెక్ పెన్నులు. ప్రస్తుతం యాడ్‌జెల్ పెన్నుల గురించి పెద్దవాళ్ళకంటే స్కూలుకు వెళ్ళే కుర్రాళ్ళే బాగా చెబుతారు. విద్యార్థులతో పాటు ప్రొఫెషనల్స్‌లో కూడా విపరీతమైన పాపులారిటీ సాధించాయి యాడ్‌జెల్ ఇంక్ పెన్నులు. 1996లో మహారాష్ట్ర స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌నించి 5 లక్షలు అప్పుగా తీసుకొని చిన్న యూనిట్ ఏర్పాటుచేసి హైటెక్ పెన్నుల ఉత్పత్తి చేపట్టాడు. మూడేళ్ళు తిరిగేసరికి డిమాండ్ పెరగడంతో గుజరాత్‌లోని ఉంబర్‌గావ్‌లో మరో చిన్నస్థాయి ఫ్యాక్టరీని ఏర్పాటుచేశారు. 1996లో జపాన్‌కి చెందిన హోటో, 1997లో దక్షిణ కొరియాకు చెందిన డోండా కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని ప్రపంచంలోనే అత్యుత్తమ డిజైన్లతో కూడిన క్వాలిటీ పెన్నుల్ని తయారుచేయడానికి శ్రీకారం చుట్టాడు. దీంతోపాటు వినియోగదారుల్ని ముఖ్యంగా పిల్లల్ని ఆకట్టుకునేందుకు ఎప్పటికప్పుడు కొత్త డిజైన్లను ప్రవేశ పెట్టడంతో యాడ్‌జెల్ పెన్నులకి మార్కెట్లో తిరుగులేకుండాపోయింది. 1997లో టర్నోవర్ 7.38 కోట్లుకాగా 2000-2001 సంవత్సరం మార్చి31 నాటికి - అంటే కేవలం మూడేళ్ళలో 108 కోట్లకు చేరింది. ఈ సంవత్సరం చివరి నాటికి టర్నోవర్ 150 కోట్లు దాటుతుందని అంచనా. ప్రస్తుతం దేశంలోనే పెన్నుల పరిశ్రమ మొత్తం టర్నోవర్ దాదాపు వెయ్యికోట్లుకాగా వచ్చే ఏడాది నాలుగోవంతు టర్నోవర్‌ని యాడ్‌జెల్ పెన్నులు సాధిస్తాయని అంచనా.

### విదేశీ పోటీకి దీటుగా...

ఒకప్పుడు కేవలం 300 రూపాయల ఉద్యోగం దొరికినందుకు అదే గొప్పనుకుని సంబరపడిపోయిన దశనుంచి ఎవరూ సీరియస్‌గా తీసుకోని పెన్నుల పరిశ్రమలోకి ప్రవేశించి - ఆర్థికంగా స్వంత వనరులు ఏ మాత్రం లేకుండా - దాదాపు 150 కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించడం అంటే మాటలు కాదు. "ఓ వ్యాపారవేత్తగా ఎదగాలనుకున్నవాడు - ఇలా నీలా ఎవరూ తొక్కిచూడని దారిలో వెళ్ళే సాహసం చేయడు" అని బంధువులు, మిత్రులు హెచ్చరించినా తాను ఎన్నుకున్న బాటనుంచి పక్కకి తప్పుకోలేదు. "ఓస్... పెన్నుల బిజినెస్సా?" అని పెదవి విరిచినవారికి - "ఇది ఓ వ్యాపారమేనా - ఇదీ ఓ పరిశ్రమేనా?" అని ఆశ్చర్యపోయినవారికి జైన్ 'సక్సెస్ స్టోరి'యే తగిన జవాబు. జైన్ దూరదృష్టికి, మార్కెట్ నాడిని పసిగట్టడంలో అతడి నైపుణ్యానికి నిదర్శనం 'జెల్ ఇంక్ పెన్నులు'. బాల్ పాయింటు పెన్నులు మన దేశంలో చాలా ఏళ్ళనించి వాడుకలో వున్నవే. వాటిలో ఎలాంటి కొత్తదనం కనిపించలేదు. ముఖ్యంగా పిల్లలకి కొత్త టేస్ట్ చూపించేందుకు జెల్ ఇంకు పెన్నుల్ని దేశంలో ప్రవేశపెట్టాడు. ఇవి అనూహ్యంగా సక్సెస్ అయ్యాయి. జెల్ ఇంక్ పెన్నుల తయారీలో ఇప్పుడు జైన్‌దే అగ్రస్థానం. నాణ్యమైన పెన్నుల్ని చవకగా అందించాలన్నదే వ్యాపారంలో జైన్ విజయరహస్యం. యాడ్ పెన్నుల జాబితాలో యాడ్ రోల్‌గోల్డ్ పిజి-500, డైమండ్ రోలర్ పెన్నుల్లాంటి ఖరీదైన హైటెక్ పెన్నులు కూడా వున్నాయి. ఈ ఉత్పత్తులన్నీ అమ్మకాల్లో సంచలనం సృష్టించాయి. పెన్నుల పరిశ్రమలో రేనాల్డ్స్, పార్కర్, డాక్టర్‌లాంటి పేరుమోసిన విదేశీ కంపెనీలు ఇప్పుడు దేశీయ మార్కెట్‌ని ముంచెత్తుతున్నాయి. ఇప్పుడు స్థానికంగా కూడా పోటీ తక్కువేం లేదు. పైగా ఈ మధ్యే చైనా సరుకు' కూడా కుప్పతెప్పలుగా వచ్చిపడుతోంది. ఇలాంటి పరిస్థితిలోనూ జైన్ ఆధిపత్యం అప్రతిహతంగా కొనసాగుతోందంటే కారణం - నాణ్యత పై దృష్టి. ప్రజల అభిరుచులకి తగ్గట్టు ఎప్పటికప్పుడు కొత్త డిజైన్లుకి రూపకల్పన చేయడం. ప్రతినెల ఒక సరికొత్త డిజైన్‌తో యాడ్‌జెల్ పెన్నులు ఇప్పుడు మార్కెట్లో ప్రత్యక్షం అవుతున్నాయి.

ఇలా మానిక చంద్ జైన్ విదేశీ పోటీని తట్టుకొని స్వయం కృషితో కేవలం 15 ఏళ్ళలో పెన్నుల వ్యాపారంలో దేశంలోనే 4వ వంతు మార్కెట్‌ని చేజిక్కించుకోవడం సాధారణ విషయమేమీ కాదు.

\- వంశీ



**నవీన్**

సీరియల్

# రక్తకాసారం

12



(గతసంచిక తరువాయి)

షేవ్ చేసుకోవడం ముగించిన బాలూనాయక్ స్నానం చేసి యూనిఫామ్ వేసుకున్నాడు.

"టిఫిన్ రెడీ" అంటూ అతని భార్య సుజాత టిఫిన్ తెచ్చి డైనింగ్ టేబుల్ మీద పెట్టేసింది.

"టిఫిన్ చేసేంత టైమెక్కడుంది నాకు. స్టేషన్‌కు తెప్పించుకొని తింటాలే... పాప స్కూలుకెళ్ళిందా?" అన్నాడు బాలూ నాయక్.

"ఇప్పుడే మన యాదగిరి స్కూల్ల దించొచ్చిండు... మీరు టిఫిన్ తినే పొంద్రి.. ఈ లోపలే కొంపలేం ముంచుకుపోతలేవు" అంది సుజాత.

"ఆలస్యంగ పోతే కొంపలు నిజంగనే ముంచుకపోతయి.. ఇప్పటికే తొమ్మిదిన్నరయి పోయింది.. మరో ఐదు నిమిషాల్లో నేను స్టేషన్లుండాలి..." అంటూనే బాలూ నాయక్ టిఫిన్ చెయ్యకుండానే బయటకొచ్చేసి పోర్టికో కిందున్న మోటార్ సైకిల్ స్టార్ట్ చేశాడు.. అతనింటికి ఓ రెండు వందల గజాల దూరంలోనే పోలీసు స్టేషనుంది. అతడు మోటారు సైకిలెక్కి కొంచెం దూరం వెళ్ళాడో లేదో... అతనికెదురుగా సైకిల్ మీదొస్తున్న ఇద్దరు యువకులు వాళ్ళ చేతుల్లో ఉన్న పిస్టల్స్‌తో అతని మీద కాల్పులు జరిపారు. మరుక్షణంలో బాలూనాయక్ నేలమీద కుప్పకూలిపోయాడు. కొంచెం దూరంలో ఉండి ఈ దృశ్యాన్ని చూస్తున్న కానిస్టేబుల్ యాదగిరి సైకిల్ మీద వెళ్ళిపోతున్న ఆ ఇద్దరు యువకుల్ని వెంటాడే ప్రయత్నం చేశాడు. కానీ వాళ్ళు అతని వేపు కూడా పిస్టల్స్ చూపించి మరుక్షణంలో అక్కన్నించి మాయమైపోయారు.

చుట్టుపక్కలున్న చాలామంది జనం పెద్దగా అరుస్తూ రక్తం మడుగులో పడి కొట్టుకుంటున్న బాలూనాయక్ చుట్టూ చేరారు.

బయట్నించి పెద్ద కలకలం వినిపించడంతో ఏదో జరిగిందని ఊహించిన సుజాత వెంటనే బయటకొచ్చి రక్తం మడుగులో కొన ఊపిరితో పడున్న భర్తను చూసి కెవ్వున కేకపెట్టి నిట్టనిలువునా కూలిపోయింది.

ఈ విషయం పోలీసు స్టేషన్లో తెలియగానే జీపులో బాలూనాయక్‌ను దగ్గర్లో ఉన్న హాస్పిటల్‌కు తీసికెళ్ళారు.. అతన్ని పరీక్షించిన డాక్టర్ చనిపోయాక హాస్పిటల్‌కు తీసుకొచ్చారని తేల్చాడు.

"వీళ్ళు ఇంతకాలం దళితుల్ని చంపరేమో అనుకున్నాను.. వీళ్ళు దళితుల్ని కూడా చంపడం మొదలెట్టింద్రన్నమాట!" అన్నారు ఆ ఊరి ప్రజల్లో కొందరు.

"దళితుడయితే ఏం... వాడు పోలీసోడు కద.. పోలీసోడు వాళ్ళ వర్గశత్రువే కద" అన్నారు మరికొందరు. "వాడు పోలీసోడయింది ఎందుకోసం.. పొట్టకూటికోసమే కద.. అందుల గీ బాలూనాయక్ అందరసుంటి పోలీసోడు కాదు.. లంచాలసలే తీసుకోడు. ఎప్పుడూ పేదోళ్ళ పక్షమే ఉండెటోడు.. గసుంటోన్ని చంపుడు అన్యాయం కదా?"

"న్యాయం లేదు. అన్యాయం లేదు. వాడు పోలీసు యూనిఫామ్ వేసుకోని తిరుగుతాండు.. గంతే వాన్ని సంపేటందుకు వాళ్ళకు గా కారణం చాలు... గీ పోలీసోళ్ళు మాత్రం చిన్నోళ్ళా? వాళ్ళెందరు అమాయకుల్ని సంపుతలేరు"

"వాళ్ళు సంపుతున్నరు.. వీళ్ళు సంపుతున్నరు.. చచ్చేదెవ్వరు.. అక్కడ సచ్చేది దళితులే.. ఇక్కడ సచ్చేది దళితులే.. పాపం! బాలూనాయక్ పెళ్ళాం, పిల్లల గతేమయితదో"

"వాని ప్రాణానికి వాడు పోయిండుగని వాని పెళ్ళాం పిల్లలు మంచిగనే ఉంటరు. ఎందుకంటె గవర్నమెంట్ బాలూనాయక్ కుటుంబానికి కనీసం ఓ ఐదు లక్షలన్నా ఎక్స్‌గ్రేసియా ప్రకటిస్తది. అట్లనే ప్రతినెలా అతనికొచ్చే జీతాన్ని కూడా అతని కుటుంబానికిస్తది. ఆమె ఏమన్న చదువుకుంటే ఆమెక్కూడా ఉద్యోగమిస్తరు"

"ఎంతిచ్చినా, యేమిచ్చినా ఆ మనిషైతె మల్ల రాడుగదా... బతికినంత కాలం ఆమె గుండెల్లో అతని జ్ఞాపకమెప్పుడూ ఓ ముల్లోలె తొలుస్తనే ఉంటది కదా..."

ఇట్లా ఎవరికి తోచినట్టుగా వాళ్ళు బాలూ నాయక్ గురించి, అతని కుటుంబాన్ని గురించి మాట్లాడుకున్నారు. అడ్వొకేట్ తిరుమలరావొచ్చి బాలూనాయక్ శవం మీద పడి గుండెలు పగిలేలా రోదించాడు.

రెండ్రోజుల తర్వాత క్రాంతికారుల్నుండి ఓ ప్రకటన వెలువడింది. "కొండాపూర్ అడవుల్లో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా వేం బాలూనాయక్‌ను హతమార్చాం" అన్నది ఆ ప్రకటన.

బాలూ నాయక్‌కు ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. అందరూ అనుకున్నట్టుగానే ప్రభుత్వం బాలూనాయక్ కుటుంబానికి నాల్గు లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. అతని భార్య ఇంటర్మీడియెట్ ప్యాసుకాగానే ఆమెకో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇస్తామనీ, అతని కూతురు ఎంతవరకు చదువుకుంటే అంతవరకు ప్రభుత్వమే ఖర్చంతా భరించి చదివిస్తుందని కూడా ప్రభుత్వం ప్రకటించింది.

బాలూనాయక్ హత్యను గూర్చి ఎవరెవరు ఎలాంటి స్టేట్‌మెంట్లిస్తారని ప్రజలు ఎదురుచూశారో వాళ్ళందరూ అలాంటి స్టేట్‌మెంట్లే ఇచ్చారు.

కొత్త ప్రభుత్వం త్రిలింగద్వీపంలో శాంతిభద్రతల్ని పునరుద్ధరిస్తుందన్న ఆశలు పటాపంచలయిపోయాయి. బూటకపు ఎన్‌కౌంటర్లు ఆగిపోతాయనుకున్న వాళ్ళూ, వర్గశత్రు నిర్మూలన ఆగిపోతుందనుకున్న వాళ్ళూ హతాశులైపోయారు. పరిస్థితి మళ్ళీ మొదటికొచ్చింది.

## 15

ఆ ఊరి పేరు పాతర్లపాడు.

హకీంపేట నియోజకవర్గంలో ఉన్న పెద్ద గ్రామాల్లో పాతర్లపాడు కూడా ఒకటి.

ఆ రోజు అర్ధరాత్రి ఆ ఊర్లో ఒక నాటక ప్రదర్శన జరుగుతోంది. ఆ ఊరి మధ్యలో... నాలుగు వీధులు కలిసే చోట విశాలమైన మైదానం ఉంది. దాంట్లో ఈ మధ్యనే గ్రామ పంచాయితి బోర్డు ఆఫీసు నిర్మించారు. ఆ ఆఫీసు ముందే ఒక స్టేజి నిర్మించారు. ఆ స్టేజి మీద ఆ రోజు 'అమ్మ' అనే నాటక ప్రదర్శన జరుగుతోంది. ఆ ఊరి జనమంతా తన్మయులయిపోయి ఆ నాటకాన్ని చూస్తున్నారు. వాళ్ళ చుట్టూ చేతుల్లో గన్స్ పట్టుకొని రక్షకభటులు కాపలా ఉన్నారు.

ఊర్లో జరుగుతున్న పెత్తందార్ల ఆగడాలతో విసిగిపోయిన కొందరు యువకులు అడవుల్లోకి వెళ్ళిపోయి క్రాంతికారులతో కలిసిపోతారు. అన్యాయాలూ, అక్రమాలూ పూర్తిగా నిర్మూలించబడాలంటే, ఉన్నవాడు లేనివాన్ని దోచుకునే ఈ దోపిడీ వ్యవస్థను అంతమొందించాలంటే సాయుధ పోరాటమొక్కటే మార్గమని క్రాంతికారులు ఈ యువకులకు బోధిస్తారు. వాళ్ళు చెప్తున్నదంతా నిజమేనని ఈ యువకులు నమ్మి వాళ్ళతో చేరిపోతారు. రైఫిల్‌ను ఎలా ప్రయోగించాలో నేర్చుకుంటారు. ఆ తర్వాత ఊర్ల మీదబడి వాళ్ళ నాయకులు ఎవర్ని చంపమంటే వాళ్ళను చంపేస్తూ అడవుల్లో తిరుగుతుంటారు. వాళ్ళను అనుక్షణం సాయుధులైన పోలీసులు వేటాడుతూ ఉంటారు. వీళ్ళను వాళ్ళు చంపడం.. వాళ్ళను వీళ్ళు చంపడం.. అనేక మంది యువకులు నేలకొరుగుతుంటారు. బస్సుల్ని తగలబెట్టడం, రైల్వే స్టేషన్లను నేలకూల్చడం, టెలిఫోన్ ఎక్స్ఛేంజీలను పేల్చెయ్యడం, మందుపాతరల్ని పేల్చడం, ఎందరో అమయకులు బలైపోవడం.. అయ్యో నా కొడుకులూ, బిడ్డలూ ఇలా ఒకర్నొకరు చంపుకుంటున్నారే... అని వాళ్ళ మాతృమూర్తి.. అంటే దేశం - గుండెలు పగిలేలా విలపించడం.. మిమ్మల్ని మీరు చంపుకోవడం మానెయ్యండని ఆమె తన కొడుకుల్నీ, బిడ్డల్నీ వేడుకోవడం, సమాజాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలోనే, శాంతియుతంగానే, చట్టబద్ధంగానే మార్చవచ్చుననీ, అన్యాయాల్నీ, అక్రమాల్నీ, దోపిడీని అంతం చెయ్యవచ్చుననీ ఆ అమ్మ తన కన్నబిడ్డలకు ఉద్బోధించడం: ఇదీ ఆ నాటకంలోని ఇతివృత్తం.

**జరిగినకథ :** పోలీస్ అధికారి జితేందర్‌రెడ్డిని రైల్వే స్టేషన్లో ఓ అజ్ఞాత వ్యక్తి కాల్చి చంపుతాడు. ఓ వైపు శవయాత్ర జరుగుతుండగా మరోవైపు ప్రజాబంధుగా పేరుబడ్డ డాక్టర్ రఘువీర్ క్లినిక్‌లోకి ఇద్దరు ఆఘంతకులు చొరబడి ఆయనపై గుళ్ళు కురిపిస్తారు. రఘువీర్ మరణిస్తాడు. ఈ హత్యపై యూనివర్శిటీలో పెద్ద చర్చ జరుగుతుంది. మరోవైపు రావులపల్లి అనే గ్రామంలో పంచాయితీ బోర్డుకు ఎన్నికలు దగ్గరపడతాయి. వీరస్వామి, మురహరిరావుల మధ్య పోటీ తీవ్రంగా వుంటుంది. వీరస్వామి అంచనాలను తలకిందులు చేస్తూ మురహరిరావు ఎన్నికల్లో గెలిచి సర్పంచ్ అవుతాడు. వీరస్వామి వెళ్లి క్రాంతికారుల్లో కలుస్తాడు. దళనాయకుడై వచ్చి మురహరిరావుని ప్రజాద్రోహిగా ప్రకటించి బెదిరిస్తాడు. కొన్నాళ్ళకు మురహరిరావు హత్య జరుగుతుంది. అనంతారం గ్రామ సర్పంచ్ ముత్యంరావును కూడా క్రాంతికారులు హత మారుస్తారు. సీతంపేట దేశ్‌ముఖ్ కరుణాకరరావు దగ్గర శేర్‌దార్‌గా పనిచేసే వెంకటాద్రి, దేశ్‌ముఖ్ పొలంలో పిడకలు దొంగిలించిందని లచ్చయ్య భార్య ముత్తమ్మకి 50 దెబ్బల శిక్ష విధించాడు. తల్లికి జరిగిన అవమానం చూసి యాదయ్య లోలోపల రగిలిపోతాడు. యాదయ్య తమ్ముడితోసహా క్రాంతికారులతో కలిసిపోయాడు. వెంకటాద్రిని ఎవరో హత్య చేశారు. బెదిరింపులు కారణంగా కరుణాకరరావు పట్టణానికి మకాం మార్చాడు. వీరాస్వామి ఎన్‌కౌంటర్ తరువాత ఊరికి తరచుగా వచ్చి పోతున్నాడు. కరుణాకరరావు దారుణంగా హతుడవుతాడు. ఆ తర్వాత ఇద్దరు యువకుల ఎన్‌కౌంటర్లు జరుగుతాయి. సుఖేందర్‌రెడ్డి కారుగా పొరబడి నలుగురు యువకులు ఒక అంబాసిడర్ కారుపై కాల్పులు జరుపుతారు. ఆ కారులోని నలుగురు వ్యక్తులు చనిపోతారు. తిమ్మాపురం భూస్వామి శేషయ్య, ఆయన కొడుకులు రవీందర్, నరేందర్, మరో ఇద్దరు ఎమ్మెల్యే మారుతీరావు కూతురి పెళ్ళి కోసం ఆ కారులో వస్తుంటారు. కారు పేలిపోయి మరణిస్తారు. పొరపాటున కారును పేల్చామని క్రాంతికారులు ప్రకటిస్తారు. రాజకీయ కురువృద్ధుడు రామకృష్ణారావును, నాయకుడు రాఘవరెడ్డిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారు.

ఆ నాటకంలో నటిస్తున్న నటీనటులందరూ చాలా బాగా నటించారు.. వాళ్ళ వాచకం బాగుంది. ఆహార్యం బావుంది.. సెట్స్‌ని రూపొందించిన పద్ధతి బావుంది. సంగీతం బావుంది. జానపద బాణీల్లో కూర్చబడిన పాటలు బావున్నాయి. ఈ కారణం చేతనే ఆ నాటకం బాగా రక్తి కట్టింది. ఆ నాటక ప్రదర్శన పోలీసుల ఆధ్వర్యంలో జరగడం అందర్నీ ఆశ్చర్యపరచింది.

క్రాంతికారుల సమస్యను ఎదురుకోవడానికి ప్రభుత్వం సరికొత్త విధానాన్ని రూపొందించింది. క్రాంతికారులు యే మార్గాల ద్వారా ప్రజల్ని ఆకర్షించి తమవైపు తిప్పుకోగల్గుతున్నారో పోలీసులు కూడా అదే మార్గాల్ని అనుసరించాలని నిర్ణయించారు.. ఆ మార్గమే ప్రచారం. సమసమాజం స్థాపించబడాలంటే విప్లవం రావాలి. విప్లవం రావాలంటే హింస తప్పదు. అని వాళ్ళు ప్రచారం చేస్తే హింస అంతకంటె ఎన్నోరెట్లు ఎక్కువ హింసకు దారి తీస్తుందనీ, రెండు వైపులా జరుగుతున్న హింసలో అనేకమంది యువకులు ప్రాణాల్ని కోల్పోవడం తప్ప సాధించేదేమీ లేదని వీళ్ళు ప్రచారం చెయ్యడం మొదలెట్టారు. అందుకణుగుణంగా సర్కారీ రచయితల చేత నాటకాలు రాయించారు. పాటలు రాయించారు. పల్లె ప్రజల్ని వెంటనే ఆకర్షించేలా ఆ పాటలను జానపద బాణీల్లో అమర్చి బాగా పాడగల్గిన కళాకారుల చేత పాడించారు. ఎంతో డబ్బు ఖర్చుపెట్టి ఎన్నో రిహార్సల్స్ చేయించి ఈ "అమ్మ" నాటకాన్ని ప్రతి గ్రామంలోనూ ప్రదర్శించడం మొదలెట్టారు.

గ్రామ ప్రజలు ఈ నాటకాన్ని చూస్తూ కన్నీళ్ళు కార్చారు.. ఎంత ప్రాణనష్టం జరుగుతోందని విలవిల్లాడిపోయారు.. అలా చనిపోతున్న వాళ్ళల్లో తమ తమ్ముళ్ళు, తమ కొడుకులు, తమ కూతుళ్ళూ ఉన్నట్టే అనుభూతి చెందారు. పోలీసుల వ్యూహం చాలా వరకు ఫలించినట్టే కనిపించింది. కానీ ఆ నాటకం చూశాక కల్గిన అనుభూతి ఎంతోసేపు నిలువలేదు. "దేవదాసు" సినిమా చూస్తూ కన్నీళ్ళు కార్చిన తల్లిదండ్రులు థియేటర్ లోంచి బయటకొచ్చాక తమ కూతురో, కొడుకో తమ కులం కంటె తక్కువ కులం వారిని ప్రేమించారని తెలిసినప్పుడు ఆగ్రహోదగ్రులైపోతారు. అలాగే 'అమ్మ' నాటకాన్ని చూసిన వాళ్ళు కూడా సమాజంలో జరుగుతున్న అక్రమాల్ని చూసినప్పుడు ఈ సమాజం శాంతియుతంగా మారడం అసంభవం అనుకున్నారు.

ప్రభుత్వం వారు క్రాంతికారుల సమస్యని ఎదురుకోవడానికి ఇంకెన్నో పద్ధతుల్ని అనుసరించారు. క్రాంతికారులు స్వచ్ఛందంగా ప్రభుత్వానికి లొంగిపోతే వాళ్ళ పునరావాసం కోసం అనేక చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. లొంగిపోయిన క్రాంతికారుల పట్ల ప్రభుత్వం చాలా ఉదారంగా వ్యవహరిస్తుందని, వాళ్ళ ఉపాధి కోసం ఉదారంగా రుణాలిస్తుందనీ, వాళ్ళ తలల మీద ప్రకటించబడిన బహుమానాల్ని లొంగిపోయినప్పుడు వాళ్ళకే అందజేస్తామని ఏలినవారు ప్రకటించారు. కాబట్టి క్రాంతికారులు హింసను విడనాడి, అజ్ఞాత జీవితానికి స్వస్తి చెప్పి, మామూలు జనజీవన స్రవంతిలో చేరిపోవాలని చాలా పెద్ద ఎత్తున ప్రచారం చెయ్యడం మొదలెట్టారు. వేలకొద్ది కరపత్రాలు ముద్రించి వాల్‌పోస్టర్లు అంటించారు. దాంతో లొంగుబాట్ల పర్వం ప్రారంభమైంది.

రోజూ వార్తా పత్రికల్లో ఫలానా చోట పదిమంది క్రాంతికారులు లొంగిపోయారనీ, ఫలానా చోట ఇరవై మంది క్రాంతికారులు లొంగిపోయారనీ, అలా లొంగిపోయిన క్రాంతికారుల ఉపాధి కోసం ప్రభుత్వం చాలా పెద్ద మొత్తాల్లో డబ్బు మూటలు అందజేశారనీ వార్తలు రావడం మొదలైంది.

బస్సుల్ని తగలబెట్టారన్న ఆరోపణలున్న వాళ్ళు, ఐదారుగురు భూస్వాముల్ని చంపారన్న ఆరోపణలున్నవాళ్ళు, పోలీసు ఆఫీసర్లను చంపేశారన్న ఆరోపణలున్నవాళ్ళు, మందుపాతరల్ని పేల్చి ఎంతోమంది సీ.ఆర్.పి.ఎఫ్. జవాన్లను చంపేశారన్న ఆరోపణలున్నవాళ్ళు... తమ తలల మీద రెండు మూడు లక్షల బహుమానాలున్న వాళ్ళు... ఇలా ఎంతోమంది పోలీసుల ఎదుట లొంగిపోతూ టీ.వీ.ల్లో కనిపించడం అనేకమంది విప్లవ సానుభూతిపరుల్ని ఆశ్చర్యపరచింది.



క్రాంతికారుల ఉద్యమానికి వెన్నెముకల్లాంటి వాళ్ళనీ, ఆ ఉద్యమానికి తాత్విక నేపధ్యాన్ని కల్పించిన సైద్ధాంతికులనీ పేరు పొందిన వాళ్ళు కూడా పోలీసులకు లొంగిపోవడం ఎంతోమంది ప్రజల్ని దిగ్భ్రాంతుల్ని చేసింది. అలా ఎంతోమందిని దిగ్భ్రాంతుల్ని చేసిన లొంగుబాట్లలో భానుమూర్తి లొంగుబాటు ఒకటి.

భానుమూర్తి బాగా డబ్బున్న కుటుంబానికి చెందినవాడు. భానుమూర్తి తండ్రి పెద్ద కాంట్రాక్టర్. ఎలక్ట్రికల్ కాంట్రాక్ట్సు చేస్తూ కోట్లు సంపాదించాడు.. అతనికి భానుమూర్తి ఒక్కడే కొడుకు. భానుమూర్తిని మెడిసిన్ చదివించి పెద్ద డాక్టర్‌ని చెయ్యాలని కలలుగన్నాడు. భానుమూర్తి కూడా చదువులో చాలా తెలివైన వాడే. ఇంటర్మీడియెట్ చదువుతున్నప్పుడే అతనికి విప్లవభావాలున్న విక్రమ్‌తో స్నేహం ఏర్పడింది. విక్రమ్ భానుమూర్తికి చాలా పుస్తకాలిచ్చాడు. అతడా పుస్తకాల్ని అత్యంత శ్రద్ధాసక్తులతో చదివాడు. ఆ పుస్తకాలే భానూను సమూలంగా మార్చేశాయి.

తనింతకాలం చీకట్లో ఉన్నాననుకున్నాడు. ఆ పుస్తకాలే తనను వెలుతురులోకి తీసికెళ్ళాయనుకున్నాడు. తను నివసిస్తున్న ఈ అసమసమాజంలో అనునిత్యం తన కళ్ళ ఎదుటే ఎంత దోపిడీ జరుగుతున్నదో అతనికర్థమైంది. ఇంతకాలం కళ్ళుండి కూడా తనా దోపిడీని చూళ్ళేకపోయాడు. విక్రమ్ తనకిచ్చిన పుస్తకాలే తన కళ్ళు తెరిపించాయనుకున్నాడు. ఎలక్ట్రికల్ కాంట్రాక్టు చేస్తూ కోట్లు సంపాదిస్తున్న తన తండ్రి కూడా దోపిడీ వర్గాలకు చెందినవాడే... ఈ దోపిడీ వ్యవస్థను కూకటివేళ్ళతో సహా పెకిలించి నూతన విప్లవ వ్యవస్థను నెలకొల్పాలంటే సాయుధపోరాటం తప్ప మరో మార్గం లేదన్న దృఢమైన అభిప్రాయం అతనిలో ఏర్పడింది.

ఇంటర్మీడియెట్ పూర్తి చేశాక అతడు మెడిసిన్‌లో చేరాడు. అప్పటికింకా ఎంసెట్ పరీక్షలు రాలేదు. ఇంటర్మీడియెట్‌లోని మెరిట్‌ని బట్టే అతనికి మెడిసిన్‌లో సీటొచ్చింది. వంగాల టౌన్లో మెడిసిన్ చదువుతూ అతడు హాస్టల్లో ఉండేవాడు. అలా అతనికి హాస్టల్లో ఉంటున్న అనేకమంది విస్ఫులింగాల్లాంటి విద్యార్థులతో పరిచయమేర్పడింది. ఆ రోజుల్లో ఏ యువకున్ని కదిలించినా ఓ అగ్నిపర్వతమే బద్దలవుతున్నట్టనిపించేది. ఎవరినోట విన్నా విప్లవ గీతమే జలపాతంలా విరుచుకు పడేది. అలాంటి వాళ్ళందరికీ భానుమూర్తి చాలా త్వరలోనే నాయకుడైపోయాడు.

భానుమూర్తి పైకి మెడిసిన్ చదువుతున్నా అతడు నిజంగా చదువుతున్నది విప్లవ సాహిత్యమని అతని దగ్గరి మిత్రులందరికీ తెలుసు. అతడు రష్యన్ విప్లవాన్ని, చైనా విప్లవాన్ని, వియత్నామ్ విప్లవాన్ని, క్యూబా విప్లవాన్ని, బొలీవియాతో సహా లాటిన్ అమెరికన్ దేశాల్లోని విప్లవ పరిస్థితుల్ని, ఆఫ్రికన్ దేశాల్లోని విప్లవ పరిస్థితుల్ని అనేక పుస్తకాల్ని అధ్యయనం చెయ్యడం ద్వారా సంపూర్ణంగా అర్థం చేసుకున్నాడు. మార్క్స్‌నూ, లెనిన్నూ, స్టాలిన్నూ, మావోను, కాస్ట్రోనూ, చేగువేరాను, హోచిమిన్‌నూ, చారుమజుందార్‌నూ, కానూసన్యాల్‌నూ ఔపోసన పట్టాడు. అతన్ని మూర్తీభవించిన విప్లవంలా అతని మిత్రులు భావించడం మొదలెట్టారు. త్రిలింగద్వీపానికి అనువైన విప్లవ వ్యూహాన్ని గురించి అతడు ఆలోచించడం మొదలెట్టాడు.

భానుమూర్తి గొప్ప వక్త కూడా. అతడు ఉపన్యాసాన్ని వింటున్న వాళ్ళంతా ఆవేశంతో ఊగిపోయేవాళ్ళు. వాళ్ళకు వెంటనే పోరాటంలోకి వెళ్ళిపోవాలనిపించేది. దోపిడి దారులందర్నీ నరికి పారెయ్యాలనిపించేది.

భానుమూర్తికి చాలా త్వరలోనే అనేక విప్లవ సంస్థలతో సంబంధం ఏర్పడింది. అతడు త్రిలింగద్వీపానికి అనువైన విప్లవమార్గాన్ని సూచిస్తూ ఎన్నో సిద్ధాంత వ్యాసాలు రాశాడు. ఎన్నో కరపత్రాలు రాశాడు. ఎన్నో ఉపన్యాసాలిచ్చాడు. ఎన్నో రహస్య సమావేశాల్లో పాల్గొని విప్లవపార్టీల నాయకులతో చర్చించాడు. తను సూచిస్తున్న మార్గాన్ని అనుసరిస్తే మనం సమీప భవిష్యత్తులోనే జంబూద్వీపంలోని ఎర్రకోట మీద ఎర్రజెండా ఎగురెయ్యవచ్చునని ధీమా వ్యక్త చేశాడు.

తన కొడుకు తనకు అందనంత దూరం వెళ్ళిపోయాడనీ, ఇప్పటికైనా అతన్ని ఆపకపోతే అతడు తమకు దక్కకుండా పోతాడని భానుమూర్తి తండ్రి వాసమూర్తికి మెడికల్ కాలేజి ప్రిన్స్‌పాల్ తెలియజేశాడు.

వాసమూర్తి వెంటనే భానుమూర్తిని కలుసుకొని మెడిసిన్ చదవడం ఆపేసి తన దగ్గరే ఉండిపోయి కాంట్రాక్టు పనుల్లో తనకు సహాయం చెయ్యమన్నాడు.

"నువ్వో పెద్ద బూర్జువావి... దోపిడిదారువి. సమాజాన్ని దోచుకొని కోట్లు గడించిన వాడివి. నీలాంటి వాళ్ళందర్నీ అంతం చెయ్యడమే నా పని... నీ మార్గం వేరు... నా మార్గం వేరు... మన మార్గాలు కలవ్వు" అన్నాడు భానుమూర్తి.

"అయితే... నువ్వేం చెయ్యదల్చుకున్నావు?" అన్నాడు వాసమూర్తి.

"నేనేం చెయ్యదల్చుకున్నానో చెబితే నీ గుండెలు ఆగిపోతాయి. నీలాంటి వాళ్ళ గుండెల్లో రాళ్ళు పరిగెత్తించడమే నేను చెయ్యదల్చుకున్న పని... ఆకాశపు దారులెంట హడావుడిగా పరిగెత్తుకుంటూ వెళ్తున్న జగన్నాధ రథచక్రాల్ని భూమార్గం పట్టించి భూకంపం పుట్టించడమే నేను చెయ్యదల్చుకున్న పని" అన్నాడు భానుమూర్తి.

"ఉడుకు రక్తంతో ఊగిపోతూ నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలియడం లేదు... నెలకు ఐదువేలు పంపిస్తోంటే హాయిగా మూడు పూటలూ తింటూ, పిచ్చి పిచ్చి పుస్తకాలన్నీ చదువుతూ, పదిమంది పిచ్చివాళ్ళను వెంటేసుకొని తిరుగుతూ విప్లవం వచ్చేస్తోందని వాగుతున్నావు.. నీ పిచ్చి కుదర్చాలంటే ఒకటే మార్గం... ఇప్పట్నించి నీకు నా దగ్గర్నుంచి ఒక్క పైసా కూడా రాదు... నాల్గు రోజులు కడుపు మాడితేగాని నీకు అమ్మా నాన్న గుర్తురారు!" అన్నాడు వాసమూర్తి.

"అది నీ భ్రమ నాన్నగారూ! నీ లాంటి కాపిటలిస్టులంతా డబ్బుతో దేన్నైనా కొనగల్గుతామనుకుంటారు. డబ్బును మించిన వస్తువు ఈ ప్రపంచంలో ఏదీ లేదనుకుంటారు. నువ్వు పంపించే ఐదు వేలు ఆపేస్తానంటే నేను లొంగిపోతానను కుంటున్నావు... ఇట్స్ ఎ డెల్యూషన్ మై డాడ్.. ఇట్స్ యువర్ బిగ్ డెల్యూషన్... నీ నాల్గు వేలు నాకక్కర్లేదు.. నీ బానిస చదువులూ నాకక్కర్లేదు.. గుడ్‌బై మై డాడ్.. గుడ్‌బై.. పోరాటంలో గెలిస్తే మళ్ళీ నీకు కనిపిస్తాను.. అప్పుడు నువ్వు సంపాదించిన ఆస్తినంతా జాతి పరం చేస్తాను. లేక పోరాటంలో ప్రాణాలు కోల్పోతే నా కొడుకు వీరమరణం చెందాడని సంతోషించు. అమ్మక్కూడా ఇదే విషయం చెప్పు... విజయమో... వీర స్వర్గమో... తన కొడుకు ఈ రెండింట్లో ఏదో ఒకటి తప్పనిసరిగా సాధిస్తాడని చెప్పండి డాడ్! గుడ్‌బై..."

అంటూ భానుమూర్తి తండ్రి దగ్గర్నుంచి వచ్చేసి, మెడిసిన్‌కు గుడ్‌బై చెప్పేసి పోరాటంలోకెళ్ళిపోయాడు. అలా వెళ్ళిపోయిన భానుమూర్తి చాలా త్వరలోనే క్రాంతికారుల పార్టీలో చాలా ఉన్నత స్థానాన్ని ఆక్రమించుకో గల్గాడు. ప్రభుత్వం అతని తలమీద రెండు లక్షల రూపాయల్ని పెట్టింది.

ఇది జరిగిన రెండేళ్ళ తర్వాత ఓ రక్షకభట నిలయం మీద క్రాంతికారులు చాలా పెద్ద ఎత్తున దాడి చేశారు. ఆ దాడిని పోలీసులు తిప్పికొట్టగల్గారు. చాలామంది క్రాంతికారులు తప్పించుకొని పారిపోయారు. కానీ భానుమూర్తి, మరో ముగ్గురు విప్లవ వీరులు పోలీసుల చేతికి చిక్కారు.

భానుమూర్తి పోలీసులకు చిక్కాడన్న వార్త త్రిలింగద్వీపంలో బ్రహ్మాండమైన సంచలనాన్ని సృష్టించింది. పత్రికలన్నీ ఈ వార్తను ప్రముఖంగా ప్రచురించాయి. టీ.వీ. ఛానల్సన్నీ ఈ వార్తను భానుమూర్తి ఫోటోలతోనూ, అతని జీవిత చరిత్రతోనూ టెలికాస్ట్ చేశాయి. భానుమూర్తిని ఎన్‌కౌంటర్ పేరుతో హతమారుస్తారేమోనని పలువురు మేధావులు ఆందోళన వ్యక్తం చేశారు. భానుమూర్తిని వెంటనే మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలని స్టేట్‌మెంట్లిచ్చారు.

భానుమూర్తిని మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచడానికి తీసుకొస్తున్నప్పుడు కోర్టు ముందు పెద్ద తొక్కిసలాట జరిగింది. కొన్ని వందలమంది మీడియా ప్రతినిధులు టీ.వీ. కెమెరాలతో హాజరయ్యారు. భానుమూర్తినీ, అతన్ని తీసుకొస్తున్న పోలీసుల్ని ఒక్క అడుగు కూడా ముందుకు కదలనీయకుండా మీడియా మనుషులు చుట్టుముట్టారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి లాఠీలను ఝళిపించాల్సివచ్చింది. ఇంత జరుగుతున్నా భానుమూర్తి ముఖం మీది చిరునవ్వు మాత్రం చెక్కు చెదరలేదు.

భానుమూర్తి తెల్లటి లాల్చీ, పైజామా వేసుకున్నాడు. ఎత్తుగా, సన్నగా ఉండే భానుమూర్తి మొఖం మీది గుబురైన గడ్డాన్ని చూడగానే ఎవరికైనా మూర్తీభవించిన విప్లవాన్ని చూస్తున్నట్టుగా ఉంటుంది.

మెజిస్ట్రేట్ భానుమూర్తిని పదిహేను రోజులు జ్యుడిషియల్ కస్టడీలో ఉంచాలని ఆజ్ఞాపించాడు.

ఓ పదిరోజులు గడిచాయి... ఆ తర్వాతొక రోజు రాత్రి పదిగంటలకు పదిమంది క్రాంతికారులు ఇద్దరు అధికార పార్టీకి చెందిన శాసన సభ్యుల ఇళ్ళమీద దాడిచేసి ఇద్దరు గన్‌మెన్లను చంపేసి ఆ శాసనసభ్యుల్ని కిడ్నాప్ చేసి తీసికెళ్ళారన్న వార్త దావానలంలా వ్యాపించింది. రాజధాని నగరంలో ఆ ఇద్దరు

మనస్తత్వ విశ్లేషణలో ట్రెండ్‌కి నాంది పలికిన సుప్రసిద్ధ కలం - మూడు దశాబ్దాల కల్లోల


విజయవిహారం పాతకాపీలు కావాలంటే, మొదటి సంపుటి (ఫిబ్రవరి-డిసెంబర్ 2000) కాపీ ఒక్కటి రూ.10/-, రెండవ సంపుటి (మార్చి 2001 తర్వాత) కాపీ ఒక్కటి రూ.15/-

శాననసభ్యులుండే క్వార్టర్స్ పక్కపక్కనే ఉంటాయి.. ఎం.ఎల్.ఏ. గారితో మాట్లాడాలని, వేం ఆయన నియోజకవర్గం నుండే వచ్చామని చెప్పిన మారువేశాల్లో ఉన్న క్రాంతికారుల్ని ఎలాంటి అనుమానం లేకుండా లోపలకెళ్ళనిచ్చారు. లోపల తమ స్నేహితులతో మాట్లాడుతున్న ఇద్దరు ఎం.ఎల్.ఏ.లను పట్టుకొని ఎవరడ్డమొచ్చినా ఎం.ఎల్.ఏ.లను కాల్చిపారేస్తామని ఆయుధాల్ని తీశారు. వాళ్ళమీదకు కాల్పులు జరపబోయిన గన్‌మెన్లను వెంటనే కాల్చేశారు. ఇద్దరు ఎం.ఎల్.ఏ.ల చేతుల్ని వెనక్కి విరిచి తాళ్ళతో కట్టేసి బయటకు తీసుకొచ్చారు.. గన్‌మెన్లు నేలకూలడంతో వాళ్ళను ఆపే ప్రయత్నం ఎవ్వరూ చెయ్యలేదు.. బయట వాళ్ళకోసం రెడీగున్న రెండు జీపుల్లోకి ఎం.ఎల్.ఏ.లను ఎక్కించుకొని కళ్ళుమూసి తెరచేటంతలో అక్కన్నించి మాయమైపోయారు. ఈ విషయం తెలియగానే ఆఘమేఘాల మీద పోలీసులక్కడకు చేరుకునేటప్పటికి అంతా అయిపోయింది.

ఎం.ఎల్.ఏ.ల ప్రాణానికి ఎలాంటి హాని తలపెట్టవద్దని పలువురు రాజకీయ నాయకులు స్టేట్‌మెంట్లిచ్చారు... ఎం.ఎల్.ఏ.లను విడిపించడానికి వేం రాయభారం జరుపుతామని పౌరహక్కుల సంఘాలవారు ముందుకొచ్చారు.. త్వరలోనే ప్రభుత్వానికి, క్రాంతికారులకు మధ్య సంప్రదింపులు ప్రారంభమయ్యాయి. పదిరోజుల క్రితం పోలీసుల చేతికి చిక్కిన భానుమూర్తినీ, మిగతా ముగ్గుర్నీ వెంటనే విడుదల చేస్తేనే తాము కిడ్నాప్ చేసిన ఇద్దరు ఎం.ఎల్.ఏ.లను వదిలిపెడ్తామని క్రాంతికారులు ప్రకటించారు.. ప్రభుత్వం వాళ్ళ డిమాండ్‌ను అమలు పరచడానికి వెంటనే అంగీకరించింది. భానుమూర్తినీ, అతనితోపాటు పోలీసులకు చిక్కిన మిగతా ముగ్గుర్నీ వాళ్ళు వదిలిపెట్టమన్న చోట వదిలిపెట్టేశారు.. భానుమూర్తిని వదిలిపెట్టిన ఇరవైనాల్గు గంటల తర్వాత ఎం.ఎల్.ఏ.లను వదిలిపెడ్తున్నట్టు క్రాంతికారులు ప్రకటించారు. ఆ ప్రకటన వెలువడిన పన్నెండు గంటల తర్వాత ఎం.ఎల్.ఏ.లు రాజధాని నగరానికి చేరుకున్నారు.

పత్రికల వాళ్ళూ, టీ.వీ.వాళ్ళూ వాళ్ళను చుట్టుముట్టారు. మిమ్మల్నెక్కడకు తీసికెళ్ళారనీ, ఎలా ట్రీట్ చేశారని అడిగారు... కళ్ళకు గంతలు కట్టి తీసికెళ్ళారు కాబట్టి మమ్మల్నెక్కడకు తీసికెళ్ళారో తెలీదని, వాళ్ళతో వేం గడిపిన ఈ మూడురోజులూ వాళ్ళు మమ్మల్ని బాగానే ట్రీట్ చేశారనీ, రోజూ మూడుపూటలు భోజనం పెట్టారనీ, టీలు, కాఫీలు కూడా ఇచ్చారనీ, వదిలిపెట్టాక మాత్రం ఓ పది కిలోమీటర్లు చాలా దట్టమైన అడవిలోంచి నడిచి రావలసి వచ్చిందని, ఆ తర్వాత వెదురు బొంగు లోడ్ చేసుకొని వస్తున్న ఓ లారీ డ్రైవర్ తమను ఎక్కించుకొని, రాజధానికి దగ్గర్లో ఉన్న ఓ రోడ్‌సైడ్ దాభా దగ్గర దించి వెళ్ళాడని, అక్కన్నించి ఓ ఆటోలో తాము రాజధాని నగరాన్ని చేరుకున్నామని ఆ ఇద్దరు ఎం.ఎల్.ఏ.లూ చెప్పారు.

"ఎం.ఎల్.ఏ.ల కిడ్నాప్ డ్రామా సుఖాంతంగా ముగిసింద"ని ఆ మర్నాడు పత్రికలన్నీ రాశాయి. ఈ నాటకంలో ఇద్దరు గన్‌మెన్లు నేలకొరిగారన్న విషయం అందరూ మరచిపోయారు.

ఇది జరిగిన ఆరు నెలల తర్వాత ప్రభుత్వం లొంగుబాట్ల విధానాన్ని పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. లొంగిపోయిన క్రాంతికారుల పట్ల ప్రభుత్వం చాలా ఉదారంగా వ్యవహరిస్తుందనీ, వాళ్ళ పునరావాసానికి అన్ని చర్యలూ తీసుకుంటుందనీ ముఖ్యమంత్రి గారూ, హోంమంత్రిగారు మీడియాలో అదే పనిగా ప్రకటించారు.. పోలీసులు గ్రామగ్రామాన తిరుగుతూ ఈ విషయాన్నింకా ప్రచారం చేశారు. దాంతో ఒకరి తర్వాతొకరు క్రాంతికారులు లొంగిపోవడం మొదలెట్టారు. లొంగిపోతున్న వాళ్ళెవరూ నిజమైన క్రాంతికారులు కారనీ, ఇదంతా పోలీసులు క్రాంతికారుల మనస్థైర్యాన్ని దెబ్బతీయడం కోసం చేస్తున్న ప్రచారమనీ, ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రచారం గోబెల్స్ ప్రచారాన్ని మించిపోయిందని, ఒక అబద్ధాన్ని పదిసార్లు నిజమని ప్రచారం చేస్తే ప్రజలు దాన్ని నిజమని నమ్మేస్తారని ఈ ప్రభుత్వం భావిస్తోందని, కానీ ప్రభుత్వం చేస్తున్న ఈ గోబెల్స్ ప్రచారాన్ని ప్రజలు పట్టించుకోరనీ, నిజమైన క్రాంతికారులెవరూ లొంగిపోవడం జరగదనీ క్రాంతికారులు ప్రకటించారు.

ఆ ప్రకటన వెలువడిన కొద్దిరోజులకే భానుమూర్తి - యే భానుమూర్తి మీదనైతే కవులు "అతడు మూర్తీభవించిన విప్లవమ"ని కవితలు రాశారో... యే భానుమూర్తిని విడిపించడం కోసం పదిమంది క్రాంతికారులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి అత్యంత పకడ్బందీగా రూపొందించబడిన రక్షణ వలయాన్ని ఛేదించి ఇద్దరు ఎం.ఎల్.ఏ.లను కిడ్నాప్ చేసుకొని వెళ్ళారో, యే భానుమూర్తయితే అత్యంత సమీప భవిష్యత్తులో ఎర్రకోట మీద ఎర్రజెండాను ఎగురేస్తామని పదేపదే ప్రకటించాడో - సాక్షాత్ ఆ భానుమూర్తి ఓ రోజు ఉదయం పోలీసులకు లొంగిపోయాడన్న వార్త త్రిలింగద్వీపంలోని ప్రజలందర్నీ దిగ్భ్రాంతుల్ని చేసింది.

లొంగిపోయిన భానుమూర్తిని పోలీసులు పత్రికలవాళ్ళ ముందూ, టీ.వీ. ఛానెల్స్ వాళ్ళ ముందూ గర్వంగా ప్రదర్శించారు. కొన్ని వందల మంది పత్రికలవాళ్ళూ, టీ.వీ. వాళ్ళూ అక్కడ హాజరయ్యారు.

"విప్లవమే ఊపిరిగా బతికిన మీరు ఎందుకు లొంగిపోయార"ని మీడియావాళ్ళు అడిగినప్పుడు భానుమూర్తి కాస్సేపు సీరియస్‌గా ఆలోచించి సమాధానం చెప్పాడు.

"విప్లవం ఒక కల. సమసమాజ స్థాపన ఒక కల.. అంతర్జాతీయ సౌభ్రాతృత్వం ఒక కల. ప్రపంచ కార్మికులంతా ఒక్కటైపోవడం ఒక కల. సరిహద్దులన్నీ చెరిగిపోయి ప్రపంచమంతా ఏకమైపోవడం ఒక కల.. రాజ్యాలనేవి అంతరించిపోయి స్టేట్‌లెస్ సొసైటీ, క్లాస్‌లెస్ సొసైటీ ఏర్పడటం ఒక కల. మనిషికి ఇవన్నీ కలలుగా ఉండిపోవడంలోనే అందం ఉంటుంది. వాటిని నిజం చేసుకోవాలని ప్రయత్నించబోయాడో... బాధ, దుఃఖం, హింస, రక్తపాతం... వద్దు... వద్దు... అవన్నీ కలలుగానే ఉండిపోనీయండి... ఇంతకంటె నేనేమీ చెప్పలేను... దయచేసి నన్ను వదిలేయండి" అన్నాడు భానుమూర్తి.

త్వరలోనే భానుమూర్తి మూడో సంవత్సరంలో ఆగిపోయిన మెడిసిన్ పూర్తి చేశాడు. డాక్టర్‌గా ప్రాక్టీసు మొదలెట్టాడు. చాలా మంచి డాక్టర్ అన్న పేరు తెచ్చుకున్నాడు. లక్షలు సంపాదించాడు... ఓ సూపర్ స్పెషాలిటీస్ హాస్పిటల్ నిర్మించాడు... ఆ హాస్పిటల్లో పేదవాళ్ళకు ఉచితంగా వైద్యసేవలు అందించే ప్రత్యేక పథకాన్నొకటి ప్రారంభించాడు... ఇదంతా సమాజసేవ కాదా? పేదవాళ్ళనుద్ధరించడం కాదా? అని తనను తాను ప్రశ్నించుకున్నాడు. మావాడు ఇన్నాళ్ళకు దార్లో పడ్డాడని భానుమూర్తి వాళ్ళ నాన్న సంతోషించాడు.

## 16

ప్రభుత్వం అనుసరిస్తున్న లొంగుబాట్లను ప్రోత్సహించే విధానం త్వరలోనే ఊపందుకుంది. చాలామంది క్రాంతికారులు లొంగిపోవడం, ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయంతో ఏదో ఒక ఉపాధిని సమకూర్చుకొని దాంట్లో మునిగిపోవడం మొదలెట్టారు. అలా లొంగిపోయిన వాళ్ళల్లో మైసయ్య కూడా ఒకడు.

మైసయ్య ఓ దళితుడు. వాళ్ళ నాన్న అతన్నో మధ్యతరగతి భూస్వామి దగ్గర జీతముంచాడు. ఓ రోజు వాంతులూ, విరేచనాలు కావడం వల్ల పన్లోకెళ్ళకుండా ఇంట్లోనే ఉండిపోయాడు. జీతముంచుకున్న ఆసామెచ్చి నోటికొచ్చినట్టు బూతులు తిట్టిపోయాడు. మైసయ్య రక్తం మసలిపోయింది. ఈ బతుక్కంటే పోరాటంలో చావడమే నయమనిపించింది. వాళ్ళూరి నుండి పోరాటంలోకెళ్ళిపోయిన వాళ్ళు నల్గురున్నారు. మైసయ్య వాళ్ళను కలుసుకొని వాళ్ళతో చేరిపోయాడు. ఐదారు నెలల తర్వాత అతన్నో దళ సభ్యుడిగా తీసుకున్నారు...

మైసయ్య పెద్దగా చదువుకోలేదు... అతనికి సైద్ధాంతిక పరిజ్ఞానమేమీ లేదు.. అతనికి ఇతర దళ సభ్యులద్వారా చదువు నేర్పించడానికి ప్రయత్నం జరిగింది. కానీ అతనికి పెద్దగా చదువు అబ్బలేదు. నాల్గైదు సార్లు ఇతర దళసభ్యులతో కలిసి బస్సుల్ని కాల్చెయ్యడం, టెలిఫోన్ ఎక్స్ఛేంజీలను పేల్చివేయడం లాంటి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొద్దిరోజుల తర్వాత మైసయ్య తల్లిదండ్రులిద్దరూ మైసయ్య మీది బెంగతో మంచమెక్కారని, మైసయ్య కోసం అనుక్షణం ఎదురుచూస్తున్నారని తెలిసింది. దాంతో వాళ్ళ దళనాయకుడు మైసయ్య లొంగిపోవడానికి అనుమతించాడు.

మైసయ్య లొంగిపోయాక అతనికి లభించిన సహాయం చాలా తక్కువ. పదివేల రూపాయలిచ్చి ఓ చెప్పులషాపు పెట్టుకోమన్నారు. మైసయ్యకు వ్యాపారంలో పెద్ద తెలివితేటలు లేవు. చాలా త్వరలోనే అతని షాపు మూతపడింది. అతడు మళ్ళీ ఓ భూస్వామి దగ్గర జీతముండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇలా పోలీసులకు లొంగిపోయిన వాళ్ళల్లో భానుమూర్తి లాంటి వాళ్ళకంటె మైసయ్య లాంటివాళ్ళే చాలా ఎక్కువ మందున్నారని పరిశీలకులు భావించారు.

మైసయ్య లాంటివాళ్ళ సంఖ్య రోజురోజుకు పెరుగుతూ వచ్చింది. కానీ లొంగిపోయిన వాళ్ళ పట్ల ఉదారంగా వ్యవహరిస్తామన్న రక్షకభటులు వాళ్ళను రకరకాలుగా వేధించటం మొదలెట్టారు.

మైసయ్య లొంగిపోయిన ఆరు నెలల తర్వాత మైసయ్య వాళ్ళ ఊర్లో యాదగిరిరెడ్డి అనే భూస్వామిని క్రాంతికారులు కాల్చి చంపారు. మొదట్లో ఈ యాదగిరిరెడ్డి దగ్గరే మైసయ్య జీతగాడుగా పనిచేశాడు. దాంతో "ఈ హత్యకూ నీకూ తప్పకుండా సంబంధం ఉండి తీరుతుంద"ని పోలీసులు మైసయ్యను పట్టుకున్నారు.

"నాకేమీ ఎరుకలేద"ని "లొంగిపోయిన దగ్గర్నుంచి నాకు వాళ్ళతో ఎటువంటి సంబంధం లేద"ని మైసయ్య ఎంత మొత్తుకున్నా పోలీసులతని మాటలు నమ్మలేదు. అతనితో "నిజాన్ని" చెప్పించటానికి అతన్నెన్నో చిత్రహింసలపాలు చేశారు. వాళ్ళెన్ని చిత్రహింసలు పెట్టినా మైసయ్య ఆ హత్యలో తనకెలాంటి సంబంధం లేదనే చెప్పాడు. దాంతో అతన్ని వదిలేశారు. చచ్చి, చెడి, కన్నులొట్టబోయి మైసయ్య పోలీసుల చేతుల్లోంచి బయటపడ్డాడు.

పోలీసులు క్రాంతికారులను ఎదురుకోవడానికెళ్ళినప్పుడల్లా మైసయ్య లాంటివాళ్ళనే ముందు పెట్టుకొని వెళ్ళడం ప్రారంభించారు. క్రాంతికారులు పట్టే మందుపాతరల్లో గానీ, హాండ్ గ్రెనేడ్లు విసిరినప్పుడుగానీ మొట్టమొదలు బలయిపోయేవాళ్ళు లొంగిపోయిన మిలిటంట్లేనని అందరికీ తెలిసిపోయింది. మేధావులూ, అధినాయకులూ అని పేరుపొందినవాళ్ళు లొంగిపోతే ఒక రకమైన పరిస్థితులు, దళితులు, నిరక్షరాస్యులు, నాయకత్వ శ్రేణిలో చిట్టచివరుండేవాళ్ళు లొంగిపోతే మరో రకమైన పరిస్థితులు ఏర్పడటాన్ని విజ్ఞులైన ప్రజలు గమనించారు.

"యే ఉద్యమమైనా సరె, దళితులకు న్యాయం చెయ్యడం లేదు. ప్రతి ఉద్యమంలోనూ అగ్రవర్ణాల వారిదే పైచేయిగా ఉంటున్నది. ప్రతి ఉద్యమంలోనూ చిందుతున్నది దళితుల రక్తమే. కానీ ఉద్యమఫలాలు మాత్రం దళితులకందటం లేదు. దళితులకు న్యాయం జరగాలంటే దళితులు మాత్రమే పాల్గొనే ఉద్యమాల్లో దళితులు చేరాలి.. దళితులు దళితుల కోసం పోరాడే ఉద్యమాలను మాత్రమే దళితులు ఆదరించాలి. దళితులకు తప్ప మరెవ్వరికీ స్థానం లేని దళితోద్యమాల్లో మాత్రమే దళితులు పాల్గొనాలి. క్రాంతికారుల్తో సహా అందరూ దళితుల్ని వంచించిన వాళ్ళే... దళితులు దళితుల్ని తప్ప మరెవ్వరినీ నమ్మకూడదు" అంటూ గర్జించాడో దళిత నాయకుడు. దాంతో త్రిలింగద్వీపంలో దళితోద్యమం ఊపందుకుంది. దళిత నాయకులు అన్ని రాజకీయ పార్టీలనూ చీల్చి చెండాడ్డం మొదలెట్టారు.

* * *

వేరే నియోజకవర్గాల్లోకంటె మారుతీరావు ప్రాతినిధ్యం వహిస్తున్న హకీంపేట నియోజకవర్గం నుండి లొంగుబాట్లు ఎక్కువగా జరుగుతున్నాయని పత్రికలవాళ్ళు రాయడం మొదలెట్టారు. భానుమూర్తి లొంగుబాటులోనూ, మైసయ్య లొంగుబాటులోనూ, ఇంకెంతోమంది లొంగుబాటులోనూ మారుతీరావు హస్తముందన్న గుసగుసలు కూడా చాలా గ్రామాల్లో వ్యాపించాయి.

మారుతీరావులోని మంచితనం... అతడా నియజకవర్గ ప్రజలకు చేసిన సేవలు... లాంటి కారణాల వల్ల మారుతీరావు మాటకు ఆ నియోజకవర్గ ప్రజల్లో చాలా గౌరవం ఉంది. అతని మాటలు, చేతలు కారణంగానే ఆ ఏరియాలో పనిచేస్తున్న చాలామంది క్రాంతికారులు లొంగిపోతున్నారన్న అభిప్రాయం క్రాంతికారుల నాయకులక్కూడా కల్గింది. దాంతో వాళ్ళు మారుతీరావుకో వార్నింగిచ్చారు.

"నీకూ, ప్రజాద్రోహి సుఖేందర్ రెడ్డికి మధ్య ఉన్న సంబంధమేమిటో మాకు తెలుసు. నిన్ను హతమార్చడానికి ఈ కారణమొక్కటే చాలు. అయినా ప్రజల్లో నీకున్న మంచిపేరు కారణంగా నిన్ను ఇంతకాలం వదిలేశాం. కానీ ఈ మధ్య మా కేడర్ లొంగుబాట్ల విషయంలో నువ్వు పోలీసులతో ఎలా కుమ్మక్కవుతున్నావో వేం గమనిస్తున్నాం. మా కాడర్‌ను నైతికంగా దెబ్బతీసి వాళ్ళను లొంగిపోయేట్టు చేస్తున్న నిన్ను ప్రజలు క్షమించరు. నీ పద్ధతుల్ని మార్చుకోకపోతే పరిణామాలు చాలా తీవ్రంగా ఉంటాయ"ని మారుతీరావును హెచ్చరిస్తూ వర్తమానం పంపించారు.

"లొంగుబాట్లకూ నాకూ ఎలాంటి సంబంధం లేదు. నేను నా ప్రజలకు నా చేతనయినంత సేవ చేయడానికే నేను రాజకీయాల్లోకొచ్చాను తప్ప మరో ఉద్దేశ్యంతో రాలేదు... నా కంఠంలో ప్రాణమున్నంత వరకు నేను ప్రజాసేవ చేస్తూనే ఉంటాను. నన్నీ మార్గం నుండి ప్రపంచంలో ఏ శక్తి కూడా మరల్చలేదు" అంటూ మారుతీరావు ఓ ప్రకటన చేశాడు. అతని ప్రకటనను పత్రికలన్నీ ప్రముఖంగా ప్రచురించాయి.

"మీకున్న ప్రమాదం దృష్ట్యా మీకు చాలా కట్టుదిట్టమైన రక్షణను ఏర్పాటు చేస్తామ"ని ప్రభుత్వం వారు మారుతీరావుకు చెప్పారు.

నాకెలాంటి రక్షణ అక్కర్లేదని, నా ప్రజలే నాకు రక్షకులని, ప్రజాసేవలో నేను నా ప్రాణాలు కోల్పోయినా లెక్కచెయ్యనని మారుతీరావు ప్రకటించాడు.

(సశేషం)



**తెలంగాణా జీవితంపై - వెలువరిస్తున్న ఆలోచనాత్మక సీరియల్**

అడ్రసు :12-5-33/2, విజయపురి కాలనీ, తార్నాక, సికింద్రాబాద్-17. ☎ 7007053, సెల్ నెం.9848019076







## చిట్టి కథ

## తోడేలూ - కాపలా కుక్కా

ఒక రోజున తోడేలు దారితప్పి ఒక పల్లెటూరి పొలిమేరల్లో ప్రవేశించింది. పాపం అది ఆకలితో నకనక లాడుతోంది. కానీ ఇంటికి తిరిగి వెళ్ళే దారి తెలీదు. అప్పుడు దానికొక కాపలా కుక్క కనబడింది. కుక్క బాగా ఆరోగ్యంగా మిసమిసలాడుతూ బొద్దుగా ఉంది. తోడేలు కుక్కతో అంది గదా- ''అన్నా! నిన్ను చూస్తే నీకు బాగా తిండి దొరుకుతూ ఉండాలనిపిస్తోంది. మరి నీకు ఆహారం ఎల్లా వస్తుందేమిటీ?'' అని అడిగింది.' ''నా యజమాని నాకు కడుపునిండా తిండి పెడతాడు. బోలెడంత మాంసం, బొమికెలూ కూడా!!'' అంది కాపలా కుక్క గర్వంగా. ''నువ్వు ఏం పనిచేస్తే నీ యజమాని తిండి పెడతాడూ?'' అని అడిగింది తోడేలు!! ''పెద్ద పనేమీ లేదు. పగలంతా హాయిగా తింటూ తాగుతూ ఉండడం, రాత్రిళ్ళు మేలుకుని ఇల్లు కాపలా కాయడం, అంతే - ఈ మాత్రం పని నువ్వూ చేసి కడుపునింపుకోవచ్చును'' అంది కుక్క. ''ఓస్! అంతేనా?'' అంది తోడేలు సంతోషంగా. అంతలోనే దానికి కుక్క మెడలో కట్టి ఉన్న చిన్న తోలు బెల్టు కనబడింది. ''అదేమిటీ?'' అంది ఆశ్చర్యంగా. ''అదా! దాన్ని కాలరు అంటారులే! పగలంతా దానికి గొలుసుకట్టి నన్ను కట్టేసి ఉంచుతాడు మా యజమాని'' అంది కుక్క. ''ఓరి బాబోయ్! అయితే నాకు అల్లాంటి ఉద్యోగం అక్కర్లేదులే! బానిస బతుకు బతుకుతూ మంచి తిండి తినడం కంటే, స్వేచ్ఛగా ఉంటూ దొరికిన దానితో కడుపు నింపుకోవడం ఉత్తమం! నేను వెళ్ళొస్తా'' అంది తోడేలు.










| | | |
|---|---|---|
| రాజధాని | : | కైరో |
| భాష | : | అరబిక్ |
| మతం | : | ఇస్లాం |
| కరెన్సీ | : | ఈజిప్షియన్ పౌండు |

క్రీస్తు పూర్వం ఐదారు వేల సంవత్సరాల క్రితమే గొప్ప నాగరికత విలసిల్లిన దేశం ఈజిప్టు. ఈజిప్టుని 'నైలునది భిక్ష' అని కూడా అంటారు. అది నిజమే! నైలునదివల్ల ఈజిప్టుకి నీరూ, ఆహారం, శక్తీ కూడా లభిస్తాయి. నైలునది ప్రయాణాలకూ, రవాణాకు కూడా అనువుగా ఉంటుంది. ఈజిప్టు ముఖ్యంగా వ్యవసాయం మీద ఆధారపడిన దేశం. ఈజిప్టులో పండే ఖర్జూరాలూ, 'ఈజిప్షియన్ కాటన్' అనబడే అక్కడి పత్తి జగత్ప్రసిద్ధం! ఎన్నో జాతుల ప్రజలు ఇక్కడ స్థిర నివాసం ఏర్పరుచుకున్నా కూడా, వాళ్ళలో ఎక్కువమంది మాట్లాడేది అరబిక్ భాషే. అయితే, బెర్బర, న్యూబియన్ భాషలు కూడా వాడకంలో లేకపోలేదు. ముఖ్యమైన మతం ఇస్లాం. ఈజిప్షియన్ పిరమిడ్లని చూడడానికి ప్రపంచం నాలుగు మూలల నుంచీ ఎంతో మంది టూరిస్టులు వస్తూ ఉంటారు. పిరమిడ్లు అంటే 'ఫేరోలు' అనబడే ప్రాచీన కాలపు ఈజిప్షియన్ చక్రవర్తుల తాలూకు సమాధులన్నమాట. మానవ నిర్మితమైన 'సూయెజ్ కెనాల్' సూయెజ్ జల సంధిని మెడిటెరేనియన్ సముద్రంతో కలుపుతూ ఉండి, ఈజిప్టు దేశపు ఆదాయాన్ని పెంచింది. కైరో ఈజిప్టుకి రాజధాని. ఈజిప్షియన్ పౌండు ఆ దేశపు కరెన్సీ●

# బుడత

## జోసఫ్ ప్రీస్ట్లీ



'ప్రాణదాత' అనదగిన ఆక్సిజన్‌ని కనిపెట్టిన శాస్త్రజ్ఞుడు జోసెఫ్ ప్రీస్ట్లీ. అంతేకాదు, 'సోడా వాటర్' ని కనిపెట్టింది కూడా ఆయనే. **1733**లో ఒక పేద కార్మికుడి ఇంట పుట్టాడు ప్రీస్ట్లీ. ఏడేళ్ళు నిండకముందే అతను అనాథ అయ్యాడు. జీవనోపాధికి గానూ అతను ట్యూషన్లు చెప్పేవాడు. పుస్తకాలు రాసేవాడు. బెంజమిన్ ఫ్లాంక్లిన్ ఆయనకి ప్రాణ మిత్రుడు. ఫ్రాంక్లిన్ ప్రభావమూ, ప్రోత్సాహమూ కలిసి ప్రీస్ట్లీ చేత 'ద హిస్టరీ ఆఫ్ ద ప్రెజెంట్ కండిషన్ ఆఫ్ ఎలెక్ట్రిసిటీ' అనే గ్రంథాన్ని రచించేటట్లు చేశాయి. ఇవాళ మనం రకరకాల కూల్‌డ్రింకులు తాగుతున్నాం కదా. కోటానుకోట్ల రూపాయల విలువ చేసే ఈ వ్యాపారానికి ఆధారం తను కనిపెట్టిన సోడా వాటర్ అవుతుందని ప్రీస్ట్లీ బహుశా ఊహించి ఉండకపోవచ్చును●




చిలక దారి తప్పింది. గూడు చేరుకోవాలి. మీరు దారి చూపిస్తారా?




అడ్రసు :12-5-33/2, విజయపురి కాలనీ, తార్నాక, సికింద్రాబాద్-17. ☎ 7007053, సెల్ నెం.9848019076



రైలు శరవేగంతో మద్రాసు వైపుకు పరుగులు తీస్తోంది.. మద్రాసు చేరేందుకు ఇంకా చాలా సమయం పడుతుంది.

పాశ్చాత్య వేషాధారణతో ఆడంబరాన్ని ఒలికిస్తున్న ఒక యువకుడి దృష్టి- తన ముందు మామూలు సాదాసీదా దేశీయ వేషంతో నిరాడంబరంగా, పరమప్రశాంతంగా కూర్చున్న అపరిచిత వ్యక్తి పైన పడింది. పంచె..., ఛాతీపైన కప్పుకున్న వస్త్రం, కాస్త మాసిన గడ్డం... మామూలుగా చూస్తే ఆ వ్యక్తి ఈ దేశంలో కోట్లాది నిరుపేద గ్రామీణుల ఆహార్యంలోనే ఉన్నట్లు కనిపిస్తుంది.

ఒకవేళ కాస్త నిశితంగా శ్రద్ధగా పరిశీలించ గలిగితే, నిశ్చల గంభీరమైన ఆయన నేత్రాలు - మానవ కల్పితాలైన హెచ్చుతగ్గుల్ని, భేదభావాల్నీ అధిగమించి, సమస్త ప్రపంచాన్నీ దైవవ్యక్తీకరణగా ప్రేమ పూర్వకంగా వీక్షిస్తున్న యోగి నేత్రాలనీ - ఆ నేత్రాలు మన అంతరాల లోతుల్ని స్పర్శించి అమృతాన్ని నింపగల శక్తి కలిగినవనీ గమనించడం సాధ్యమే.

కానీ, తన యూరోపియన్ ఫ్యాషన్ అట్టహాస ప్రదర్శనలో మురిసిపోతున్న యువకుడికి ఎదుటి వ్యక్తిని పరిశీలించగల శక్తీ యదార్థమైన ఆసక్తీ లేవు. ఎవరైతేనేం, తన ఎదురుగా కూర్చున్నది ఒక కింది స్థాయి గ్రామీణుడు-ఆ యువకుడికి తెలిసిందిఅంతే-

"మీ పేరేమిటి?" - ఉన్నట్టుండి యువకుడు చటుక్కున ప్రశ్నించాడు.

'నారాయణ' - స్పష్టంగా, ప్రశాంతంగా దయాపూరితమైన స్వరంతో సమాధానం వచ్చింది.

పేరు తెలుసుకున్న వెంటనే సాధారణంగా వచ్చే మలి ప్రశ్న యువకుడి నోట్లోంచి దూసుకువచ్చింది:

"మీది ఏ కులం?"

ఒక్క క్షణం నిశ్శబ్దం.

తర్వాత శాంతంగా "నువ్వు ఏమను కుంటున్నావు? చెప్పుచూద్దాం" అన్నాడా వ్యక్తి.

యువకుడు ఆశ్చర్యపోయాడు. ఏమనుకుంటాం?, మనిషిని చూడగానే కులం స్పష్టంగా ఎలా స్ఫురిస్తుంది?.... అదే మాట అనేశాడు.

"మీ ఆకారాన్ని చూసి మీ కులమేమిటో నేనెలా కనుక్కోగలను?"

యోగి నేత్రాలు కరుణాన్వితమైన చూపులు ప్రసరించాయి. పెదవులపై లీలామాత్రమైన చిరునవ్వు మెరిసింది.

"చూసి తెలుసుకోలేని వాడివి - విని మాత్రం ఎలా తెలుసుకోగలవు?"

* * *

నిజమే.... అందరికీ అవే ఇంద్రియాలు, అదే హృదయం, అదే ఆకలి, అదే ఆత్మ... మరి మనిషినీ, మనిషిని విడదీసే కులం 'సహజం' ఎలా అవుతుంది? 'వాస్తవం' ఎలా అవుతుంది?

# "ఒకే కులం -

# కులనిర్మూలనా విప్లవ ప్రవక్త

## ఆదిశంకరుడి అవతారం

"నా మార్గం ఆదిశంకరుని మార్గమే" అన్నారు నారాయణ గురు.

ప్రజలు మాత్రం నారాయణగురుని శంకరాచార్యుని అవతారమేనని భావిస్తారు.

క్రీ॥శ॥ 8-9 శతాబ్దాల కాలంలో జీవించిన ఆదిశంకరాచార్యుడు, భారతదేశానికి కేరళ అందించిన అపురూపమైన కానుక. ఆదిశంకరులు అద్వైత దర్శనాన్ని ప్రచారం చేసిన తత్వవేత్త, మహాకవి, అసమాన పండితుడు, దేశం నలుమూలలా పర్యటించి పీఠాలను స్థాపించిన ఉద్యమకారుడు, భాష్యకారుడు, నిరుపమాన మేధావి. శంకరుని అద్వైతం భారతీయ ఉపనిషత్తులపైన గీతపైన ఆధారపడినట్టిదే. అద్వైతతత్వం ప్రకారం జగత్తంతా బ్రహ్మ మయమే. జగత్తు మిథ్య. బ్రహ్మ సత్యం. అంతటా నిండి ఉన్నది బ్రహ్మమే అయినపుడు - అహేతుకమైన అసమానతలకూ, అమానుష కులవ్యవస్థకూ - సమర్ధన వీలుకాదు.

అయినా ఆదిశంకరుల దృక్పథంలో వర్ణవ్యవస్థ కు చాలాకాలం విలువ ఉండేదని దైవప్రేరితమైన ఒకానొక మహత్తర ఘటనవల్ల శంకరాచార్యుల దృక్పథంలో సమూలమైన మార్పు వచ్చిందనీ చెపుతారు. కొంత కాల్పనికత కనిపించినా, నిజానికి శంకరాచార్యుల జీవితచరిత్రలోనే అది అత్యంత మనోజ్ఞమైన ఘట్టం, కులవ్యవస్థ బూటకాన్ని బట్టబయలు చేసేఘట్టం. ఆ ఘట్టం ఇలా ఉంటుంది:

ఒకరోజు కాశీపట్టణంలో శంకరా చార్యులు ఉదయానే గంగాస్నానం కోసం వెళ్తున్నారు. దారిలో ఒక చండాలుడు నాలుగు కుక్కలతో ఎదురు వచ్చాడు. శంకరాచార్యులు అసహ్యించు కుని "ఫో, ఫో, దారితొలగు" అని అదిలించారు. "ఎవరిని తొలగమంటున్నావు? తొలగవలసింది ఆత్మా? శరీరమా? శరీరం ఒట్టి మిథ్యే కదా? మరి ఆత్మ అయితే అది ఎక్కడికి తొలగి పోతుంది? అందరిలోనూ ఉన్నది అదే కదా, అంతటా తానే కదా, నువ్వెవరు, నేనెవరు. నీలోనూ నాలోనూ వాస్తవంగా ఉన్నది ఒక్కటే ఆత్మ కదా, ఆత్మ తన నుంచి తానే ఎలా తొలగిపోతుంది? అందరిలో ప్రకాశించే ఆత్మ ఒక్కటే అయినపుడు ఇతడు బ్రాహ్మణుడని ఇతడు శూద్రుడనీ ఎలా చెపుతావు?" అని చండాలుడు ప్రశ్నించాడు. శంకరాచార్యులు ఈ మాటలకి సిగ్గుపడ్డారు. తాను బోధించే అద్వైతాన్ని తానే పూర్తిగా ఆచరణలో పెట్ట లేదని, అజ్ఞానంతో కులభేదం పాటించానని అర్థమై పశ్చాత్తాప పడ్డారు. ఆ చండాలుడు బ్రహ్మజ్ఞాని అనీ, బ్రహ్మజ్ఞాని బ్రాహ్మణుడైనా చండాలుడైనా ఒకటేనని చెప్పి, అతడినే తన గురువుగా ప్రకటించి సాష్టాంగపడ్డారు. చండాలుడు, నాలుగు కుక్కలు మాయమై నాలుగు వేదాల సహితంగా శివుడు ప్రత్యక్షమై ఆశీర్వదించాడు.

- ఇదే ఆ కథ. ఇందులో కాల్పనికత ఉన్నా సందేశం అజరామరమైనది. చరిత్రకారులందరి అభిప్రాయం ప్రకారం ఆది శంకరాచార్యులు కేవలం 32 సం. మాత్రమే జీవించారు.

తన దృక్పథంలోని పొరపాటును గ్రహించాక ఆదిశంకరులు ఎక్కువకాలం జీవించలేక పోయారనీ, ఆ లోటును భర్తీ చేసి అద్వైత సిద్ధాంతాన్ని మరింత విస్తృత ప్రజానీకపు హితానికి అనువుగా ఆచరణకు తెచ్చేందుకే, ఒక సహస్రాబ్ది అనంతరం - అలనాటి ఆదిశంకరులే ఈనాటి నారాయణ గురుగా పునరవతరించారని భావించేవారు ఎందరో ఉన్నారు.

## "ఒకే కులం - ఒకే మతం - ఒకే దేవుడు"

జీవులన్నింటిలోనూ ఉన్నది ఒకే ఆత్మ అనీ అది అద్వయమనీ అఖండమనీ అద్వైతం చెపుతుంది. మనుషుల్ని విభజించే వర్ణవ్యవస్థ, కులవ్యవస్థ వాటి వికృత ఫలితమైన అస్పృశ్యత - అద్వైత దృక్పథానికి వ్యతిరేకమని నారాయణగురు అభిప్రాయం. అందుకే ఆయన "మనుషులందరికీ ఒకే కులం, ఒకే మతం, ఒకేదేవుడు" అని నినాదమిచ్చారు.

## పిచ్చివాళ్ళ ఆశ్రయం

నారాయణగురు కాలానికి కేరళలో కులవ్యవస్థ వికృతత్వం పరాకాష్టకి చేరి ఉంది.

కులనిచ్చెనలో అగ్రభాగాన వున్న నంబూద్రీల్లో (బ్రాహ్మణులు) సైతం అనేక దురాచారాలు, మూఢ విశ్వాసాలు ఉండేవి.

నంబూద్రీ కుటుంబాల్లో పెద్దకొడుక్కే సర్వహక్కులు వుండేవి. అతడికే తమకులంలోని స్త్రీలని పెళ్ళాడే హక్కు ఉండేది. మిగతా కొడుకులు తమ స్వంత నంబూద్రీ కులంలోని యువతులను పెళ్ళాడేందుకు వీలులేదు. వారు తమకంటే తక్కువ స్థాయి కులాలైన క్షత్రియ లేదా నాయర్ కులంలోని అమ్మాయిలను పెళ్ళాడవచ్చు. అలా పెళ్ళాడినా ఆ పెళ్ళికి పూర్తిస్థాయి హోదా ఉండేదికాదు. ఆ పెళ్ళిని 'సంబంధం'అనే వ్యవహరించేవారు. 'సంబంధం'లో స్త్రీలకు ధర్మపత్ని హోదా లభించేది కాదు. వారిసంతానానికి తండ్రి ఆస్తిపైన హక్కులేదు.

ఇంకా ఘోరమైన సంగతి ఏమిటంటే ఈ సంబంధం వల్ల జన్మించిన సంతానానికి తమ బ్రాహ్మణ తండ్రిని తాకే అర్హత కూడా ఉండేది కాదు.

మరోపక్క నంబూద్రి కుటుంబాల్లో కేవలం పెద్ద కొడుకులకి మాత్రమే స్వంత కులంలోని కన్యను పెళ్ళాడే అవకాశం ఉండటంతో, నంబూద్రి కులంలో పెళ్ళికాని యువతుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా ఉండేది. వారిలో అనేకులు జీవితాంతం కన్యలుగానే కాలం గడపాల్సి వచ్చేది. లేదా అనేక మంది భార్యల్లో ఒకరుగా వేగాల్సివచ్చేది లేదా మరే ముసలివరుడు దొరికినా అంగీక రించాల్సి వచ్చేది.

శూద్రకులాలవారు, నిమ్న కులాల వారు అత్యంత దారుణమైన అవమానాలకు, అత్యాచారాలకు, దోపిడీకి గురయ్యేవారు. సత్యబాయి శివదాస్, పి.ప్రభాకరరావు రచించిన "శ్రీ నారాయణగురు కేరళ సామాజిక తత్వవేత్త" గ్రంథంలో ఈ పరిస్థితిని ఇలా వర్ణించారు : "పదిహేడవ శతాబ్ది చివరినాటికి కేరళలో కుల వ్యవస్థ మరీ పాశవికంగా, అనాగరికంగా తయారైంది. కుల దొంతరలో క్రింది స్థాయిన వున్నవాళ్ళపై తీవ్రమైన అణిచివేత, దారుణమైన దోపిడీ కొనసాగేవి. ప్రత్యేకంగా అవర్ణులనుండి దాదాపు 300 రకాల పన్నులను నిర్బంధంగా వసూలు చేసేవాళ్ళు. ఈనాటి దృష్టితో చూస్తే ఆ పన్నులు ఎంతో హాస్యాస్పదంగా, దుర్మార్గంగా కనిపిస్తాయి. ఉదాహరణకు కొన్ని -

| | |
|---|---|
| తరివరి | - చేనేత మగ్గాలపై పన్ను |
| వలయరచేపలు | - పట్టే పడవలపై, వలలపై పన్ను |
| చక్కువరి | - నూనె గానుగపై పన్ను |
| తలవరి | - అవర్ణుడు తన తలపై జుట్టు పెంచుకున్నందుకు చెల్లించాల్సిన పన్ను |
| ములకరమ్ (రొమ్ముపన్ను) | - అవర్ణ స్త్రీలు తమ రొమ్ముల సైజుని బట్టి చెల్లించాల్సిన పన్ను |
| చెత్తుకరమ్ | - కల్లుగీత కార్మికుడు రోజుకు ఎన్ని కొబ్బరి చెట్లెక్కుతాడో - దాని ఆధారంగా చెల్లించాల్సిన పన్ను. (కేరళలో కొబ్బరి చెట్టునుంచే కల్లుగీస్తారు) |

అనాటి పన్నుల తీరు తెన్నులు మనకు నవ్వులాటగా అనిపించవచ్చు. కాని అప్పటి ప్రజలు వీటి మూలంగా ఎంతటి పరాభవానికి, ఎంతటి విషాదానికి గురై వుంటారో నిశితంగా ఆలోచిస్తే మనసు చలించిపోతుంది. ఈ పన్నులు అన్యాయమైనవీ, అక్రమమైనవీ, అమానుష మైనవీ అని గుర్తించి ఆ తరువాతి కాలంలో రాణీ గౌరీలక్ష్మిబాయి 1851లో వాటిని నిషేధించింది. (తిరువాంకూరు సంస్థానానికి ఆమె అప్పుడు మహారాణిగా వుండేది)

అయితే, క్రింది కులాల వాళ్ళని సామాజికంగా అవమానించే ధోరణి మాత్రం యథాతథంగా కొనసాగుతూ వచ్చింది. క్రిందికులాలవాళ్ళు తమని ఆధ్యాత్మికంగా, సాంప్రదాయపరంగా అపవిత్ర పరుస్తారనే భావన అగ్రవర్ణాలలో అలాగేవుండిపోయింది. అందుకే వారు అంటరానితనం, దూరంగావుండడం వంటి నియమ నిబంధనలనుఖచ్చి తంగా అమలు పరిచేవారు. చివరికి కొందరు సవర్ణులకు కూడా ఈ నియమ నిబంధనలను వర్తింప జేశారు. అందరికంటే నంబూద్రీలు అత్యున్నతులు, అతి పవిత్రమైన వాళ్ళు (దైవాంశ సంభూతులు) అనే నమ్మకం కల్పించారు. ఆ కారణంగా క్షత్రియులు (పాలకులు) సైతం తమను తాకకూడదు, మరీ దగ్గరకు రాకూడదు అని ఆంక్షలు విధించారు. తమ పవిత్రతకు భంగం వాటిల్లకుండా వుండేందుకుగాను నంబూద్రీలకూ, దేవాలయ గర్భగుడికీ క్షత్రియులు కనీసం రెండడుగుల దూరాన్ని పాటించాలని తీర్మానించారు. అలాగే ఇతర కులాల వాళ్ళు పాటించాల్సిన దూరాలు ఈ క్రింది విధంగా నిర్ణయించారు.

నాయర్లు - 16 అడుగుల దూరం

'ఈళవ'లు -32 అడుగుల దూరం

పులయ మరియు పరయలు - 64 అడుగుల దూరం

నాయాదీలు - బ్రాహ్మణుల కనుచూపు మేరలో కనిపించకూడదు. పొరబాటున ఏ నాయాదినైనా బ్రాహ్మణుడు చూస్తే ప్రాయశ్చిత్తం చేసుకోవాలి.

ఇదిలావుంటే, మిగతా కులాల వారు కూడా ఈ ప్రభావంతో నంబూద్రీలను అనుకరిస్తూ తమలో తాము కూడా నిర్ణీతదూరాల నియమాలను ఏర్పరచుకుని పాటించేవాళ్ళు.

రహదారులను అవర్ణులు వినియోగించ కుండా నిషేధం విధించారు. ఒకవేళ ఏ అవర్ణుడైనా నిర్ణీత దూరాన్ని పాటించకుండా ఒక సవర్ణుడికి దగ్గరగా వచ్చినట్టయితే అతణ్ని తీవ్రంగా శిక్షించేవారు. ఒకోసారి అలాంటి వారిని చంపేసేవాళ్ళుకూడా. నిమ్న కులస్థులను సులభంగా గుర్తించేందుకు వీలుగా ఆయా కులాలకు చెందిన స్త్రీలూ, పురుషులూ తమ ఛాతిమీద ఎలాంటి ఆఛ్ఛాదనా లేకుండా (అర్ధనగ్నంగా) వుండాలనే ఆంక్ష విధించారు. ఒకవేళ ఏ అవర్ణ పురుషుడైనా లేక స్త్రీ అయినా కారణాంతరాలవల్ల తమ ఛాతీని వస్త్రంతో కప్పుకుని వుంటే - సవర్ణ వ్యక్తి తారసపడిన తక్షణమే ఆ వస్త్రాన్ని గౌరవపూర్వకంగా తొలగించిపారేయాలి. తరతరాలుగా సాగిన ఈ ఆంక్షల వల్లనే కేరళలో కొందరు స్త్రీలలో పైట వేసుకోకపోవడం అనేది ఇప్పటికీ ఒక ఆచారంగా కనిపిస్తుంది.

అలాగే అవర్ణులు చెప్పులు తొడుక్కోకూడదు, గొడుగులు పట్టుకోకూడదు, మంచి దుస్తులు వేసుకోకూడదు, నగలు ధరించకూడదు. వర్షం పడుతున్నాసరే కేవలం బ్రాహ్మణులు తప్ప మిగతా కులాల వాళ్ళు బహిరంగ స్థలాల్లో గొడుగులు పట్టుకుని కనిపించకూడదు అంతగా కావలస్తే అరటి ఆకులను తమ తలలపై కప్పుకోవచ్చు అన్నారు.

అవర్ణులు కట్టుకునే ఇళ్ళ విషయంలో కూడా వివిధ నిబంధనలుండేవి. ఇంటిని ఏవిధంగా ఎంత స్థలంలో కట్టుకోవాలి. దాని ఎత్తు ఎంత వుండాలి, ఎన్ని కిటికీలు ఎన్ని వెంటిలేటర్లు వుండాలి అనే అంశాల్లో పలు ఆంక్షలుండేవి.

తమకంటే ఎక్కువ కులాలవారితో మాట్లాడేప్పుడు, అవర్ణులు తప్పనిసరిగా కొన్ని ప్రత్యేకమైన పదాలను ఉపయోగించాలని ఆదేశించారు. ఉదాహరణకు కొన్ని ఇలా వున్నాయి :

- అవర్ణుడు తనగురించి తను చెప్పదలుచు కున్నప్పుడు 'నేను' అనే పదాన్ని ఉపయోగించ కూడదు. దానికి బదులుగా 'మీ బానిస' (బాంచెను) అనే పదాన్ని వాడాలి.
- సంభాషణ మొదలు పెట్టేప్పుడే 'తమ బానిస ఫలానా విషయం విన్నవించు కునేందుకు అనుమతి కోరుతున్నాడు' అంటూ మొదలుపెట్టాలి.





సవాల్‌ను ప్రేమించే తరం కోసం సంధించిన గెలుపు బాణం - జనహర్ష గ్రూపు నుంచి నెలనెలా విజయవిహారం!

"చూసి తెలుసుకోలేనివాడివి - విని మాత్రం ఎలా తెలుసుకోగలవు?"

'కులం' లోని కృత్రిమత్వాన్ని సూటిగా బయట పెట్టిన ఈప్రశ్నను అడిగిన వ్యక్తి - శ్రీనారాయణగురు.

క్రీ॥శ॥ 1854-1928 మధ్యకాలంలో కేరళ రాష్ట్రంలో జీవించిన నారాయణగురు తన జీవిత కాలంలోనే దక్షిణ భారతదేశంలోని లక్షలాది మంది ప్రజానీకం చేత దైవసమానుడిగా గౌరవాభిమానాలు పొందారు.

"మనుషులందరికీ ఒకే కులం ఒకే మతం ఒకే దేవుడు" అన్న నారాయణ గురు నినాదం ప్రజల్ని మంత్ర ముగ్ధుల్ని చేసింది. జీవులందరిలో నిండి వున్నది ఒకే ఆత్మ అని ఎలుగెత్తి చాటిన అద్వైత విప్లవకారుడాయన.

"కులం అడగొద్దు, కులం చెప్పొద్దు, కులం గురించి ఆలోచించొద్దు" అని ఆయన బోధించారు.

ఒక్క నెత్తురు బొట్టు చిందకుండానే, ఎటువంటి విద్వేషాలూ, కావేషాలూ రేపకుండానే లక్షలాది నిమ్నకులాల ప్రజల జీవితాల్లో వెలుతురు నింపారు నారాయణ గురు. వేలాది సంవత్సరాలుగా సమాజాన్ని నిర్వీర్యం చేసిన కులవ్యవస్థ పునాదులని నారాయణగురు కేవలం కొన్ని దశాబ్దాల కాలంలోనే కుదిపివేయగలిగారు. అణగారిన ప్రజలకు ఆత్మవిశ్వాసాన్ని అందించారు. విద్యాపరంగా, ఆర్థికంగా, ఆత్మికంగా ఒక తరం మొత్తం ముందడుగేసిన అద్భుతాన్ని సాధించి చూపారు.

జ్ఞానం, ఆచరణ, ప్రేమ మూర్తీభవించిన నారాయణగురు వంటి ప్రవక్తలు చరిత్రలోనే అరుదు.

ఏ ప్రమాణాల ప్రకారం చూసినా నారాయణగురు నిశ్శబ్దవిప్లవం వేల సంవత్సరాల భారత చరిత్రలోనే అపురూపమైనది.

నాడు వేలాదిభిక్షువులు ఘోరారణ్యాలనూ, మహా సముద్రాలను దాటి ఖండఖండాంతరాల ప్రజానీకానికీ సిద్ధార్థ గౌతముని సందేశాన్ని తీసుకెళ్ళిన అపూర్వఘట్టంతోనూ, నేడు జాతీయోద్యమ చరిత్రలో మహాత్ముని సత్యాహింసల పతాకం చేబూని కోట్లాది ప్రజానీకం కదంతొక్కిన మహత్తర సన్నివేశంతోనూ - సరిపోల్చదగినదే మహనీయుడు నారాయణగురు తెచ్చిన విప్లవం.

* * *

ఈ అసమాన, కుల నిర్మూలనా సంస్కర్త కృషి గురించి కేరళ రాష్ట్రంలోనూ, కొద్దిగా తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల్లోనూ తప్ప, మొత్తం భారతదేశంలో - ఆ మాటకి వస్తే కనీసం మన ఆంధ్ర దేశంలోనూ ప్రజలకి పెద్దగా తెలియకపోవడం దురదృష్టం.

కుల అసమానతలతోనూ ద్వేషకీలల తోనూ కుతకుతలాడుతున్న సమకాలీన భారతంలో - ఇప్పుడు నారాయణ గురువంటి సంస్కర్తల భావాలు, కృషి గురించి పల్లె పల్లెకూ తెలియాల్సిన అవసరం వుంది.

నిమ్నవర్గాల ఆత్మవిశ్వాసం అభ్యున్నతి లక్ష్యంగా సాగే కులనిర్మూలన పోరాటంలో నారాయణగురు ఉద్యమం నేర్పుతున్న అనుభవాలూ పాఠాలూ అత్యంత విలువైనవి.

* * *

సెప్టెంబరు 20 నారాయణగురు వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన జీవితం కృషిని క్లుప్తంగా పరిచయం చేసేందుకే ఈ ప్రయత్నం.

భారత ప్రభుత్వం, సమాచార ప్రసార మంత్రిత్వ శాఖవారి నేతృత్వంలోని పబ్లికేషన్ డివిజన్‌వారు ప్రచురించిన "స్టోరీ ఆఫ్ ఎయిట్ సెయింట్ రిఫార్మర్స్", నేషనల్ బుక్ ట్రస్ట్ వారు ఆంగ్లంలో ప్రచురించిన, ముర్కోట్‌కున్హప్ప రచన - "శ్రీ నారాయణ గురు", సత్యసాయిశివదాస్, పి.ప్రభాకర రావుల సంయుక్త ఆంగ్ల రచనకు ప్రభాకర్ మందార తెలుగుసేత - హైదరాబాద్ బుక్‌ట్రస్ట్ ప్రచురించిన "కేరళ సామాజిక తత్త్వవేత్త శ్రీ నారాయణ గురు", పైకో పబ్లిషింగ్ హౌస్ వారు ప్రచురించిన నటరాజ గురు రచన - "ది వర్డ్ ఆఫ్ ది గురు", భారతీయ విద్యాభవన్ ప్రచురించిన యం.కె.సానూ రచన - "నారాయణగురు", నారాయణగురు విరచిత 'దర్శనమాల'కు సి.కె.దినకరన్ ఆంగ్లసేత "ఫిలాసఫిక్ పెరల్" ఇంకా నారాయణగురికి సంబంధించి కొన్ని వ్యాసాలు ఈ రచనకి ఆధారం. ఆయా రచయితల, ప్రచురణకర్తల సౌజన్యంతో - వారు పేర్కొన్న అంశాలను ఈ రచనలో విరివిగా ఉపయోగించుకోవడం జరిగింది.

నారాయణగురు జీవితం, కృషిపైన అధ్యయనాసక్తిని ఏ కొద్ది మందిలో రేకెత్తించగలిగినా ఈ రచన ప్రయోజనం నెరవేరినట్టే. - రచయిత

## - ఒకే మతం - ఒకే దేవుడు" అని బోధించిన

# నారాయణ గురు

**- ఈశ్వరానంద**



**(ఆగస్టు, 1856 - సెప్టెంబరు, 1928)**

- మాట్లాడేప్పుడు తప్పనిసరిగా కుడిచేయిని నోటికి అడ్డుగా పెట్టుకుని మాట్లాడాలి. అవర్ణుడి ఊపిరి సవర్ణుడిని అపవిత్రంగా చేయకుండా వుండేందుకు అలా చేయాలి.
- అవర్ణుడు తన శరీర అవయవాలను గురించి ప్రస్తావించేటప్పుడు వాటి ముందు మునలి (ముదనష్టపు) అనే విశేషణాన్ని జోడించాలి. అంటే నా ముదనష్టపు కళ్ళు, నా ముదనష్టపు చేతులు.... ఇలా గన్నమాట.
- తన తిండిని 'ముష్టి జావ' (ముష్టిగంజి) అనాలి.
- తన ఇంటిని 'దరిద్రపు కొంప' అనాలి.
- ఏ నాయర్‌నైనా సంబోధించేటప్పుడు 'దొరా' (యజమాని)' అనాలి.

ఆనాటి దళితుల దుర్భర స్థితి గతులకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే!"

ఇటువంటి పరిస్థితి ఉన్నందుకే స్వామి వివేకానంద నాటి కేరళను "భారతదేశం లోని పిచ్చివాళ్ళ ఆశ్రయం" (Lunatic asylum of India) అని అభివర్ణించారు.

## అద్వైతం - ఆధ్యాత్మిక నాయకత్వం

"మతానికి మానవ ఆలోచనకీ సంబంధించినంత వరకూ అద్వైతం అనేది తుదిమాట. అద్వైతం - ఒక వ్యక్తి అన్ని మతాలనూ తెగలనూ ప్రేమ పూర్వకంగా వీక్షించగల ఒకానొక స్థాయి. అద్వైతం - భవిష్యత్తులోని వికసిత మానవాళి మతమని నా విశ్వాసం." అంటారు స్వామి వివేకానంద. అద్వైతానికి ఆయన ఇచ్చే గౌరవం అటువంటిది.

నారాయణగురు కూడా అద్వైతం పట్ల అంతటి నిబద్ధత వున్నవారే. పైగా అద్వైత స్ఫూర్తిని నిత్యజీవిత ఆచరణలోకి తెచ్చి, అదే స్ఫూర్తితో కుల నిర్మూలనకు నిర్మాణాత్మకమైన అహింసాయుతమైన మహోద్యమాన్ని ఆయన స్వయంగా నిర్మించి నడిపారు.

"మతము, మతమొక్కటే భారతదేశపు జీవం. మతమే విడిచిపోయినప్పుడు రాజకీయాలు ఉన్నా, సాంఘిక సంస్కరణలున్నా తన సంతానం అంతటి పైనా కుబేరుడి సంపద వర్షించినా భారతదేశం మరణిస్తుంది" అన్నారు స్వామి వివేకానంద. ఆయనింకా ఇలా అన్నారు : "భారతదేశాన్ని సోషలిస్టు, రాజకీయ భావాలతో ముంచెత్తే ముందు ఈ నేలని ఆధ్యాత్మిక భావాలతో నింపెయ్యండి"

కేరళలో నెలకొన్న పరిస్థితుల గురించి ఆరోజుల్లో డా॥ పల్పు, డా॥పద్మనాభన్ ఒకసారి స్వామి వివేకానందతో చర్చించినపుడు సామాజిక దురాచారాలను మార్చేందుకు సాగే పోరాటానికి సైతం ఒక ఆధ్యాత్మిక నాయకత్వం అవసరమని స్వామివివేకానంద విస్పష్టమైన సలహా ఇచ్చారు.

అప్పటికే నారాయణగురు నిమ్న కులాల అభ్యున్నతి కోసం ఆధ్యాత్మిక దృక్పథంతో కృషి ప్రారంభించారు. త్వరలోనే డా॥పల్పు నారాయణగురు ముఖ్య అనుచరుల్లో ఒకరుగా మారిపోయారు. నారాయణగురు ఆశయాలను అమలు పరిచేందుకు, ఆయన స్వీయ అధ్యక్షతన ఏర్పడిన "శ్రీ నారాయణ ధర్మపరిపాలన యోగం" (యస్.యన్.డి.పి) కి డా॥ పల్పు వ్యవస్థాపక ఉపాధ్యక్షులు అయ్యారు. తదనంతరం ఒకటిన్నర దశాబ్దం కాలం ఆయన ఆ పదవిలో కొనసాగారు.



యస్.యన్.డి.పి. ఆశయాలను ప్రచారం చేసేందుకు కుమారన్ ఆశాన్ సంపాదకత్వంలో ప్రారంభమైన పత్రిక పేరు "వివేకోదయం". స్వామి వివేకానంద ఆశయాల స్ఫూర్తిని తాము ఆచరణాత్మ కంగా కొనసాగిస్తున్నామని యస్.యన్. డి.పి. ఆవిధంగా ప్రకటించినట్లైంది.

స్వామి వివేకానంద ఆశించిన ఆధ్యాత్మిక నాయకత్వం - శ్రీ నారాయణగురు రూపంలో మూర్తీభవించి, కేవలం కొన్ని దశాబ్దాల స్వల్ప వ్యవధిలోనే కేరళ రూపురేఖల్ని సమూలంగా మార్చివేసింది.

కేరళ సామాజిక వ్యవస్థలో ఈళవ కులస్థులు అవర్ణులలో (అంటే వర్ణవ్యవస్థకు వెలుపల ఉన్న కులాల్లో) ఎగువ స్థానంలో ఉన్నారు. అగ్రకులాలవారిచేత అవమానాలకూ, చిన్న చూపుకూ, దోపిడికీ గురైన ఈళవలు అదే సమయంలో కులనిచ్చెనలో తమకంటే కిందవున్న కులాల పట్ల వివక్షను పాటించేవారు.

ఈళవ కులంలో జన్మించి, కులవ్యవస్థ దౌష్ట్యాన్ని అమానుషత్వాన్నీ స్వయంగా అనుభవించిన నారాయణగురు మొత్తం కులవ్యవస్థ నిర్మూలనకే తన ఉద్యమాన్ని ఉద్దేశించారు.

అద్వైత తాత్త్వికస్ఫూర్తితోనే నారాయణగురు తన ఉద్యమాన్ని నడిపారు. అల్వాయెల్ లో తాను స్థాపించిన ఆశ్రమానికి నారాయణగురు "అద్వైత ఆశ్రయం" అనే పేరు పెట్టారు. అన్ని మతాలవారు కలిసి ప్రార్థించుకోగల ప్రార్థనా మందిరం ఈ ఆశ్రమంలో ఉండేది.

## 'అరువిప్పురం'లో మొదటి అద్భుతం

ఆత్మయోగిగా నారాయణగురు ఖ్యాతి నలుదిశలా వ్యాపిస్తున్న తొలినాళ్ళలో ఆయన నివశిస్తున్న 'అరువిప్పురం' గ్రామానికి భక్త జనులు తండోప తండాలుగా వచ్చేవారు. నారాయణగురుని భక్తిపురస్సరంగా 'నానుస్వామి' అని పిలుచుకునేవారు. త్వరలోనే 'అరువిప్పురం' ఒక విశేషయాత్రాస్థలిగానూ 'నానుస్వామి' సశరీర దైవంగానూ మారిపోయే పరిస్థితి వచ్చింది.

నారాయణగురుకి ఇది ఆమోద యోగ్యం కాదు. ప్రజలు పూజించుకునేందుకు తాను శివరాత్రి నాడు శివలింగాన్ని ప్రతిష్టిస్తానని గురు ప్రకటించారు.

శివలింగాన్ని ప్రతిష్ఠించేందుకు, అనువైన ఆలయం నిర్మించేందుకు వనరులూ లేవు, కాలమూ సరిపోదు.

నారాయణగురుకి ఈ విషయం తెలుసు. అటువంటివేవీ అవసరంలేదని ఆయన సహచరులకి చెప్పారు. ఒక సమతలంగా ఉన్న రాతిని ఆయన శివలింగం ప్రతిష్ఠించేందుకు పీఠంగా ఎంచుకున్నారు. "ఈ రాయే మన పీఠం. నేను నదిలో మునిగి ఒక గుండ్రటి శిలాఖండాన్ని తెస్తాను... అదే మన శివలింగం అవుతుంది. అంతే" అని గురు తేల్చి చెప్పారు.

> **నారాయణగురు నినాదాలు**
>
> ★ మనుషులందరికీ ఒకే కులం-ఒకే మతం-ఒకే దేవుడు
>
> ★ కులం అడగొద్దు-కులం చెప్పొద్దు-కులం గురించి ఆలోచించొద్దు
>
> ★ మతం ఏదైనాగానీ మనిషిని ఎదగనివ్వాలి
>
> ★ విద్య ద్వారా స్వేచ్ఛ సంఘటితమవడం ద్వారా శక్తి పరిశ్రమించడం ద్వారా ప్రగతి

ప్రజల సంతోషానికి అవధిలేదు. ఆ శివరాత్రిరానే వచ్చింది. ఆ రాతి పీఠంపైన ఒక తాటాకుపందిరి వేశారు. ఆకులతోనూ, పూలతోనూ పీఠాన్ని అలంకరించారు. దీపాలను వెలిగించారు. ఎక్కణ్ణించో ఒక నాదస్వరబృందం వచ్చింది.

భక్తులు జాగరణ చేస్తున్నారు. ఆరోజు ఖచ్చితంగా అక్కడ ఏం జరగబోతోందో ఎవరికీ తెలియపోయినా ఒక అవ్యక్తమైన భావావేశమేదో భక్తుల మనసుని సంతోష తరంగాలతో ముంచెత్తింది.

భక్తి ఉప్పొంగింది. ప్రజలందరి ఆశలకు, ఆర్తికీ కనిపించని దైవం, కనిపించే నారాయణగురు కేంద్ర బిందువయ్యారు. అందరి దృష్టి గురుపైన కేంద్రీకృతమైంది.

అర్ధరాత్రి స్వామి నదీగర్భంలో ప్రవేశించారు. కొద్ది క్షణాలు నిశ్శబ్దం. భక్తులందరి హృదయంలో తెగని ఉత్కంఠ.... కొద్ది సేపటిలో నారాయణ గురు నదినుంచి వెలుపలికి వచ్చారు. ఆయన హస్తాలమధ్య నల్లని రాతిగుండు. అలాగే తిన్నగా రాతిపీఠం వరకూ ఆయన నడిచి వచ్చారు. చేతిలో శివలింగంతో ఆపాదమస్తకం నదీ జలాలతో తడిసిన స్థితిలో, కన్నులుమూసుకుని నిశ్చలధ్యాన సమాధిలో స్వామి నిల్చుండి పోయారు. చుట్టూ ఉన్న జనం ఉచ్చస్వరంతో "ఓమ్ నమశ్శివాయ" అంటూ తన్మయత్వంతో శివనామాన్ని ఉచ్చరిస్తూనే ఉన్నారు. నారాయణ గురు అలా నిశ్చల సమాధిలో శిలావిగ్రహంలా మూడు గంటలు ఉండిపోయారు. మూడు గంటలూ భక్తుల శివనామజపంతో ఆ ప్రదేశం మార్మోగిపోయింది. అందరి మనసులూ ఏకమై అందరి గొంతులూ ఒక్కటై... ఒకే నామం, ఒకే భావం, ఒకే ప్రార్థన.. "ఓమ్ నమశ్శివాయ", "ఓమ్ నమశ్శివాయ".

ఉదయం మూడు గంటలకు స్వామి కళ్ళు తెరిచారు. లింగప్రతిష్ఠాపన జరిగింది. స్వామి స్వయంగా శివలింగాన్ని అభిషేకించారు.

1888వ సంవత్సరం, ఫిబ్రవరి నెల, 10 వ తారీకు తొలిఘడియల్లో భవిష్యత్ కేరళ రూపు రేఖలని మార్చగల ఒక నిశ్శబ్ద మహావిస్ఫోటం ఆ విధంగా సంభవించింది.

బ్రాహ్మణుల చెరలోంచి ఈశ్వరుడు విడివడ్డాడు. ప్రజల ఆర్తినీ, వేదననూ వినేందుకు 'దైవం' నిమ్న కులాల చెంతకు నడిచివచ్చాడు.

ఏ గుడిలో తాము ప్రవేశించలేరో, ఏ దైవాన్ని దర్శించేందుకు తాము నిర్ణీత దూరాన్ని పాటిస్తూ వివక్షకు గురికావాలో, ఆ 'దైవం' తమ కళ్ళముందే వెలిసింది.

బ్రాహ్మణాధిపత్యానికీ, అహంకారానికీ చావు దెబ్బతగిలింది. ఈ ఘటన, అనంతరం నిమ్న కులాల ప్రజలు నిర్వహించే, కులభేదాలకు తావులేని ఇటువంటి మరెన్నో 'నారాయణ దేవాలయాల' ఉద్భవానికి దారితీసింది.

## ఈళవశివుడు

అరవిప్పురం ఆలయ ప్రతిష్టాపన వార్త దావానలంలా వ్యాపించింది.

ఆలయ ప్రవేశార్హత కూడాలేని ఈళవకులస్థుడు స్వయంగా ఆలయాన్ని ప్రతిష్టించడమా? - కింద వున్న దళిత కులస్థుల మంచి పైన వున్న బ్రాహ్మణ కులం వరకూ ఈ ఘటన ఒక కుదుపు కుదిపింది.

దళిత కులాలు నారాయణగురు ఉద్యమస్ఫూర్తిని అందిపుచ్చుకున్నాయి. ఛాందసులు మిన్నువిరిగి మీద పడినంతగా కల్లోల పడ్డారు. మేధావి వర్గాలు సైతం 'ఎవరీ నారాయణగురు' అని కనుబొమలు ఎగరేశారు. అయితే నారాయణగురుకి అప్పటికే ఏర్పడిన ఆధ్యాత్మిక ప్రతిష్ట కారణంగా గొంతెత్తి నిరసన తెలిపేందుకు ఎవరూ సాహసించ లేదు.

ఇది నారాయణగురు అద్వితీయ వ్యక్తిత్వానికి లభించిన విజయం.

అయినా ఒక బ్రాహ్మణుడు నిప్పులు కక్కుతూ ఆ ప్రదేశానికి వచ్చి "ఒక ఈళవ కులస్థుడికి ఆలయాన్ని ప్రతిష్ఠించే అధికారం ఎవడిచ్చాడు" అని ఆగ్రహంతో ఊగిపోతూ గద్దించాడు.

నారాయణగురు మందస్మిత వదనంతో "నిజమే, కానీ నేను ప్రతిష్ఠించింది ఈళవ శివుడిని. బ్రాహ్మణ శివుడిని కాదు" అని జవాబిచ్చారు.

ఆ జవాబులో ఎన్ని అర్థాలున్నాయో!

---

నారాయణగురు జీవిత విశేషాలు, కార్యాచరణ వివరాలు ఇంకా రాబోయే సంచికల్లో...

(ఇంకావుంది)

వంటివారే కాక, తమిళ ప్రయోజనాలకోసం పోరాడినా కేవలం టైగర్లతో విభేదించిన కారణంగానే తుల్ఫ్‌నేత అమృత లింగం, టెలో నేతలు సబారత్నం, ఉమా మహేశ్వరన్, ఇ.పి.ఆర్.యల్.యఫ్. నేత పద్మనాభ వంటివారు టైగర్ల బారిన పడి మరణించారు.

ఆగస్టు 8 నాటి 'ఈనాడు' వార్తా కథనంలో పేర్కొన్నట్టు - తమకూ సైన్యానికీ మధ్య జరిగే పోరాటంలో పుట్టపర్తి బాబా జోక్యం కలిగించుకోరాదని తీవ్రంగా హెచ్చరించడమే టైగర్ల చర్యల లక్ష్యమా లేక కొందరు అనుమానిస్తున్నట్టు పుట్టపర్తి బాబాను టైగర్లు లక్ష్యంగా ఎంచుకున్నారా అనేది స్పష్టంగా తెలీదు.

బాబాపై ఆరోపణల వివరాలను ప్రజల్లో పెట్టి పోలీసులు, నేతలు చేయలేక పోయారు. పైగా అసాధారణమైన రీతిలో అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ ప్రభుత్వ ఖజానాకి కోట్ల రూపాయలు చిల్లు పెట్టే విధంగా - పుట్టపర్తిబాబాను దర్శించేవారి కోసం రాయితీలను ఇవ్వచూపుతున్నారు. ఆయన కార్యకలాపాలపై ఎన్ని వివాదాలు రేగినా ఎటువంటి దర్యాప్తు జరిపేందుకు ఇష్టపడటం లేదు. అంతర్జాతీయంగా బాబాపై వెల్లువెత్తుతున్న లైంగిక అత్యాచారాల ఆరోపణల పట్ల ఉలుకుపలుకులేని వైఖరిని ప్రదర్శించి, బాబాను చట్టబద్ధమైన విచారణ నుంచి రక్షిస్తున్నారు. ఇటువంటి చర్యలవలన బాబాను చట్టాతీతుడుగా ప్రభుత్వం పరిగణిస్తున్నదనే భావం

పుట్టపర్తిబాబా అప్పుడప్పుడు తన ఉపన్యాసాల్లో అన్యాపదేశంగా విమర్శకులపై విరుచుకు పడడం వలన ఫలితం ఉండదు. ఆశ్రమ కమిటీ ఇటువంటి సందర్భాల్లో చిన్నపాటి వివరణలు ఇచ్చినా ప్రశ్నలు మిగిలే ఉంటున్నాయి.

తన మహత్యాలపైన, శక్తులపైన, కార్యకలాపాలపైన, పసిపిల్లలతో లైంగిక కార్యకలాపాలవార్తలపైన, ప్రపంచ వ్యాప్తంగా వెల్లువెత్తుతున్న ఆరోపణలను - పుట్టపర్తి బాబా ధైర్యంగా పరీక్షకు నిలబడి ఎదుర్కొని తన 'దివ్యత్వాన్ని' రుజువు చేసుకోవడం సముచితం.

---

తాజాగా లండన్ నుంచి వెలువడే ది టైమ్స్ పత్రిక ఆగస్టు 27న ప్రకటించిన "సూయిసైడ్, సెక్స్, ది గురు", "త్రీ డై ఆఫ్టర్ ఫుటింగ్ ఫెయిత్ ఇన్ గురు" అనే కథనాలు రేపుతున్న ప్రకంపనలను గురించి వచ్చే సంచికలో మాట్లాడుకుందాం.

(ఇంకా ఉంది)



## పుట్టబాబా ఉవాచ:12
### 75 సంవత్సరాలు

"మహాభారత యుద్ధ సమయంలో కృష్ణుని వయస్సు 75 సంవత్సరాలు, నాకూ వస్తున్నాయి 75 సంవత్సరాలు."

- సనాతన సారధి, మార్చి 2001, పే.81

# పులి కన్ను




చర్చించడమే సరైన విధానం అవుతుంది కానీ బాబాకు ముప్పు తలపెట్టాలని ప్రయత్నించడాన్ని ప్రజాతంత్ర వాదులెవరైనా తీవ్రంగా ఖండిస్తారు. భౌతిక దాడుల ద్వారా తాము భావించే అక్రమాలను అడ్డుకోవాలని, వివాదాలను పరిష్కరించుకోవాలని ప్రయత్నించడం - పూర్తి అపసవ్య, నేరపూరిత మానసిక ధోరణి. నేరానికి సమాధానం నేరం కాదు. సహనంగా ప్రజాతంత్రయుతంగా పోరాడే పద్ధతే జనామోదం పొందుతుంది.

బాబా అక్రమ పద్ధతులపైన నిలకడగా ప్రపంచవ్యాప్తంగా పోరాడుతున్న వారెవరూ ఇటువంటి 'హంతక' ధోరణులను ఆమోదించలేరు, ఖండించకుండా ఉండలేరు.

బాబాపైన దశాబ్దాల కాలంగా వస్తున్న ఏ ఆరోపణనీ, చివరికి ఆశ్రమంలో జరిగిన హత్యా కాండ సందర్భంలో కూడా నిష్పాక్షికంగా దర్యాప్తు చేయడంలో ప్రభుత్వాలు విఫలమైనాయి. చట్టాన్ని ఉల్లంఘించి నిర్లజ్జగా బాబా అక్రమాలపై మేలి ముసుగు కప్పుతున్నారనే అభిప్రాయాన్నే పాలక రాజకీయ నేతలు కలిగించారు. పుట్టబాబా నివసించే మందిరంలో హత్యలు జరిగినా చివరికి ఆయన బెడ్‌రూమ్‌లోనే నెత్తురు ఒలికినా - కనీసం పుట్టబాబాను ప్రశ్నించే సాహసం కూడా మన ప్రజల్లో ఏర్పడుతోంది. బాబా భక్తులైన రాజకీయ నాయకుల, అధికారుల సూత్రరహిత చర్యలు - మొత్తంగా ప్రజాతంత్ర వ్యవస్థ పట్ల, చట్టబద్ధ పాలనపట్ల చివరికి మనం ప్రకటించుకుంటున్న లౌకికవాదం పట్ల అవిశ్వాసం పెరిగేందుకే దోహదపడతాయి.

చట్టం ముందు అందరూ సమానులే - అన్న భావాన్ని ప్రభుత్వం ఆచరణలో చూపాలి.

పుట్టపర్తి బాబా తనపై వస్తున్న ఆరోపణలపైన మౌనం పాటించడం, చివరికి బెంగుళూరు యూనివర్సిటీ నియమించిన శాస్త్రవేత్తల మేధావుల కమిటీతో సహా ఎటువంటి విమర్శకులతోనూ, జర్నలిస్టుల తోనూ కనీసం మాట్లాడేందుకు సైతం నిరాకరించడం, ఎటువంటి పారదర్శకతకూ తావివ్వకపోవడంవంటి చేష్టలవలన - ఆరోపణలకే బలం చేకూరుతోంది. (కరంజియా సంగతి ఈ సీరియల్‌లో రాబోయే భాగంలో ప్రస్తావిస్తాను.)



## పాదనమస్కారాలు పనికిరావు!
### బాబా అబౌట్టర్న్!

పుట్టబాబా పాదపూజ చేయించు కునేందుకు ఎంత ఉత్సాహపడతాడో, చివరికి శతాధిక వృద్ధుడైన తన తాత, తన కాళ్ళు పట్టుకునే వైనంపైన 'కథలు' ఎంత రంజుగా వినిపిస్తాడో, తనలాగే మరెవరైనా పాదనమస్కారం స్వీకరించే సందర్భంలో ఎలా విరుచుకుపడతాడో గత సంచికలో ఇదే ధారవాహికలో పేర్కొనడం పాఠకులకు విదితమే.

అయితే పుట్టబాబా స్వంత పత్రిక సనాతన సారధి ఆగస్టు సంచిక (ఆగస్టు నెల చివర్లో వెలువడింది) చదివితే - బాబా ఇప్పుడు పాదపూజలపై సడన్‌గా తన వైఖరి మార్చుకున్న సంగతి తెలుస్తుంది.

సనాతన సారధిలో "ఇకపై పాద నమస్కారాలు చేయవద్దు" అనే శీర్షికలో పుట్టబాబా వ్యాఖ్యల్ని ఇలా ప్రకటించారు: "ఈనాడు మీకు మరొక విషయాన్ని చెప్పదల్చుకున్నాను. అది మీకు వినడానికి కష్టంగా ఉండవచ్చునుకాని, నాకు ఆనందమే. ఈనాటి నుండి నేనెవ్వరికీ పాదనమస్కారా లివ్వకూడదని నిర్ణయించుకున్నాను. ఎందుకంటే మీరు, నేను ఒక్కటే. "ఈశ్వరస్సర్వ భూతానాం," అందరియందున్న దైవం ఒక్కడే. ఈ సత్యాన్ని మీరు గుర్తించండి. ఎవరికి నమస్కారం చేయాలి? మీ తల్లిదండ్రులకు చేసుకోండి. ఎందుకంటే, వారికీ సత్యం తెలియదు, మీకు కూడా తెలియదు. కాని, ఈ సత్యం నాకు తెలుసు కాబట్టి, నేను పాటించాలి. మీలో ఉన్నది, వారిలో ఉన్నది, వీరిలో ఉన్నది ఒకే ఆత్మ, కాబట్టి, ఎవ్వరూ ఎవ్వరికీ నమస్కారం చేయనక్కర్లేదు."

ప్రధాని నుంచి సామాన్యుడి వరకూ ఎదురైన ప్రతీ భక్తుడి నుంచీ దశాబ్దాలుగా, ప్రతీరోజూ పదుల, వందల సంఖ్యలో పాద నమస్కారాలు స్వీకరించిన పుట్టబాబాకి లేటు వయసులో తన 75వ సంవత్సరంలో సడెన్‌గా 'ఎవ్వరూ ఎవ్వరికీ నమస్కారం చేయనక్కర్లేదు' అని అనిపించడం ఆశ్చర్యమే.

(మొన్నటికి మొన్న తన 75వ జన్మదినోత్సవ వేడుకల్లోనే ముఖ్య అతిథిగా హాజరైన కేంద్రమంత్రి మురళీమనోహర్ జోషీనుంచి అదేరోజు పుట్టబాబా ముచ్చటగా మూడుసార్లు పాదనమస్కారాలు అందుకున్నాడు!)

పుట్టబాబా కల్ట్‌లో పాదనమస్కారాలకి ఎనలేని ప్రాముఖ్యత వుంది. బాబా క్యాంప్‌కి ఇప్పటివరకు పోస్టు కార్డు సైజునుంచి నిలువెత్తు సైజు వరకు - బాబా పాదాల ఫోటోలను రూపొందించి, ప్రచారంలో పెట్టి పాదనమస్కారాల ట్రెండుని ప్రోత్సహించింది.

'అందరి యందున్న దైవం ఒక్కడే' అనే సత్యం 'నాకు తెలుసు కాబట్టి, నేను పాటించాలి' అని ఇప్పుడు ప్రవచిస్తున్న బాబాకి, ఈ సత్యం ఇప్పటివరకూ తెలియకే పాటించలేదా?

పుట్టబాబా నోట ఇటువంటి ప్రవచనాలు వినడమే ఒక ఆశ్చర్యమైతే, ఈ ప్రవచనాలను ఆయన పాటిస్తాడా లేదా చూడటం కాస్త ఆసక్తికరమైన సంగతే!●



మూడుసార్లు మొక్కిన జోషి



చంద్రబాబు చూస్తుండగా వాజ్‌పాయ్ పాద నమస్కారాలు

ఇటువంటి దృశ్యాలు ఇక కనిపించవా?

అడ్రసు :12-5-33/2, విజయపురి కాలనీ, తార్నాక, సికింద్రాబాద్-17. ☎ 7007053, సెల్ నెం.9848019076

ఉద్యమకారులను రెచ్చగొట్టాల్సిన అవసరం లేదు. సమస్యకు సారధ్యం వహించి వారనుకున్న ఉన్నతమైన సమాజాన్ని నిర్మించుకోవాలి. సమస్త మానవులు కలసి సహజీవనం చేసే పాలవెల్లిని వారు తయారు చేయాలి. మానవతా భావాలున్న వారందరు విభేదాలు లేని మానవ సమాజాన్ని నిర్మాణం చేయాలి. ఎప్పుడో ఏదో చెడు జరిగిందని దాని పరిణామం అనుభవిస్తున్నామనే వ్యధను విడిచి అంతకంటె బలమైన మానవ సమాజవ్యవస్థను రూపొందించాలి. ప్రగతి మార్గంలో మనం నడచి మన వారందరిని నడిపించాలి. మంచి పనికి నేతృత్వం వహించి సమసమాజాన్ని నిర్మించుకోవాలి.

ఇంతటితో మహర్షి మనువు - మనుస్మృతికి సంబంధించిన చర్చను నేను మనస్ఫూర్తిగా ముగిస్తున్నాను. ఇహ నేను ఏవిధమైన చర్చలు చేయదలచుకోలేదు. విజ్ఞులైన పాఠకులు సహృదయంతో, విశాల దృక్పథంతో ఈ చర్చలను నిష్పక్షపాతంగా గ్రహించి వాద - వివాదాలకు తావివ్వని విధంగా మానవ సమాజాన్ని నిర్మాణం చేసి సర్వమానవ సర్వతోముఖ వికాసానికి కృషి చేయగలరని ఆశిస్తున్నాను●

## మనుస్మృతిని ఏడునిలువుల గోతిలో పాతిపెట్టాలి

జూలై సంచికలో డా॥సంధ్యావందనం లక్ష్మీదేవిగారు, మనుస్మృతిని అపార్థం చేసుకొనవద్దని, అది చాలా మంచి గ్రంథమని వ్రాశారు. వాస్తవానికి "స్మృతులన్నీ" ఆటవిక, అనాగరిక కాలానికి చెందినవి. కావున వాటిలోని భావాలు, ఆలోచనలు ఆటవికంగాను, అనాగరికంగాను వుంటాయన్న జ్ఞానం చాలా మందిలో లేదు. మానవుడు అభివృద్ధి చెందే కొలది పాతను వదలి, కొత్తని సంతరించుకుంటున్నాడు. విజ్ఞానం పెంచుకుంటున్నాడు. ఒక ప్రక్క ఆధునిక శాస్త్రవిజ్ఞాన ఫలితాలను అనుభవిస్తూ - కొంతమంది పాతలోనే అంతే వుంది అంటూ తల్లిపాలు త్రాగి రొమ్ము గుద్దే విధంగా ప్రవర్తిస్తున్నారు. అంతా మా వేదాల్లోనే వుంది, అంతా మా పాత తాటాకు గ్రంథాల్లో వుంది అనేవాళ్ళు - వాళ్ళు అనుభవిస్తున్న విజ్ఞాన ఫలితాలను వదలి - వాళ్ళు గొప్పవిగా చెబుతున్న పాతగ్రంథాల ద్వారా ఒక్క గడ్డిపోచను కదిలించమనండి! స్మృతులన్నీ ఒక సోంబేరి వర్గాన్ని పూజించమని, "మీరు కష్టపడి మా పొట్ట నింపండి" అని పలికేవే! ఇవి మానవ ధర్మసూత్రాలు కాదు. పురోహిత వర్గరక్షణ కవచాలు.

మనుస్మృతిని ఒకసారి పరిశీలించి నట్లయితే అది ఎవరి రక్షణకు రచింపబడినదో అర్థం కాగలదు. మనుషులు వారు పుట్టిన కులాలను బట్టి పేర్లు నిర్ణయించాలట - బ్రాహ్మడికి పేరు శుభప్రదంగాను, క్షత్రియుడికి బలసూచకంగాను, వైశ్యునికి గుప్త సూచకంగాను, శూద్రునికి అసహ్యం కల్గించేదిగాను వుండాలట (2-32) సకల భూతంలలోకెల్ల ప్రాణులు శ్రేష్ఠమైనవి - ప్రాణులలోకెల్ల మనుషులు శ్రేష్ఠమైన వారు, మనుషులలోకెల్ల బ్రాహ్మలు శ్రేష్ఠమైనవారు (1-96). పంది వాసన చూచినదాన్ని, కోడి రెక్కల గాలిసోకినదాన్ని, కుక్క చూపు సోకినదాన్ని, శూద్రుడు తాకిన దాన్ని అపరిశుద్ధంగా భావించాలి (1-143) అడుక్కు తినేటప్పుడు గూడ,

బ్రాహ్మడు - "భవతి భిక్షాందేహి" అని,

క్షత్రియుడు - "భిక్షాంభవతిదేహి" అని,

వైశ్యుడు - "భిక్షాందేహి భవతి" అని,

శూద్రుడు మాత్రం "మాదాకవళం తల్లీ" అంటూ అడుక్కుతినాలని స్పష్టంగా వ్రాశాడు (1-49). బ్రాహ్మణులకు, క్షత్రియులకు, వైశ్యులకు సేవచేయుటమే శూద్రుని విధి అని (1-91) చెప్పాడు.

దానము గైకొనుట, యజ్ఞయాగాలు చేయించుట, బ్రాహ్మతిధి (1-88) అంటూ పీకల దాకా మెక్కేందుకు, పొట్టలు పగిలిందాకా తినేందుకు, శ్రాద్ధకర్మల పేరుతో ఒక్కొక్కని ఒక్కొక్కరకమైన మాంసాన్ని - మేకపోతు మాంసము ఒకరోజు, కోడి మాంసము ఒకరోజు, అడవిదున్న మాంసము ఒకరోజు, కోడెదూడ మాంసము ఒకరోజు, ఖడ్గమృగము మాంసము ఒకరోజు, తెగబలిసిన ఆవు మాంసము ఒకరోజు, శాస్త్రప్రకారము బ్రాహ్మడికి దానమొసగిన ఎడల, దానం చేసినవారి పితరులు పైలోకాల్లో శాశ్వతంగా ఆకలి దప్పులు లేకుండా వుంటారని 3-267 నుండి 272 వరకు సిగ్గు లేకుండా చెప్పాడు. పచ్చిమాంసం తినే వారు - బౌద్ధాన్ని నాశనం చేసిన తర్వాత పూర్తి శాఖాహారులయ్యారు. బ్రాహ్మడు తప్పుచేస్తే చిన్న శిక్ష విధిస్తూ - శూద్రుడు గనుక బ్రాహ్మడిని ఏ అంగంతో కొడతాడో - ఆ అంగాన్ని తొలగించమని శాసించాడు. చేయి ఎత్తితే చేతిని, కాలు ఎత్తితే కాలుని, బ్రాహ్మణునితో సమానంగా శూద్రుడు కూర్చుంటే అతనికి ఇనప నువ్వులతో పిర్రల మీద వాత పెట్టాలని, శూద్రుడు బ్రాహ్మడి మొఖాన ఉమ్మివేస్తే పెదవులు కోయాలని, ఉచ్చబోస్తే అంగాన్ని కోయమని, బ్రాహ్మడి ముందు అపాన వాయువు వదిలితే, ఆ శూద్రుని ముడ్డి కోయమని 8-279 నుండి 283 వరకు వ్రాసి పురోహితవర్గ ఆధిపత్యం కొరకు చాలా కష్టపడ్డాడు.

జ్ఞానం పెరుగుతుంది. జినోమ్ ప్రాజెక్ట్ ద్వారా మనిషి వేయి సంవత్సరాలకు పైగా జీవించే ప్రయత్నం చేస్తున్నాడు. ఖగోళశాస్త్రంలో, వైద్యరంగంలో, ఇంజనీరింగ్ విభాగంలో ఎన్నో అద్భుతాలు కనుగొంటున్నాము. అయినా కొంతమందికి ఇది అంతా మా వేదాల్లోనే వుంది. అనే చాదస్తం పోలేదు. మరి ఇంత చండాలంగా వున్న స్మృతులను మనం సమాధి చేయాలో - ఆదరించాలో పాఠకులే ఆలోచించండి●

**- నార్నె వెంకట సుబ్బయ్య, ఒంగోలు.**

# 'నట కోచింగ్' సంస్థల నటన..!

మనసు ఒక్కచోట నిలవదు.

పదే పదే గుర్తుకు వస్తాయ్... వెండి తెరమీది ప్రేమలు.

గిలిగింతలు పెడతాయ్.

తెరమీద ఆడేవీ, పాడేవీ, కళ్లకి విందు చేసేవీ కేవలం బొమ్మలే అని తెలుస్తూనే వున్నా - ఎందుకో వాటిని సజీవమైనవిగానే భావించాలనిపిస్తుంది.

ఆ పాత్రల్లో నటించిన స్టార్ల మీద అబ్సెషన్ ఇంతింతై పెరుగుతుంది. వారిలాగే వుండాలనిపిస్తుంది.

అలా వుండనీయని - తీరీ, తీరని ఆశల మధ్య కొట్టుకులాడే మధ్యతరగతి జీవిత వాస్తవం అంటే చీదరపుడుతుంది.

నోట్ల కట్టల మీద పరుచుకున్న తమ అభిమాన హీరో, హీరోయిన్ల జీవితంలా తమవి లేవే అన్న ఫీలింగ్ మనసుని తొలిచేస్తుంది. వారిని అనుకరించడం, ఆరాధించడం మొదలవుతుంది. మెల్లమెల్లగా ఆ రంగుల ప్రపంచంలోకి ఎంటర్ అవ్వాలన్న కోరిక పుడుతుంది.

సరిగ్గా ఈ పాయింట్ దగ్గరే - చాలామంది తమ ఆశలు తీరేవి కావన్న నిజం తెలుసుకొని - వెనక్కి తగ్గి కాంప్రమైజ్ అయిపోతారు.

కాని కొంతమందిని మాత్రం స్టార్‌నైపోవాలన్న కోరిక వదిలిపెట్టదు. రంగురంగుల కలలు కుదురుగా వుండనివ్వవు. వాటిని మూటగట్టుకుని - మొన్నటి దాకానైతే ఏ మద్రాసు రైలో, ఇప్పుడైతే ఏ హైద్రాబాద్ రైలో ఎక్కేసి నగరంలోకి చెంగున దూకేస్తారు. వీళ్లలో చాలామందికి అప్పటిదాకా తెరమీద బొమ్మలు చూడ్డం తప్పిస్తే నటనంటే తెలియదు. సినిమా ఎలా తయారవుతుందో - అంతా తెలిసినట్టే అనుకుంటారు కాని - ఏమీ తెలియదన్న సంగతి ఈ మాయా ప్రపంచంలోకి అడుగుపెట్టే దాకా అర్థంకాదు.

ఇదిగో... సరిగ్గా ఇలాంటి అమాయకుల కోసమే ట్రైనింగ్ పేరిట గాలం వేసి సిద్ధంగా వుంటాయ్ కొన్ని సంస్థలు.

ఫలానా... ఫలానా ఫిల్మ్ అండ్ టి.వి. ఇన్‌స్టిట్యూట్ అని భారీ పేరు రాసివున్న బోర్డులుతగిలించుకుంటాయ్.

ఒకటిన్నరో, రెండో గదులు కూడా లేని ఈ ఇన్‌స్టిట్యూట్‌లని కలల్లో తేలిపోతూ వచ్చిన అమాయకులు చూసి - ఇవేవో మహా సంస్థలు కాబోలని భ్రమపడతారు.

విచిత్రమేమంటే - సినిమాయో, టీవీయో అనగానే కేవలం నటులే అన్న అభిప్రాయమే చాలామందిలో వుంది. కాని సినిమా అనేది అనేక విభాగాల సమిష్టి, సమన్వయ కృషి ఫలితం అన్న అవగాహన తక్కువ. అందుకే చాలామంది సినిమాల్లో చేరదా'మని వచ్చేవాళ్ళే తప్ప సినిమా నిర్మాణంలోని ఏదో విభాగంలో టెక్నీషియన్‌గా పాలుపంచుకుందామని వచ్చేవాళ్లు ఒక్కరూ కనిపించరు. కారణం-నటనలో అయితే తెరమీద కనిపించి అమాంతం తారా పథంలోకి దూసుకుపోవచ్చని ఆశ. వీరి ఆశను క్యాష్‌చేసుకోవడానికి ఇప్పుడు తామర తంపరగా ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు పుట్టుకొస్తున్నాయ్. వీటిని 'స్టార్‌డమ్'కి షార్ట్‌కట్‌గా భావించి - వేలకువేలు పోసి చేరే అమాయకులకి లెక్కలేదు.

అసలు ఫిల్మ్ అండ్ టీవీ ఇన్‌స్టిట్యూట్ అని పేరు తగిలించుకున్న ఈ సంస్థలు అలా పిలుచుకోవడం సమంజసమేనా? వీటిలో ఇస్తున్న శిక్షణ ఏమిటి? అదెంతవరకు ఉపయోగపడుతుంది? అసలు ఈ సోకాల్డ్ ఇన్‌స్టిట్యూట్‌లు ఇచ్చే శిక్షణకు ఓ సిలబస్ అంటూ వుందా?.. ఏ ప్రమాణాలకు లోబడి శిక్షణ ఇస్తున్నాయ్?... ఇవన్నీ జవాబు దొరకని ప్రశ్నలే. కాని - ఈ సంస్థల్లో చేరగోరే వాళ్ళు మాత్రం - తప్పనిసరిగా జవాబు రాబట్టుకోవల్సిన ప్రశ్నలని గుర్తించాలి.

### డాబుసరి అంతా పేరులోనే

ఇప్పుడు సినిమా ప్రొడక్షన్‌కి, టీవీ చానెళ్ల డైలీ సీరియళ్ల నిర్మాణానికి హైదరాబాద్ కేంద్రంగా మారింది. టాలెంట్ వున్న నటులు, టెక్నీషియన్లకు అవకాశాలు పెరిగాయి. వాటిని వెతుక్కుంటూ నగరానికి వచ్చేవాళ్ల కోసం ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లూ పెరిగాయి. విచిత్రమేమిటంటే - మంచి సెంటర్లు చూసి - రెండు మూడు గదుల్లో ట్రైనింగ్ దుకాణాలు తెరిచేవారు కూడా పేరు మాత్రం "ఫిల్మ్ అండ్ టీవీ ఇన్‌స్టిట్యూట్" అని తగిలించుకుంటున్నాయి. ఇది మరీ ఘోరం. సినిమా నిర్మాణానికి సంబంధించి, యాక్టింగ్, డైరెక్షన్, ఫొటోగ్రఫీ, ఎడిటింగ్, సౌండ్ ఇంజనీరింగ్, ప్రొడక్షన్ వంటి అంశాల్లో సమగ్రమైన శిక్షణ ఇచ్చే అవకాశాలున్న సంస్థలకి మాత్రమే ఇలాంటి పేరు అర్హమైనది. ఈ విభాగాల్లో అవగాహన కల్పించే నిష్ణాతులైన సిబ్బంది వుండాలి. ప్రాక్టికల్స్‌కి తగిన హంగులూ, సౌకర్యాలు వుండాలి.

ఇలా సినిమా ప్రొడక్షన్‌కి సంబంధించిన అన్ని విభాగాల్లో శిక్షణకి అవకాశాలున్న వాటినే ఫిల్మ్ అండ్ టీవీ ఇన్‌స్టిట్యూట్‌లని పిలవాలి. కాని ఇవాళ ఇరుకు గదుల్లో పుట్టుకొస్తున్న ఎన్ని ఇన్‌స్టిట్యూట్‌లలో ఈ శిక్షణావకాశాలున్నాయి? దాదాపు మూడు దశాబ్దాలుగా కళాకారుడిగా, దర్శకుడిగా సినీ మాధ్యమంతో ప్రత్యక్ష సంబంధాలున్న దేవదాస్ కనకాల లాంటి వ్యక్తే అన్ని విభాగాలూ, హంగులతో కూడిన ఓ సమగ్రమైన ఇన్‌స్టిట్యూట్‌ని ఏర్పాటు చేయాలని కొన్ని ఏళ్లనించి తపిస్తుంటే - రాత్రికి రాత్రి 'ఫిల్మ్ అండ్ టీవీ ఇన్‌స్టిట్యూట్'లు పుట్టుకురావడం విచిత్రం.

సినిమా ఫీల్డ్ అంటే సహజంగానే క్రేజ్ వుంటుంది కాబట్టి ఇలాంటి ఇన్‌స్టిట్యూట్‌లకి సినిమా ట్రైనింగ్ బిజినెస్' బంగారు గనిలా కనిపించడంలో వింత లేదు.

ఏ హంగులూ లేని ఇలాంటి ఇన్‌స్టిట్యూట్ లలో చేరితే 'నేర్చు'కునే దానికంటే 'చేజార్చు'కునేదే ఎక్కువన్న సంగతిని - వీటిలో చేరేవాళ్ళకి తెలియడంలేదు. అసలు సినిమా ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లనేవి ఎలా వుండాలో తెలిస్తే - వీటిలో చేరేముందు వెనకాముందూ చూసుకునే అవకాశం వుంటుంది.

### సినీ శిక్షణా సర్వస్వం- పూనా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్

మనదేశంలో పూర్తిస్థాయి ఫిల్మ్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు రెండేరెండు వున్నాయి.

అవి ఒకటి పూనాలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా. రెండవది ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ తమిళనాడు.

ఈ రెండూ ఎందరో గొప్ప కళాకారుల్ని తయారు చేశాయి. పూనా ఇన్‌స్టిట్యూట్ కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తోంది. కేవలం నటనలోనే కాక సినిమా నిర్మాణానికి సంబంధించి అన్ని విభాగాలలలో అంతర్జాతీయస్థాయి టెక్నీషియన్లను తయారు చేయాలనే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం ఈ ఇన్‌స్టిట్యూట్‌ని నెలకొల్పింది. పూనాలోని లాకాలేజి రోడ్డులో శాంతారామ్‌కు చెందిన ప్రభాత్ స్టూడియోని కొనుగోలు చేసి - దాన్నే ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌గా మార్చారు. ఇందులో యాక్టింగ్ దర్శకత్వం, ఎడిటింగ్, సౌండ్ ఇంజనీరింగ్, ఫొటోగ్రఫీ, ప్రొడక్షన్... ఇలా అన్ని విభాగాలున్నాయి. ఆయా రంగాల్లో నిష్ణాతులైన ప్రొఫెసర్లు వున్నారు. అరుదైన, అద్భుతమైన గ్రంథాలున్న ఓ లైబ్రరీ, అత్యాధునిక పరికరాలు, అన్ని హంగులతో వున్న థియేటర్లున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే సినిమాకి సంబంధించి ఇది ఓ విజ్ఞాన సర్వస్వమని అనవచ్చు.

యాక్టింగ్ విభాగం ప్రొఫెసర్ రోషన్ తనేజా శిక్షణలో ఎందరో గొప్ప కళాకారులు తయారయ్యారు.

మార్లిన్ బ్రాండో నించి మార్లిన్ మన్రోదాకా ఎందరో ఎందరో హాలీవుడ్ నటులు ఓనమాలు దిద్దుకున్న లీస్ ఆస్ బర్గ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్టింగ్‌లో శిక్షణ పొందిన తనేజా - మనదేశంలో అందరికీ తెలుసు. పూనా ఇన్‌స్టిట్యూట్‌లోని బోధనా సిబ్బంది ఎంత ఉన్నతస్థాయికి చెందినవారో చెప్పేందుకు ఇదో ఉదాహరణ మాత్రమే.

ఎడిటింగ్‌లో కొడవటిగంటి రామచందర్ రావు, సౌండ్ ఇంజనీరింగ్ విభాగంలో వి.రెడ్డి, ఫొటోగ్రఫీలో గోపాల్ వంటి ప్రసిద్ధులైన తెలుగువాళ్ళు వున్నారు. తాళ్ళూరి రామేశ్వరి, జరీనావాహెబ్, దేవదాస్‌కనకాల, నవీన్ నిశ్చల్, శత్రుఘ్నసిన్హ, తనూజ, రాకేష్ రోషన్, సుభాష్ ఘాయ్... ఇలా ఈ పూనా ఇన్‌స్టిట్యూట్ నించి వచ్చిన మహా కళాకారులకి లెక్కలేదు. 1980 దశకం నించి టెలివిజన్ ఓ శక్తివంతమైన మాధ్యమంగా విస్తరించడంతో ఇటు సినిమా, అటు టెలివిజన్ రంగాలకు సంబంధించిన సమగ్రమైన ఇన్‌స్టిట్యూట్‌గా గౌరవం పొందింది.

దక్షిణాదిన కూడా పూనా ఇన్‌స్టిట్యూట్ లాంటిదే ఏర్పాటు చేయాలన్న ఆలోచన పరిశ్రమ వారికి వచ్చింది. అయితే సినిమా ప్రొడక్షన్‌కి సంబంధించి అన్ని విభాగాల్లో కాకుండా కేవలం యాక్టింగ్ విభాగాన్ని మాత్రమే ఏర్పాటు చేయాలనుకున్నారు. ఫలితంగా 1973లో మద్రాసులో సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యాక్టింగ్' ఏర్పాటైంది. దీనికి అమెరికాలో శిక్షణపొందిన ప్రతిభాశాలి రాజా రామ్‌దాస్ తొలి ప్రిన్సిపాల్.

మెగాస్టార్ చిరంజీవి, తమిళసూపర్‌స్టార్ రజనీకాంత్, నారాయణరావు, కామెడీకింగ్ రాజేంద్రప్రసాద్, సుధాకర్, నాజర్, భానుచందర్‌లాంటి హేమాహేమిలంతా ఈ ఇన్‌స్టిట్యూట్‌నించి వచ్చినవారే. అయితే అప్పటికే తమిళనాడు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే అడయార్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహణ సవ్యంగా లేకపోవడంతో ఇక్కడి స్టాఫ్‌ని అక్కడికి తరలించారు.

లక్ష్మీదేవికనకాల తొలి సారధ్యంలో ఏర్పాటైన అడయార్ ఇన్‌స్టిట్యూట్‌నించి కూడా రఘువరన్, అరుణ్‌పాండ్యన్ శుభలేఖసుధాకర్, కుట్టిపద్మినిలాంటి ఆర్టిస్టులెందరో వచ్చారు.

పూనా, మద్రాసు ఇన్‌స్టిట్యూట్‌ల ప్రస్తావన ఎందుకు తేవాల్సివచ్చిందంటే - ఇటు విస్తృతమైన విషయ పరిజ్ఞానం, ఎన్నో ఏళ్ల ప్రాక్టికల్ అనుభవం వున్న బోధనా సిబ్బంది, ప్రొడక్షన్‌కి కావలసిన అన్ని హంగులుంటేనే అవి గొప్ప ఇన్‌స్టిట్యూట్‌లుగా నిలుస్తాయి అని చెప్పడానికే మెరికల్లాంటి ఆర్టిస్టులు తయారవుతారు.

మన రాష్ట్రంలో కూడా అన్ని హంగులతో ఒక ఉన్నత స్థాయి ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌ని ఏర్పాటు చేయాలన్న ప్రయత్నాలు చురుగ్గా మొదలు పెట్టిన ఘనత దేవదాస్ కనకాలకే దక్కుతుంది. నటనలో, దర్శకత్వంలో, నిర్మాణంలో, బోధనలో అపారమైన అనుభవమున్న 'పూనా స్టూడెంట్' కనకాల ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహిస్తున్నారు. పూనా ఇన్‌స్టిట్యూట్‌లో వున్నట్టుగానే అన్ని విభాగాల్లో నిర్దిష్టమైన సిలబస్‌ని తయారు చేశారు.



నటనలో శిక్షణ ఇవ్వడానికి పూనా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో మాదిరిగా ఉన్నత ప్రమాణాలుగాని, టాలెంట్‌కు పదునుపెట్టగల సిలబస్‌గాని ఎన్ని ఇన్‌స్టిట్యూట్‌లకు ఉన్నాయి? రెండు,మూడు నెలల కోర్సుల్లో నేర్చుకునేదేముంటుంది? నేర్పేదేముంటుంది? ఆర్టిస్టులను తయారుచేసే ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లకే శిక్షణపట్ల అవగాహన లేకపోతే ఎట్లా?

**- దేవదాస్ కనకాల**

ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించి కనకాల చేసిన ప్రతిపాదనలను - ఆయన రూపొందించిన సిలబస్‌ని పరిశీలించేందుకు 1991లో రాష్ట్రప్రభుత్వం ఒక కమిటీ ఏర్పాటు చేసింది. 92లో ఈ కమిటీ ఇచ్చిన నివేదిక ఇప్పటికీ సాంకేతిక విద్యావిభాగంలోనే - అమలుకి నోచుకోకుండా - మూలుగుతోంది.

### అదనపు ఖర్చు లేకుండా....

బోగస్ ఇన్‌స్టిట్యూట్‌ల ఆట కట్టించాలంటే ప్రభుత్వ ఆధ్వర్యంలో - పూనా, మద్రాస్ ఇన్‌స్టిట్యూట్‌ల మాదిరి - ఓ సమగ్రమైన సంస్థను ఏర్పాటు చేయాలని, దీనికి ప్రభుత్వం పెద్దగా ఖర్చు చేయాల్సిన అవసరం కూడా లేదంటారు. ఉదాహరణకి ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌కు చెందిన భవన సముదాయాన్ని ఇన్‌స్టిట్యూట్ కోసం ఉపయోగించుకోవచ్చని, ఎఫ్‌డిసి దగ్గర వున్న అధునాతన కెమెరాలను, ఎడిటింగ్ సదుపాయాలను ట్రైనింగ్‌కి వాడుకోవచ్చని, అలాగే ప్రాసెసింగ్, సౌండ్ ఇంజనీరింగ్‌కు సంబంధించిన సౌకర్యాలని తమ స్టూడియోలో అందించేందుకు రామానాయుడు సిద్ధంగా వున్నారని కనకాల చెబుతున్నారు. ఇక దర్శకత్వం, యాక్టింగ్ కోర్సులలో బోధనకి తెలుగు యూనివర్సిటీ థియేటర్ ఆర్ట్స్ బోధనా సిబ్బంది వుండనే వున్నారు. టెలివిజన్ ఎక్విప్‌మెంట్‌ని ప్రభుత్వమే సమకూరిస్తే పన్నుల భారం వుండదు.

ఇలా అన్ని హంగులు అదనపు ఖర్చు లేకుండా సమకూర్చుకొని - ఇన్‌స్టిట్యూట్‌ని ప్రారంభించవచ్చన్న సూచనలని ప్రభుత్వం ఇప్పటికైనా పరిశీలిస్తే - సినిమా, టీవీరంగానికి ఎందరో మంచి ఆర్టిస్టులు, టెక్నీషియన్లు లభిస్తారు. ఉన్నత ప్రమాణాలతో ఈ రెండు రంగాలూ మన హైదరాబాద్‌లో విస్తరిస్తాయి. లేకుంటే ట్రైనింగ్ అంటే అర్థం కూడా తెలియని బోగస్ ఇన్‌స్టిట్యూట్‌లు పూటకొకటి పుట్టుకొస్తూనే వుంటాయి ●




నెదర్లాండ్స్‌లో 2,091 మీటర్ల ఎత్తున్న ఈ ఇసుక కోట నిర్మాణానికి కోటి ఆరవై లక్షల కిలోల ఇసుక పట్టింది. ఇసుక శిల్పాల్లో ప్రపంచంలోనే ఎత్తైన శిల్పంగా ఇది గిన్నీస్ రికార్డుల్లోకి ఎక్కింది.








అమెరికా, కెనడా లాంటి దేశాల్లో ఇటువంటి ఇసుక శిల్పాలు సర్వసాధారణం




# ఇసుకతో శిల్పాలు చేసినారూ...

...మనవాళ్లు బీచికే అందాలు తెచ్చినారూ... అని పాడాలనిపిస్తుంది పూరీ సముద్రతీరాన్ని చూస్తే!

కరకురాళ్లను కమనీయ శిల్పాలుగా తీర్చిదిద్దడంలో భారతీయులకి వున్నంత ఘన చరిత్ర మరెవరికీ లేదు. ఆ చరిత్రకి ఆనవాళ్లుగా దేశమంతా ఇప్పటికీ ఎంతో శిల్పసంపద మన కళ్లముందు ఇంకా కనిపిస్తూనే వుంది. కానీ ఇసుకశిల్పాలు మనకి చాలా కొత్త. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా లాంటి అనేక దేశాల్లో దీనికి చాలా పాపులారిటీ వుంది. దీన్ని అక్కడ 'శాండ్ ఆర్ట్' అని పిలుస్తారు.

ఇప్పుడిప్పుడు మన దేశంలో కూడా ఈ ఇసుకశిల్పాలు కనిపిస్తున్నాయి. ఒరిస్సాలోని పూరీ సముద్రతీరంలో తరచుగా దర్శనమిస్తున్న ఈ శిల్పాలు ఆ ప్రాంతానికి మరో అదనపు ఆకర్షణగా మారాయి. మన్‌మోహన్ మహాపాత్ర అనే శిల్పి 1977 నుంచే ఈ ఇసుకశిల్పాల సృష్టిలో నిమగ్నమైవున్నాడు. ఈ ఆర్ట్‌లో ఆసక్తి వున్న అనేకమంది యువశిల్పులకి శిక్షణ కూడా ఇచ్చాడు. కెనడా లాంటి దేశాల్లో జరిగిన శాండ్ ఆర్ట్ పోటీలకు వెళ్లి అవార్డులనూ గెల్చుకున్నాడు. కెనడా, నెదర్లాండ్స్, అమెరికా, బ్రిటన్‌లు ప్రతిఏటా ఈ శాండ్‌ఆర్ట్‌లో పోటీలను నిర్వహించి ప్రోత్సహిస్తున్నాయని, మనదేశంలో ఇటువంటి పోటీలు ప్రోత్సాహకాలు లేవనేది మహాపాత్ర బాధ. అయితే ఒరిస్సా టూరిజం శాఖ ప్రతిఏటా ఫిబ్రవరిలో ఒక వారం రోజులపాటు నిర్వహించే బీచ్ ఫెస్టివల్ శిల్పులకి ఒక మంచి అవకాశాన్ని కల్పిస్తూవుంటుంది. ఇటువంటి సందర్భాలను ఉపయోగించుకుని, ఈ కళకు ఇంకా ప్రచారం తీసుకురావటానికి మహాపాత్ర కృషి చేస్తున్నాడు. ఇప్పుడు ఒరిస్సా వెళ్లే పర్యాటకులు తప్పక చూడవలసిన వాటిలో పూరీ జగన్నాధుడు, కోణార్క్ సూర్యదేవాలయం మాత్రమే కాదు, ఈ ఇసుకశిల్పాలూ వున్నాయి. అయితే బలీయమైన ఒక ఒక అల వొడ్డును తాకే వరకే వీటి బతుకు.. కొద్దిపాటి కాలవ్యవధిలో కరిగిపోయే ఈ శిల్పసౌందర్యం, కళాభిమానుల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోతుంది●







తెలుగు జర్నలిజం చరిత్రలో ఒక వినూత్నాధ్యాయం - తెలుగు పాఠకుల ఉత్తమాభిరుచికి నిజమైన నిదర్శనం- విజయవిహారం

## చదరంగ విశ్వంలో తెలుగు తేజాలు



# హంపి గెలుపుకెరటాలు హరికృష్ణ



ప్రపంచ క్రీడారంగంలో రాష్ట్ర చదరంగ క్రీడాకారులు ఉత్తేజంగా ముందుకెళుతున్నారు. ఎన్నో ఏళ్ళ కృషి, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో అంతర్జాతీయంగా భారత కీర్తి పతాకం ఎగరేస్తున్న తెలుగు బిడ్డలకు హేట్సాఫ్!

ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ భారత దేశానికి చెందిన విశ్వనాథన్ ఆనంద్ తన 18వ ఏట ప్రపంచ జూనియర్ ఛాంపియన్ షిప్‌ను సాధించి నెలకొల్పిన రికార్డును కోనేరు హంపి 14 ఏళ్ళకే సాధించి కొత్త రికార్డు నెలకొల్పింది. విశ్వనాథన్ ఆనంద్ జూనియర్ స్థాయిలో విశ్వవిజేత అయిన 1987లోనే కృష్ణాజిల్లాలో జన్మించిన హంపి ప్రస్తుతం గుంటూరులోని చలపతి రెసిడెన్షియల్ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతోంది.

భారత్‌లో 2వ మహిళా గ్రాండ్ మాస్టర్ అయిన హంపి 1997లో అండర్-10, 1998లో అండర్-12, 2000లో అండర్-14 ప్రపంచ ఛాంపియన్ షిప్‌లను సాధించటం విశేషం.

గత ఏడాది ఆసియా ఖండపు యువ ఇంటర్నేషనల్ మాస్టర్‌గా సంచలనం సృష్టించింది. 13 ఏళ్ళ ప్రాయంలోనే 3 అంతర్జాతీయ టైటిళ్ళు గెలిచింది.

హంపి ప్రతిభను గమనించిన తండ్రి కోనేరు అశోక్ నిక్షేపంలాంటి బ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసి కూతురుని అనుక్షణం ప్రోత్సహిస్తూ వచ్చాడు. ఆయనే హంపికి కోచ్. తల్లి లత ప్రోత్సాహం ఎంతో వుంది. ఈ ఏడాది ప్రపంచ జూనియర్ ఛాంపియన్ షిప్ సాధించిన హంపి ప్రస్తుతం 2,398 ప్రపంచ రేటింగ్ కలిగి వుంది.

మరో మూడేళ్ళలో మహిళా విభాగంలో విశ్వ విజేతగా నిలవాలని హంపి ఉవ్విళ్ళూరుతోంది.

బెస్ట్ ఆఫ్ లక్ టు హంపి.






10 ఏళ్ళ లోపే విశ్వవిజేతలైన నాటి మధుర క్షణాలు

అతి పిన్న వయస్సులోనే గ్రాండ్ మాస్టర్ అయిన ఆనంద్ రికార్డును రాష్ట్రానికి చెందిన పెంట్యాల హరికృష్ణ అధిగమించాడు. గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు చెందిన హరికృష్ణ, కృష్ణాజిల్లా గుడివాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో తొలి ఛాంపియన్ షిప్‌ను సాధించి విజయాలకు తన నాలుగున్నరేళ్ళ ప్రాయంలో శ్రీకారం చుట్టాడు. తాత రంగారావు తొలి గురువు. విజయాల వెనుక తల్లి పద్మావతి తండ్రి నాగేశ్వరరావుల ప్రోత్సాహం ఎంతో వుంది.

1996లో అండర్ - 10, విశ్వవిజేతగా, 1998లో అండర్ - 12 బాలల చెస్ ఒలింపియాడ్ ఛాంపియన్ షిప్ చేజిక్కించు కున్నాడు. తొలి జి.ఎం. నార్మ్ గత ఏడాది దక్కగా, ఈ ఏడాది ఆసియా వ్యక్తిగత పోటీల్లో పాల్గొని ప్రపంచ చెస్ పోటీలకు క్వాలిఫై అయ్యి చివరి గ్రాండ్ మాస్టర్ హోదాను పొందాడు. ప్రస్తుతం 2522 ప్రపంచ రేటింగ్‌లో ఉన్న హరికృష్ణ లండన్‌లో జరిగిన కామన్‌వెల్త్ చెస్ టైటిల్ చేజిక్కించుకొని విజయగర్వంతో వచ్చాడు. ప్రపంచ మేటి చదరంగ ఆటగాడు గ్యారీ కాస్పరోవ్‌కు ఒక నాడు శిక్షణ ఇచ్చిన ఎవ్‌గెనీ వ్లాదిమిరోవ్ వద్ద హరికృష్ణ తర్ఫీదు పొంది వరుస ఛాంపియన్ షిప్‌లు కైవసం చేసుకుంటున్నాడు. నవంబర్ 24 నుంచి డిసెంబర్ 11 వరకు మాస్కోలో జరగే వరల్డ్ చెస్ ఛాంపియన్ షిప్ ప్రిలిమినరీ రౌండ్ పోటీలో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ విశ్వనాథన్ ఆనంద్‌తో పాటు మన హరికృష్ణ కూడా బరిలోకి దిగుతున్నాడు. ప్రస్తుతం ప్రపంచ ఛాంపియన్ షిప్‌పై కన్నేసిన హరికృష్ణ ఆ దిశగా సక్సెస్ సాధిస్తాడని ఆశిద్దాం●

## పన్నెండేళ్ళకే కవితా సంకలనాన్ని వెలువరించిన



# అపూర్వ అయ్యంగార్

ఈ అమ్మాయి పేరు అపూర్వ అయ్యంగార్.

వయసు పద్నాలుగేళ్లు. భారతీయ విద్యాభవన్ స్కూల్లో తొమ్మిదవ స్టాండర్డు చదువుతోంది. ఇవన్నీ మామూలు వివరాలు. మామూలు కాని మరో వివరముంది. ఈ అమ్మాయి పన్నెండేళ్లకే ఇంగ్లీషులో ఒక కవితా సంకలనాన్ని వెలువరించి తలపండిన కవులచే ఔరా అనిపించుకుంది. సాహితీ ప్రపంచంలో ఈ బాల మేధావిపేరు అప్పుడే నాలుగు దిక్కులా పాకిపోయింది. పేరు మోసిన మేధావుల రచనలనే ప్రచురించే భారతీయ విద్యాభవన్ పబ్లికేషన్స్ విభాగం అపూర్వ సంకలనాన్ని అచ్చులోకి తెచ్చింది. 'శ్రీ సత్యపూర్వ పొయెట్రీ - ఎ ఫస్ట్ ఆఫరింగ్' పేరిట వెలువడిన ఈ సంకలనంలో వంద కవితలున్నాయి. త్వరలో మరో రెండు సంకలనాలు రాబోతున్నాయి. ఒక్క కవిత్వమే కాదు. కథలు, నాటికలు రాయడంలోనూ అపూర్వ దిట్ట. కన్నడ మాతృభాష అయినా ఇంగ్లీషు, హిందీ భాషల్లోనే ఈ అమ్మాయి రచనా ప్రక్రియని చేపట్టింది. తండ్రి ఉద్యోగ రీత్యా చెన్నై, గోవా, హైద్రాబాదులో అపూర్వ పెరిగింది. ఏడేళ్ల వయసులోనే తన అనుభూతుల్ని కవిత్వీకరించడం మొదలుపెట్టిన అపూర్వ ఇప్పటికి 450 ఇంగ్లీషు కవితలను, 150కి పైగా హిందీ కవితలను రాసి పెద్ద పెద్ద సాహితీవేత్తలతోనే భేష్ అనిపించుకుంది. అతిచిన్న వయసులో అపూర్వలోని కవితాభినివేశాన్ని పసిగట్టిన తల్లి అనుక్షణం కూతుర్ని వెన్ను తట్టి ప్రోత్సహించింది. అనేక అంతర్జాతీయ స్థాయి ఒలింపియాడ్స్‌లో పాల్గొంది. ఇక వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్‌లు, కవితాపఠనం వంటి పోటీలకూ, అందుకున్న అవార్డులకూ లెక్కలేదు.

ఆలిండియా రేడియోలో నెలలో రెండుసార్లు తన కవితల్ని వినిపించే అవకాశం పొందిన అతి కొద్దిమందిలో అపూర్వ ఒకరు. ఆమె కవితలు హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, తమిళన్, నయీబాల్, దక్షిణ్ సమాచార్ వంటి ప్రసిద్ధ పత్రికల్లో అచ్చయ్యాయి. త్వరలో తన కవితలకి దృశ్యరూపం ఇచ్చే ప్రయత్నంలో వుంది. తన తొలి కవితా సంకలనం అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తంలో కొంత భాగాన్ని గుజరాత్ భూకంప బాధితుల కోసం విరాళంగా ఇస్తానని చెబుతోంది.

"క్లుప్తతలోనే అందం వుంది. తక్కువ పదాల్లో చెపితేనే కవిత అర్థవంతంగానూ మనసును హత్తుకునేదిగానూ వుంటుంది. ఒక్కో కవితను ఎన్నిసార్లు దిద్దుకుంటానో తెలియదు. ఒక్కొక్కసారి మొత్తం తిరగ రాసుకుంటాను" అంటున్న ఈ బాలకవయిత్రి స్మితాదాస్ స్ఫూర్తితో భవిష్యత్తులో ఐఏఎస్ కావాలని కల కంటోంది. విష్ యూ ఆల్ ద సక్సెస్ అపూర్వా!!●

## కాలిరాతతో టెన్త్‌లో టాప్ ర్యాంకర్

# సబిత



విల్‌పవర్, ఆత్మవిశ్వాసం, పట్టుదల, కిల్లర్ ఇన్‌స్టింక్ట్... ఇలాంటి మాటల్ని చాలా క్యాజువల్‌గా అనేస్తూ ఉంటాం... ఏమిటో? ఈ మాటల్లో ఒక్కటీ బుర్రకెక్కడం లేదని చెప్పే క్వశ్చన్ మార్క్ ఫేసులకి - 17 ఏళ్ల సబితే సమాధానం. ఆమెని చూస్తే ఈ మాటలకి అసలైన అర్థం ఏమిటో ఇట్టే తెలుస్తుంది. పుట్టుకతోనే సబితకి చేతుల్లేవు. అయినా కుంగిపోలేదు. కాళ్ళతోనే రాతను ప్రాక్టీస్ చేసింది. ఆ కాలిరాతతోనే పదో తరగతిలో టాప్ ర్యాంక్ తెచ్చుకుందంటే ఊహించండి... ఆమె పట్టుదల ఏమిటో! పై చదువులకోసం సాయం చేయమని బెంగుళూరులో ఎస్.ఎమ్. కృష్ణ ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా - విన్న నాధుడే లేడు. ఇంతకూ అంగవైకల్యం ఎవరికి? అసాధ్యం అనే మాటని చెరిపేసిన సబితదా? లేక ఆమె విన్నపాలు చెవికెక్కని ప్రభుత్వానిదా?●

## ఘరానా మోసగాణ్ణి చట్టానికి పట్టించిన డేరింగ్ లేడీ

# సొనాలి మాల్‌గుంకర్



'మనకెందుకులే' అని పక్కకు తప్పుకుని పోయే తత్వం కాదు 20 ఏళ్ల సోనాలీది. అలా అనుకుని వుంటే - ఓ ఘరానా వైట్‌కాలర్ మోసగాడు చట్టానికి చిక్కకుండా ఇప్పటికీ దర్జా వెలగబెట్టేవాడే. అతగాడు చిన్నా, చితకా మోసగాడు కాదు. 'మోస్ట్ వాన్టెడ్'గా ప్రభుత్వం పట్టుకోచూస్తున్న మాయగాడు.

తాను రిస్కు తీసుకుంటున్నానని తెలుసు సోనాలికి. తనకి ప్రాణభయం కూడా వుంటుందని తెలుసు. అయినా భయపడలేదు. భవిష్యత్తులో ప్రమాదంలో ఇరుక్కుంటానని బెదిరిపోలేదు. తను పనిచేసే ఆఫీసులోనే - తన బాస్ స్థానంలో తిష్ఠవేసిన ఆ నేరస్తుణ్ణి పట్టి ఇచ్చింది. సాహసిగా అనేక అవార్డులు అందుకుంది. అచ్చంగా సినిమా ఫక్కీలో జరిగిన ఆ సంఘటనలోకి వెళితే...

సోనాలిది మధ్యతరగతి కుటుంబం. ముంబయి శివారు ప్రాంతంలోని ఓ మామూలు ఇంట్లో వుంటున్నారు.

డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న సోనాలి సాయంత్రం ఖాళీగా కూర్చోవడం ఇష్టంలేక - అంధేరీలో వున్న గ్లోబల్ వెల్త్ నెట్ అనే సంస్థలో పార్ట్‌టైం రిసెప్షనిస్ట్‌గా చేరింది. కొద్ది రోజులకి రాజీవ్ అగర్వాల్ అనే వ్యక్తిఅదే ఆఫీసులో ఫైనాన్షియల్ కన్సల్టెంట్‌గా చేరాడు. రాజీవ్‌ది పెద్ద హోదా. రిసెప్షనిస్టుగా అతడి కాల్స్ అటెండ్ చేయడం తప్పిస్తే సోనాలికి రాజీవ్‌తో పెద్దగా సాన్నిహిత్యం వుండేది కాదు. అందుకే అతడి గురించిన వివరాలేమీ తెలియవు. రాజీవ్ కూడా రిజర్వ్‌డ్‌గా వుండేవాడు. అయితే బయటి కాల్స్ చేసినప్పుడల్లా ఆ నంబర్ తనకి దొరక్కుండా జాగ్రత్త పడడం సోనాలి గమనించింది. కానీ దాన్ని సీరియస్‌గా పట్టించుకోలేదు. కొద్ది రోజులు గడిచాక...

* * *

17, జూన్ 2001.

ఆఫీసు నించి వచ్చిన సోనాలి ఫ్రెషప్ అయ్యాక - టీవీలో ఛానెల్ల వేటలో పడింది.

హఠాత్తుగా జీటీవీ ఛానెల్ దగ్గర ఆగింది సోనాలి. కారణం స్క్రీన్ నిండా కనిపించిన ఒక ఫోటో. అది తన ఆఫీసులో పనిచేసే రాజీవ్ అగర్వాల్‌ది. టెలికాస్ట్ అవుతున్న ప్రోగ్రాం పేరు 'ఇండియాస్ ది మోస్ట్ వాన్టెడ్'. చట్టానికి దొరక్కుండా తప్పించుకు తిరిగే నేరగాళ్లకు సంబంధించిన ప్రోగ్రాం అది. అందులో రాజీవ్ ఫోటో కనిపించడం ఏమిటో ఆమెకి ఒక్క క్షణం అర్థం కాలేదు. కానీ అర్థమయ్యాక ఆమె షాక్ తిన్నది. ఆ వివరాలేమిటంటే... మూడేళ్ల క్రితం ఢిల్లీలో జెబి ఎక్స్‌పోర్ట్స్‌లో అకౌంటెంట్‌గా రాజీవ్ పని చేశాడు. బోగస్ అకౌంట్లు తెరిచి కంపెనీకి చెందిన 33 లక్షల మొత్తాన్ని తెలివిగా తన పేరిట బదలాయించుకున్నాడు. పైవారికి ఈ సంగతి తెలిసే సరికే చెప్పాపెట్టకుండా ఉడాయించాడు. ఢిల్లీ క్రైంబ్రాంచికి చెందిన ఆర్థిక నేరాల నిరోధక విభాగం అతగాడిపై ఐపిసి 420, 408, 420(బి) కింద కేసులు పెట్టింది. అతడి కోసం పోలీసులు అన్ని చోట్లా గాలిస్తున్నారు... ఇదీ ఆ ప్రోగ్రాం సారాంశం.

సోనాలి ఆ షాక్ నుంచి తేరుకోవడానికి చాలా సేపు పట్టింది. పోలీసులకి చెపితే తన పేరు బయటికి వస్తే - నేరగాడి వైపు నుంచి తన ప్రాణాలకు ముప్పు కూడా రావచ్చు. వస్తే రానీ... అనుకొని - తండ్రికి ఈ సంగతి చెప్పి 100 నంబరు (పోలీసు విభాగం) డయల్ చేసింది... స్థానిక పోలీస్ స్టేషన్‌ని కంటాక్ట్ చేయమని బదులొచ్చింది. దాని నంబరు దొరకలేదు. చాలా సేపు ప్రయత్నించింది. అది రాత్రివేళ కావడంతో తెల్లారేదాకా... అసహనంగా గడిపిన సోనాలి... ఉదయం కాలేజి దగ్గర ఓ కానిస్టేబుల్ సహాయంతో ఢిల్లీ క్రైంబ్రాంచి సెల్‌కి ఫోన్ చేసి సంగతి వివరించింది. వెంటనే పోలీసులు రంగంలోకి దిగారు. గతంలో 33 లక్షలు కాజేసిన వ్యక్తీ, రాజీవ్ ఒకరేనని నిర్ధారించుకున్నారు. సాయంత్రం సోనాలి ఆఫీసుకు వెళ్లేసరికే రాజీవ్ చేతులకి అరదండాలు పడ్డాయి.

ఈ వ్యవహారంలో తన పేరు బయట పెట్టవద్దని సోనాలి పోలీసులను కోరింది. కానీ ఆమె చర్య, ఆమె చూపిన ధైర్యం పదిమందికి స్ఫూర్తినివ్వాలంటే - పేరు బయటికి రావాల్సిందేనని అధికారులు ఒప్పించారు. దాంతో సోనాలి పేరు అంతటా పాకిపోయింది. ఎన్నో సంస్థలు ఆమెని సత్కరించాయి. ఢిల్లీ పోలీసు విభాగం ఆమెకు ప్రత్యేక బ్రేవరీ అవార్డు ప్రకటించింది. ఈ సైలెంట్ గర్ల్ జీవితంలో ఇప్పుడు ఎంతో సందడి నెలకొంది. కీపిటప్ సోనాలి●

చూసుకుంటారు.. రాత్రయితే కష్టమవుతుంది.." అన్నాడు అయిలయ్య.

"మీ తొందర మీకుంటది నిజమే... కాని నాకు సమయం దొరకద్దా..."

పాత పాటే పాడాడు డాక్టర్.

"సార్...! మీకిచ్చేది మీకిస్తాం... అందరి దగ్గరెంత తీసుకుంటున్నారో అంత ఇస్తాం... పని కానియ్యండి...!

మధూకర్ అనగానే లేచి నిల్చున్నాడు డాక్టర్.. పేషంట్లను చూడమని ఇంకో డాక్టర్‌కు చెప్పాడు.

"పేపాలవీ పట్టుకొని వార్డుబాయ్‌లిద్దర్ని మార్చురీ గదికి రమ్మనండి... హెడ్ గదిలోంచి నేను పేపర్లవీ తీసుకొస్తా... వాళ్ళను తీసుకురాపొండి..."అని హెడ్ గది దిక్కెళ్ళాడు డాక్టర్.

ఆ ముగ్గురూ వార్డుబాయ్‌ల దగ్గరికెళ్ళారు. విషయం చెప్పారు.

"డాక్టర్‌తోని అన్ని విషయాలు మాట్లాడండ్రా..."

"మాట్లాడను... మీకిచ్చేది మీకిస్తం... తొందరగ నడువుండ్రి... నిన్నట్నుంచుంటుంది శవం..."

"ఇదేమన్న వట్టికేసా....? ఆత్మహత్య. ఎన్ని తతంగాలుంటయి? ఐదు నిమిషాలల్ల వస్తం నడవుండ్రి. పైసలు రడీగుంచుండ్రి...."

రోజూ శవాలు కోసే వాళ్ళ ముఖాల్లో ఏ భావమూ కనపడలేదు మధూకర్‌కు..

మరో పది నిముషాల్లో పోస్టుమార్టమ్ పని ప్రారంభమైంది. శవాన్ని పరపరా కోస్తున్నారు వాళ్ళు. బయట గేటు దగ్గర నిల్చొని చూస్తున్న మధూకర్‌కు తలతిరిగి నట్టువుతుంది.

మాంసం ముద్దలా మారుతున్న రాజేంద్ర శవాన్ని చూస్తుంటే దుఃఖమాగడం లేదు వాళ్ళకు. వాళ్ళు అక్కడే నేలమీద కూలబడ్డారు. గోడ అడ్డంగా ఉండటం వల్ల శవాన్ని కోసే దృశ్యం కనబడటం లేదిప్పుడు.

"ఏంటి అయిలయ్యా..! ఇలా ఎందుకు జరిగింది..?" కళ్ళనీళ్లు తుడుచుకుంటూ అన్నాడు మధూకర్.

"ఏం జెప్పుమంటవు బావా! ఇదంతా విశ్వనాదన్న దురదృష్టం.. అంతా రాత..! రాతనెవ్వలు తప్పిస్తరు..? చేతికెదిదొచ్చిన కొడుకు అన్యాయంగా చచ్చిపాయె.. తండ్రెత్తు కొడుకు.. ఏం జేసుడు..?" అని రాజేంద్ర ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలను వివరిస్తున్నాడు అయిలయ్య...

చెట్టుకింద శవంలా పడివున్న విశ్వనాథం తన కొడుకు చావు గుర్చి ఆలోచిస్తూనే ఉన్నాడు..

తాను హంతకుడా..? తన కొడుకును తానే చంపుకున్నాడా? తానే చనిపోయుంటే తన కొడుకును చంపడమేంటి? తాను చచ్చి కొడుకును చంపాడా? తాను చచ్చి కొడుకునెలా చంపుతాడు? తన కొడుకు నిన్న చనిపోయాడా? ఎప్పుడో చనిపోయాడు.. ఇంతకీ తన కొడుకు చావెప్పుడు మొదలైంది? ఎప్పుడు..?...?...

మామకు అన్యాయం చేయొద్దన్న రాజేంద్రను తిట్టికొట్టి నోరు మూయించాడు విశ్వనాథం.. ఈ వ్యవస్థపై విపరీతమైన నమ్మకమతనికి.. పిల్లలెదిగి, ఖర్చులు పెరిగి ఒక్కో సమస్య వెంటాడుతున్నా ఆతనికి వ్యవస్థపై నమ్మకం సడలలేదు.

కరీంనగర్‌లో డిగ్రీ చేస్తున్న రాజేంద్ర సెలవుల్లో ఇంటికొచ్చాడు. కొడుకు విద్యార్థి యూనియన్లలో పాల్గొంటున్నాడని తెలుసుకున్న విశ్వనాథం లబోదిబోమని మొత్తుకున్నాడు.

తనకున్న బడిపంతులుద్యోగంతో ఎంతో కొంత భద్రతుందని భావిస్తున్న విశ్వనాథంను కొడుకు యూనియన్లంటూ తిరగడం అసలే నచ్చలేదు.. "నువ్వు వాట్లో పాల్గొంటే నా ఇంట్లో అడుగుపెట్టొద్దు. నేను నూతిలో పడి చస్తా.."

ఎన్నో చెప్పి కొడుకును కట్టడి చేసాడు విశ్వనాథం. వారానికి రెండుసార్లు కరీంనగర్ వెళ్ళి కొడుకును చూసివస్తున్నాడు.

చదువు తప్ప మరేదీ పట్టించుకోకుండా చేసాడు.. రాజేంద్ర డిగ్రీ చదువయిపోతున్న సమయంలో ఓ సంఘటన జరిగింది. రాజేంద్ర కిరాయకుంటున్న ఇంటి యజమానికి నలుగురమ్మాయిలు. తమ కులానికి తగ్గట్టుగా కట్నమిచ్చి పెళ్ళి చేసే స్థితిలో లేడతను.. ముగ్గురమ్మాయిలకూ కట్నం లేకుండా కులాంతర వివాహాలు చేసాడు. నాలుగవ అమ్మాయి కోసం ఏ దురలవాట్లూ లేని రాజేంద్రపై ఆతని దృష్టి పడింది. ఆమెను రాజేంద్రకు పరిచయం చేసాడు. వాళ్ళిద్దరూ పరస్పరం ఆకర్షితులయ్యారు. ఆ ఆకర్షణ ఇష్టంగా మారింది.

డిగ్రీ పరీక్షల తర్వాత వాళ్ళిద్దరూ పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న విశ్వనాథం కొడుక్కు నచ్చజెప్పడానికి బదులు నోటికొచ్చినట్టు తిట్టాడు.. కొట్టబోయాడు...

అయినా రాజేంద్ర తొణకలేదు...

"నేనా అమ్మాయినే పెళ్ళి చేసుకుంటాను..." అన్నాడు.

"మన కులంగాని అమ్మాయితో పెళ్ళెలా జరుగుతుంది?"

"వాళ్ళది మన కులం కంటె పెద్ద కులమే కదా...!"

"అంటే? కులం కాదని పెళ్ళి చేసుకునేంత పెద్దవాడివయ్యావా? కట్నం ఇవ్వలేక దాని తండ్రి నీకంటగట్టాలని చూస్తున్నాడు. వాళ్ల కులంలో కట్నమెక్కువ గదా!"

"అయితే కావచ్చు... కాని నాకా అమ్మాయంటే ఇష్టమే..."

"నీకుద్యోగమొస్తే లక్షల కట్నమొస్తుంది"

రకరకాలు చెప్పాడు విశ్వనాథం... తల్లీతండ్రులెంత మొత్తుకున్నా విన్లేదు రాజేంద్ర... అక్కడుండకుండా చేసారు... ఆ అమ్మాయినసలే కలువకుండా చేసారు.

అయినా రాజేంద్ర మనసా అమ్మాయిపైనే... ఓ దిక్కు మామ కుటుంబానికి దూరముండటం... మరో దిక్కు విద్యార్థి యూనియన్లను దూరముంచడం... ఇంకో దిక్కు తావిష్టపడ్డ అమ్మాయికి దూరంగా ఉండటం... భరించలేక పోయాడు రాజేంద్ర.

అందర్నీ ఎదిరించే ధైర్యం లేక తనలో తానే సంఘర్షణ పడుతున్నాడు.

దాంతో మతి స్థిమితం తప్పిందతనికి... చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టే అయింది విశ్వనాథం పరిస్థితి...

(మిగతా 46వ పేజీలో)

# సిండ్రిల్లా సిండ్రోమ్

పచ్చిక పాటల గరిక పల్లవులు
వరద గాలిని పడవ మీద ఈడ్చుకుంటూ
పలాయనం వచ్చేస్తాయి

ప్రేమ ఏ ప్రకటనా లేకుండా
విరహంతో చెట్టాపట్టా కట్టి
రాస్తోంది కవిత్వాన్ని గడ్డి పూల కుంచెతో

చీకటి మీద అద్దిన వెన్నెల
ఏటి అలల చంద్రుడ్ని
మూడు ముక్కలు చేస్తుంది

ఒంటరి తనాన్ని విప్పి చెప్పిన రాత్రి
ఇవాళ తానే జతలు పోతోంది

విశాల ఆకాశం
కొనచూపులో కూరుకుపోయినట్టు
భయం యుగళ గీతాలకు కునుకుతోంది

పల్లవులు గరిక తల విదిలింపుల్లో
పచ్చిక పలకరింపుల్లో
వినపడుతున్నాయి

కిటికీలోంచి కనపడే గాలి
సిమెంటు పైరును పండిస్తోంది

సెల్ కాలువల్లో వెబ్ గంటలు
నెట్ వలల్లో సైబర్ రహస్యాలు
కలల ముసుగుల
రూపాలు వింత వింతలు

* *

రాలిపోయిన వీధి దీపం
నీడలో తన రూపాన్ని వెతుక్కుంటోంది
ఇక్కడి చంద్రుడేమో
ఏ నాలుగు చక్రాల కిందో
తల దాచుకున్నాడు నియాన్ గాయాలతో

కేబుల్ తీగల్లోంచి
అర్ధ నగ్న రాగాలు వినిపిస్తున్నాయి
నగరం అడుగుల్లో
నక్షత్రాలు మడుగులొత్తుతున్నాయి

నిన్నటి నది
మురికి కాలువై కంపుతోంది
పల్లె దేహానికి
పట్నం ఘాటు అంటించి
ధాన్యం రూపాయికి
డాలర్ బొమ్మ బొరుసయింది

- ప్రసేన్

# దేహం కూడా ఒక మతమే

ఆమె ఒక మతం
అతడు ఒక మతం
మధ్యన ద్వీపంలా సంతానం.

* * *

మోహావరణంలో తప్పిపోయిన శరీరం
జీవితంలోంచి తొంగి చూస్తుందిప్పుడు.
జనాభా లెక్కల్లో తేలని మతాల మధ్యన
ఒక మతంగా జన్మెత్తాడు
నా శరీరాన్ని పంచుకొని.
ఈ చిన్నారి ప్రశ్నలకు
హిందూ/ముస్లిం/సిక్కుగడుల
"సెన్సస్ చార్టు" జవాబుల కోసం
వెతుక్కుంటుంది.
దొరకని జవాబుల కోసం
పసిమొగ్గ జీవితాంతం అన్వేషించాలా?

ముఖం చెక్కేసిన బుద్ధుడులా
మతముఖం లేని నా రక్తంలో రక్తం.

ప్రేమికులారా!
మోహంలో మతాన్ని చూడండని
ఇక ఉద్యమాలు లేవదీద్దాం
మతాల్నే ప్రేమించమని
దేహాల్తో మొరపెట్టుకుందాం
ముఖం వెనుక దాగిన చూపులకు
మత కచ్చడాలు బిగించమని మతపెద్దల్ని
అడుగుదాం.
దేహంకూడా ఒక మతమేనని చాటుదాం
మృత్యువు లోంచి కూడా కళ్ళు తిప్పుతూ
ప్రశ్నించడం మానని మతం.

దంపతులారా!
మన ప్రేమలకు ఈ ఇళ్ళు చోటివ్వలేవు
మన ఇళ్ళు మనమే నిర్మించుకుందాం.
జనాభా లెక్కల పత్రాల్లో మన గడుల్ని
ఇక మనమే తయారు చేద్దాం.

- శిలాలోలిత

# ఖడ్గ చాలనానికి ఆహ్వానం

ప్రపంచీకరణం అనే అందమైన మేలిముసుగు మాటనూ, దాని వెనుక దాగిన సామ్రాజ్యవాద దోపిడీ అనే రక్కసి కోరనూ తెలుగు నేల మీద ప్రతి మనిషి జీవితంలోనూ ప్రవేశపెట్టింది ఇరవయో శతాబ్దపు అఖరి దశాబ్దం. ప్రపంచీకరణ అనే మాటలో ప్రపంచం చిన్నదయిపోతున్నదనే ప్రగల్భాలెన్ని ఉన్నా, వసుధైక కుటుంబం అనే ఉదాత్త ఆదర్శాలెన్ని ఉన్నా అట్టడుగున ఉన్నది బహుళజాతి సంస్థల మార్కెట్ల దాహం, సహజ వనరుల దాహం, చౌక మానవ శ్రమదాహం.

బహుళజాతి సంస్థల నిఘంటువులో, ఇవాళ్టి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ గంతల చూపుల్లో మనిషి అనే మాట లేదు. మానవ సంబంధాలు అనే మాట లేదు. ఉన్నదల్లా కొనుగోలుదారు, అమ్మకందారు అనే మాటలు. నా సరుకులు నువ్వెన్ని కొనుక్కుంటావు, నీ రక్తమూ చెమటా నీ నేల మీది నీళ్ళూ పంటలూ ఖనిజాలూ అడవులూ నాకెంతకు అమ్ముతావు - సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు తెలిసినవి ఇవి రెండే ప్రశ్నలు.



| | |
|---|---|
| సంపాదకులు: | జాకంటి జగన్నాథం, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, అక్షరంప్రచురణ-2001. |
| వెల: | 50/- |
| ప్రతులకు: | నవోదయ బుక్‌హౌస్, ఆర్యసమాజ్ సందు, కాచిగుడ, హైదరాబాద్. |

అందువల్ల మనుషుల ముందర 'డాలర్‌లా జీవించడమూ, మనిషిలా మరణించడమూ (నాళేశ్వర శంకరం) అనే విచికిత్స మిగులుతుంది. 'జీవితాన్ని గ్లోబు చేద్దాం, గ్లోబులో జీవితం లేకుండా మార్చేద్దాం' (యాకూబ్) అని బహుళ జాతి సంస్థలు చేసుకున్న నిర్ణయానికి మన జీవితాలనిండా పెంజీకటి నిండుతుంది.

ఈ విచికిత్స నుంచి ఒక నిర్ణయం మొలకెత్తుతుంది. ఈ పెంజీకటి భయాన్ని మాత్రమే కాదు వెలుగు కోసం తపననూ, ఉద్యమాన్నీ, నిర్మాణాన్నీ హామీ ఇస్తుంది. సమాజ జీవితం ఇటువంటి ప్రకంపనల్ని అనుభవిస్తున్నప్పుడు అందరికన్న ముందుగా కవిత్వ సీస్మోగ్రాఫే ఆ ప్రకంపనల్ని వ్యక్తీకరించగలదు.

పదిసంవత్సరాలుగా ప్రపంచ బ్యాంకుకూ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణకూ ప్రయోగశాలగా మారిన తెలుగునేల మీద కవిత్వం ఆ ప్రకంపనల్ని పాడడం చాల సహజం. జాతీయోద్యమ కాలం నుంచి కూడ సామ్రాజ్యవాద వ్యతిరేక సాహిత్య వ్యక్తీకరణల చరిత్ర వున్న తెలుగు సాహిత్యం 1991 నూతన ఆర్థిక విధానాల ప్రకటన నాటినుంచీ తన వ్యతిరేకతను, ధిక్కారాన్ని ప్రకటిస్తూనే ఉన్నది. నిజంగా గత పది సంవత్సరాల కవిత్వం చూస్తే ప్రపంచీకరణను నిరసిస్తూ, "బహుముఖాల్తో, అనేకానేక ముసుగుల్తో, మనల్ని నిండా ముంచటానికి" "మళ్ళీ మళ్ళీ పుడుతున్న వాడి" "లీలావిలాసాల్ని" గ్రహించి, వ్యక్తీకరించడానికి ప్రయత్నించని కవి లేరనిపిస్తుంది.

ఇటువంటి ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వాన్ని ఒకచోటికి తెచ్చి ప్రచురించడం చాలా ఆహ్వానించదగిన పరిణామం. ఈ పనికి పూనుకున్నందుకు అక్షరం, కవులు, రచయితలు, కళాకారులు, మేధావుల ఐక్యవేదికను అభినందించాలి. అక్షరం ప్రచురించిన 'గ్లోబల్ ఖడ్గం', ప్రచురణకర్తలే అంగీకరించినట్టు సమగ్రం కాకపోయినా, పేజీల పరిమితి, ఆర్థిక ఇబ్బందులకు లోబడే వెలువడినా, 48 కవితలతో స్థూలంగా ప్రపంచీకరణ వ్యతిరేక ఆలోచనలకు, ఆచరణకు స్ఫూర్తినిస్తుంది.

ప్రపంచీకరణకు ఉన్న అన్ని ముఖాలనూ తెలుగు కవిత్వం పట్టుకున్నదా, పాఠకులు గుర్తించని కోణాల మీద వెలుగు ప్రసరింపజేయడానికి ప్రయత్నించిందా అని ప్రశ్నించుకుంటే సంతృప్తికరమైన జవాబులు రావు. మొత్తం మీదనే అటువంటి అసంతృప్తి ఉందనుకుంటే, గ్లోబల్ ఖడ్గం ఆ అసంతృప్తిని మరింత పెంచుతుంది. ప్రపంచీకరణకు ఉన్న అన్ని కోణాలనూ కవిత్వీకరించడం సాధ్యం కాకపోవచ్చు కానీ కనీసం వీలయినన్ని ఎక్కువ కోణాల మీద కవులు స్పందిస్తే బాగుండునని కోరుకోవడం అత్యాశ కాదు.

వ్యవసాయ రంగ సంక్షోభం, విద్యుత్ రంగ సంస్కరణల ఫలితాలు, టెలివిజన్ ద్వారా సామ్రాజ్యవాద సంస్కృతి దాడి, మేధోవలస, మానవ సంబంధాలలో మార్పులు, స్థూలంగా ప్రపంచీకరణ ప్రభావాలు - ఇవీ ఈ సంకలనంలోని కవులు తీసుకున్న వస్తువులు, వ్యంగ్యం, ఆత్మనింద, సంభాషణ, ఆరోపణ, వాంగ్మూలం ప్రధానంగా ఎంచుకున్న శిల్పపద్ధతులు. కాని ఈ వస్తువుల కన్నా, ఈ శిల్పపద్ధతుల కన్న భిన్నంగా కూడా ఈ పది సంవత్సరాలలో ప్రపంచీకరణ వ్యతిరేక కవిత్వం ఎంతో వచ్చింది.

ఈ సంకలనంలోని కవితల్లో కనీసం ఇరవైకి పైగా అద్భుతమైన, ఆలోచనా ప్రేరకమైన కవితలు ఉన్నాయని అంగీకరిస్తూనే, సంకలన ప్రయత్నాన్ని అభినందిస్తూనే ఎడిటింగ్ లోపాల గురించి ప్రస్తావించవలసి ఉంది.

ఈ పది సంవత్సరాలలో ప్రపంచీకరణ మీద వచ్చిన 'మంచి' కవితల సంకలనం చేయాలా, తమ ప్రకటనకు స్పందించి పంపించిన కవితల లోంచి ఎంపిక చేయాలా అనే విషయంలో సంపాదకులకు స్పష్టత ఉన్నట్టు లేదని సంకలనం పారదర్శకంగా చూపుతోంది. అందువల్ల ఈ సంకలనంలో చేరి ఉండదగిన మరెందరో కవులు ఇందులో చోటు చేసుకోలేదు. కొన్ని కవితలు ఎందుకు చేరాయో అర్థం చేసుకోవడం కష్టం. ఇది కవిత్వ ప్రమాణాల గురించిన చర్చ మాత్రమే కాదు, ప్రపంచీకరణ వ్యతిరేకంగా ఉండి, కవిత్వ ప్రమాణాలు లేని కవితలు కొన్ని సంకలనంలో ఉన్నాయి. అవి ఉన్నా ఫరవాలేదేమో గాని, మంచి కవితలు అయి కూడా సుదూరంగానైనా ప్రపంచీకరణతో సంబంధమే లేని కవితలు కనీసం రెండున్నాయి.

ఇక ఇటువంటి సంకలనంలో తప్పనిసరిగా ఉండవలసిన కవితల మొదటి ముద్రణ వివరాలకు ఒక పద్ధతి లేదు. మొదటి ముద్రణ స్థల కాలాల గురించి గాని, రచనా కాలం గురించి గాని, అముద్రితమైతే ఆ వివరణగాని సంకలనంలోని అన్ని కవితలకూ ఒకే రకంగా, క్రమబద్ధంగా ఉండేలా చూడడం ఎడిటింగ్‌లో ముఖ్యమైన అంశం. వసీరా 'మరో దశ' సంపుటం, "దిశ కవితా సంకలనం"గా మారిపోయిందంటే, కవితా చరణాల మధ్య ఖాళీల విషయంలోనూ, అచ్చుతప్పుల విషయంలోనూ తగిన జాగ్రత్తలు తీసుకోలేదంటే అది సంపాదకుల అశ్రద్ధను సూచిస్తుంది.

కొన్ని కవితలలో వ్యక్తమయిన అభిప్రాయాల గురించి వివరంగా చర్చించవలసి ఉందిగాని ఇక్కడ స్థల పరిమితులు అందుకు అంగీకరించవు.

'మూలాలను కాపాడేదే సాహిత్యం' అంటూ జయధీర్ తిరుమలరావు రాసిన ముందుమాటలోని కొన్ని అంశాల గురించి మాత్రం ప్రస్తావించక తప్పదు.

"రావలసినంత కవిత్వం రాలేదు. ఒక నిర్దిష్టరూపంలో ప్రచారం కాలేదు'' అని తిరుమల రావు అన్నమాట నిజమే గాని "మొదటిసారిగా ఈ భావజాలాన్ని వ్యతిరేకించే కవితలను ఒకచోట ఏరి కూర్చి ఇప్పుడు పుస్తక రూపంలో తీసుకురావడం జరుగుతోంది" అనడంలో మాత్రం నిజం లేదు. 1990ల కన్నా ముందరి సామ్రాజ్యవాద భావజాల వ్యతిరేక కవితా సంకలనాల సంగతి పక్కన మంజీరా రచయితల సంఘం 1996లో ప్రచురించిన సామ్రాజ్యవాద వ్యతిరేక కవితా సంకలనం 'మొగులైంది', ప్రజాశక్తి బుక్‌హౌస్ 2000లో ప్రచురించిన 'వికసించిన విద్యుత్తేజం' ఉండగా, 'గ్లోబల్ ఖడ్గం'ను మొదటి సంకలనం అనడం సరికాదు.

ఇక సామ్రాజ్యవాదం అనే రాజకీయార్థిక శాస్త్ర పారిభాషిక పదానికి దేశీ అనే అంటుకట్టి 'దేశీ సామ్రాజ్యవాదం' అనే మాట సృష్టించి తిరుమలరావు ఏమి సాధించదలచారో తెలియదు. 'భూస్వామ్య ప్రతీకలయిన మతం, కులం' సామ్రాజ్యవాదానికి వంత పాడడమే దేశీ సామ్రాజ్యవాదం అని ఆయన నిర్వచిస్తున్నారు. శాస్త్ర పదజాలాన్ని ఇట్లా ఇష్ట ప్రకారంగా నిర్వచించడం కుదరదేమోనని నా అనుమానం.

భూస్వామ్యానికీ సామ్రాజ్యవాదానికీ ఉండే ఈ మిలాఖత్తు గురించి ఇప్పటికే ఎందరో చెప్పి ఉన్నారు. దానికి కొత్తమాట సూచించడం, కొత్త భావన చెప్పినట్టు కాదు. ఆ కొత్త మాటకు కూడా శాస్త్రపరమైన నిర్దుష్టత లేదు. అదే రకంగా దేశీయ వలసవాదం అనే మాట కూడ ఆయన విరివిగానే వాడారు.

ఇక జాజిరి పాటలో తూర్పునుండి వచ్చెరా తూప్పల నక్క, పడమటి నుండి వచ్చెరా హ్వేతాల నక్క అనే మాటలకు ఆయన చెప్పిన అర్థాలు సరిపోవు. జానపద గీతాలలో చాలా సంకేతాలుండే మాట నిజమే గాని పడమటి నుండి అనే మాటకు తెల్లవాళ్ళనే అర్థం చెపితే, తూర్పు నుండి అనే మాటకు ముస్లిం రాజులు అనే అర్థం ఎట్లా సరిపోతుంది?

అసలు మొత్తం ముందుమాటలో రచయిత ఏం చెప్పదలచుకున్నారో స్పష్టం కాకపోవడం, వాక్యాల్లో వచనం గాని, స్వరం గాని పాటించబడకపోవడం కనిపిస్తాయి.

ఒక అవసరమైన, ఆహ్వానించవలసిన, మంచి ప్రయత్నాన్ని ఈ పుడకలతోనైనా గ్రహించక తప్పదు. బహుశా పుడకలే పానకం రుచిని పెంచుతాయేమో.

- ఎన్. వేణుగోపాల్

# కాలుతున్న మనిషి

(45వ పేజీ తరువాయి)

కొడుకును బాగు చేయించడానికి ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నాడు... దెబ్బ మీద దెబ్బన్నట్టుగా ఈ మధ్యనే విశ్వనాథం తండ్రి చనిపోయాడు. ఆర్థిక ఇబ్బందులూ పెరుగుతున్నాయి... ఇదువరకే పెళ్ళయిన కూతురు సంసారం ఏమంత బాగాలేదు... కరీంనగర్‌లో ఇల్లు కట్టుకోవాలనుకున్న కల కలగానే మిగిలిపోయింది.

రోజూ చస్తూ బతికినట్టే బతుకుతున్నాడు విశ్వనాథం... ఇంతలో ఈ విషయం జరగడమాతనికి భరించరానిదిగానే ఉంది...

కొడుకు విషయాన్ని మననం చేసుకున్న విశ్వనాథం కంటికోధారగా ఏడుస్తున్నాడు.......

విశ్వనాథం మనిషిపుడు కష్టమే...

"ఊకో బిడ్డా ఊకో... పోస్టుమార్టమయి పోయినట్టే... ఇగ శవాన్ని తీసుకపోవుడే..." అన్నాడు వీరయ్య.

"ఆఁ.. శవాన్ని తీసుకపోతవా? ఎందుకు? నా కొడుకు చచ్చిపోయిండా? ఇవ్వుడు చచ్చిపోయిండా? నాలుగేండ్లాయె చచ్చిపోయి. ఇప్పుడు చచ్చిపోవుడేంది?"

ఛాతీ చేతుల్తో చరుచుకుంటూ ఏడుస్తున్నాడు విశ్వనాథం... విరయ్య, బాల్లింగం ఆతన్నోదార్చే ప్రయత్నంలో ఉన్నారు... గది బయట గేటు దగ్గర నిల్చొనున్న మధూకర్, అయిలయ్య దగ్గరికొచ్చాడు కనుకయ్య.

"ఇగ కుట్లేసుడే మిగిలింది సార్... సాంపుల్సవీ తీసి సీసాల్లో పెట్టాం... డాక్టర్ సాబ్‌కిచ్చే పైసలియ్యండ్రి..." అన్నాడు.

అతని చేతుల్నిండా రక్తముంది. ముక్కలుగా కోయబడిన రాజేంద్ర శవం చూడటానికి భయంకరంగా ఉంది. శవాన్ని కోసి కుట్లేయకుండా డబ్బడుగుతున్న కనుకయ్య దిక్కు అసహ్యంగా చూసాడు మధూకర్... శవం దగ్గర నిల్చొనున్న డాక్టర్ మరీ వికృతంగా కనబడుతున్నాడతనికి...

జేబులోంచి మూడు వందల రూపాయలు తీసిచ్చాడు అయిలయ్య... "ఐదు వందల కన్న ఒక్క పైసా తక్కువున్నా తీసుకోడు డాక్టరు..."

మరేం వాదించకుండా ఇంకో రెండు వందలిచ్చాడు అయిలయ్య... ఆ ఐదు వందలు డాక్టరుకిచ్చి మళ్ళీ వచ్చాడు కనుకయ్య.

"మాకిచ్చేటియియ్యండ్రి..." అన్నాడు.

"ఐదు వందలిచ్చాం కదా? మళ్ళీ మీకిప్పడమేంటి?"

"ఐదు వందలు డాక్టర్‌కే సార్... ఆయన చేతిలకు పోయినయి మల్ల రావు.. ఈ శవాలను కోసే పని ఎంత రోతో మీకు తెలువదా సార్! ఈ పని చేసుకుంట మేమూ శవాలైపోతం... ఈ రోతతో, వాననలోని ఇంటికి పోతె వేం మనుషులమే కాము. అందుకే మీరేమన్నిచ్చినా అది తాగుటానికే ఐతది... తాగిపోంది మాకేం మనుసున వట్టది. డాక్టరుకు మాకే సంబంధం లేదు... అయినా మా బతుకెంత సార్?" అన్నాడు కనుకయ్య.

ఆ మాటల్లోని సబబు సంగతెలా ఉన్నా వేలాది రూపాయల జీతం తీసుకుంటూ కూడా శవాన్ని పక్కనపెట్టి డబ్బులడిగే డాక్టర్ల కంటె చాలీచాలని జీతంతో సతమతమయ్యే కనుకయ్య లాంటివాళ్ళకు యాభయో వందో ఇచ్చినా తప్పు లేదనుకున్నాడు మధూకర్.

జేబులోంచి వంద నోటు తీసిచ్చాడు కనుకయ్యకు...

"సార్... ఇవి మాకిద్దరికి తాగుటానికే ఐతయి... ఇంత కష్టపడితె మాకేం మిగిలినట్టు..?"

"ఇది మీ డ్యూటీ కదయ్యా! కష్టపడటమేంటి? మీ పని మీరు చేయడానికి లంచాలు కావాలా?"

"గది లంచమా సార్? మీ లాంటి చదువుకున్నోల్లే గిట్లంటెట్ల సార్... ఇంకో వందన్నియ్యండ్రి"

ఇంకో వంద కనుకయ్య చేతిలో పెట్టాడు మధూకర్. ఆత్మహత్య చేసుకున్న పత్తిరైతు శవాన్ని, కాలిపోయిన స్త్రీ శవాన్ని జీపుల్లో వేసుకొని తీసుకెళ్ళడానికి సన్నద్ధమవుతున్నారు.

వాళ్ళ తాలూకు మనుషులు గుండెలలిసేలా దుఃఖిస్తున్నారు... "ఏమేడ్పుడది... ఇది హాస్పిటల్ తెలుసా?"

గద్దరించినట్టన్నాడు బయటకొచ్చిన డాక్టరు. "హాస్పిటలయితె ఏడ్పుడు గూడ తప్పేనా సారు? గట్టిగేడ్పుడు మోటుపనా సారు?"

డాక్టరేం మాట్లాడకుండా లోపలికెళ్ళి పోయాడు... మరో పదిహేను నిమిషాల్లో కుట్లేసే పనయిపోయింది.

"జీపు తెచ్చుకొని శవాన్ని తీసుకెళ్ళండి" మధూకర్‌తో అని కనుకయ్య హాస్పిటల్ లోపలికెళ్ళాడు.

డాక్టర్ మరో వార్డుబాయ్ కూడా వెళ్ళి పోయారు... కిరాయకు జీపు మాట్లాడుకొచ్చాడు అయిలయ్య.

మాంసపు ముద్దలా ఉన్న రాజేంద్ర శవాన్ని జీపులోకెక్కించారు... కొడుకు శవం తల దగ్గర కూర్చున్న విశ్వనాథం వెక్కివెక్కి ఏడుస్తున్నాడు.

అయిలయ్య, బాల్లింగం, మధూకర్, వీరయ్య, అక్కడు ఇంకో ఇద్దరు ఊరివాళ్ళు జీపెక్కి కూర్చున్నారు.

జీపు బయలుదేరింది... సివిల్ హాస్పిటల్ చౌరస్తా దాటి చౌవ్రదండి రోడ్డు మీద నడుస్తుంది.. సన్నగా రోదిస్తున్నాడు విశ్వనాథం...

రోడ్డుకిరువైపులున్న పంటపొలాలను, చేల్లను దాటేస్తూ ఊళ్ళనధిగమిస్తూ పరుగెడుతుంది జీపు... అరగంటయినా కాకముందే చొప్పదండి దాటి రాజేంద్రి పుట్టిపెరిగిన ఊరు చేరుకుంది జీపు.

జీపు ఊళ్ళోకి ప్రవేశించింది... ఇండ్ల దిక్కు చూస్తున్నాడు మధూకర్. కొన్ని పాత ఇండ్ల స్థానంలో బంగ్లాలు లేచాయి... కొన్నిండ్లు పాడుబడున్నాయి... వాట్లో దీపంబెట్టడానికి దిక్కు కూడా లేవు... కొన్నిండ్లకు తాళాలున్నాయి... ఇంతకు ముందు దొరలని చెప్పబడే వాళ్ళ చాలా మందిండ్లు కూలిపోవడానికి సిద్ధంగా ఉన్నట్టున్నాయి... కొన్నిండ్ల ముందు ముసలివాళ్ళు కూచొని ఎవరికోసమో ఎదిరిచూస్తున్నట్టున్నారు.

ఇండ్ల దిక్కు పరీక్షగా చూస్తున్న మధూకర్‌కు ఆ ఊరెందుకో తగులబడి పోతున్నట్టనిపిస్తుంది...

శవాన్ని నేరుగా ఊరిబయటున్న శవాలను కాల్చే ప్రదేశానికి తీసుకెళ్ళారు.

స్త్రీలు, విశ్వనాథం బంధువులు, ఊరివాళ్ళంతా అక్కడే ఉన్నారు. కాట్నం పేర్చబడి సిద్ధంగా ఉంది... జీపక్కడికి చేరగానే వెంకటమ్మ, ఇతర స్త్రీలు గొల్లుమని ఏడ్వసాగారు... శవాన్ని దించి నేలపై పరిచున్న వరిగడ్డి పడుకోబెట్టారు.

పైనుంచి కొత్తబట్ట కప్పారు... శవంపైబడి మొత్తుకుంటుంది వెంకటమ్మ...

విశ్వనాథం కొడుకు కాళ్ళమీద పడేడుస్తున్నాడు... "కొడుకా..! నిన్ను మేమే చంపినం కొడుకా..! నా రాజేంద్రా... ఓ రాజేంద్రా..! నిన్ను చంపింది మేమే కొడుకా...!"

మొత్తుకుంటుంది వెంకటమ్మ... వాళ్ళ గొంతులు ఏడ్చీ ఏడ్చీ బొంగురుపోయాయి...

శవాన్ని తీసి కాట్నంపై పెట్టారు...

మీది నుంచి, పక్కలకు మరికొన్ని కట్టెలు పెట్టారు... "ఇలాంటి పరిస్థితి పగవాడికి కూడా రావద్దు. కొడుక్కు తండ్రి తలకొరివి పెట్టే పాపాన్నెవరూ చూడకూడదు..."

అని వలవలా ఏడుస్తున్నాడు మధూకర్.

విశ్వనాథం చేతికి మండుతున్న కట్టెనిచ్చి అంటుపెట్టమన్నారు. చితికి నిప్పంటించాడు విశ్వనాథం... అతన్ని తీసుకెళ్ళి కొంచెం దూరంలో కూర్చోబెట్టారు.

ఏడ్పులు తారాస్థాయినందుకున్నాయి...

వాళ్ళలా ఏడుస్తూనే ఉన్నారు...

మొత్తుకుంటూనే ఉన్నారు...

చితిమంటలు భయంకరంగా నింగికె గుస్తున్నాయి...

అప్పటికే ముక్కలు ముక్కలుగా కోయబడిన రాజేంద్ర భారీశరీరం ఆ మంటల్లో ఆహుతవుతూనే ఉంది...

రాజేంద్ర మంటల్లో దహనమవుతున్నాడు... విశ్వనాథం తనను తాను దహించుకుంటున్నాడు...

రాజేంద్ర శవం కాలుతుంది... విశ్వనాథం మనిషే కాలుతున్నాడు...

తతను తాను కాల్చుకుంటున్నాడు... తనను తాను మార్చుకుంటున్నాడు...

తనను తాను కాల్చుకుంటూ మార్చు కుంటున్నాడు...

తన కొడుకును దహనం చేస్తున్న వ్యవస్థ గూర్చి ఆలోచిస్తున్నాడు...

ఆతనికిదువరకున్న భ్రమలు తొలగుతున్నాయి... అతనికిప్పుడు మార్గం స్పష్టంగానే కనబడుతుంది...

అక్కడంతా మనిషి కాలుతున్న వాసనేస్తుంది... ఆ వాసన ఊరంతా వ్యాపిస్తుంది... ఊళ్ళకన్నిటికీ వ్యాపిస్తుంది...

ఆ వాసనలోంచే కొత్త మనిషి ఆవిర్భావం జరుగుతున్నట్టుంది...

విశ్వనాథం లాంటివాళ్ళెంతో మంది కాలుతూనే ఉన్నారు... కొద్ది సేపట్లో రాజేంద్ర శవం కాలి పిడికెడు బూడిదగా మిగిలిపోయింది... కాలుతున్న మనిషి వాసన మాత్రం దేశమంతటా వ్యాపిస్తూనే ఉంది...●

## చిత్ర విహార

మొదటి గంట తర్వాత సినిమాని ఎప్పుడైనా ముగించే అవకాశం వున్నప్పటికి రెండుగంటలపైగా లాగబడిన చిత్రమే 'ఆకాశవీధిలో' (ఈ సినిమా దాదాపు రెండు సంవత్సరాలక్రితమే ప్రారంభించబడినప్పటికీ - ఇపుడు విడుదలైంది) పైగా ఇది సింగీతం శ్రీనివాసరావులాంటి దర్శకుడి చేతిలో రూపుదిద్దుకున్న సినిమా! అర్థవంతంగాలేని కథ, అసంబద్ధమైన సన్నివేశాలు (ఎన్నో!), బలవంతంగా ఇరికించబడిన క్లైమాక్స్, దారితప్పిన పాత్రలు - వెరసి 'ఆకాశవీధిలో'.

సినిమాలో కథ గురించి చెప్పే ముందు ఒక విషయం చెప్పటం సబబుగా వుంటుంది. ఈ సినిమాలో వివిధ సినిమాల్లోనుంచి కథలు, సన్నివేశాలు తీసుకున్నట్లు అనిపించటంలో ప్రేక్షకుల తప్పు ఎంత మాత్రంలేదు. సినిమా ప్రారంభంలోనే నాగార్జున చేతిలో విమానం (చిన్నదే) పల్టీలు కొట్టటం (సింబాలిక్‌గా వుంది). కథ కూడా అలాంటి పనే చేసి ప్రేక్షకులను పల్టీ కొట్టిస్తుందని ప్రేక్షకులు ఊహించలేకపోవటం - మామూలే! కథ రాసిన వారికి, దర్శకుడికి (?!) కొన్ని విషయాల్లో జనరల్ నాలెడ్జ్ అత్యంత అవసరమని తెలుస్తుంది. అయితే ఈ సినిమాలో ఏ విషయం చటుక్కున తెలియదు. క్రమేణా తెలుస్తుంది.



### తేలిపోయిన సినిమా

కథ ప్రారంభం కూడా పల్టీలు కొట్టటంతో (కథ కాదు... విమానం...) ప్రారంభమవుతుంది. నాగార్జున, రాజేంద్ర ప్రసాద్‌లు (పాపం! హాస్యకిరీటిట!) ప్రాణ స్నేహితులు. ఢిల్లీలోని ఓ ఫ్లయింగ్ క్లబ్‌లో ఇన్‌స్ట్రక్టర్స్‌గా పనిచేస్తుంటారు. అది తెలుగు వాడైన గిరిబాబుదే. (ముందే చెప్పటం మంచిది). రాజేంద్రప్రసాద్ గిరిబాబు కూతురు కస్తూరిని ప్రేమిస్తుంటాడు.... తమాషా ఏమిటంటే నాగార్జున, రాజేంద్రప్రసాద్ ఇద్దరూ అనాథలే. (అని మనం అనుకోవాలి) సరే! ఫ్లయింగ్ క్లబ్‌లో రవీనాటాండన్ (డబ్బుతో పాటు అహం అనే అమ్మాయిని వేరే చెప్పాల!) చేరుతుంది. రవీనాటాండన్‌కు బంధువు కోటశ్రీనివాసరావు - అతని కుమారుడు సుధాకర్ వుంటారు. ఇక రవీనా, నాగార్జున ప్రేమలో పడాలి కదా? ఓ రోజు నాగార్జున ట్రెయినింగ్‌కని చెప్పి రవీనాను విమానంలో ఎక్కించుకుని వెళుతూ వుంటే అది కూలిపోతుంది. (అంతకుముందు చెంపదెబ్బ కొట్టిన రవీనా సారీ చెప్పనందుకు విమానాన్ని ఢిల్లీకి 500 కి.మీ. దూరం తీసుకెళ్ళ గలిగిన ఘనత నాగార్జునదే! (అది ఏ విమానమో మరి!). సరే విమానం ఎక్కడో మంచు ప్రదేశంలో కూలిపోయింది. ఇక వాళ్ళిద్దరూ సహాయం కోసం ఎదురుచూస్తూ నడక మొదలెడతారు. మధ్యలో ఓ ఎలుగుబంటి (ఇండియాలో అలాంటి జంతువు వుందా!) వాళ్ళవెంట పడుతుంది. తమాషా ఏమిటంటే రవీనా దగ్గర సెల్‌ఫోన్ వుంటుంది. ఆ విషయం ఆమెకే తెలీదు. కోట శ్రీనివాసరావు హెలికాప్టర్ నుంచి ఆమెకి (ఇండియాలో హెలికాప్టర్ నుంచి సెల్‌ఫోన్!) సెల్‌ఫోన్ చేస్తాడు. అయితే మన దురదృష్టవశాత్తూ దాన్ని ఎలుగుబంటి నమిలేస్తుంది. ఎలాగోలా తప్పించుకుంటారు. తప్పించుకునే క్రమంలో ప్రేమించేసుకుంటారు. చివరికి ఎలాగోలా ప్రేక్షకులకోసం ఢిల్లీ చేరుకుంటారు. రవీనా వాళ్ళ నాన్న పెద్దగా అభ్యంతర పెట్టకుండా పెళ్ళి చేసేస్తాడు. రాజేంద్రప్రసాద్‌కి కూడా పెళ్ళవుతుంది. (ఇక ఇక్కడ్నుంచి సినిమా అయిపోవచ్చు. కానీ కాదు గాక కాదు...) రాజేంద్రప్రసాద్‌కి తిరుపతిలో పైలట్ (?!) ఉద్యోగం వస్తుంది. అది పర్వాలేదు. నాగార్జునకు ఎయిర్‌ఫోర్స్‌లో పెద్ద ఉద్యోగం (ఎలా వచ్చిందో!) వస్తుంది.

రవీనా, కస్తూరిలు ఇద్దరూ తల్లులు (వేరేవేరేగానే) కాబోతున్నారని వాళ్ళతో పాటు మనకు కూడా తెలుస్తుంది. ఎయిర్‌పోర్ట్‌కు వెళుతున్న రవీనాకు యాక్సిడెంట్ అయి (తెలుగు సినిమా రూలు ప్రకారం) శాశ్వతంగా తల్లి అయ్యే అవకాశం కోల్పోతుంది. కస్తూరికి కవల పిల్లలు పుడతారు. (రామ్, లక్ష్మణ్) ప్రేక్షకులు ఊహించినట్లే కస్తూరి తన ప్రాణ స్నేహితురాలు రవీనాకు ఒక పిల్లాడ్ని ఇస్తుంది. (సినిమా ఇక్కడైనా అయిపోవచ్చు. కానీ....) ఒకరోజు కస్తూరి కొడుకు కిందపడితే డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తారు. మళ్ళీ తెలుగు సినిమా రూలు ప్రకారం ఆ పిల్లాడికి లుకేమియా (బ్లడ్‌క్యాన్సర్). ఇపుడా పిల్లాడు బతికే అవకాశం ఒక్కటే - రామ్ నుంచి బోన్‌మ్యారో తీసి ట్రాన్స్‌ప్లాంట్ చెయ్యటం. చిత్రంగా (మళ్ళీ తెలుగు సినిమా రూలు ప్రకారం) రవీనా దీనికి ఒప్పుకోదు. నాగార్జునకు తెలీకుండా పిల్లాడ్ని ఢిల్లీకి తీసుకెళుతుంది. మళ్ళీ ఎలాగోలా తప్పు తెలుసుకుని విమానంలో (పెద్దదే) హైద్రాబాద్ వస్తుంటుంది (ఆమె వచ్చేసిన తరువాత సినిమా అయిపోవచ్చు. కానీ...). మనం ఊహించినట్లే విమానాన్ని హైజాక్ చేస్తారు పాకిస్తాన్ వాళ్లు. (వాళ్ళు తప్ప మన విమానాల్ని ఎవరు హైజాక్ చేస్తారు). నాగార్జున (కమాండర్ లెవల్లో! ఏ అధికారంలోనో తెలీదు) విమానంలోకి ప్రవేశించి (ఎలానో సిన్మా చూసినా అర్థం కాదు. చెబితే ఏం అర్థమవుతుంది) వాళ్ళని చంపి విమానాన్ని, ప్రయాణీకులను, రవీనాను, కొడుకును (సినిమాను తప్ప) అందర్నీ కాపాడతాడు. ఇది ఆకాశవీధిలో.... కథ.

సినిమాలో పాటలు కూడా వున్నాయి. కోట, సుధాకర్‌ల కామెడీట్రాక్ కూడా వుంది. ఈ సినిమాలో ఏం చూపించదల్చుకున్నాడో దర్శకుడు తేల్చుకోలేకపోయాడు. నాగార్జున ఎయిర్‌ఫోర్స్‌లో ఆఫీసర్ కావటం, అడవిలో పదడుగుల ఎలుగుబంటి, ఫ్లయింగ్ క్లబ్‌లాంటి అనేక తప్పులున్నాయి. సినిమాలో విలన్ లేడు. ఫైటింగ్‌లు లేవు. చివర్లో హడావుడిగా (నాగార్జున ఫ్యాన్స్ కోసం మాత్రమే...) పెట్టిన క్లైమాక్స్ తప్ప నాగార్జున అభిమానులు కూడా నిరాశపడే పాత్రలో నాగార్జున, పాపం అనిపించే పాత్రలో రాజేంద్రప్రసాద్ వున్నారు. నటించే అవకాశం ఎంత మాత్రం లేదు. కోట శ్రీనివాసరావు కొంతవరకు ఫర్వాలేదు అనిపించినా లాభంలేదు. సుధాకర్‌నుంచి ప్రేక్షకులను ఎవరు కాపాడతారు. రవీనా పాటలకే పరిమితం. కస్తూరి, గిరిబాబుల పాత్రల గురించి చెప్పవలసిందేమీ లేదు. ఆకాశవీధిలో అని ఈ సిన్మాకు పేరు ఎందుకు పెట్టారో అర్థం కాదు... (అంటే భూమ్మీద పైగా అడవుల్లో జరుగుతుంది). ఉషాకిరణ్ సంస్థ ద్వారా వచ్చిన మరో సినిమా ఇది. బస్సులు, రైళ్ళు, విమానాల నేపథ్యంలో సినిమాలు తీసేటపుడు కథను వదలేస్తే ఫర్వాలేదు. సినిమానే వదిలేస్తే కష్టం. ఆ రంగం గురించి సరైన అవగాహన లేకపోతే ఇబ్బంది. ఇలాంటి సినిమాలు ఎలా ముగియాలో అలానే ముగుస్తాయి. ప్రేక్షకులను ఆకాశవీధిలోకి తీసుకెళ్ళి కిందికి తోసేస్తే అదే జరుగుతుంది మరి!●

- సి.యస్. సలీంబాషా

ఇదొక క్రీడాకారుని (?!) సినిమా. ప్రారంభంలో హీరో నవీన్ కెనడాలో జరిగిన ఓ అథ్లెటిక్ పోటీలో 800 మీటర్ల (నిజం!) పరుగులో గెలిచినట్లు టీవీలో చూపిస్తారు (అదీ రెండు నిముషాల్లోపే). సినిమా అయిపోయేంత వరకు నవీన్ అసలు ఏ ఆట ఆడడు (పాడతాడు). అయితే దర్శకుడు మాత్రం మనతో ఆటాడుకుంటాడు. సినిమా ప్రారంభం ఒక కొత్త పాయింటుతో మొదలు కాగానే ప్రేక్షకులు ఉత్సాహంతో సర్దుకుని కూచునే లోపలే నవీన్ ఇండియా వచ్చేస్తాడు (అక్కడ 'సారే జహాఁసే అచ్చా' అన్న పాట పాడింతర్వాతే). ఇక్కడ మన జాతీయ పతాకం ఎగరేసిన క్రీడాకారుడికి సిగరెట్లు తాగటం, మందు తాగటం, స్నేహితులతో బలాదూర్ తిరగటం తప్ప వేరే పనుండదు (ప్రాక్టీస్ ఎప్పుడు చేస్తాడో మరి!). తెలుగులో సక్సెస్ అయిన సినిమాలు ఒకే రకంగా సక్సెసవుతే, ఫెయిలయిన (అయ్యే) సినిమాలు ఒక్కోరకంగా, కొండొకచో కొత్త రకంగా ఫెయిలవుతాయి. ఇదీ అలాంటి సినిమానే! పాత కథ(లు) కొత్త రకంగా తీసి ఎలా ఫెయిల్ చెయ్యవచ్చో దీన్ని చూసి నేర్చుకోవచ్చు. (సారీ ప్రేక్షకులు కాదు. సినిమా వాళ్ళు). ఈ సినిమాలో చాలా ట్విస్ట్‌లు - సస్పెన్స్ కూడా వున్నాయి!

కథ :- నవీన్ తండ్రి చలపతిరావు బాగా డబ్బున్నవాడు. వాళ్ళది ఉమ్మడి కుటుంబం. నవీన్ ఇండియా రాగానే మరదలు ప్రియాంక ('కంచి'కౌల్)ను పెళ్ళిచేసుకోవాలనుకుంటాడు. కాని వెంటనే చెప్పడు (మనఖర్మ!). ప్రియాంక మాత్రం తాను వేరే అతన్ని ప్రేమిస్తున్నాని నవీన్‌కు చెప్పి, పెళ్ళికి అతని సహాయమే అడుగుతుంది (ట్విస్ట్). సరేనని మాట ఇచ్చిన నవీన్ ఇంట్లో అసలు విషయం దాచి ప్రియాంకను పెళ్ళి చేసుకోవటం ఇష్టం లేదని చెప్తాడు. తాను మరో అమ్మాయిని ప్రేమిస్తున్నానని ఒక ఫోటో చూపిస్తాడు (రాశి). ఆ అమ్మాయి వస్తే ఎలా అని స్నేహితులు అడిగితే లోకల్ పేపర్‌లో శ్రద్ధాంజలి అన్న కాలమ్ కింద ఆ అమ్మాయి ఫోటో చూపించి (ట్విస్ట్) అందర్ని ఆశ్చర్యపరుస్తాడు. అక్కడ ప్రకాశ్‌రాజ్ తన భార్యకు (రాశి!) పిండం పెట్టటం చూపిస్తారు. తర్వాత ఇంటర్వెల్‌కి ముందు రాశి నవీన్ ఇంట్లోనే (ట్విస్ట్) ప్రత్యక్షమవుతుంది. ఇక నవీన్ ఆమెను పంపించే ప్రయత్నం చేస్తుంటాడు. (ప్రాక్టీస్ మాత్రం చెయ్యడు). ఇక రాశి మామూలుగా ఇంట్లో అందర్నీ ఆకట్టుకుంటుంది (ఇది ఏ సినిమా కథ అని అడగొద్దు). ఈలోపు ప్రకాశ్‌రాజ్ రాశి ఫోటోను పట్టుకుని ఆమె కోసం వెతుకుతూ వుంటాడు (ట్విస్ట్ + సస్పెన్స్!). సరే చివరికి రాశి - నవీన్, ప్రియాంకా - ప్రియుడుల పెళ్ళిళ్ళు జరుగుతుండగా రౌడీలతో ప్రకాశ్‌రాజ్ వచ్చి పెళ్ళి పీటల మీద కూచోవటం - అందరూ తన్నులు తిని వెళ్ళిపోవటం క్లైమాక్స్ అంతకు ముందే రాశి గురించిన సస్పెన్స్ విడిపోయి వుంటుంది (చెప్పటం మర్యాద కాదు).

ఈ సినిమాలో కామెడీ ట్రాక్ వుంది. ఎల్బీ శ్రీరాం, బ్రహ్మానందం కామెడీ కొన్నిసార్లు నవ్వించినా చివరికి నవ్వపోతుంది. బలవంతంగా పెట్టినట్టున్నాయి సీన్లు. నవీన్‌ను ఒక అంతర్జాతీయ స్థాయి క్రీడాకారుడిగా చూపించి, తర్వాత ఆ పాత్రను పేలవంగా మార్చిన ఘనత కథదే! ఇక ప్రకాశ్‌రాజ్ పాత్ర ఓవర్



### కానీ... వినేవారేరీ

యాక్షన్ అణువణువునా వుంది. అనవసర సన్నివేశాలు, డైలాగులు, మేనరిజం - బోర్‌గా వున్నాయి. సినిమాలో కథను ముందుకు తీసుకెళ్ళే సన్నివేశాలు తక్కువే. సినిమాలో సస్పెన్స్ కోసం పడిన తంటాలు చికాకనిపిస్తాయి. మధ్యలో అడ్డూ అదుపూ లేకుండా పాటలు వున్నాయి.

సినిమాలో ఏ పాత్ర నటించే ప్రయత్నం చెయ్యలేదు. ఈ సినిమాలో బోలెడు కథలున్నట్లు - బోలెడు పాత్రలున్నాయి. కొత్తమ్మాయికి ముందే చెప్పారులా వుంది - నీకు మొదటి సినిమా కనుక నటించకపోయినా ప్రేక్షకులు - విమర్శకులు క్షమిస్తారని ఆమెకు ఆ విషయం తెలిసినట్లే కనిపించింది. మిగతా వాళ్ళకి నటించే అవకాశం ఎలాగూ లేదు. రాశి పాత్రకి పరిమితులు ఎక్కువే. నవీన్‌కి ఒక పెద్ద హీరో ఇమేజ్ ఎప్పుడూ లేదు. ఒకవేళ అతని సినిమా హిట్టయితే బోనస్ కిందికే లెక్క. ఒక అథ్లెట్ ఎలా వుంటాడన్న ప్రాథమిక జ్ఞానం కూడా లేదు. జనరల్ నాలెడ్జ్ పరిశీలనా శక్తి లేని దర్శకుల జాబితాలో చంద్రమహేశ్ స్థానం సంపాయించుకున్నాడు. ఇక ఈ సినిమాలో అనవసర సన్నివేశాలు అనేకం వున్నాయి. శివరాత్రికి నవీన్ వంట చేసి - అందరికి తినిపించటం, ప్రకాశ్‌రాజ్ లెక్చర్‌లు, నవీన్ రాశిని పంపించేయటానికి వేసే పథకాలు వగైరా... ఈ సినిమా టైటిల్ చిత్రంగా వుంది ("బావా మరదళ్ళ పెళ్ళి" బావుండేది). ఎవరు ఎవరికి ఏం చెప్పాలో - చెప్పాలనుకున్నారో అర్థం కాదు. ప్రతి పాత్ర తెలివెరిగి ఒక సీన్‌కు ముందే మనకి అన్నీ తెలిసేలా చేస్తుంది.

ఈ సినిమా పోయినందువల్ల ఇందులో నటించిన వారికి పోయేదేమీ లేదు. ముఖ్యంగా నవీన్‌కి. ఎందుకంటే అతని సినిమాలు అలానే వుంటాయి అని ప్రేక్షకులు ఊహిస్తారు. అయితే ఎప్పుడైనా అద్భుతం జరక్కపోదా అని ఆశపడి వస్తారు. సహజంగానే వాళ్ళని నిరాశ పర్చిన చిత్రం ఇది●

- సి.యస్. సలీంబాషా

